సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 292

శనివారం 12-1-2019



'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే
ఆత్మీయుడిగా ఉంటే చాలు...
నా జన్మ ధన్యమైనట్టే'

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL







డీఎన్‌ఏ నమూనా ఇవ్వండి... రొనాల్డోకు పోలీసుల వారెంట్

లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణ జరిపేందుకు డీఎన్‌ఏ నమూనాలు ఇవ్వాలని లాస్‌వెగాస్ పోలీసులు ప్రఖ్యాత ఫుట్‌బాల్ ఆటగాడు, పోర్చుగల్ జట్టు కెప్టెన్ క్రిస్టియానో రొనాల్డోను కోరారు. 2009 జూన్ 13న హోటల్ సూట్‌లో రొనాల్డో తనపై అత్యాచారం చేశాడంటూ అమెరికాకు చెందిన మాజీ మోడల్ క్యాథరిన్ మోర్గా గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై సమగ్ర విచారణ చేయాలని భావిస్తున్న పోలీసులు... హోటల్‌లో దొరికిన క్యాథరిన్ దుస్తులను ప్రధాన ఆధారంగా భావిస్తున్నారు. అందుకే, డీఎన్‌ఏ నమూనాలు కోరుతూ ఇటలీలో లీగ్ ఆడుతున్న రొనాల్డోకు వారెంట్ పంపారు. మరోవైపు ఘటనను బయటకు చెప్పకుండా ఉండేందుకు క్యాథరిన్‌కు 3.75 లక్షల అమెరికన్ డాలర్లు చెల్లించేందుకు అప్పట్లోనే అంగీకారం కుదిరింది. అయితే, 'మీ టూ' ఉద్యమ ప్రభావంతో ఆమె మళ్లీ నోరు విప్పింది. రొనాల్డో, అతడి న్యాయవాదులు ఈ అభియోగాలను మొదటి నుంచి ఖండిస్తున్నారు.



రాహుల్

నిరవధిక బహిష్కరణ



పాండ్యా

హార్దిక్ పాండ్యా, రాహుల్‌లపై వేటు వేసిన బీసీసీఐ

విచారణ ముగిసే వరకు మ్యాచ్‌లు, బోర్డు కార్యక్రమాల్లో పాల్గొనడంపై నిషేధం

సిడ్నీ: టీవీ టాక్ 'షో'లో మహిళల గురించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, లోకేశ్ రాహుల్‌లపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) చర్యలు తీసుకుంది. వారిద్దరిపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. ఎంత కాలం లేదా ఎన్ని మ్యాచ్‌లు అనే విషయం ప్రకటించకపోయినా ప్రస్తుతం జరుగుతున్న ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌తో పాటు న్యూజిలాండ్ పర్యటనకు కూడా వీరిద్దరు దూరమయ్యే అవకాశం కనిపిస్తోంది. పాండ్యా, రాహుల్‌లపై విచారణ కొనసాగుతుండగానే సస్పెండ్ చేయడం విశేషం. వీరిద్దరికి బోర్డు తాజాగా మళ్లీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇద్దరిపై చర్యలు ఎందుకు తీసుకోరాదో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొంది. సీఓఏ ఈ–మెయిల్ ద్వారా ఈ సమాచారం అందించింది. 'అనుచిత ప్రవర్తన, క్రమశిక్షణారాహిత్యం ప్రదర్శించినందుకు బీసీసీఐ నియమావళిలోని నిబంధన–41 కింద విచారణ జరుగుతోందనే విషయం మీకు తెలుసు. ప్రస్తుతం ఆ విచారణ పెండింగ్‌లో ఉంది. 41 (6) నిబంధనను అనుసరించి మీపై తక్షణం నిషేధం విధిస్తున్నాం. దీని ప్రకారం విచారణ ముగిసి తుది తీర్పు వచ్చే వరకు బీసీసీఐ లేదా ఐసీసీ లేదా రాష్ట్ర క్రికెట్ సంఘాలకు సంబంధించిన గుర్తింపు పొందిన ఏదైనా మ్యాచ్‌లో పాల్గొనడం లేదా కార్యక్రమాలకు హాజరు కావడం కూడా మీరు చేయరాదు' అని బోర్డు స్పష్టం చేసింది. సీఓఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ, తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరితో చర్చించిన తర్వాత నిషేధంపై నిర్ణయం తీసుకున్నారు. శనివారం ఆస్ట్రేలియా నుంచి స్వదేశానికి రానున్న పాండ్యా, రాహుల్ స్థానాల్లో ఇద్దరు కొత్త ఆటగాళ్లను సెలెక్షన్ కమిటీ ఎంపిక చేయనుంది.

'కాఫీ విత్ కరణ్' కార్యక్రమంలో పాండ్యా, రాహుల్ అమ్మాయిల గురించి అసభ్యంగా మాట్లాడటంతో తీవ్ర వివాదం చెలరేగింది. కుర్రాళ్లకు ఆదర్శంగా ఉండాల్సిన క్రికెటర్లు ఇలా వ్యవహరించడంపై అన్ని వైపుల నుంచి విమర్శలు వచ్చాయి. బీసీసీఐ షోకాజ్ నోటీసుకు స్పందిస్తూ వారిద్దరు క్షమాపణలు కూడా చెప్పారు. అయితే దీనితో సరిపెట్టకుండా కనీసం రెండు వన్డేల నిషేధం విధించాలని సీఓఏ చీఫ్ వినోద్ రాయ్ సూచించడంతో శిక్ష తీవ్రత పెరిగింది. నేడు జరిగే తొలి వన్డే కోసం వీరిద్దరి పేర్లను పరిశీలించరాదని టీమ్ మేనేజ్‌మెంట్‌కు బోర్డు నుంచి ముందే సమాచారం అందడంతో వారిని పక్కన పెట్టారు. మరోవైపు తమ 'షో' కొందరి మనోభావాలను గాయపరిచినట్లు గుర్తిస్తూ దీనిని తొలగిస్తున్నట్లు హాట్‌స్టార్ ప్రకటించింది.



వాళ్లు తప్పు చేశారు

అనుచిత వ్యాఖ్యల విషయంలో భారత జట్టు నుంచి మా ఇద్దరు ఆటగాళ్లకు ఎలాంటి మద్దతు లభించదు. ఈ విషయాన్ని పాండ్యా, రాహుల్‌కు కూడా చెప్పేశాం. అవి వ్యక్తిగత వ్యాఖ్యలే అయినా వాటిని మేం అంగీకరించడం లేదు. ఆ ఇద్దరు ఆటగాళ్లకు కూడా తాము ఎంత పెద్ద తప్పు చేశామో అర్థమైంది. వారిపై దీని ప్రభావం పడింది. ఇలా జరగడం దురదృష్టకరం. కానీ కొన్ని విషయాలు మన నియంత్రణలో ఉండవు. ఇకపై ఏం జరుగబోతోందో చూడటమే మనం చేయగలం. ఇలాంటి సమయంలో జట్టు కూర్పు గురించి మాత్రం మళ్లీ ఆలోచించాల్సి ఉంటుంది. అయితే ఈ అంశాలు మా జట్టు స్ఫూర్తిని దెబ్బ తీయలేవు. ఇంతకు ముందే చెప్పినట్లు అవి పూర్తిగా వ్యక్తిగత అభిప్రాయాలు. మేం వాటిని ఖండిస్తున్నాం.

- కోహ్లి, భారత కెప్టెన్

ఫైనల్లో బెంగళూరు



శ్రీకాంత్

బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) నాలుగో సీజన్‌లో బెంగళూరు రాప్టర్స్ ఫైనల్‌కు చేరింది. తొలి సెమీఫైనల్లో బెంగళూరు 4–2తో అవధ్ వారియర్స్‌ను ఓడించింది. సెమీస్‌లో తొలి మ్యాచ్ మిక్స్‌డ్ డబుల్స్‌ను అవధ్ 'ట్రంప్'గా ఎంచుకుంది. మథియాస్ క్రిస్టియన్సెన్–అశ్విని పొన్నప్ప (అవధ్) జోడీ 15–7, 15–10తో మార్కస్ ఎలిస్–లారెన్ స్మిత్ జంటపై గెలుపొంది 2–0తో ముందంజ వేసింది. అయితే, పురుషుల తొలి సింగిల్స్‌లో సాయి ప్రణీత్ 15–9, 15–4తో లి డాంగ్ కుయెన్‌ను, రెండో సింగిల్స్‌లో శ్రీకాంత్ 15–7, 15–10తో సన్ వాన్ హోను ఓడించడంతో స్కోరు 2–2తో సమమైంది. తమ 'ట్రంప్' మ్యాచ్ పురుషుల డబుల్స్‌లో అహసాన్–సెటియవాన్ జంట 15–14, 15–9తో యాంగ్ లీ–క్రిస్టియన్సెన్ జోడీపై నెగ్గడంతో బెంగళూరు 4–2తో విజయాన్ని ఖాయం చేసుంది. నేడు జరిగే రెండో సెమీస్‌లో హైదరాబాద్ హంటర్స్‌తో ముంబై రాకెట్స్ తలపడుతుంది.

టి20లో కివీస్‌దే గెలుపు

ఆక్లాండ్: శ్రీలంకతో శుక్రవారం జరిగిన ఏకైక టి20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 35 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 179 పరుగులు చేసింది. డగ్ బ్రేస్‌వెల్ (26 బంతుల్లో 44; ఫోర్, 5 సిక్స్‌లు), స్కాట్ కుగ్లెజిన్ (15 బంతుల్లో 35 నాటౌట్; ఫోర్, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. 180 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక 16.5 ఓవర్లలో 144 పరుగులకు ఆలౌటైంది. తిసారా పెరీరా (24 బంతుల్లో 43; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కివీస్ బౌలర్లలో ఫెర్గూసన్ (3/21), ఇష్ సోధి (3/30) మూడేసి వికెట్లు పడగొట్టారు.

ఈ సిరీసూ గెలిస్తే సరి

ఇది వన్డే ప్రపంచ కప్ సంవత్సరం... అందుకే ఏ టోర్నీ బరిలో దిగినా, ఏ సిరీస్ ఆడినా జట్ల లెక్కలన్నీ కప్పు చుట్టూనే తిరుగుతున్నాయి. అంతటి ప్రతిష్టాత్మక విశ్వ సమరానికి ముందు బలగాలను సరిచూసుకునేందుకు, సంసిద్ధం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆ కోణంలో టీమిండియాకు ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ రూపంలో చక్కటి అవకాశం దక్కింది. సమస్యలను చక్కదిద్దుకుని, కూర్పును మరింత పటిష్ఠం చేసుకునే వీలు చిక్కింది. అసలే బలహీనంగా ఉన్న ఆతిథ్య జట్టు... ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి బరిలో దిగుతోంది. మరి, కోహ్లి సేన ఊపును కొనసాగిస్తుందా? ఫించ్ బృందం ఎంతవరకు పోటీనిస్తుంది? అనేది చూడాలి.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ, ధావన్, కోహ్లి (కెప్టెన్), రాయుడు, ధోని, జాదవ్, జడేజా, భువనేశ్వర్, కుల్దీప్, ఖలీల్ అహ్మద్, షమీ.

ఆస్ట్రేలియా: క్యారీ, ఫించ్ (కెప్టెన్), ఖాజా, మార్ష్, హ్యాండ్స్‌కోంబ్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, సిడిల్, రిచర్డ్‌సన్, లయన్, బెహ్రెన్‌డార్ఫ్.

ఆస్ట్రేలియాతో తొలి వన్డే నేడు

- ఆత్మవిశ్వాసంతో టీమిండియా
- కొత్త కూర్పుతో ఆస్ట్రేలియా

ఉదయం గం.7.50 నుంచి సోనీ సిక్స్, సోనీ టెన్–3లలో ప్రత్యక్ష ప్రసారం



ప్రాక్టీస్ సెషన్‌లో రాయుడు, ధావన్, ఖలీల్, ధోని

సిడ్నీ: దశాబ్దాల కల అయిన టెస్టు సిరీస్ గెలుపును సాకారం చేసుకుని అమితోత్సాహంతో ఉన్న టీమిండియా... వన్డే సిరీస్‌లోనూ ఆస్ట్రేలియా సంగతి తేల్చేందుకు సిద్ధమవుతోంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రెండు జట్ల మధ్య శనివారం ఇక్కడ తొలి వన్డే జరుగనుంది. బలాబలాలు, ఆటగాళ్ల తాజా ఫామ్ ప్రకారం కోహ్లి సేన కంగారూలకు అందనంత ఎత్తులో ఉంది. సొంతగడ్డ అనుకూలత తప్ప ఆరోన్ ఫించ్ బృందం ఏ అంశంలోనూ మెరుగ్గా కనిపించడం లేదు. అయితే, పరిస్థితులు ఎలా ఉన్నా పోరాట పటిమ చూపే ఆస్ట్రేలియాను ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదు.

వారికి తోడుగా వీరు చెలరేగితే...

కొన్నాళ్లుగా పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో జట్టు బ్యాటింగ్ భారం మొత్తాన్ని ధావన్, రోహిత్, కోహ్లినే మోస్తున్నారు. అంబటి తిరుపతి రాయుడు కుదురుకోవడంతో నాలుగో నంబర్‌పైనా బెంగ తీరింది. మిగిలిందిక 5, 6 స్థానాల్లో వచ్చే ధోని, కేదార్ జాదవ్. గత 14 ఇన్నింగ్స్‌ల్లో అర్ధ శతకం చేయలేకపోయిన ధోని... ఈ సిరీస్ ద్వారా ఫామ్‌లోకి రావాలని జట్టు ఆశిస్తోంది. గాయాల బెడద లేకుంటే జాదవ్ మంచి ఇన్నింగ్స్‌లు ఆడగల సత్తా ఉన్నవాడు. నిరవధిక బహిష్కరణ ఎదుర్కొంటున్న హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండర్ బెర్త్ రవీంద్ర జడేజాకు దక్కనుంది. యజువేంద్ర చహల్‌ను కాదని కుల్దీప్‌ను ఆడించే అవకాశం కనిపిస్తోంది. బుమ్రాకు విశ్రాంతి నేపథ్యంలో... టెస్టు సిరీస్ ఆసాంతం బెంచ్‌కే పరిమితమైన భువనేశ్వర్ వన్డే సిరీస్‌లో కీలకం కానున్నాడు. అతడితో కలిసి షమీ కొత్త బంతిని పంచుకుంటాడు. పరుగులు ఇచ్చే బలహీనతను షమీ అధిగమించాలి. సొంతగడ్డపై రాణించిన ఎడంచేతి వాటం యువ పేసర్ ఖలీల్ అహ్మద్ ఆసీస్ పిచ్‌లపై ఎలా బౌలింగ్ చేస్తాడో చూడాలి. భువనేశ్వర్, షమీ ఉన్నందుకు హైదరాబాద్ యువ పేసర్ సిరాజ్‌కు అరంగేట్రం చేసే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి.

ఆసీస్ కొత్తకొత్తగా...

ప్రధాన పేసర్లు ముగ్గురికీ విశ్రాంతినిచ్చిన ఆతిథ్య జట్టుకు భారత బ్యాట్స్‌మెన్‌ను నిలువరించడం సవాలే. పీటర్ సిడిల్ ఎనిమిదేళ్ల తర్వాత వన్డే ఆడుతున్నాడు. టీమిండియా టాప్‌ఆర్డర్ నుంచి ఆసీస్ బౌలర్లకు ఇబ్బందులు తప్పవు. షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్ వంటి వారున్నా బ్యాటింగ్‌లో కెప్టెన్ ఫించ్‌పైనే ఆశలన్నీ. కీపర్ అలెక్స్ క్యారీతో కలిసి ఫించ్ ఇన్నింగ్స్‌ను ఆరంభిస్తాడు. జట్టు పరిస్థితులరీత్యా టెస్టు స్పెషలిస్ట్ ఉస్మాన్ ఖాజాను వన్డేలకూ తీసుకున్నారు. అయితే, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్‌లాంటి విధ్వంసక ఆటగాళ్లతో బ్యాటింగ్ లైనప్ భారీగా ఉంది. టెస్టుల్లో స్పిన్నర్ లయన్‌ను దెబ్బతీసిన కోహ్లి సేన వన్డేల్లో అతడిని ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

పిచ్, వాతావరణం

కొద్దిగా పచ్చికతో ఉన్నా ఫ్లాట్ పిచ్. భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. చివరి టెస్టు సందర్భంగా సిడ్నీలో వర్షం కురిసింది. అయితే వన్డే మ్యాచ్‌కు వర్ష సూచన లేదు.

48 ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాతో భారత్ ఇప్పటివరకు 48 వన్డేలు ఆడింది. 11 మ్యాచ్‌ల్లో గెలిచి, 35 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. మరో రెండు మ్యాచ్‌ల్లో ఫలితం రాలేదు.

16 సిడ్నీ మైదానంలో భారత్, ఆస్ట్రేలియా మధ్య 16 మ్యాచ్‌లు జరిగాయి. రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన భారత్... 13 మ్యాచ్‌ల్లో పరాజయం చవి చూసింది. మరో మ్యాచ్‌లో ఫలితం రాలేదు.

2 ఆస్ట్రేలియా గడ్డపై ఆతిథ్య జట్టుతో భారత్ ఆడుతున్న రెండో ద్వైపాక్షిక సిరీస్ ఇది. 2015–16లో ఐదు వన్డేల ద్వైపాక్షిక సిరీస్ జరుగగా... ఆసీస్ 4–1తో గెలిచింది. అంతకుముందు ఇక్కడ భారత్ మూడు లేదా నాలుగు దేశాలు పాల్గొన్న వన్డే టోర్నీలు ఆడింది.



వన్డే సిరీస్ ట్రోఫీతో ఫించ్, కోహ్లి

ఒక్కసారి రిటైర్ అన్నానంటే...

మళ్లీ ఎక్కడా ఆడనన్న కోహ్లి

సిడ్నీ: అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అనంతరం కూడా డివిలియర్స్, బ్రెండన్ మెకల్లమ్ లాంటి అనేక మంది స్టార్లు ప్రపంచ వ్యాప్తంగా టి20 లీగ్‌లు ఆడుతున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి ఆలోచనలేమీ లేవని భారత కెప్టెన్ కోహ్లి స్పష్టం చేశాడు. ఆస్ట్రేలియా టి20 టోర్నీ బిగ్‌బాష్ లీగ్‌లో ఆడేందుకు ఒకవేళ బీసీసీఐ భారత క్రికెటర్లకు కూడా అవకాశం ఇస్తే, అప్పటికి రిటైరైతే ఆ టోర్నీలో ఆడతావా అనే ప్రశ్నకు కోహ్లి సమాధానమిచ్చాడు. తనలో పూర్తిగా సత్తువ అయిపోయిందని భావించిన రోజునే రిటైర్మెంట్ ప్రకటిస్తానని, ఆ తర్వాత బ్యాట్ ముట్టుకోనని అతను అన్నాడు. 'భవిష్యత్తులో బీసీసీఐ నిర్ణయం మారుతుందా లేదా తెలీదు. నాకు సంబంధించి మాత్రం ఒక్కసారి ఆట ముగిశాక ఇంకా క్రికెట్ ఆడలేనని నిజాయితీగా చెబుతున్నా. గత ఐదేళ్లలో నేను చాలా ఎక్కువ క్రికెట్ ఆడాను. రిటైర్ కాగానే నేనేం చేస్తానో చెప్పలేను కానీ మళ్లీ బ్యాట్ మాత్రం పట్టుకోను. నేను ఒకసారి క్రికెట్ ఆడటం మానేస్తున్నానంటే ఆ సమయానికి నాలో శక్తి సామర్థ్యాలు పూర్తిగా కరిగిపోయాయనే అర్థం. కాబట్టి మళ్లీ వచ్చి ఆడే ప్రసక్తే లేదు. ఒక్కసారి క్రికెట్ ముగిసిందంటే దరిదాపుల్లో కూడా కనిపించను'అని కోహ్లి స్పష్టం చేశాడు.

కోహ్లి, శాస్త్రిలకు ఎస్‌సీజీ గౌరవ సభ్యత్వం

క్రికెట్‌కు చేసిన సేవలకు గాను భారత కెప్టెన్ కోహ్లి, కోచ్ రవిశాస్త్రి శుక్రవారం సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఎస్‌సీజీ) జీవిత కాల గౌరవ సభ్యత్వం అందుకున్నారు. బ్రియాన్ లారా, సచిన్ టెండూల్కర్ తర్వాత ఈ హోదా అందుకున్న ఇతర దేశాలవారు వీరిద్దరే కావడం విశేషం. 'ఆస్ట్రేలియాలో తొలిసారి టెస్టు సిరీస్ గెలిచిన టీమిండియాను ఎస్‌సీజీ అభినందిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ దేశమైన భారత్ టెస్టులపై ఆధిపత్యం చెలాయిస్తున్న తీరును చూడటం అద్భుతం. టెస్టు క్రికెట్ ఔన్నత్యాన్ని ఇది కాపాడుతుంది' అని ఎస్‌సీజీ చైర్మన్ టోనీ షెపర్డ్ తమ అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొన్నాడు. 'కోహ్లితో కలిసి ఇంతటి గౌరవం పొందినందుకు ధన్యుడిని' అని రవిశాస్త్రి ట్విట్టర్‌లో సందేశం ఉంచాడు.

కన్నీళ్లతో టెన్నిస్‌కు ముర్రే వీడ్కోలు!

ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆఖరి టోర్నీ • గాయాలే కారణమన్న బ్రిటన్ స్టార్

మెల్‌బోర్న్: సుదీర్ఘ కాలంగా వేధిస్తున్న తుంటి గాయంతో బ్రిటన్ స్టార్ టెన్నిస్ ప్లేయర్, మాజీ వరల్డ్ నంబర్‌వన్ ఆండీ ముర్రే కెరీర్ అర్ధాంతరంగా ముగిసిపోతోంది. టెన్నిస్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు 31 ఏళ్ల ముర్రే శుక్రవారం ప్రకటించాడు. సోమవారం ప్రారంభం కానున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత తాను రిటైర్ అవుతున్నట్లు అతను చెప్పాడు. సొంతగడ్డపై ఈ ఏడాది వింబుల్డన్ ఆడిన తర్వాత గుడ్‌బై చెప్పాలనుకున్నానని, అయితే అప్పటి వరకు తాను నొప్పితో ఆడలేనని అన్నాడు. రిటైర్మెంట్ ప్రకటన సందర్భంగా ముర్రే కన్నీళ్ల పర్యంతమయ్యాడు. 'తుంటి గాయం చాలా బాధపెడుతోంది. ఏదోలా ఓర్చుకుంటూ కొంత వరకు ఆడగలనేమో. కానీ అంత సహనంతో బాధను భరిస్తూ ప్రాక్టీస్‌లో గానీ పోటీల్లో గానీ శ్రద్ధ పెట్టలేకపోతున్నా. కాబట్టి ఇదే నా ఆఖరి టోర్నీ కావచ్చు'అని ముర్రే వ్యాఖ్యానించాడు.

ఇంగ్లీష్ హీరో...

1936లో ఫ్రెడ్ పెర్రీ వింబుల్డన్ గెలిచిన తర్వాత బ్రిటన్ అభిమానులు మళ్లీ టైటిల్ సాధించే తమ దేశపు ఆటగాడి కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూశారు. ఎట్టకేలకు 2013లో సొంతగడ్డపై వింబుల్డన్ గెలిచి ముర్రే 77 ఏళ్ల కల నెరవేర్చాడు. మరో మూడేళ్లకు 2016లో కూడా ముర్రే ఇదే టైటిల్ నెగ్గాడు. ఈ రెండింటికంటే ముందు 2012లో గెలిచిన యూఎస్ ఓపెన్ అతని ఖాతాలో ఉన్న మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నీ. వరుసగా రెండు ఒలింపిక్స్‌లలో (2012, 2016) అతను స్వర్ణపతకం గెలుచుకొని ఈ ఘనత సాధించిన ఏకైక ఆటగాడిగా నిలిచాడు. 2016 నవంబర్ 7 నుంచి వరుసగా 37 వారాల పాటు వరల్డ్ నంబర్‌వన్‌గా కొనసాగిన రికార్డు ముర్రే సొంతం. మొత్తం 45 ఏటీపీ టైటిల్స్ అతని ఖాతాలో ఉన్నాయి.



దక్షిణాఫ్రికా 262

జొహన్నెస్‌బర్గ్: పాకిస్తాన్‌తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలనే లక్ష్యంతో మూడో టెస్టులో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో తడబడింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా 77.4 ఓవర్లలో 262 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ మార్క్‌రమ్ (124 బంతుల్లో 90; 16 ఫోర్లు) సెంచరీ చేజార్చుకున్నాడు. ఆమ్లా (98 బంతుల్లో 41; 6 ఫోర్లు), డి బ్రుయెన్ (82 బంతుల్లో 49; 9 ఫోర్లు), అరంగేట్రం చేసిన జుబేర్ హమ్జా (68 బంతుల్లో 41; 5 ఫోర్లు, సిక్స్) అర్ధ సెంచరీలకు దూరమయ్యారు. పాక్ బౌలర్లలో ఫహీమ్ అష్రఫ్ మూడు వికెట్లు పడగొట్టగా... ఆమిర్, అబ్బాస్, హసన్ అలీలకు రెండేసి వికెట్లు లభించాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 17 పరుగులు చేసింది. ఫిలాండర్ బౌలింగ్‌లో షాన్ మసూద్ (2), అజహర్ అలీ (0) ఔటయ్యారు. ఇమామ్ ఉల్ హఖ్ (10 బ్యాటింగ్), అబ్బాస్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

మెయిన్ 'డ్రా'కు ప్రజ్నేశ్ అర్హత


ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ



మెల్‌బోర్న్: భారత టెన్నిస్ నంబర్‌వన్ ప్లేయర్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తన కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ మెయిన్ 'డ్రా'లో ఆడనున్నాడు. టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్ ద్వారా ప్రజ్నేశ్ ప్రధాన టోర్నీకి అర్హత పొందాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో 29 ఏళ్ల ప్రజ్నేశ్ 6–7 (5/7), 6–4, 6–4తో యోసుకె వతనుకి (జపాన్)పై విజయం సాధించాడు. 'గ్రాండ్‌స్లామ్ టోర్నీ మెయిన్ 'డ్రా'లో ఆడాలని ఎన్నో ఏళ్లుగా కలలు కన్నాను. నేడు అది నిజమైంది. నా అనుభూతిని మాటల్లో వర్ణించలేను. నా కెరీర్‌లో ఇది పెద్ద ఘనత' అని చెన్నైకి చెందిన ప్రజ్నేశ్ వ్యాఖ్యానించాడు. క్వాలిఫయింగ్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన ప్రజ్నేశ్‌కు ప్రైజ్‌మనీగా 40 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 20 లక్షలు 32 వేలు) లభించాయి. ఇక మెయిన్ 'డ్రా'లో తొలి రౌండ్‌లో ఓడిపోయినా అతనికి మరో 75 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 38 లక్షల 10 వేలు) లభిస్తాయి. సోమవారం మొదలయ్యే ప్రధాన టోర్నమెంట్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో అమెరికా ప్లేయర్, ప్రపంచ 39వ ర్యాంకర్ ఫ్రాన్సెస్ టియాఫోతో ప్రపంచ 112వ ర్యాంకర్ ప్రజ్నేశ్ తలపడతాడు.

సత్యమేవ జయతే

సాక్షి



'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

WWW.SAKSHI.COM

పేజీలు: 18+4+20 వెల: ₹ 5.00



దారి తప్పుతున్న దిక్కులు!

- వేగంగా తారుమారవుతున్న ధృవాలు
- కదిలిపోతున్న భూపొరల్లోని అయస్కాంత క్షేత్రాలు
- ఏడాదికి 50 కిలోమీటర్ల మేర ఉత్తర ధృవం కదలికలు
- గూగుల్ మ్యాప్స్, నావిగేషన్ వ్యవస్థలకు కష్టకాలమే..
- త్వరలోనే ఈ వ్యవస్థలను మార్చుకోవాలంటున్న శాస్త్రవేత్తలు

స్మార్ట్‌ఫోన్‌లో మ్యాప్స్ అప్లికేషన్ వాడుతుంటారా..?
తెలియని ప్రదేశానికి వెళ్లాలంటే దీన్నే ఉపయోగిస్తారా..?
ఏ మారుమూల ప్రాంతాలనైనా భలే గుర్తుపడుతుంది కదా..
ఈ సౌకర్యానికి రోజులు దగ్గరపడ్డాయి..
ఎందుకంటే భూ అయస్కాంత ధృవం వేగంగా కదిలిపోతోంది!
దీంతో మ్యాప్స్‌లాంటి దిక్సూచిలన్నీ కకావికలం కానున్నాయి!

అయస్కాంత ధృవమేంటీ..? కదిలిపోవడం ఏంటీ? స్మార్ట్ ఫోన్లకూ వాటికీ లింకేంటీ.. ఇవేగా మీ మనసులో మెదులుతున్న ప్రశ్నలు. భూమి ఒక అయస్కాంతం లాంటిదని పుస్తకాల్లో చదువుకున్నాం. ఈ అయస్కాంతానికి ఉత్తర దక్షిణ ధృవాలు ఉంటాయి. ఇవి కంటికి కనిపించవు. ఆర్కిటిక్.. అంటార్కిటికాలను ధృవాలు అంటాం. ఈ ప్రాంతాలను అసలు ధృవాలని పిలుస్తారు. అయస్కాంత క్షేత్ర ధృవాలు భూమి లోపలి పొరల్లో జరిగే కార్యకలాపాలకు అనుగుణంగా కదులుతుంటాయి. ఇంకా సులువుగా చెప్పాలంటే 3 లక్షల ఏళ్లకోసారి ధృవాలు తారుమారు అవుతుంటాయి. అయస్కాంతం తిరగబడినట్లు అన్నమాట! కానీ ఈ మధ్య ఈ ప్రక్రియ చాలా వేగంగా జరుగుతోందట. ఎంత వేగంగా అంటే.. అయస్కాంత ఉత్తర ధృవం ఏడాదికి యాభై కిలోమీటర్ల చొప్పున సైబీరియా ప్రాంతంవైపు కదిలిపోయేంతగా! అయితే ఏంటి అంటున్నారా.. దీని వల్ల చాలా సమస్యలే ఉన్నాయి. గూగుల్ మ్యాప్స్ మొదలుకొని విమానాలు, నౌకలు తమ ప్రయాణానికి ఉపయోగించే దిక్సూచీలన్నీ ఈ అయస్కాంత ధృవాల ఆధారంగానే ఉత్తర దక్షిణాలను గుర్తిస్తుంటాయి. ఒకవేళ ధృవాలు తారుమారైతే ఈ రంగాలన్నీ అతలాకుతలమైపోతాయి.

ఏం జరుగుతుంది?

అయస్కాంత ఉత్తర ధృవం వేగంగా కదలిపోతే నావిగేషన్ వ్యవస్థలకు ఇబ్బందన్నది ఒక సమస్య మాత్రమే. ఇది కాస్తా సమీప భవిష్యత్తులో ధృవాలు తారుమారయ్యేందుకు సూచిక అయితే ప్రమాదమేనని శాస్త్రవేత్తల అంచనా. సూర్యుడి నుంచి వస్తున్న రేడియోధార్మిక కిరణాల నుంచి మనల్ని రక్షిస్తున్న అయస్కాంత క్షేత్ర ధృవాలు తారుమారయ్యే సమయంలో బలహీనంగా మారుతాయి. సూర్యుడి నుంచి వెలువడే శక్తిమంతమైన కిరణాలు మన ఉపగ్రహాలను, విద్యుత్ సరఫరా గ్రిడ్‌లను తీవ్రంగా నష్టపరుస్తాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకోపక్క ఈ అయస్కాంత క్షేత్రం ఆధారంగానే ఎటువెళ్లాలో నిర్ణయించుకునే పక్షులు గందరగోళానికి గురవుతాయి. అయితే ఈ ధృవాల తారుమారు ప్రక్రియతో ప్రాణ నష్టం ఉండే అవకాశాలు లేకపోవడం కొంచెం సాంత్వన కలిగించే అంశం.



కారణమేంటో తెలీదు..

అయస్కాంత ధృవాలు ఎందుకు తారుమారు అవుతున్నాయన్న ప్రశ్నకు ఇప్పటివరకూ సమాధానం లేదు. అయస్కాంత ఉత్తర ధృవం ప్రస్తుతం కెనడా ప్రాంతంలో ఉన్నట్లు అంచనా. కంటికి కనిపించని ధృవాల కదలికలతో వరల్డ్ మాగ్నెటిక్ మోడల్ పేరుతో ఒక మ్యాప్ ఉంటుంది. గూగుల్ లాంటి సంస్థలు ఈ మోడల్‌నే వాడుకుంటాయి. 2020 వరకు పనిచేస్తుందన్న అంచనాతో నాలుగేళ్ల కింద తాజా మోడల్ విడుదలైంది. అయితే తాజా పరిశోధనలు మాత్రం ఈ మోడల్‌ను అర్జెంటుగా మార్చేయాలని సూచిస్తున్నాయి. ఐదేళ్ల కాలంలో కదిలే దూరాన్ని మూడేళ్లలోనే అధిగమించినట్లు కొలరాడో యూనివర్సిటీ, నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ శాస్త్రవేత్తలు గుర్తించారు. 2000 నుంచి అయస్కాంత ఉత్తర ధృవం ఏడాదికి 50 కిలోమీటర్ల దూరం కదులుతోందని.. అయితే మూడేళ్ల కింద సంభవించిన ఓ భౌగోళిక సంఘటన.. ఉత్తర ధృవ ప్రాంతంలోని అయస్కాంత క్షేత్రంలో వచ్చిన మార్పుల కారణంగా వేగం మరింత పెరిగిందని అర్నాడ్ చుల్లియట్ అనే శాస్త్రవేత్త వివరించారు. అయస్కాంత దక్షిణ ధృవం మాత్రం ఏడాదికి పది కిలోమీటర్ల మేర మాత్రమే కదులుతోందని చెప్పారు. దీంతో ఈ మోడల్‌ను అర్జెంటుగా మార్చేయాలని, లేదంటే యూరోపియన్ స్పేస్ ఏజెన్సీతో పాటు ఇతర సంస్థల నావిగేషన్ వ్యవస్థలు దెబ్బతింటాయని శాస్త్రవేత్తలు భావించారు. ఈ నెల 15 నాటికి మార్చేద్దామని నిర్ణయించారు కూడా. కాకపోతే అమెరికాలో ప్రభుత్వం షట్‌డౌన్ కారణంగా ఈ గడువు నెలాఖరుకు చేరింది.

- సాక్షి నాలెడ్జ్ సెంటర్



నగరానికి బుద్ధుడి ధాతువులు

- థాయ్‌లాండ్ నుంచి నగరానికి తెచ్చిన బుద్ధ సొసైటీ
- అస్థికలకు ప్రత్యేక పూజలు చేసిన వివిధ దేశాల బౌద్ధులు
- భక్తుల సందర్శనార్థం బుద్ధవిహార్‌లో ధాతువులు
- ఆదివారం ఉదయం బుద్ధభవన్‌లో ప్రతిష్టత

హైదరాబాద్: కొన్ని వందల ఏళ్ల క్రితం థాయ్‌లాండ్‌కు తీసుకువెళ్లిన గౌతమ బుద్ధుని ధాతువులు(అస్థికలు) తిరిగి భారత్‌కు వచ్చాయి. థాయ్‌లాండ్‌కు వెళ్లినప్పటినుంచి వాటిని వెనక్కి తెచ్చేందుకు భారతీయులు పడిన శ్రమ అంతా ఇంతా కాదు. గౌతమ బుద్ధుడి ధాతువులు కొన్నింటిని భారత్‌కు తీసుకురావాలన్న ధ్యేయంతో థాయ్‌లాండ్ వారితో చర్చలు జరిపి హైదరాబాద్‌కు తెప్పించినట్లు మాజీ డీజీపీ, బుద్ధిస్ట్ ఆంజనేయరెడ్డి శుక్రవారం మీడియాకు తెలిపారు. ఇతర దేశాల నుంచి వచ్చిన బౌద్ధులు బుద్ధ సొసైటీ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్‌లోని బుద్ధ విగ్రహం వద్ద ధాతువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాటిని బుద్ధ విగ్రహం నుంచి సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లోని బుద్ధ విహార్‌లకు ర్యాలీగా తీసుకెళ్లారు. బుద్ధవిహార్‌లో భక్తుల సందర్శనార్థం వీటిని శనివారం ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంచనున్నారు. రాత్రి 7 గంటల నుంచి ఆదివారం ఉదయం 7 గంటల వరకు 'పట్టార చాంటింగ్'ను నిర్వహించనున్నట్లు ధర్మరక్షిత తెలిపారు. అనంతరం 9 గంటలకు బుద్ధవిహార్‌లోని బుద్ధుని స్తూపం వద్ద వాటిని అమెరికాకు చెందిన బిక్కబోది ప్రతిష్ఠించనున్నట్లు బుద్ధిస్ట్ ఆనంద్ బంతే తెలిపారు. బుద్ధ సొసైటీ నేషనల్ సెక్రటరీ కట్టయ్య మాట్లాడుతూ బుద్ధుని పట్ల కేంద్రం చూపిన శ్రద్ధాసక్తులు రాష్ట్ర ప్రభుత్వం చూపలేకపోతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రాధాన్యతనిస్తే మరింతమంది బుద్ధుని అడుగుజాడల్లో ముందుకెళతారన్నారు.





సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 18+4+20 వెల: ₹ 5.00
సంపుటి: 11
సంచిక: 292

శనివారం 12-1-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పౌరసత్వం దిశగా హెచ్1బీ
తగు సంస్కరణలు చేస్తాం: ట్రంప్
– 11లో



జీఎస్టీ పరిధిలోని వర్తకులకు బీమా
కేంద్ర ప్రభుత్వం పరిశీలన
– బిజినెస్‌లో

వైఎస్‌ జగన్‌ నవరత్నాల ఎఫెక్ట్‌

పింఛన్‌.. పెంపు



పింఛన్ల పెంపు

- ప్రస్తుతం ఉన్న పింఛన్ల వయస్సు 65 నుంచి 60కి తగ్గిస్తాం
- అవ్వా తాతకి పింఛన్‌ రూ. 2,000 ఇస్తాం
- వికలాంగులకు పింఛన్‌ రూ. 3,000 ఇస్తాం

సంవత్సరానికి రూ. 24,000 - 48,000

ఇక రూ.2 వేల చొప్పున ఇస్తామని ప్రకటించిన సీఎం

- ఏడాదిన్నర క్రితమే విపక్ష నేత వైఎస్‌ జగన్‌ ఇచ్చిన హామీని ఎన్నికల ముందు ప్రకటించిన బాబు
- జగన్‌ పాదయాత్రతో ప్రజల్లోకి వెళ్లిన నవరత్నాల హామీ.. గత్యంతరం లేకనే సర్కారు తాజా నిర్ణయం
- వృద్ధాప్య, వితంతువుల పింఛన్‌ రూ.2 వేలకు పెంచుతామని నవరత్నాల్లో ప్రకటించిన ప్రతిపక్ష నేత
- ఇన్నాళ్లు మౌనం దాల్చి ఎన్నికల షెడ్యూల్‌కు ముందుగా టీడీపీ సర్కారు ప్రకటన
- ఎన్నికల్లో ఓటమి భయంతో ఆఖరిలో తాయిలాలతో మభ్యపెట్టే యత్నం..
- బాబు హయాంలో.. పింఛను తీసుకునేవారు ఎవరైనా చనిపోతేనే కొత్తవి మంజూరు
- జన్మభూమి కమిటీల ఆగడాలతో నాలుగున్నరేళ్లుగా పింఛనుదారుల అగచాట్లు
- ఐదు లక్షల మందికి పింఛన్ల ఎగవేత
- పింఛన్‌ కోసం ఇప్పటికీ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో 14 లక్షలకుపైగా దరఖాస్తులు
- జన్మభూమి వినతుల్లో అవే అత్యధికం

ప్రతిపక్ష నేత వైఎస్‌ జగన్‌ ప్రకటించిన నవరత్నాల్లోని పింఛన్‌ల పెంపు అంశానికి సంబంధించిన వివరాలు

సాక్షి, అమరావతి

మరో నెలలో ఎన్నికల షెడ్యూల్‌ వెలువడవచ్చని భావిస్తున్న తరుణంలో పింఛన్ల మొత్తాన్ని రెట్టింపు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల నుంచే దీన్ని వర్తింపచేస్తామని శుక్రవారం జన్మభూమి ముగింపు సందర్భంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. అయితే తాము అధికారంలోకి రాగానే వృద్ధాప్య, వితంతువుల పింఛన్లను రూ.2,000కు పెంచుతానని వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్‌ జగన్‌ 2017 జూలై 8వ తేదీన గుంటూరులో నిర్వహించిన పార్టీ ప్లీనరీ సందర్భంగా ప్రకటించడం తెలిసిందే. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా జరిగిన ఆ ప్లీనరీలో వైఎస్‌ జగన్‌ మాట్లాడుతూ వైఎస్సార్‌ సీపీ అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పింఛన్ల పెంపు సహా తొమ్మిది (నవరత్నాలు) పథకాలను అమలు చేస్తామని స్పష్టంగా చెప్పారు. వృద్ధాప్య పింఛన్ల అర్హత వయసును 65 నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తామని, అవ్వా తాతలకు రూ.2,000 చొప్పున పింఛన్‌ ఇస్తామని, దివ్యాంగులకు రూ.3,000 చొప్పున పింఛను ఇస్తామంటూ ప్రతిపక్ష నేత హామీ ఇచ్చారు. వైఎస్‌ జగన్‌ ప్రకటన చేసిన ఏడాదిన్నర తర్వాత.. ఎన్నికల షెడ్యూల్‌

మిగతా 4వ పేజీలో ▶

పింఛన్‌ ఇక రూ.2 వేలు



- జన్మభూమి ముగింపు సభలో సీఎం చంద్రబాబు ప్రకటన
- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చిప్పలేరు బ్రిడ్జి ప్రారంభం

4 లో

శుక్రవారం కడప పెద్ద దర్గాలో చాదర్‌ సమర్పిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి



దారిపొడవునా జనమే జనం..

- ప్రతిపక్ష నేత వైఎస్‌ జగన్‌ను చూసేందుకు తిరుపతి నుంచి పులివెందుల వరకు పోటెత్తిన జనం

2 లో

ఆలోక్‌ వర్మ పదవీ విరమణ



- ఉద్యోగానికి గుడ్‌బై చెప్పిన ఉద్వాసనకు గురైన సీబీఐ చీఫ్‌
- అగ్నిమాపక శాఖలో చేరబోనని వెల్లడి
- అబద్ధపు ఆరోపణలపై బదిలీ చేశారని ఆవేదన

11లో



జర్నలిస్ట్‌ హత్య కేసులో డేరా బాబా దోషి

పదహారేళ్ల క్రితం జరిగిన హత్య కేసులో డేరా సచ్చా సౌదా చీఫ్‌ గుర్మీత్‌ రామ్‌ రహీమ్‌తో పాటు మరో ముగ్గురు దోషులుగా తేలారు. ఈ మేరకు పంచకుల ప్రత్యేక సీబీఐ కోర్టు జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు. ఇద్దరు మహిళా భక్తురాళ్లపై అత్యాచారానికి పాల్పడిన కేసులో గుర్మీత్‌ ఇప్పటికే 20 ఏళ్ల జైలు శిక్ష పడి అనుభవిస్తున్న విషయం తెలిసిందే.

- వివరాలు 11లో

2021 డిసెంబర్‌లో 'గగన్‌యాన్‌'!



దేశ అంతరిక్ష చరిత్రలో మైలురాయిగా నిలవనున్న మానవ సహిత అంతరిక్ష ప్రయోగం 'గగన్‌యాన్‌'ప్రాజెక్టుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ ప్రాజెక్టును డిసెంబర్‌ 2021లోగా చేపట్టే లక్ష్యంతో పనిచేస్తున్నామని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చైర్మన్‌ డాక్టర్‌ కె.శివన్‌ వెల్లడించారు.

11లో

అభ్యర్థుల్లో గ్రూప్స్‌ గుబులు!

పరీక్షల విధానం, సిలబస్‌ మారినా ప్రామాణిక పుస్తకాలు కరువు

- వ్యవధి గోరంత.. సిలబస్‌ కొండంత
- రిఫరల్‌ పుస్తకాలు పేర్కొనని ఏపీపీఎస్సీ
- ఎలా ప్రిపేర్‌ కావాలో తెలియక గందరగోళం
- సమయం పెంచాలంటున్న అభ్యర్థులు
- యూపీఎస్సీ తరహా అంటూనే అడ్డగోలు నిబంధనలు




4 లో

'అవినీతి చక్రవర్తి' పుస్తకంపై

సర్కారు వణుకు

ప్రభుత్వంలో, టీడీపీలో తీవ్ర ప్రకంపనలు

- నష్టనివారణ చర్యలకు దిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- పుస్తకంలోని అంశాలకు వివరణలు ఇవ్వాలని ప్రభుత్వ అధికారులకు ఆదేశం
- సీఎం తీరుపై అధికారుల ఆగ్రహం
- వాస్తవాలను ఎలా వక్రీకరిస్తామని మండిపాటు
- 'అవినీతి చక్రవర్తి' పుస్తకంలోని అంశాలన్నీ అక్షర సత్యాలని స్పష్టీకరణ
- తమను బలిపశువులను చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అనుమానం
- తప్పుడు వివరణలు ఇవ్వడం తమ వల్ల కాదంటున్న అధికారులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాగించిన రూ.6.17 లక్షల కోట్ల దోపిడీపై ప్రతిపక్ష వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ విడుదల చేసిన 'అవినీతి చక్రవర్తి' పుస్తకం ప్రభుత్వంలో, అధికార తెలుగుదేశం పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ పుస్తకాన్ని ఆమూలాగ్రం చదివిన ప్రజలు చంద్రబాబు దోపిడీ తీరును తెలుసుకుని ఔరా అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. గ్రామాల్లో రచ్చబండలపై

మిగతా 2వ పేజీలో ▶

ఎన్‌ఐఏ కస్టడీకి శ్రీనివాసరావు



నిందితుడు శ్రీనివాసరావును విజయవాడలోని కోర్టుకు తీసుకువస్తున్న పోలీసులు

- ప్రతిపక్ష నేత వైఎస్‌ జగన్‌పై హత్యాయత్నం కేసులో వారం రోజులపాటు కస్టడీకి అనుమతించిన న్యాయమూర్తి
- నేడు హైదరాబాద్‌ కార్యాలయానికి తరలించనున్న అధికారులు!

సాక్షి, అమరావతిబ్యూరో/విజయవాడ లీగల్‌/ఆరిలోవ (విశాఖతూర్పు): ప్రతిపక్ష నేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావును వారం రోజులపాటు ఎన్‌ఐఏ కస్టడీకి అప్పగిస్తూ ఎన్‌ఐఏ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శనివారం నిందితుడిని అదుపులోకి తీసుకోనున్న ఎన్‌ఐఏ అధికారులు విచారణ నిమిత్తం హైదరాబాద్‌ ఎన్‌ఐఏ కార్యాలయానికి తరలించనున్నట్లు సమాచారం. హైకోర్టు ఆదేశాల మేరకు జగన్‌పై హత్యాయత్నం కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా

మిగతా 4వ పేజీలో ▶

ఏప్రిల్‌ మూడో వారంలో ఎంసెట్‌



- రాష్ట్రంలోని వృత్తి విద్యా కళాశాలల్లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్‌ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీ ఎంసెట్‌–2019ను ఏప్రిల్‌ మూడో వారంలో నిర్వహించనున్నారు. ఎంసెట్‌తో పాటు వివిధ వృత్తి విద్యాకోర్సుల ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పరీక్షల షెడ్యూళ్లను రాష్ట్ర ఉన్నత విద్యామండలి సిద్ధం చేసింది.

5 లో

రైల్వేకోడూరు సెంటర్‌లో వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు



రాజంపేట శివార్లలో వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు..



కడప జేఎంజే కళాశాల వద్ద జగన్‌కు ద్విచక్ర వాహనాలపై స్వాగతం పలుకుతున్న విద్యార్థి సంఘ నాయకులు



దారిపొడవునా జనమే జనం

- ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ను చూసేందుకు తిరుపతి నుంచి పులివెందుల వరకు పోటెత్తిన జనం
- ప్రజలు, అభిమానుల ఘనస్వాగతాలు, హారతులతో ముందుకు కదిలిన ప్రతిపక్ష నేత
- కడప పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు
- వైఎస్సార్ ఉద్యానవన కళాశాల విద్యార్థులకు భరోసా
- చంద్రబాబు ప్రభుత్వంలో న్యాయం జరగదని, బాగా చదువుకోవాలని హితవు

సాక్షి కడప/సాక్షి, చిత్తూరు: దారిపొడవునా జనసంద్రం వెల్లువెత్తింది.. ఊరువాడా ఏకమయ్యాయి. 'జయహో జగన్', 'సీఎం.. సీఎం' అంటూ ప్రజలు, అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల నినాదాలతో తిరుపతి–కడప–పులివెందుల రహదారి దద్దరిల్లింది. ప్రజాసంకల్ప యాత్రను దిగ్విజయంగా ముగించుకుని గురువారం తిరుమలేశుడి ఆశీస్సులు పొందిన ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కడప పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకుముందు తిరుపతిలో ఉదయం ఆయన్ను పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు కలిసి సంకల్పయాత్ర విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు. తర్వాత ఉదయం ఎనిమిది గంటలకు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ బయలుదేరగా ఎక్కడికక్కడ ఆయనకు దారిపొడవునా జనాలు బ్రహ్మరథం పట్టారు. పూలు చల్లుతూ, హారతులు ఇస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయనను చూసేందుకు, కలిసేందుకు బారులు తీరారు. ఆయనను చూసిన ఆనందంతో టపాసులు పేల్చారు. పోటెత్తిన జనాలందరికీ వాహనంపై నుంచి చిరునవ్వుతో వైఎస్ జగన్ అభివాదం చేశారు. కాన్వాయ్ ఆపుతూ ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ.. కష్టాలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. వైఎస్సార్, చిత్తూరు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన కుక్కలదొడ్డి వద్ద రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం లభించింది. రోడ్ల వెంట వైఎస్సార్‌సీపీ జెండా రంగులతో కూడిన బెలూన్లను స్వాగత తోరణాలుగా కట్టి ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. రైల్వేకోడూరు నుంచి రాజంపేటకు రాగానే పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు హారతులు పట్టారు. అక్కడి నుంచి కడప జేఎంజే కళాశాలకు చేరుకోగానే కడప మాజీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజద్‌బాష, పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి ఘనస్వాగతం పలికారు. ప్రజలు వెల్లువలా తరలిరావడంతో కడప నుంచి వేంపల్లె మీదుగా పులివెందులకు చేరుకోవడానికి రాత్రి 9 గంటలైంది.

చంద్రబాబు చర్మం చాలా మందం

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలు, చేసేవన్నీ మోసాలేనని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మండిపడ్డారు. చంద్రబాబు చెప్పేవాటిలో పొరపాటున కూడా నిజాలు ఉండవని అన్నారు. చంద్రబాబు చర్మం చాలా మందమని, ఎన్ని నిరసనలు చేసినా ఈ ప్రభుత్వంలో న్యాయం జరగదని ధ్వజమెత్తారు. రైల్వేకోడూరులో వైఎస్సార్ ఉద్యానవన కళాశాల విద్యార్థులు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఉద్యానవన శాఖలో అన్ని రకాల ఉద్యోగాలు అర్హులైన ఉద్యాన కోర్సుల విద్యార్థులకే అందించాలని కోరుతూ 15 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నా సర్కార్ స్పందించడం లేదని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి అన్ని సమస్యలు తెలుసుకున్న ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. ఇంటింటికీ ఉద్యోగమిస్తానని చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో దారుణమైన మోసం తప్ప ప్రజలకు న్యాయం జరగదని అన్నారు. మనందరి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తానని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. ఆరు నెలల్లో గ్రామ సచివాలయాల ద్వారా రైతు సంక్షేమానికి ఉపయోగపడే అన్ని పోస్టులు భర్తీ చేస్తామని.. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1.50 లక్షల ఉద్యోగాలను కూడా భర్తీ చేస్తామన్నారు. ఎన్ని నిరసనలు చేసినా చంద్రబాబు సర్కార్ పట్టించుకోదని.. అనవసరంగా చదువులు పాడుచేసుకోకుండా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. వైఎస్ జగన్ వెంట రాజంపేట మాజీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఇతర నేతలు ఉన్నారు.



రైల్వేకోడూరు పట్టణంలో స్వాగతం పలుకుతున్న ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

నేడు ఇడుపులపాయకు వైఎస్ జగన్

పులివెందుల: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయను సందర్శిస్తారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తారు. తొలుత ఆయన శనివారం ఉదయం 7.30 గంటలకు పులివెందుల ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌కు చేరుకుంటారు. అక్కడ ఆయనకు వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మనోహర్‌రెడ్డి, పార్టీ వైద్యుల విభాగం రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డిల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలకనున్నారు. అక్కడినుంచి జగన్ పూలంగళ్ల సర్కిల్, శ్రీనివాస హాలు రోడ్డు మీదుగా స్థానిక సీఎస్‌ఐ చర్చికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి ఇడుపులపాయకు చేరుకుని మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద తల్లి వైఎస్ విజయమ్మ, సోదరి షర్మిల, సతీమణి వైఎస్ భారతమ్మ ఇతర కుటుంబసభ్యులతో కలసి నివాళులర్పిస్తారు.



కడప పెద్ద దర్గాలో తల పాగా ధరిస్తున్న వైఎస్ జగన్



ఒంటిమిట్ట రామాలయం వద్ద వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు



రైల్వేకోడూరు హార్టికల్చర్ కళాశాల సమస్యలపై వైఎస్ జగన్‌కు మొరపెట్టుకుంటున్న విద్యార్థినులు



అమీర్ పీర్ దర్గాలో పూల చాదర్ సమర్పిస్తున్న వైఎస్ జగన్.. చిత్రంలో అంజాద్ బాష, రవీంద్రనాథరెడ్డి, రెహ్మాన్, సురేష్‌బాబు

కడప పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న కడప పెద్ద దర్గాను ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ దర్శించుకున్నారు. ముందుగా పూల చాదర్‌ను గురువుల మజార్‌కు సమర్పించిన ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఆవరణలోని ఇతర గురువుల మజార్లను కూడా దర్శించుకుని ఫాతెహా నిర్వహించారు. దర్గా సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రార్థనల్లో పాల్గొన్నారు. పెద్దదర్గాలో ప్రార్థనలు ముగిసిన అనంతరం ఆవరణలోని పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్‌ను కలిసి ఆశీస్సులు పొందారు. ఈ ప్రార్థనల్లో వైఎస్ జగన్‌తోపాటు కడప మాజీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అంజద్‌బాషా, రవీంద్రనాథ్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, రఘురామిరెడ్డి, పార్టీ నేతలు సురేష్‌బాబు, ప్రసన్నకుమార్‌రెడ్డి, రెహ్మాన్ తదితరులు ఉన్నారు.



రాజంపేట పాత బస్టాండు వద్ద మైనార్టీలను ఆప్యాయంగా పలకరిస్తున్న జగన్



రైల్వేకోడూరు హార్టికల్చర్ కళాశాల వద్ద జగన్ ప్రసంగం వింటున్న విద్యార్థులు

కశ్మీర్‌లో బాంబు పేలుడు

మేజర్, జవాన్ మృతి

జమ్మూ: కశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో నియంత్రణ రేఖ సమీపంలో శుక్రవారం బాంబు పేలిన ఘటనలో ఆర్మీ మేజర్, జవాన్ మృతిచెందారు. సరిహద్దులో గస్తీ నిర్వహిస్తున్న జవాన్లే లక్ష్యంగానే మిలిటెంట్లు ఈ బాంబును పెట్టి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మేజర్, జవాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు, రాజౌరీ, పూంచ్ జిల్లాల సరిహద్దులో పాకిస్తాన్ దళాలు కాల్పులకు తెగపడటంతో ఆర్మీ కూలీ ఒకరు చనిపోయాడు. మృతుడిని హేమరాజ్‌గా గుర్తించారు. పాకిస్తాన్ సైనికులు వరుసగా నాలుగో రోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులకు పాల్పడ్డారని, భారత ఆర్మీ ప్రతిదాడికి దిగి తిప్పికొట్టిందని అధికారులు తెలిపారు.



కళ్ల ముందు ఉన్నట్లే ఉంది! గ్రాఫిక్స్ అద్భుతం.. కంగ్రాట్స్!!

'అవినీతి చక్రవర్తి' పుస్తకంపై సర్కారు వణుకు

▶ మొదటి పేజీ తరువాయి

ఇదే అంశంపై విస్తృతంగా చర్చించుకుంటున్నారు. మరోవైపు సోషల్ మీడియాలోనూ చంద్రబాబుపై నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. దీంతో ప్రభుత్వ పెద్దలు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. చంద్రబాబు అవినీతిని సాక్ష్యాధారాలతో సహా వైఎస్సార్‌సీపీ బయటపెట్టడంతో ఏం మాట్లాడాలో తెలియక గింజుకుంటున్నారు. 'అవినీతి చక్రవర్తి' పుస్తకం వల్ల ప్రజలకు వాస్తవాలు తెలిశాయని, ప్రభుత్వ పెద్దల అవినీతిపై మండిపడుతున్నారని నిఘా వర్గాలు, టీడీపీ శ్రేణుల ద్వారా తెలుసుకున్న సీఎం చంద్రబాబు నష్టనివారణ చర్యలు ప్రారంభించారు. అవినీతి చక్రవరి పుస్తకంలోని అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో వివరణలు(రిజాయిండర్లు) తయారు చేయించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. దీంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆ పుస్తకంలోని ఆయా అంశాలను సంబంధిత శాఖలకు పంపించి, వివరణలు రూపొందించాలని లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు.

మేమేనా బలిపశువులం..

ముఖ్యమంత్రి ఆదేశాలపై ప్రభుత్వ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నేతలు చేసిన దోపిడీకి తామెలా బాధ్యత వహిస్తామని ప్రశ్నిస్తున్నారు. తమను బలిపశువులను చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడుతున్నారు. ప్రభుత్వ పెద్దల అవినీతిపై తమను వివరణ ఇవ్వాలని ఆదేశించడం ఏమిటని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు నిలదీశారు. అవినీతి చక్రవర్తి పుస్తకంలోని అంశాలన్నీ వాస్తవాలేనని, అందుకు సాక్ష్యాలుగా జీవోలు కూడా ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో తాము వాటికి వివరణ ఇవ్వడం ఎలా సాధ్యమని అధికారులు అంటున్నారు. ఇప్పుడు వివరణలు ఇస్తే భవిష్యత్తులోతమకు ఇవన్నీ తలనొప్పిగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకంలోని అంశాలన్నీ అక్షర సత్యాలు

తాము అధికారంలోకి రాగానే టీడీపీ పెద్దల అవినీతిపై విచారణ జరిపిస్తామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులతో వివరణల పేరిట సీఎం చంద్రబాబు కొత్త ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. నాలుగున్నరేళ్లలో ఎలాంటి అవినీతి జరగలేదని ఏకంగా ప్రభుత్వ అధికారులతోనే చెప్పిస్తే తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అందుకే అధికారులతో వివరణలు ఇప్పించాలని ఆదేశించినట్లు ప్రభుత్వ యంత్రాంగం అనుమానిస్తోంది. ఈ వ్యవహారంలో తమను ఇరికించి, ప్రభుత్వ పెద్దలు తప్పించుకోవాలని చూస్తున్నారని అధికారులు ఆరోపిస్తున్నారు. అవినీతి చక్రవర్తి పుస్తకంలో పేర్కొన్న అంశాలన్నీ అక్షర సత్యాలేననే, సంబంధిత ఫైళ్లు, జీవోలను పరిశీలిస్తే ఆ విషయం స్పష్టంగా తెలుస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ పుస్తకంలోని అంశాలన్నీ తప్పు అంటూ వివరణలు ఇవ్వడం సాధ్యం కాదని తెగేసి చెబుతున్నారు.

నిజాలు ఆ ఫైల్‌లోనే ఉన్నాయి..

ఉదాహరణకు విశాఖపట్నంలో ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సంస్థకు తక్కువ ధరకే భూమిని కేటాయించిన విషయం వాస్తవమేనని, రూ.400 కోట్ల విలువైన భూమిని తక్కువ ధరకు కేటాయించవద్దంటూ సంబంధిత ఫైలులో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) స్పష్టంగా పేర్కొన్నారని, అంతే కాకుండా అమెరికాలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయం 10 ఎకరాల్లోనే ఉందని, విశాఖపట్నంలో 25 ఎకరాలు ఎందుకని సీఎస్ పేర్కొన్నారని, ఇప్పుడు అది నిజం కాదంటూ వివరణ ఎలా ఇస్తామని ఒక అధికారి ప్రశ్నించారు. వాస్తవానికి ఆ ఫైలులో పేర్కొన్న అంశాలతోనే రిజాయిండర్ రూపొందించాల్సి ఉంటుందని, తక్కువ ధరకు భూమి కేటాయించలేదని వివరణ ఇస్తే.. ప్రభుత్వం మారిన తరువాత విచారణ జరిగితే తమకు ఇబ్బందులు తప్పవని అన్నారు.

అవినీతి జరగలేదని చెప్పాలా?

పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో రూ.376 కోట్లు, పోలవరం ప్రాజెక్టులో రూ.1,819 కోట్ల అవినీతి జరిగినట్లు సాక్షాత్తూ 'కాగ్' స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అందులో ఏమాత్రం అవినీతి జరగలేదని వివరణ ఎలా ఇవ్వాలో ఇక ప్రభుత్వ పెద్దలే చెప్పాలని అధికారులు ప్రశ్నిస్తున్నారు. నీరు–చెట్టు కార్యక్రమంలో ఇప్పటిదాకా రూ.16 వేల కోట్లకు పైగా విలువైన పనులు చేయగా, ఇవన్నీ నామినేషన్ విధానంలో అధికార పార్టీ నేతలు దక్కించుకున్నారు. ఈ వ్యవహారంలో రూ.వేల కోట్ల అవినీతి జరిగింది. దీనిపై రిజాయిండర్ ఎలా తయారు చేస్తామని అధికారులు అంటున్నారు. ఇలా అన్నీ అంశాలపై తప్పుడు వివరణలు ఇవ్వడం తమ వల్ల కాదని తేల్చిచెబుతున్నారు.

చిదంబరం భార్యపై సీబీఐ చార్జిషీట్



న్యూఢిల్లీ: శారదా చిట్‌ఫండ్ కుంభకోణం కేసులో కేంద్ర మాజీ హోంమంత్రి పి.చిదంబరం భార్య నళినీ చిదంబరంపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ విషయమై సీబీఐ అధికార ప్రతినిధి అభిషేక్ దయాల్ మాట్లాడుతూ.. శారదా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సుదీప్త సేన్‌తో కలిసి నళిని నేరపూరిత కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. కేంద్ర మాజీ మంత్రి మాతంగ్ సిన్హ్ మాజీ భార్య మనోరంజనా సిన్హ్ నళినీని సుదీప్త సేన్‌కు పరిచయం చేశారని వెల్లడించారు. శారదా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ నుంచి 2010–12 మధ్యకాలంలో 1.4 కోట్లను నళిని అందుకున్నారనీ, ఇందుకు ప్రతిగా సెబీ, ఆర్వోసీ వంటి విచారణ సంస్థల నుంచి రక్షణ కల్పించారని పేర్కొన్నారు. కోల్‌కతాలోని ఓ ప్రత్యేక కోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశామన్నారు. ఆకర్షణీయమైన వడ్డీ ఆశచూపి రూ.2,500 కోట్ల మేర సమీకరించిన శారదా గ్రూపు.. చెల్లింపులు జరపలేక 2013లో మూతపడింది.

రోడ్డు ప్రమాదాల నివారణకు రూ.20 వేల కోట్లు

వెల్లడించిన కేంద్ర మంత్రి గడ్కరీ



న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ప్రమాదాలను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలన్నదే తమ ధ్యేయమన్నారు. నిస్సాన్ ఇండియా, సేవ్ లైఫ్ ఫౌండేషన్ల పరిశోధన నివేదికను గడ్కరీ శుక్రవారం ఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ప్రతి సంవత్సరం ప్రమాదాల్లో లక్ష మందికి పైగా మరణిస్తున్నారని చెప్పారు. రహదారుల్లో ఇంజినీరింగ్ లోపాల కారణంగా యాక్సిడెంట్లు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వాటిని సరిదిద్దేందుకు రూ.20 వేల కోట్లతో అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్‌లు నిర్మిస్తున్నామన్నారు. అలాగే ప్రాథమిక విద్యలో రోడ్డు భద్రతకు సంబంధించిన పాఠ్యాంశాలను చేర్చి పిల్లలకు అవగాహన కల్పించాలని రాష్ట్రాలకు సూచించామన్నారు. కేంద్రం సైతం ఆటో పరిశ్రమతో చర్చించి ప్రమాదాల నివారణ చర్యలు తీసుకుంటుందన్నారు. దేశంలో వెనక సీటు బెల్టులను పూర్తిగా విస్మరించారని నిస్సాన్ ఇండియా అధ్యక్షుడు థామస్ కుయెల్ చెప్పారు. సేవ్‌లైఫ్ ఫౌండేషన్, షార్ప్ తరఫున 12 నగరాల్లోని 240 పాఠశాలల్లో 2 లక్షల మంది పిల్లలకు వెనుక సీట్ బెల్టుల ఉపయోగం గురించి అవగాహన కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

స్వల్పంగా పెట్రో ధర పెంపు

లీటరు పెట్రోల్‌పై 19పైసలు..డీజిల్‌పై 28 పైసలు పెంపు



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా చమురు సంస్థలు ఇంధన ధరలు పెంచడంతో శుక్రవారం పెట్రోల్, డీజిల్ ధరలు స్వల్పంగా పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై 19 పైసలు, ఇంధనంపై 28 పైసలు చొప్పున చమురు సంస్థలు పెంచాయి. పెరిగిన తాజా ధరలతో ఢిల్లీలో లీటరు పెట్రోల్ రూ.69.07 గా ఉండగా, డీజిల్ ధర రూ.62.81గా ఉంది. ముంబైలో లీటరు పెట్రోల్ ధర రూ.74.72, డీజిల్ ధర రూ.65.73గా ఉంది. అమ్మకాల పన్ను, వ్యాట్‌ల కారణంగా రాష్ట్రాలకు రాష్ట్రాలకు మధ్య చమురు ధరల్లో వ్యత్యాసం ఉంటోంది. ఈ నెలలో చమురు ధరలు పెరగడం ఇది మూడోసారి. గురువారం లీటరు పెట్రోల్ పై 38 పైసలు, డీజిల్‌పై 29 పైసలు పెరిగింది. ఈనెల 7న లీటరు పెట్రోల్‌పై 21పైసలు, డీజిల్‌పై 8 పైసలు పెంచగా, 8,9 తేదీల్లో ఈ ధరలు స్థిరంగా కొనసాగాయి. ఈ మూడుసార్లు ఇంధన ధరల పెంపుతో లీటరు పెట్రోల్‌పై 78పైసలు, డీజిల్‌పై 55 పైసలు పెరిగాయి.

తెలంగాణ హైకోర్టు సీజే రాధాకృష్ణన్ బదిలీ

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు
- బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా ఏపీకి చెందిన జస్టిస్ దామ శేషాద్రినాయుడు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్‌ను కొల్‌కతా హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీం కోర్టు కొలీజియం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఇటీవలి వరకు కొల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన డీకే గుప్తా ఇటీవల పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిజ్ రంజన్‌గొగాయ్, న్యాయమూర్తులు జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఎన్‌వీ రమణ, జస్టిస్ అరుణ్‌మిశ్రాలతో కూడిన కొలీజియం భేటీ అయ్యింది. జస్టిస్ రాధాకృష్ణన్‌ను కొల్‌కతా హైకోర్టుకు బదిలీ చేయాలని తీర్మానించింది. కేరళకు చెందిన జస్టిస్ రాధాకృష్ణన్ గతేడాది జూలై 1న ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతిపై వచ్చారు. వచ్చిన 6 నెలలకే ఆయన బదిలీ కావడం న్యాయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్ కేరళకు చెందినవారు. 2004 అక్టోబర్‌లో కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా, 2015న అదే హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2017లో పదోన్నతిపై ఛత్తీస్‌గఢ్ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అక్కడి నుంచి ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీపై వచ్చారు. రాధాకృష్ణన్ బదిలీ నేపథ్యంలో రెండో స్థానంలో కొనసాగుతున్న జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే)గా వ్యవహరించే అవకాశముంది. ఇలావుండగా కేరళలో పని చేస్తున్న జస్టిస్ దామ శేషాద్రినాయుడును బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ చేస్తూ కొలీజియం సిఫారసు చేసింది. శేషాద్రినాయుడు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద మరోసారి పోలీసుల హల్‌చల్

‘నిన్ను నమ్మం బాబు’ స్టిక్కర్లున్న వాహనాలు సీజ్ చేసేందుకు యత్నం



పోలీసులతో మాట్లాడుతున్న అప్పిరెడ్డి. చిత్రంలో రోశయ్య తదితరులు

పట్నంబజారు(గుంటూరు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పశ్చిమ నియోజక వర్గ సమన్వయకర్త చంద్రగిరి ఏసురత్నం కార్యాలయం వద్ద పోలీసులు మరోసారి హడావుడి సృష్టించారు. ‘నిన్ను నమ్మం బాబు’ అనే స్టిక్కర్లు వాహనాలపై ఉన్నాయని, వాటిని సీజ్ చేయాలంటూ శుక్రవారం సాయంత్రం హైడ్రామాకు తెరతీశారు. వాహనాలను తమకు అప్పజెప్పాలని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఆదేశించారు. చంద్రగిరి ఏసురత్నం ప్రస్తుతం అందుబాటులో లేరని, ఒక్కరోజు ఆగితే ఆయన వస్తారని చెబుతున్నప్పటికీ వినిపించుకోలేదు. వాహనాలను అప్పజెప్పాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు. విషయం తెలుసుకున్న గుంటూరు పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కిలారి రోశయ్య, నగర అధ్యక్షుడు పాదర్తి రమేష్‌గాంధీ తదితర నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. వాహనాలను సీజ్ చేసేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని తేల్చిచెప్పారు. ఇంతలో పట్టాభిపురం ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకున్నారు. ఏసురత్నం చేసిన నేరం ఏమిటని ఎస్‌హెచ్‌వోను వైఎస్సార్‌సీపీ నేతలు ప్రశ్నించారు. వాహనాల సీజ్‌కు అంగీకరించబోమని చెప్పడంతో పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సాయంత్రం 5.30 గంటలకు వచ్చిన పోలీసులు 8.45 గంటల వరకు కార్యాలయంలోనే ఉండటం గమనార్హం. తాటాకు చప్పుళ్లకు తాము భయపడబోమని, పోలీసులను అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలు చేయటం చంద్రబాబు సర్కార్‌కు పరిపాటిగా మారిందని లేళ్ల అప్పిరెడ్డి విమర్శించారు. నిన్ను నమ్మం బాబు అని రాష్ట్రంలో ప్రజలంతా గొంతెత్తి నినదిస్తున్నారని, ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేస్తారా? అని నిలదీశారు. కిలారి రోశయ్య మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా చంద్ర బాబు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. కేవలం స్వార్థ రాజకీయాలతో ప్రజలను, ప్రతిపక్ష నేతలను భయపెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు.

జేఎన్‌టీయూ అమరావతి!

- దీని పరిధిలోకి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు
- త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం

సాక్షి, అమరావతి: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(జేఎన్‌టీయూ)ను అమరావతిలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ శుక్రవారం సమావేశమైంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఈ వర్సిటీలో ఏయే కోర్సులకు ప్రాధాన్యమివ్వాలి? కొత్తగా ఏయే అంశాలతో కూడిన వినూత్న కోర్సులకు రూపకల్పన చేయాలన్న దానిపై చర్చించింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జేఎన్‌టీయూను ఆ తరువాత ఏపీలోని జిల్లాలకు కూడా అందుబాటులో ఉండేలా విస్తరించారు. తరువాత కోస్తా జిల్లాలకు అందుబాటులో ఉండేలా జేఎన్‌టీయూ కాకినాడను, రాయలసీమ జిల్లాలకు వీలుగా జేఎన్‌టీయూ అనంతపురంలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాష్ట్రం విడిపోయి అమరావతి రాజధాని ప్రాంతంగా మారినందున రాజధాని కేంద్రంగా జేఎన్‌టీయూని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఇందులో భాగంగా ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం కాకినాడ జేఎన్‌టీయూ పరిధిలో ఉన్న గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలను ఆ వర్సిటీ పరిధి నుంచి తప్పించి అమరావతి జేఎన్‌టీయూ పరిధిలోకి తేనున్నారు. దాంతో జేఎన్‌టీయూ కాకినాడ పరిధి ఉత్తరాంధ్రతోపాటు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు పరిమితమవనుంది. రాయలసీమ జిల్లాలు గతంలో మాదిరిగానే జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో కొనసాగుతాయి. జేఎన్‌టీయూ అమరావతి ఏర్పాటుకు సంబంధించి త్వరలోనే ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేయనుందని అధికార వర్గాలు తెలిపాయి.

ఔటర్‌పై అంబులెన్స్‌ను ఢీకొన్న కారు

- ప్రమాదంలో నలుగురు మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు
- మృతుల్లో ముగ్గురు కర్ణాటకవాసులు, ఒకరు ఆంధ్రప్రదేశ్ వాసి
- తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల గ్రామ సమీపంలో ప్రమాదం

హైదరాబాద్: ఔటర్ రింగ్‌రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కేన్సర్‌కు వైద్య చికిత్స పొంది సొంత రాష్ట్రానికి అంబులెన్స్‌లో తిరుగు ప్రయాణమైన ఓ కుటుంబాన్ని మృత్యువు కారు రూపంలో కబలించింది. ఈ ఘటనలో ఒకే కుటుంబంలోని ముగ్గురితోపాటు అంబులెన్స్ డ్రైవర్ మృతిచెందాడు. అంబులెన్స్‌లోని మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. కర్ణాటకలోని బళ్లారికి చెందిన బొల్లిరెడ్డి వెంకటేశ్వరరావు(60) పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులోని ఓ ఆస్పత్రిలో కేన్సర్ చికిత్స పొందాడు. చికిత్స పూర్తికావడంతో తన భార్య సుబ్బలక్ష్మి(55), సోదరుడు రామారావు (70), కుమారుడు హేమచందర్‌రావు, అల్లుడు శ్రీనివాసరావుతో కలసి ప్రైవేటు అంబులెన్స్‌లో ఈ నెల 10న రాత్రి హైదరాబాద్ మీదుగా బళ్లారికి బయలుదేరారు. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట నుంచి ఔటర్‌రింగ్ రోడ్డు మీదుగా శంషాబాద్‌కు వెళ్లే క్రమంలో తెల్లవారుజామున 3 గంటలకు తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల గ్రామ సమీపంలోని ఔటర్ ఎగ్జిట్ 13 వద్దకు వచ్చారు. ఆ సమయంలో శంషాబాద్ నుంచి బొంగుళూరు గేటుకు వస్తున్న హస్తినాపురానికి చెందిన మనోజ్‌తోపాటు ఆరుగురితో ఉన్న కారు అదుపు తప్పి డివైడర్‌ను దాటుకుని అంబులెన్స్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న వెంకటేశ్వరరావు, సుబ్బలక్ష్మి, అంబులెన్స్ డ్రైవర్ శివ అక్కడికక్కడే మృతిచెందారు. హేమచందర్‌రావు, శ్రీనివాసరావు, రామారావు, అంబులెన్స్ మరో డ్రైవర్ మోహిద్ తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు కర్ణాటకకు చెందిన వారు కాగా.. అంబులెన్స్ డ్రైవర్ శివది ఆంధ్రప్రదేశ్. అలాగే కారులో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. ఆదిభట్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను, మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు.

మార్గమధ్యలో మరొకరు మృతి

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామారావును వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతిచెందాడు. ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిభట్ల సీఐ నరేందర్ తెలిపారు.

అభ్యర్థుల్లో గ్రూప్స్ గుబులు!



- పరీక్షల విధానం, సిలబస్ మారినా ప్రామాణిక పుస్తకాలు కరువు
- వ్యవధి గోరంత.. సిలబస్ కొండంత
- రిఫరల్ పుస్తకాలు పేర్కొనని ఏపీపీఎస్సీ
- ఎలా ప్రిపేర్ కావాలో తెలియక గందరగోళం
- సమయం పెంచాలంటున్న అభ్యర్థులు
- యూపీఎస్సీ తరహా అంటూనే అడ్డగోలు నిబంధనలు

సాక్షి, అమరావతి:

ఏపీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన గ్రూప్స్ నోటిఫికేషన్స్ నిబంధనలు అభ్యర్థుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) తరహా అంటూ అడ్డగోలు నిబంధనలు పెడుతూ పరీక్షల విధానం, సిలబస్‌ను పూర్తిగా మార్చివేశారు. అందుకు తగ్గట్టుగా ప్రామాణిక పుస్తకాలు అందుబాటులో లేకపోవడం, తగిన సమయం ఇవ్వకపోవడంతో లక్షలాది మంది నిరుద్యోగులు సన్నద్ధం కావడానికి నానా అవస్థలూ పడుతున్నారు. ఏయే పుస్తకాలను తాము అనుసరించాల్సి ఉంటుందో ఏపీపీఎస్సీ రిఫరల్ పుస్తకాలను ఇవ్వలేదని వారు వాపోతున్నారు. తెలుగు అకాడెమీ ఏర్పాటు కాకపోవడంతో పుస్తకాల ముద్రణ లేక ప్రైవేటు పబ్లిషర్ల పుస్తకాలను అధ్యయనం చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. చివరకు వీటినే పరీక్షల్లో రాస్తే ఏపీపీఎస్సీ అంగీకరించని పరిస్థితుల్లో తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రూప్1 విషయంలో ప్రిలిమ్స్‌కు కనీసం 150 రోజులు సమయం ఇవ్వాల్సి ఉన్నా కేవలం 60 రోజులే ఇవ్వడంపై మండిపడుతున్నారు.

ఏడాది తిరక్కుండానే భారీ మార్పులు

రాష్ట్రంలో గ్రూప్1, గ్రూప్2లకు సంబంధించి 2016లోనే సిలబస్, పరీక్షల విధానంలో కొన్ని మార్పులు చేస్తూ ఆన్‌లైన్ విధానాన్ని ఏపీపీఎస్సీ ప్రవేశపెట్టింది. మళ్లీ ఏడాది తిరగకుండానే మార్పులు చేయడం నిరుద్యోగుల పాలిట అశనిపాతంగా మారింది. గతంలో గ్రూప్1లో స్క్రీనింగ్ టెస్ట్‌లో 150 మార్కులకు జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ అంశాలపై ప్రశ్నలు అడిగేవారు. ఈసారి స్క్రీనింగ్ టెస్టును పేపర్1, పేపర్2గా విభజించి 120 మార్కుల చొప్పున 240 మార్కులకు పెంచేశారు. అలాగే మెయిన్స్‌లోనూ భారీ మార్పులు చేశారు. గతంలో క్వాలిఫైయింగ్ పేపర్ కింద జనరల్ ఇంగ్లీష్ సబ్జెక్టు ఒక్కటే 150 మార్కులకు ఉండేది. ఈసారి క్వాలిఫైయింగ్ పేపర్లను రెండుకు పెంచారు. పేపర్1 తెలుగు, పేపర్ 2 ఇంగ్లీషు ఉంటాయి. 150 మార్కుల చొప్పున ప్రశ్నలుండే ఈ రెండు పేపర్లలోనూ అభ్యర్థులు క్వాలిఫై కావాల్సిందేనని కొత్త నిబంధన పెట్టారు.

సమకాలీన పరిణామాలతో ముప్పు

మెయిన్స్ సిలబస్‌లో పలు మార్పులు అభ్యర్థులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఎందుకంటే సమకాలీన పరిణామాలతో ముడిపెట్టి ప్రశ్నలను ఏపీపీఎస్సీ పరీక్షలకు చాలా ముందుగా నిపుణుల కమిటీ ద్వారా రూపొందింపచేస్తుంది. పరీక్షల అనంతరం ప్రాథమిక కీ సిద్ధం చేయిస్తుంది. ఓ రెండు మూడు నెలల తర్వాత సమకాలీన పరిణామాల్లో, ఆయా గణాంకాల్లో చాలా మార్పులు చోటుచేసుకుంటాయి. గతంలోని సమాచారం ప్రకారం పాత అంశాలను ఏపీపీఎస్సీ సమాధానాలుగా రూపొందించుతుందని, అభ్యర్థులు పరీక్ష రోజు నాటికి మార్పులను అనుసరించి సమాధానాలు గుర్తిస్తే అవి తప్పుగా పరిగణించి నష్టపరిచే అవకాశం ఉందని చెబుతున్నారు. గతంలోనూ ఇలా జరిగిందని, అయినా ఈసారి ఇదే విధంగా చేయడం అన్యాయమని వాపోతున్నారు.

పేపర్ల వారీగా మార్పులు ఇలా..

పేపర్ 1 గతంలో జనరల్ ఎస్సే మాత్రమే ఉండేది. ఈసారి అందులో ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ పరిణామాలకు సంబంధించి అంశాలుంటాయి. పేపర్ 2లో గతంలో భారత రాజ్యాంగం ప్రశ్నలుండగా దాన్ని తీసేసి భారత మరియు ఆంధ్రప్రదేశ్ చరిత్ర, సాంస్కృతిక, భౌగోళిక అంశాలపై సిలబస్ పెట్టారు. పేపర్ 3లో గతంలోని ప్లానింగ్ ఇన్ ఇండియా అండ్ ఇండియన్ ఎకానమీ, భూ సంస్కరణలు, స్వాతంత్ర్యం అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన మార్పులు, ఆంధ్రప్రదేశ్ తాజా ఆర్థిక పరిస్థితి, బలం బలహీనతలు అనే వాటిని తీసేసి కొత్తగా రాజకీయ, రాజ్యాంగ, పరిపాలన, న్యాయ, నైతిక అంశాలను చేర్చారు. పేపర్ 4లో ఇంతకు ముందటి అంశాలను పూర్తిగా మార్చేసి భారత, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధిపై, పేపర్ 5లో శాస్త్ర సాంకేతిక అంశాలు, పర్యావరణంపై సిలబస్‌ను పొందుపరచారు.

ఇప్పటికిప్పుడు చదవడం ఎలా?

యూపీఎస్సీలో సిలబస్‌ను మార్పు చేయాలంటే కనీసం రెండేళ్ల ముందు ప్రకటన చేస్తారు. కానీ ఇక్కడ 2016లో సిలబస్ మార్చి వెంటనే మళ్లీ ఇప్పుడు ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే డిసెంబర్‌లో ఫైనల్ సిలబస్‌ను ఖరారు చేశారని అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఇంత తక్కువ సమయంలో ఈ సిలబస్‌ను ఎలా ప్రిపేర్ కాగలమని వాపోతున్నారు. ఇప్పటివరకు లక్షలు ఖర్చు చేసి కోచింగ్‌లు తీసుకున్నామని, ఇప్పుడు ఒక్కసారిగా సిలబస్‌ను మార్పుచేసి పెంచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఏ సబ్జెక్టు అయినా ఏదో ఒకలా కొంత కష్టపడితే తెలుసుకోవచ్చని, కానీ కొత్తగా మేథ్స్‌ను, న్యాయ, ఎథిక్స్, పరిపాలన వంటి అంశాలను ఎలా సన్నద్ధం కాగలమని వాపోతున్నారు. వాటికీ ప్రామాణిక పుస్తకాలు దొరక్క అవస్థలు పడుతున్నామన్నారు. ఏపీపీఎస్సీ దీనిపై పునరాలోచించాలని, ప్రిలిమ్స్‌కు నాలుగైదు నెలల వ్యవధి ఇవ్వాలని కోరుతున్నారు. గ్రూప్2 ప్రిలిమ్స్ మేలో నిర్వహిస్తామని, అంతకన్నా ఎక్కువ సిలబస్ ఉన్న గ్రూప్1ను మార్చి 10న పెడతామని చెప్పడం భావ్యం కాదని పేర్కొంటున్నారు.

ఇష్టానుసారం సిలబస్

యూపీఎస్సీ సిలబస్ ప్రకారం చేస్తున్నామని అధికారులు పైకి చెబుతున్నా అందుకు భిన్నంగా పరిస్థితి ఉందని అభ్యర్థులు వాపోతున్నారు. మెయిన్స్‌లో హిస్టరీ చాలా ఎక్కువగా ఉంది. ఎథిక్స్, ‘లా’ కొత్తగా పెట్టారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మార్పులు చేశారు. వాస్తవానికి యూపీఎస్సీలో ఇలాంటి సబ్జెక్టులున్నా అవి ఆప్షనల్ మాత్రమే. ఏపీపీఎస్సీ అందుకు భిన్నంగా కంపల్సరీ చేసింది. పేపర్–5లో ప్యూర్ మేథ్స్ పెట్టడంతో పాటు ప్రిలిమ్స్ రెండో పేపర్‌లో 60 శాతం ప్రశ్నలు మేథ్స్‌లోనే ఉండేలా చేస్తున్నారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్‌లో పేపర్1లో వచ్చిన మార్కులను మాత్రమే మెయిన్స్‌లోకి అర్హతగా కౌంట్ చేస్తారు. రెండో పేపర్‌ను కేవలం క్వాలిఫయింగ్ పేపర్‌గా ఉంచారు. ఏపీపీఎస్సీ మాత్రం రెండు పేపర్లను తప్పనిసరి చేసి రెండింటిలోనూ మెరిట్ సాధించిన వారికే మెయిన్స్‌కు అవకాశమిస్తున్నారు. పేపర్1లో గట్టెక్కే అభ్యర్థులు పేపర్2 మేథ్స్ సబ్జెక్టులో 60 మార్కుల ప్రశ్నలను పెట్టడం వల్ల తీవ్రంగా నష్టపోనున్నారు.

ఓటర్ల తుది జాబితాకు ఎన్నికల సంఘం అనుమతి

సాక్షి, అమరావతి: ఓటర్ల తుది జాబితాను ప్రకటించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం అనుమతిచ్చింది. ఈ మేరకు శనివారం తమ వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరుస్తామని వెల్లడించింది. పూర్తి జాబితా ప్రకటించాక ఓటర్లు తమ పేర్లను పరిశీలించుకోవచ్చు. ఎవరైనా తమ పేరు లేదనుకుంటే మళ్లీ తాజాగా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానాల్లో ఫామ్–6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. నామినేషన్ల చివరి రోజు వరకు ఇందుకు అవకాశం ఉందని ఎన్నికల సంఘం తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 3,69,33,091 మంది ఓటర్లు ఉన్నారని వివరించింది. ఇందులో 1,83,24,588 మంది పురుషులు కాగా, మహిళలు 1,86,04,742 మంది. కాగా థర్డ్ జెండర్ 3,761 మంది ఉన్నారు.

9.1 % అధిక ధరకు ఫైబర్‌గ్రిడ్ పనులు

- నిబంధనలకు విరుద్ధమన్న సంబంధిత శాఖ
- ప్రాజెక్టు వ్యయం రూ. 857 కోట్ల నుంచి రూ.1,410 కోట్లకు పెంపు
- ఈ దోపిడీనీ ముందే వెల్లడించిన ‘సాక్షి’

సాక్షి, అమరావతి: ఫైబర్ గ్రిడ్ రెండో దశ పనులను టెండర్ నిబంధనలకు విరుద్ధంగా 9.1 శాతం అధిక ధరకు 3 సంస్థలకు కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. సాధారణంగా టెండరు నిబంధనల్లో 5 శాతం ధరకు మించి కోట్ చేస్తే రద్దు చేయాల్సి ఉంది. ఇలా ఇంత అధిక ధరకు టెండర్లను కేటాయించడం నిబంధనలకు విరుద్ధమని ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్‌ఎఫ్‌ఎల్) స్పష్టం చేయడంతో క్యాబినెట్‌లో పెట్టిమరీ ఈ దోపిడీకి సీఎం ఆమోదముద్ర వేయించడం గమనార్హం. అలాగే ఫైబర్ గ్రిడ్ రెండో దశ పనుల వ్యయాన్ని రూ. 857 కోట్ల నుంచి రూ.1,410 కోట్లకు పెంచేశారు. ఈ దోపిడీని గతంలోనే ‘సాక్షి’ వెలుగులోకి తీసుకొచ్చింది. కాగా, టెండర్లల్లో ఎల్1గా నిలిచిన టెలీకమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియా రూ. 859.87 కోట్లకు బిడ్ దాఖలు చేస్తే అదే ధరకు ఎల్2గా నిలిచిన లార్సెన్ అండ్ టూబ్రో, ఎల్4గా నిలిచిన తెరాసాఫ్ట్‌లు పనిచేయడానికి ముందుకొచ్చాయని, ఎల్3 సంస్థ మాత్రం ఇలా అధిక ధరకు పనిచేయడానికి ముందుకు రాలేదని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ ఆ జీవోలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆమోదంతోనే ఈ ఎక్సెస్ ధరకు టెండర్లను కేటాయిస్తున్నట్లు అందులో తెలిపారు. గ్రామ పంచాయితీల్లో ఫైబర్ గ్రిడ్‌ను అందుబాటులోకి తీసుకురావడం కోసం భారత్ నెట్ రెండో దశ కింద కేంద్రం రూ. 851.23 కోట్లు కేటాయించింది. మొదటిసారి నిర్వహించిన టెండర్లలోముఖ్యనేత సన్నిహితుడికి చెందిన సంస్థ అర్హత సాధించలేదు. తర్వాత మరో రెండుసార్లు సవరణలు ప్రతిపాదించినా అర్హత సాధించలేదు. దీంతో దీన్ని మూడు ప్యాకేజీలుగా విభజించి ఎల్1గా నిలిచిన టెలీకమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ ఇండియాకు ఐదు జిల్లాలను, ఎల్అండ్‌టీకి 4 జిల్లాలు, తెరా సాఫ్ట్‌కు 4 జిల్లాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఎన్‌ఐఏ కస్టడీకి శ్రీనివాసరావు

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్‌ఐఏ అధికారులు నిందితుడు శ్రీనివాసరావును తమకు అప్పగించమని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత నిందితుడిని విశాఖ జైలు నుంచి భారీ బందోబస్తు నడుమ విజయవాడ తీసుకువచ్చి శుక్రవారం పూర్తి అదనపు ఇన్‌చార్జి నగర మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి అచ్యుత పార్థసారథి ఎదుట హాజరుపరచగా ఈ నెల 25 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రిమాండ్ అనంతరం నిందితుడిని జిల్లా జైలుకు తరలించారు. విచారణ నిమిత్తం నిందితుడిని వారం రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించమని కోరుతూ ఎన్‌ఐఏ చీఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిందితుడి తరపున న్యాయవాదులు హాజరు కాకపోవడంతో అధికారులు నిందితుడికి కస్టడీ పిటిషన్ కాపీ ప్రతులను అందజేశారు. తనను విచారించడానికి ఎటువంటి అభ్యంతరం లేదని, లాయర్ సమక్షంలో విచారించమని నిందితుడు న్యాయమూర్తిని కోరాడు. దీంతో శ్రీనివాసరావును వారం రోజులపాటు ఎన్‌ఐఏ కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. నిందితుడికి మూడురోజులకోసారి వైద్యపరీక్షలు చేయించాలని, అతని న్యాయవాది సమక్షంలోనే విచారించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా జైలు నుంచి నిందితుడిని అదుపులోకి తీసుకున్న తరువాత ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షల అనంతరం నేరుగా హైదరాబాద్‌లోని ఎన్‌ఐఏ కార్యాలయానికి తరలిస్తున్నట్లు తెలిసింది. అక్కడే వారం రోజులపాటు ఉంచి విచారణ చేపడతారని సమాచారం

పింఛన్.. పెంపు

▶ మొదటి పేజీ తరువాయి

మరో నెల రోజుల్లో వెలువడవచ్చని భావిస్తున్న సమయంలో పింఛన్ మొత్తాన్ని పెంచుతున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడం గమనార్హం. పేదలకు జగన్ ఇచ్చిన హామీపై ఏడాదిన్నరగా స్పందించకుండా చంద్రబాబు ఇప్పుడు హడావుడిగా నెలకు రూ.2 వేల చొప్పున పింఛను చెల్లించాలని నిర్ణయం తీసుకోవడం ఒత్తిడికి లోనై కేవలం ఎన్నికల లబ్ధికోసమేనని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. నవరత్నాల్లో ఇచ్చిన పింఛన్ పెంపు హామీ వైఎస్ జగన్ పాదయాత్ర సందర్భంగా ప్రజల్లోకి బలంగా వెళ్లింది. ప్రతిపక్ష నేతకు పేదలు పెద్ద ఎత్తున వినతిపత్రాలు ఇస్తున్నట్లు గుర్తించిన చంద్రబాబు గత్యంతరం లేకనే తాజా ప్రకటన చేశారని పేర్కొంటున్నారు. పింఛను మొత్తం పెంపుపై ఏడాదిన్నరగా చర్చ జరుగుతున్నప్పటికీ ఇన్నాళ్లూ మౌనంగా ఉండి ఓటమి భయంతోనే చంద్రబాబు వైఎస్సార్ సీపీ ప్రకటించిన నవరత్నాల హామీని ఇప్పుడు ఎన్నికల ముందు ప్రకటించారని అధికార, రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. మరోవైపు కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఇప్పటికే పెండింగ్‌లో 14 లక్షలకుపైగా దరఖాస్తులు ఉండడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఐదు లక్షల మందికి పింఛన్లు ఇవ్వకుండా ఎగ్గొడుతున్న సర్కారు తాజాగా ఈ మొత్తాన్ని పెంచుతున్నట్లు ప్రకటన చేయడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

పింఛనుదార్లకు నాలుగున్నరేళ్లుగా చుక్కలే...

రాష్ట్ర విభజన అనంతరం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పింఛన్‌దార్లకు చుక్కలు చూపించారు. దాదాపు రెండు దశాబ్దాలుగా పింఛన్లు పొందుతున్న వారు సర్కారు ఆంక్షలు, కోతలతో అల్లాడారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన 3 నెలలకే టీడీపీ నాయకులు, సాను భూతి పరులతో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో దీర్ఘకాలంగా పింఛన్ పొందుతున్న వారిని సైతం అందుకు అర్హులో కాదో తేల్చాలంటూ జన్మభూమి కమిటీలకు అధికారం అప్పగించి వసూళ్లకు తెర తీశారనే విమర్శలున్నాయి. చంద్రబాబు సీఎం అయ్యే నాటికే రాష్ట్రంలో 43.11 లక్షల మంది లబ్ధిదారులు పింఛన్లు పొందుతుండగా 2014 సెప్టెంబరు, అక్టోబరు నెలలో నిర్వహించిన జన్మభూమి కమిటీల తనిఖీలతో నానా అగచాట్లు పడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయలేదనే అక్కసుతో జన్మభూమి కమిటీలు కొంతమంది పింఛన్లను రద్దు చేశాయి. కొందరు పేదలు తెలిసిన వారి కాళ్లావేళ్లా పడి హైకోర్టుకు వెళ్లి మరీ పింఛన్లు పునరుద్ధరించుకోవాల్సి వచ్చింది.

2014 జూన్ నాటికి రాష్ట్రంలో పింఛన్ పొందుతున్న వారి సంఖ్య:	43,11,856
2019 జనవరి నెలకు ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షన్లు:	50,61,906
2019 జనవరి నెలలో ప్రభుత్వం పంపిణీ చేసిన పెన్షన్లు:	46,49,155
2018 డిసెంబరు చివరికి పెండింగ్‌లో ఉన్న పెన్షన్ దరఖాస్తుల సంఖ్య:	14,59,312

తిష్ట వేసి జన్మభూమి కమిటీల వసూళ్లు..

ఎవరైనా లబ్ధిదారుడు వరుసగా మూడు నెలల పాటు పింఛను తీసుకోని పక్షంలో తాత్కాలికంగా రద్దుచేసే విధానాన్ని చంద్రబాబు సర్కారు కొత్తగా అమలు చేస్తోంది. పింఛన్లు పొందే వారిలో అధికశాతం నిరుపేదలే కావడంతో పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళుతుంటారు. ఇలాంటి వారు పింఛను తీసుకునే అవకాశం కోల్పోతున్నారు. జన్మభూమి కమిటీలతో సిఫార్సు చేయించుకుని పింఛను పునరుద్ధరించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాత్కాలికంగా రద్దయిన పింఛన్ డబ్బులను కోల్పోతున్నారు. దీనికితోడు పలుచోట్ల జన్మభూమి కమిటీ సభ్యులు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ చేసే ప్రాంతంలో తిష్ట వేసి నిరుపేద లబ్ధిదారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇలా ప్రతి నెలా రూ.10 – 14 కోట్ల దాకా పేదల నుంచి జన్మభూమి కమిటీ సభ్యులు లంచం రూపంలో దోపిడీ చేస్తున్నట్లు ప్రభుత్వానికి నివేదికలు అందడం గమనార్హం.

లక్షల్లో దరఖాస్తులు....

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఏ కార్యక్రమం కోసం గ్రామాలకు వెళ్లినా పింఛన్ కోసమే వినతులు వెల్లువెత్తుతున్నాయి. ‘పింఛను కోసం కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతున్నాం. కొత్త పింఛను ఇప్పించండయ్యా!’ అన్న వేడుకోళ్లే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఏటా జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నా తొలగించిన పింఛన్లు, కొత్త వాటి కోసం అందుతున్న దరఖాస్తులు లక్షల్లోనే ఉంటున్నాయి. నాలుగున్నర ఏళ్ల పాలన తర్వాత తాజాగా నిర్వహించిన 6వ విడత జన్మభూమి కార్యక్రమంలోనూ ప్రభుత్వానికి అందిన వినతిపత్రాల్లో పింఛన్ల కోసం అందిన దరఖాస్తులే అత్యధికంగా ఉండటం గమనార్హం. 2014 అక్టోబర్ 2 నుంచి 2018 అక్టోబర్ మధ్య కాలంలో పింఛన్లు మంజూరు చేయాలంటూ పేదల నుంచి అందిన 14,59,312 దరఖాస్తులు ప్రభుత్వం వద్ద ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. 13,26,206 మంది వృద్ధులు, 94,499 మంది వితంతువులు, 38,607 మంది దివ్యాంగులు పింఛన్లు ఇప్పించాలని అభ్యర్థిస్తూ దరఖాస్తు చేసుకోగా కేవలం లక్షన్నర మందికి మాత్రమే తాజా జన్మభూమిలో కొత్తగా మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఇదే సమయంలో జన్మభూమి కార్యక్రమంలో 1.80 లక్షల మంది కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అంటే పెండింగ్‌లో ఉన్న పింఛన్ దరఖాస్తులు యథాతథంగానే ఉన్నట్లు వెల్లడవుతోంది.

వైఎస్ హయాంలో ఒకే ఏడాది 23 లక్షల మందికి..

చంద్రబాబు గతంలో సీఎంగా ఉండగా పింఛన్‌దారుల్లో ఎవరైనా చనిపోతేనే కొత్తవి మంజూరు చేయాలనే విధానాన్ని అమలు చేయడంతో ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా రూ.70 చొప్పున పింఛను ఇచ్చే సమయంలో ఈ విధానం అమల్లో ఉండటాన్ని గుర్తు చేసుకుంటున్నారు. అయితే 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి కాగానే పింఛను మొత్తాన్ని రూ.200కి పెంచడంతోపాటు సంతృప్త స్థాయి పద్ధతిలో అర్హులందరికీ ఇవ్వాలని నిర్ణయించడంతో ఉమ్మడి రాష్ట్రంలో కేవలం ఒక్క ఏడాదిలోనే 23 లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. అయితే విభజన తర్వాత మరోసారి అధికారం చేపట్టిన చంద్రబాబు మళ్లీ పాత పింఛనుదారుడు చనిపోతేనే కొత్త పింఛను మంజూరు అన్న విధానాన్నే కొనసాగించారు. 2014 నుంచి 2015 చివరి వరకు మరణించిన పింఛన్‌దారుల సంఖ్య ఆధారంగానే కొత్తవి మంజూరు చేసే విధానాన్ని కొనసాగించారు.

ఐదు లక్షల మందికి కోత..

టీడీపీ 2014లో అధికారం చేపట్టే నాటికి రాష్ట్రంలో 43.11 లక్షల మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఫించన్ పొందుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ నాలుగున్నర ఏళ్లలో 19.38 లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్టు చెబుతోంది. అంటే ప్రస్తుతం ఫించన్లు పొందే వారి సంఖ్య 62.49 లక్షలు అంతకన్నా ఎక్కువగా ఉండాలి. కానీ 2019 జనవరి లో ప్రభుత్వం మంజూరు చేసిన ఫించన్ల సంఖ్య 50.61 లక్షలే కావడం గమనార్హం. ఈ ప్రకారం చూస్తే దాదాపు 12 లక్షల మందికి పింఛన్ అందలేదని తేలుతోంది. అయితే ఈ నాలుగున్నరేళ్లలో 7.34 లక్షల మంది పింఛన్‌దారులు చనిపోయారని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ అలా చూసినా దాదాపు ఐదు లక్షల మందికి సర్కారు పింఛన్ ఎగ్గొడుతున్నట్లు స్పష్టమవుతోంది. రకరకాల సాకులతో పింఛనుదార్లును ఏరి వేసింది.

పింఛన్ ఇక రూ.2 వేలు

జన్మభూమి ముగింపు సభలో సీఎం చంద్రబాబు ప్రకటన

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సంక్రాంతి కానుకగా పింఛను మొత్తాన్ని రూ. వెయ్యి నుంచి రూ.2 వేలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ నెల నుంచే దీన్ని అమలు చేస్తామన్నారు. అయితే ఈనెల మిగిలిన రూ.వెయ్యిని కలిపి ఫిబ్రవరిలో రూ.మూడు వేలు ఇస్తామని చెప్పారు. ఆ తర్వాత నుంచి నెలకు రూ.రెండు వేలు చొప్పున పింఛన్ అందుతుందని వివరించారు. జన్మభూమి – మాఊరు 6వ విడత ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బోగోలు మండలంలో సీఎం పర్యటించారు. చిప్పలేరు హైలెవల్ వంతెన ప్రారంభించిన అనంతరం శ్రీపొట్టి శ్రీరాములు స్వగ్రామంలో స్మారక భవనాన్ని సందర్శించి విగ్రహన్ని ఆవిష్కరించారు. రూ.110 కోట్లతో జువ్వల దిన్నె గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. బోగోలు జన్మభూమి సభలో సీఎం మాట్లాడుతూ పింఛన్ల ద్వారా 54 లక్షల మందికి మేలు జరుగుతోందని చెప్పారు. విద్యార్థినుల కోసం రక్ష పథకం పేరుతో రేషన్ షాపుల ద్వారా శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ చేస్తామని తెలిపారు. విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాను, వార్డు డెవలప్‌మెంట్ ప్లానుకు కూడ ఈ సభ నుంచే శ్రీకారం చుడుతున్నట్లు ప్రకటించారు. నెల్లూరు జిల్లాలో 66,276 ఎకరాల సీజెఎఫ్ఎస్ భూములకు పట్టాలు ఇచ్చి పసుపు కింద మహిళలకు పంపిణీ చేసే కార్యక్రమం ఈవేదిక నుంచే నిర్వహిస్తున్నామని చెప్పారు. రుణమాఫీ మిగిలిన మొత్తాన్ని 10 శాతం వడ్డీతో ఈనెలలోనే విడుదల చేస్తామన్నారు. ఏప్రిల్ నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిని రూ. 5 లక్షలకు పెంచుతామన్నారు. పోలవరం ద్వారా గ్రావిటీతో మే నెలలో నీటిని విడుదల చేసి డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. ప్రతి ఇంటికి ఒక స్మార్ట్ ఫోన్ ఇవ్వాలని ఆలోచిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దగదర్తి మండలం దామవరం గ్రామంలో 1,379.71 ఎకరాల్లో నెల్లూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పైలాన్‌ను సీఎం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి. నారాయణ, మాజీ మంత్రి ఆదాల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యేలు పాశం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ,పొలంరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లినేని రామారావు,ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యుడు బీదా మస్తానరావు పాల్గొన్నారు.



దామవరం గ్రామంలో విమానాశ్రయం పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు





బోగోలులో జరిగిన జన్మభూమి సభలో చంద్రబాబు ప్రసంగిస్తుండగానే బస్సుల్లో సభకు తరలించిన జనం తిరుగుముఖం పట్టారు. దీంతో సభా ప్రాంగణంలో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. సీజేఎఫ్ఎస్ పట్టాలను మహిళల చేతికే ఇస్తామంటూ స్త్రీలను, రక్షా పథకంలో భాగంగా శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ పేరుతో యువతులను కూడా పెద్ద ఎత్తున తరలించారు. అయితే చంద్రబాబు సుదీర్ఘ ప్రసంగం నేపథ్యంలో విసుగుచెందిన జనం తిరుగుముఖం పట్టారు.

ఏప్రిల్ మూడో వారంలో ఎంసెట్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వృత్తి విద్యా కళాశాలల్లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీ ఎంసెట్–2019ను ఏప్రిల్ మూడో వారంలో నిర్వహించనున్నారు. ఎంసెట్‌తో పాటు వివిధ వృత్తి విద్యాకోర్సుల ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పరీక్షల షెడ్యూళ్లను రాష్ట్ర ఉన్నత విద్యామండలి సిద్ధం చేసింది. శనివారం వీటిని రాష్ట్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు విడుదల చేయనున్నారు. గత ఏడాది ఎంసెట్ షెడ్యూల్ కన్నా కొన్ని రోజులు ముందుగానే ఈసారి సెట్ పరీక్షలు జరుగుతాయని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సెట్ పరీక్షలన్నీ గతంలో మాదిరిగానే ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. గత ఏడాదిలో ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగపు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 22, 23, 24 తేదీల్లో జరిగింది. అగ్రికల్చర్ కోర్సుల ప్రవేశపరీక్ష ఏప్రిల్ 24, 25 తేదీల్లో జరిగింది. అదే రకంగా ఈసెట్ పరీక్ష మే 3న, పీఈసెట్ పరీక్ష మే 24న, ఐసెట్ పరీక్ష మే 2న, ఎడ్‌సెట్ పరీక్ష ఏప్రిల్19న, లాసెట్, పీజీఎల్‌సెట్ పరీక్ష ఏప్రిల్ 19న జరిగాయి. దాదాపు ఇదే షెడ్యూళ్లకు రెండు మూడు రోజులు ముందు ఈసారి పరీక్షల తేదీలు ఉండే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం తమ కాలేజీల్లో వృత్తివిద్యా కోర్సుల ప్రవేశాల షెడ్యూల్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఏపీ నుంచి కూడా పలువురు అభ్యర్థులు తెలంగాణ ఎంసెట్‌కు హాజరయ్యే అవకాశమున్నందున అంతకన్నా ముందుగానే ఏపీ ఎంసెట్‌ను పూర్తిచేసి ప్రవేశాల ప్రక్రియను త్వరితంగా చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. తెలంగాణలో మే 3, 4 ,6 తేదీల్లో ఎంసెట్ ఇంజినీరింగ్, మే 8, 9 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్ ఎంట్రన్స్ టెస్టు నిర్వహించనున్నారు. అలాగే మే 11న టీఎస్ ఈసెట్, 20న టీఎస్ పీఈసెట్, 23, 24వ తేదీల్లో టీఎస్ ఐసెట్, 26న టీఎస్ లాసెట్, పీజీ లాసెట్, 27 నుంచి 29 వరకు టీఎస్ పీజీ ఈసెట్, మే 30, 31 తేదీల్లో టీఎస్ ఎడ్ సెట్ పరీక్షలు నిర్వహించనున్నారు.

సంక్రాంతికి ఫ్లాట్‌ఫారం టికెట్ ధర పెంపు

సాక్షి, విజయవాడ: సంక్రాంతి సీజన్‌లో ప్రయాణీకులతో పాటు వారిని రైలు ఎక్కించేందుకు బంధువులు, స్నేహితులు, కుటుంబసభ్యులు రైల్వేస్టేషన్‌కు వస్తూ ఉంటారు. అటువంటి వారిని రైల్వేశాఖ బాదేస్తోంది. పండుగ సందర్భంగా విజయవాడ, రాజమండ్రి, నెల్లూరు రైల్వేస్టేషన్లలో ఫ్లాట్‌ఫారం టికెట్ ధరను రూ.10 నుంచి రూ.20కు పెంచారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ పెంచిన రేట్లు అమలులో ఉంటాయి. రైల్వేఫ్లాట్‌ఫారంపై ప్రయాణీకులతో పాటు వచ్చే ప్రయాణీకులు కానివారి రద్దీని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు.

ఏఎస్‌జీగా బొప్పూడి కృష్ణమోహన్ నియామకం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)గా బొప్పూడి కృష్ణమోహన్‌ను నియమిస్తూ కేంద్ర న్యాయ శాఖ గురువారం ఉత్తర్వులిచ్చింది. ఇక నుంచి ఏపీ హైకోర్టులో కేంద్ర ప్రభుత్వం తరఫున కృష్ణమోహన్ వాదనలు వినిపించనున్నారు. కృష్ణమోహన్ గుంటూరు జిల్లా బొప్పూడి గ్రామానికి చెందిన వారు. ఆయన తండ్రి బీఎస్ఆర్.ఆంజనేయులు గుంటూరు జిల్లా జడ్జిగా పనిచేశారు. కృష్ణమోహన్ ఏజీ లా కాలేజీ నుంచి బీఎల్ పూర్తి చేసి సీనియర్ న్యాయవాది సి.త్రివిక్రమరావు వద్ద లాయర్‌గా జీవితాన్ని ఆరంభించారు. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ న్యాయవాదుల్లో ఒకరిగా కొనసాగారు.

22 నుంచి సీఎం దావోస్ పర్యటన

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు నాయుడు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు వెళ్లను న్నారు. ఆయనతోపాటు ఏడుగురితో కూడిన బృందం వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశంలో పాల్గొనేందుకు దావోస్ వెళ్లనుందని ప్రభుత్వం శుక్రవారం తెలి పింది. దావోస్‌కు వెళ్లే ఈ బృందంలో మంత్రులు యనమల, నారా లోకేశ్ పలువురు అధికారులు ఉన్నారు.

ఎన్టీఆర్ బయోపిక్ దర్శకుడు, హీరోకి సీఎం అభినందన

ఎన్టీఆర్ బయోపిక్ సినిమా దర్శకుడు క్రిష్, హీరో బాలకృష్ణలను సీఎం చంద్రబాబు అభినందించారు. శుక్రవారం వారిద్దరూ ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా వారిని చంద్రబాబు సత్కరించారు.

సాక్షి
శనివారం, జనవరి, 12

శాస్త్రీయతకు చోటెక్కడ?

జగదీశ్ చంద్రబోస్, సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, హోమీ జే భాభా వంటి దిగ్గంతులను వైజ్ఞానిక ప్రపంచానికి అందించి మురిసిన మన దేశం కొన్నేళ్లుగా ఆ రంగంలో వెలవెలబోతోంది. పంజాబ్‌లోని జలంధర్‌లో ఇటీవల ముగిసిన 106వ భారత సైన్స్ కాంగ్రెస్ సదస్సు ఆ దుస్థితినుంచి దేశాన్ని రక్షించడానికి, శాస్త్ర సాంకేతిక రంగాలను పటిష్టపరచడానికి ఏమేరకు దోహదపడిందో అనుమానమే. వాస్తవానికి ఏటా జరిగే ఆ సదస్సులు ఆ రంగాల్లో సాధించిన విజయాల గురించి మదింపు వేసుకుని, పరిశోధనా రంగంలో మన స్థానం ఎక్కడుందో నిర్ధారించుకుని లక్ష్య నిర్దేశం చేసుకోవాలి. ఆ రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు కారణాలేమిటి... కారకులెవరు అన్న అంశాలపై దృష్టి పెట్టాలి. స్వీయ లోపాలను సైతం నిష్కర్షగా, నిర్మొహమాటంగా చర్చించుకుని చక్కదిద్దుకోవాలి. ప్రాథమిక విద్య మొదలుకొని కళాశాల స్థాయి వరకూ విజ్ఞాన శాస్త్రానికి ఇస్తున్న ప్రాముఖ్యత ఏ పాటిదో ఆరా తీసి దాన్ని మెరుగుపరచమని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడం కూడా శాస్త్రవేత్తల బాధ్యత కావాలి. మన రాజ్యాంగం ఆశించినట్టు దేశంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఇవన్నీ చాలా అవసరం. ఈ ప్రక్రియంతా విజ్ఞాన శాస్త్ర అధ్యయనంవైపు నవతరం దృష్టి సారించేలా చేయగలుగుతుంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా ఉండటం మాట అటుంచి కనీసం ఇప్పుడున్న స్థితిని దాటి ముందుకెళ్లాలంటే శాస్త్రవేత్తల్లో, పరిశోధకుల్లో ఆ విచికిత్స తప్పనిసరి.

కానీ దురదృష్టమేమంటే మన సైన్స్ కాంగ్రెస్ సదస్సులు నానాటికీ తిరునాళ్లను తలపిస్తున్నాయి. ఉద్దండులనుకున్నవారు సైతం వేదికనెక్కి ఉబుసుపోని కబుర్లు చెబుతున్నారు. ఆ వేదికపై మాట్లాడే ప్రతి మాటకూ శాస్త్రీయ ప్రాతిపదిక ఉండాలన్న కనీస స్పృహ లేకుండా ప్రవర్తిస్తున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జి. నాగేశ్వరరావు అంతక్రితం ఎన్ని సదస్సుల్లో పాల్గొన్నారో... ఏం మాట్లాడారో, అక్కడ ప్రతిపాదించిన అంశాలేమిటో ఎవరికీ తెలియవు. కానీ ఈసారి ఆయన పేరు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్మోగింది. కౌరవులు టెస్ట్‌ట్యూబ్ బేబీలనీ, మన పూర్వీకుల వద్ద గైడెడ్ మిస్సైళ్లు ఉండేవని, రావణుడికి 24 రకాల విమానాలున్నాయని ఆయన వాక్రుచ్చారు. మరో శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్, ఐజాక్ న్యూటన్‌లు ప్రతిపాదించిన సిద్ధాంతాలన్నీ తప్పుల తడకని, గురుత్వాకర్షణ తరంగాలపై తాను ప్రతిపాదిస్తున్న సిద్ధాంతానికి 'నరేంద్రమోదీ తరంగాల'ని నామకరణం చేశానని చెప్పారు. పంజాబ్ యూనివర్సిటీకి చెందిన మరో శాస్త్రవేత్త గత 25 ఏళ్లుగా తాను భారత్‌లో డైనోసార్ల పుట్టుక, వాటి ఉనికి గురించి పరిశోధిస్తున్నానని సదస్సులో తెలియజేశారు. సృష్టికర్త బ్రహ్మకు తెలియనిదంటూ ఉండదని, డైనోసార్ల గురించి వేదాల్లో ఆయన ప్రస్తావించారని తెలిపారు. సాధారణ పరిస్థితుల్లో శాస్త్రవేత్తలకుండే వ్యక్తిగత విశ్వాసాలేమిటని ఎవరూ ప్రశ్నించరు. సైన్స్ కాంగ్రెస్ వంటి వేదిక లెక్కినప్పుడు ఆ విశ్వాసాల ఆధారంగా మాట్లాడితే నిలదీస్తారు. భిన్న అంశాలపై శాస్త్రవేత్తల అభిప్రాయాలేమిటో తెలుసుకుని తమ విజ్ఞానానికి పదును పెట్టుకోవాలని వచ్చేవారికి ఈ ధోరణి ఏమాత్రం దోహదపడేలా లేదు. ఇప్పుడే కాదు... గత మూడు నాలుగేళ్లుగా ఇదే వరస కొనసాగుతోంది. సైన్స్ సదస్సులు కాల్పనిక గాథలకు వేదికలైతే, అవి వినోద ప్రధానంగా మారితే అంతర్జాతీయంగా మనం నవ్వులపాలవుతాం. ముంబైలో 2015లో జరిగిన సైన్స్ కాంగ్రెస్‌కు ముఖ్య అతిథిగా వచ్చి ఆ తంతును గమనించాక నోబెల్ గ్రహీత వెంకటరామన్ రామకృష్ణన్ దాన్నంతటినీ ఒక సర్కస్‌గా అభివర్ణించారు. ఇకపై భారత సైన్స్ కాంగ్రెస్ సదస్సుల్లో తాను పాల్గొనబోనని ప్రకటించారు. కనీసం అప్పుడైనా సదస్సు నిర్వాహకులు మేల్కొని, వక్తల ఎంపికకు నిర్దిష్టమైన విధానాలను రూపొందించుకోవాల్సింది. అలాగే పిలిచినవారి నుంచి ప్రసంగ పాఠాలను ముందే తెప్పించుకుని వాటి ప్రామాణికతను నిర్ధారించుకునే ప్రక్రియ అమల్లోకి తీసుకురావాల్సింది. కానీ నిర్వాహకులు ఆ పని చేయలేదు. కనీసం ఆ శాస్త్రవేత్తల ప్రసంగాల అనంతరం అయినా వాటిని ఖండించలేదు. కనుకనే కేంద్ర ప్రభుత్వ ప్రధాన వైజ్ఞానిక సలహాదారు కె. విజయరాఘవన్ ఆ బాధ్యత తీసుకోవాల్సివచ్చింది. ఆ ప్రసంగాలు శాస్త్రవేత్తల వ్యక్తిగత అభిప్రాయాలే తప్ప ప్రభుత్వానికి సంబంధం లేదని... సదస్సు ఎక్కడ నిర్వహించాలో, దాని ఎజెండా ఏమిటో, వక్తలుగా ఎవరిని పిలవాలో నిర్వాహకులే చూసుకుంటారని ఆయన చెప్పారు. సైన్స్ కాంగ్రెస్ సదస్సులకు దేశ దేశాలనుంచి ఏటా వందలాదిమంది శాస్త్రవేత్తలు హాజరవుతారు. ఇందులో భాగంగా బాలల సైన్స్ కాంగ్రెస్, మహిళా సైన్స్ కాంగ్రెస్ జరుగుతాయి. మొత్తంగా దాదాపు 20,000మంది ప్రతినిధులు పాల్గొంటారు.

విజ్ఞాన శాస్త్ర రంగంలో, ముఖ్యంగా పరిశోధనల్లో వాస్తవ స్థితిగతులేమిటన్న విషయాన్ని శాస్త్రవేత్తలతో పోలిస్తే కేంద్ర జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీ బాగా చెప్పగలిగారు. మీ రంగంలో లింగ వివక్ష వేళ్లూనుకున్నదని, దాన్ని చక్కదిద్దడానికి ప్రయత్నించమని ఆమె నిష్కర్షగా చెప్పారు. దేశంలోని వివిధ పరిశోధన, అభివృద్ధి సంస్థల్లో 2,80,000 మంది శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు పని చేస్తుంటే వారిలో కేవలం 14 శాతంమంది అంటే... 39,200 మంది మాత్రమే మహిళలని తెలిపారు. ఐఐటీల్లో సైతం మహిళల శాతం నానాటికీ తగ్గిపోతున్నదని చెప్పారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పనిచేస్తున్న మహిళల్లో 81 శాతంమంది తమ పనితీరు మదింపులో లింగ వివక్ష కొట్టొచ్చినట్టు కనబడుతున్నదని చెప్పిన సంగతిని ఆమె ప్రస్తావించారు. ప్రపంచంలోని ఉత్తమోత్తమ సైన్స్ పత్రికల్లో వచ్చే వ్యాసాలను, పరిశోధనా విశేషాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో అనువదించి వారిలో ఆ రంగంపై మక్కువ పెంచాలని సూచించారు. స్మృతి ప్రసంగం విన్నాకైనా తమ కర్తవ్యమేమిటో శాస్త్రవేత్తలు, సదస్సు నిర్వాహకులు బోధపరుచుకుంటారని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం
హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి శు.షష్ఠి సా.5.38 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం ఉత్తరాభాద్ర పూర్తి (24గంటలు), వర్జ్యం ప.3.44 నుంచి 5.28 వరకు
దుర్ముహూర్తం ఉ.6.37 నుంచి 8.05 వరకు
అమృతఘడియలు... రా.2.09 నుంచి 3.54 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.39
రాహుకాలం : ఉ. 9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

ఇది 'పునాది' లేని పోరాటం!



శేఖర్ గుప్తా

భారతీయుల్లో 31 శాతం మంది మాత్రమే 2014లో మోదీకి ఓటు వేశారని మనకు తెలుసు. రాహుల్ పదే పదే మోదీపై చేస్తున్న దాడులను ప్రజలు ఆస్వాదించవచ్చు. కానీ వీరు గంపగుత్తగా రాహుల్‌కి ఓట్లేస్తారని దీనర్థం కాదు. రాజీలేని మోదీ వ్యతిరేక తత్వం దానికదే ఒక భావజాలంగా కానీ లేక ఎన్నికల్లో ప్రత్యామ్నాయంగా కానీ కాజాలదు. మోదీపై ఆగ్రహం ఒక్కటే మీ లక్ష్యమైతే ప్రజలు తమకు అందుబాటులోని అనేక ప్రత్యామ్నాయాలలో ఉత్తమమైన వారిని ఎంచుకోవచ్చు. రాహుల్ దూకుడు శైలి మోదీ ప్రతిష్టకు నష్టం కలిగించి, ప్రజలు అంతిమంగా ప్రధానిని ఓడిస్తారని భావించినప్పటికీ, మోదీ స్థానంలో ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకుంటారని భావించవచ్చా?

చాన్నాళ్ల క్రితం అప్పటి ప్రజాస్వామిక వ్యవస్థల్లో నాయకులు ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చాక, తమకు ఓటు వేయని వారితో సహా ప్రజలందరి ప్రయోజనాలను కూడా సంరక్షించేవారు. ఎందుకంటే ప్రభుత్వ ఆఫీసు అంటే ప్రజల విశ్వాసం. కానీ ఇప్పుడు మాత్రం పాలకులు తమను బలపర్చే ప్రజా పునాది గురించి మాత్రమే మాట్లాడుతున్నారు. వారి మద్దతుదారులు తప్ప తక్కినవారు ఇప్పుడు లెక్కలోకి రారు. ఒక ఉదాహరణ చూద్దాం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను లక్షలాదిమంది అమెరికన్లు మతిలేని మూర్ఖుడు, జాత్యహంకారి వగైరా వగైరా పదాలతో నిందిస్తున్నారు. కానీ తనను విమర్శిస్తున్న వారి పట్ల ట్రంప్ ఎంత తూష్ణీభావంతో చూస్తే అంత కంటే ఎక్కువగా మద్దతుదారులు ట్రంప్‌ను ఆరాధిస్తుంటారు. మిగతావారి విషయం ఏమిటి? వారు రంగం నుంచి తప్పుకోవలసిందే. ఇదేం సూచిస్తుంది? నీవు నాకు ఓటు వేయకపోతే, నానుంచి మీరు ఏమీ ఆశించవద్దు.

అలాగే అధికారంలోకి రావడానికి హిందూ ఓటుపై స్వారీ చేస్తున్న మోదీ బీజేపీని చూడండి. 20 శాతం ముస్లిం జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో అటు లోక్‌సభలో, ఇటు అసెంబ్లీలో బీజేపీ ఒక్కరంటే ఒక్క ముస్లిం అభ్యర్థిని కూడా నిలబెట్టకుండానే రెండింటిలోనూ ఘనవిజయం సాధించింది. సవర్ణులు అంటే ఎగువ, మధ్య స్థాయి కులాల ఓట్లను కొల్లగొట్టింది కాబట్టే బీజేపీ గత రెండు ఎన్నికల్లోనూ ముస్లింలను, చాలావరకు దళితులను పక్కనబెట్టేసింది. అందుకే అగ్రకుల హిందువులను వైదొలుగుతున్న మోదీ ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లతో సత్కరించింది. ఈ నేపథ్యంలో రాహుల్ తనకున్న ప్రజాపునాదిని ఎలా నిర్వచిస్తారు? ప్రజా పునాది అంటే ఏమిటో ఆయనకు తెలుసా? మోదీ వ్యతిరేకవాదం ఒక్కటి మాత్రమే మీ ప్రచారానికి ఇప్పుడు సరిపోదన్నది స్పష్టమే.

భారతీయుల్లో 31 శాతం మంది మాత్రమే 2014లో ఓటు వేశారని మనకు తెలుసు. పైగా మోదీని ఇప్పుడు కూడా మీరు ఇష్టపడకపోవచ్చు లేక తనతో విభేదించవచ్చు. రాహుల్ పదే పదే మోదీపై చేస్తున్న దాడులను ప్రజలు ఆస్వాదించవచ్చు. కానీ ఇలాంటివారు గంపగుత్తగా రాహుల్‌కి ఓట్లేస్తారని దీనర్థం కాదు. మోదీపై ఆగ్రహం ఒక్కటే మీ ఉద్దేశం అయితే మీరు అందుబాటులో ఉన్న అనేక ప్రత్యామ్నాయాలలో ఉత్తమమైన వారిని ఎంచుకోవచ్చు. బెంగాల్‌లో మమత కావచ్చు, ఉత్తర ప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ కావచ్చు. బిహార్‌లో లాలూ కావచ్చు. కేరళలో వామపక్షం కావచ్చు. ఇక తెలంగాణ, ఒడిశా, ఢిల్లీల్లో వరుసగా కేసీఆర్, నవీన్ పట్నాయక్, అరవింద్ కేజ్రీవాల్ కావచ్చు. రాహుల్ ఒంటెత్తు మనస్తత్వం మాత్రమే మోదీ ప్రతిష్టకు అంత నష్టం కలిగించి ప్రజలు బీజేపీ ప్రధానిని ఓడిస్తారని భావించినప్పటికీ, మోదీ స్థానంలో ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకుంటారని భావించవచ్చా? ఈరోజు అలాంటి అవకాశమే కనబడటం లేదు. ఎందుకంటే ఒక బలీయమైన ప్రతిపాదన లేదా అభిప్రాయం (మోదీది అధమపాలన) దానికదే మరొక ప్రతిపాదనవైపు మొగ్గ (రాహుల్ ఉత్తముడు) చూపకపోవచ్చు.

1989 వరకు కాంగ్రెస్ ప్రజాపునాది దిగువ కులాలు, మైనారిటీలు, గిరిజనులు, బ్రాహ్మణులు, కొన్ని మధ్య కులాలు, పేదల్లో చాలామంది మద్దతును గెలుచుకోగలిగినంత పెద్దదిగా ఉండేది. అప్పట్లో బీజేపీ ప్రధానంగా పట్టణ వ్యాపారులు, హిందూ మధ్యతరగతులకు మాత్రమే పరిమితమై ఉండేది. కాబట్టే ఇందిరాగాంధీ జనసంఘ్, బీజేపీలను బనియా పార్టీగానే పిలిచేవారు తప్పితే వారిని హిందూ పార్టీగా ఎన్నడూ వర్ణించలేదు. అలాగే ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీ అధినేత్రిగా ఉన్నంత వరకు, బీజేపీ ఎన్నడూ ఆమె పార్టీని ముస్లిం పార్టీగా పిలవగలిగేది కాదు. కానీ పోటా (ఉగ్రవాద నిరోధక చట్టం)ను ఎప్పుడయితే రద్దు చేశారో అప్పుడే మోదీకి కాంగ్రెస్‌ను ముస్లిం పార్టీ అని పిలిచే దమ్ము వచ్చేసింది. 1989లో రాజీవ్ గాంధీ తన ప్రజాపునాదిని కోల్పోవడం ప్రారంభం కాగానే, కాంగ్రెస్ పార్టీ మిగిలిన తన మద్దతుదారులతో, బీజేపీ వ్యతిరేక రాజకీయ శక్తుల మద్దతుతో మాత్రమే మనగలగ సాగింది. 2014 తర్వాత పార్టీని తిరిగి వైభవంలోకి తీసుకురావడానికి మరింతగా ప్రయత్నిస్తోంది.

జాతిహితం



అయితే ఇప్పటినుంచి వందరోజుల లోపు అతిపెద్ద పరీక్షను ఎదుర్కోవలసి ఉన్న సమయంలో కాంగ్రెస్ ఒక్క పంజాబ్‌లో తప్పితే మరే రాష్ట్రంలోనూ విశ్వాస పాత్రులైన ఓటర్లతో కూడిన ప్రజారాశులను కలిగిలేదన్నది స్పష్టం. అది ఇప్పటికే బీజేపీతో పాటు తూర్పు మధ్య ప్రాంత గిరిజనులను పంచుకుంటోంది. దళితులు అన్ని పార్టీల్లో ఉంటున్నారు. ముస్లింలకు ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బిహార్, అస్సాం వంటి ముఖ్యమైన రాష్ట్రాల్లో అనేక అవకాశాలు ఉంటున్నాయి. పైగా పట్టణ మధ్యతరగతిలో ప్రధానంగా 25 ఏళ్ల లోపు వయస్కులలో చాలా మంది ఇప్పటికీ మోదీ పట్ల అనుకూలతతోనే ఉంటున్నారు. మోదీ పట్ల వ్యతిరేకత తెలుపుతున్న వారిని మీ శిబిరంలోకి లాక్కోవడం ద్వారా మాత్రమే మీరు ఎన్నికల్లో గెలుపు సాధించిపెట్టే కొత్త ఓటర్ పునాదిని మీరు నిర్మించలేరు. మీరు మోదీకి నష్టం కలిగించవచ్చు కానీ దాని ప్రయోజనం మాత్రం అనేకమంది మిత్రులు, ప్రత్యర్థుల మధ్య విభజితం కావచ్చు. ఈ కోణంలో, రాహుల్ 2010–14 నాటి అరవింద్ కేజ్రీవాల్ స్టైల్‌ని అనుసరిస్తున్నారు. అన్నాహజారేని, ఆరెస్సెస్ గొంతు బలాన్ని ఉపయోగించి, యూపీఏని ప్రత్యేకించి కాంగ్రెస్ విశ్వసనీయతను విధ్వంసం చేయడంలో అరవింద్ కేజ్రీవాల్ కీలకపాత్ర పోషించారు. దీంతో కాంగ్రెస్ వారు సైతం పార్టీపై వస్తున్న అవినీతి ఆరోపణల నుంచి సమర్థించుకోలేని మానసిక స్థితిలో కూరుకుపోయారు.

యూపీఏని పతనం చేసిన ఘనతను బీజేపీకి, వివేకానంద ఫౌండేషన్‌కి ఆపాదించడం ఫ్యాషన్ కావచ్చు కానీ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రధానాస్త్రంగా వ్యవహరించింది మాత్రం అరవింద్ కేజ్రీవాల్ మాత్రమే. తాను యువకుడు, విశ్వసనీయత కలిగినవాడు, అవినీతి అంటనివాడు కాంగ్రెస్ పార్టీ గజదొంగల పార్టీ అనే ఇమేజిని తానే పెంచిపోషించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మళ్లించడానికి తాను ప్రయత్నించిన ఓటర్లు కేజ్రీవాల్‌వైపునకు రాలేదు. అలాంటి ప్రజాపునాదిని తాను నిర్మించుకోలేదు. అతడి ప్రయోజనాలు ఢిల్లీకే పరిమితమయ్యాయి. కాకపోతే, నరేంద్రమోదీవైపు ఓటర్లు మళ్లిపోయేలా చేయడంలో కేజ్రీవాల్ విజయవంతమయ్యారు. ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించకుండా కేవలం వ్యతిరేకతపై మాత్రమే ఆధారపడిన రాజకీయాల్లోని ప్రమాదం ఇదే. ఇది జరగకూడదంటే మీరు మీ పునాదిని నిర్వచించుకోవాల్సి ఉంటుంది. ఇక్కడే రాహుల్ పెనుప్రమాదంలోకి కొట్టుకెళ్లిపోతున్నారు. ఒక తిరుగుబాటుదారుగా సమర్థంగా వ్యవహరించడం సరైందే కావచ్చు కానీ ప్రజాస్వామ్యంలో మీరు చేయగలిగేది ఏమిటంటే అధికారాన్ని గెలుచుకోవడం కాకుండా ప్రతిష్టను దెబ్బతీయగలగడం, అధికారాన్ని మరొకరికి అప్పగించడం మాత్రమే. గెరిల్లా యుద్ధతంత్రం ప్రకారం రాహుల్ తన ఎత్తుగడలను బలంగానే అమలు చేస్తున్నారు కానీ దాని వ్యూహాత్మక ఫలితం ఏమిటన్నదే ముఖ్యం. ముస్లింల అనుకూల పార్టీగా తనపై ఉన్న ముద్రను తొలగించుకోవడానికి రాహుల్ ఆలయాలను సందర్శిస్తూ టీవీల్లో ప్రసారమయ్యేలా జాగ్రత్తపడుతున్నారు, తన జంధ్యాన్ని ప్రదర్శిస్తూ తన బ్రాహ్మణ గోత్రాన్ని వెల్లడిస్తూ వస్తున్నారు. కానీ, ఆయన పార్టీ... ట్రిపుల్ తలాక్, శబరిమల, అగ్రవర్ణాల రిజర్వేషన్ వంటి కీలకమైన లౌకిక–ఉదారవాద సమస్యల పట్ల మౌనం వహిస్తోంది.

భారతదేశాన్ని యూదుజాత్యహంకార దేశంగా సమర్థవంతంగా క్రోడీకరించబోతున్న పౌరసత్వ చట్ట సవరణపై చర్చ జరుగుతుంటే లోక్‌సభనుంచి వాకౌట్ చేయడంలో కూడా పార్టీ సంప్రదాయాల లేమి కొట్టొచ్చినట్లు కనబడింది. ఇజ్రాయెల్ తన్నుతాను భావజాలపరంగానే జాత్యహంకార దేశంగా మల్చుకుంది. కానీ భారత్ దానికి భిన్నంగా పూర్తి వ్యతిరేకదిశలో.. భావజాలేతర, లౌకిక రాజ్యాంగంగా తన్ను తాను మల్చుకుంది. ఈరోజు ఆ పునాదే సవాలుకు గురవుతుండగా కాంగ్రెస్ వాకౌట్ చేయటంకంటే మరేమంత ఘనచర్యకు పూనుకోలేకపోవడమే విషాదం. ఇలాంటి నిస్సహాయ స్థితిని అస్సామ్‌లో హిందువులు, ముస్లింలు ఇదదరూ కలిసి చూస్తుండిపోతున్నారు. సరిగ్గా ఈ స్థితే బీజేపీకి కలిసొస్తుంది. ఆ పార్టీ ప్రజాపునాది అనేది సరిగ్గా దీన్నే కోరుకుంటోంది. అక్రమ వలసదార్లు చెదపురుగులు అని ఎవరైనా వ్యాఖ్యానిస్తే బీజేపీ ప్రజాపునాది అభినందిస్తోంది. ఈ చెదపురుగుల్లో ముస్లింలు మాత్రమే ఉంటున్నారని పేర్కొంటూ రాజ్యాంగాన్ని ఎవరైనా సవరించడానికి పూనుకుంటే బీజేపీ ప్రజాపునాది కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకుంటుంది. సరిగ్గా ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ తన పునాది ఏంటో కూడా తెలుసుకోవడం లేదు. లేదా సార్వత్రిక ఎన్నికల ప్రచారం సమీపిస్తుండగా అంటే వచ్చే నెలలో తన పునాదిని నిర్మించుకోవడం ఎలా అని కూడా దానికి తెలీడం లేదు.

రాజీలేని మోదీ వ్యతిరేక తత్వాన్ని ఎంత ఆగ్రహంతో ప్రదర్శించినప్పటికీ, అది దానికదే ఒక భావజాలంగా కానీ లేక ఎన్నికల్లో ప్రత్యామ్నాయంగా కానీ కాజాలదు. మీరు చేయవలసింది ఏమిటంటే మోదీని వచ్చే ఎన్నికల్లో 200 కంటే తక్కువ సీట్లతో వెనుకబడేలా చేయడమే. దీనికి ప్రతిగా మీరు ప్రారంభంలోనే 100 సీట్లను అదనంగా పొందే స్థితిని ఇది కలిగిస్తుందా? అలా జరగాలంటే ముందుగా రాష్ట్రం తర్వాత రాష్ట్ర స్థాయిలో భారత చిత్రపటాన్ని నిశితంగా పరిశీలించాలి. బీజేపీ పట్ల ప్రజల్లో ఆశలు ఎంత ఎక్కువస్థాయిలో ఆవిరయినప్పటికీ మే నెలనాటికి కాంగ్రెస్ పార్టీ, చాలా రాష్ట్రాల్లో వారి ప్రత్యామ్నాయ ఎంపిక కావడం కష్టమే. రాహుల్ గ్రహించాల్సిన అత్యంత కఠిన వాస్తవం ఇదే మరి.

వ్యాసకర్త ద ప్రింట్ చైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మిమిక్రీ



"అనవసరంగా నా డబ్బులు వృథా అయ్యాయి. మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌పై వచ్చిన 'ద యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' సినిమా చూశాను. ఏమీ బాగోలేదు. ఈ సినిమా కథను పదేళ్ల క్రితం రాసుకుని, ఐదేళ్ల వయసున్నవాళ్లు నిర్మించి, దర్శకత్వం వహిస్తే.. మిమిక్రీ చేయడమే నటన అనుకునే కిండర్ గార్డెన్ పిల్లలు నటించినట్టుగా ఉంది"
– సీమా గోస్వామి
జర్నలిస్టు

మండుతుంటే..



"ప్రస్తుతం పౌరసత్వ సవరణ బిల్లుపై అస్సాం మండుతుంటే, జాతీయ మీడియా కేవలం పది శాతం కోటా బిల్లుపై మాత్రమే చర్చిస్తోందని ఆ రాష్ట్రానికి చెందిన మిత్రుడు ఒకరు వ్యాఖ్యానించారు. మీరేమంటారు?"
– యోగేంద్ర యాదవ్
స్వరాజ్ ఇండియా పార్టీ అధ్యక్షుడు

విధ్వంసం



"ఆర్థిక వ్యవస్థ అన్ని విధాలా కుప్పకూలిందనడానికి ఇదే సాక్ష్యం. ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన విధ్వంసం నుంచి ఏ రంగమూ ఇంకా కోలుకోలేదు. మన పారిశ్రామిక అభివృద్ధిని 3.6 శాతంగా అంచనా వేయగా, 0.5 శాతం మాత్రమే నమోదైంది"
– సీతారాం ఏచూరి, సీపీఎం నేత

నష్టం



"యూపీఏ ప్రభుత్వం మన రక్షణ రంగాన్ని పట్టించుకోలేదు. వాళ్లెప్పుడూ డీల్స్ కోసమే చూశారు. అందువల్ల సహజంగానే దేశం నష్టపోయింది"
– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి


కారణం



"ముగ్గురు సభ్యుల కమిటీ సమావేశమేమీ న్యాయ విచారణ కానప్పుడు, ప్రధాని నరేంద్ర మోదీ చేతిలో కీలుబొమ్మగా మారాడని అతడిపై దాడి జరుగుతున్నప్పుడైనా జస్టిస్ సిక్రీ స్పందించాల్సింది. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ వ్యవహారంలో తాను అటువంటి నిర్ణయం తీసుకోవడానికి దారితీసిన పరిస్థితులు ఏమిటనేది తనను కలిసిన మీడియాకు ఆయన వెల్లడించి ఉండాల్సింది. అలా ఆయన మౌనం వహించడానికి కారణమేమిటో నాకు ఇప్పటికీ అర్థం కావడంలేదు"
– మార్కండేయ కట్జు
సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి

వివేకానంద స్ఫూర్తి చెరగనిది


హిందూ సంస్కృతి విస్తృతార్థంలో విశ్వవ్యాప్తి కావడానికి, సంకుచిత పరిమితులు దాటి సమస్త ప్రపంచ ఆమోదం పొందటానికి కారణమైన మహనీయుడు స్వామి వివేకానంద జయంతి నేడు. మొదటిసారిగా హిందూమతం ఒక మతం కాదని, అది జీవన సంస్కృతీ విధానమని యావత్ ప్రపంచానికి తెలిపిన విశిష్ట మూర్తి ఆయన. 1863 డిసెంబర్ 12న కోల్‌కతాలో విశ్వనాథ్ దత్తా, భువనేశ్వరీదేవి వంశాంకురంగా జన్మించిన నరేంద్రుడు తర్వాత రామకృష్ణ పరమహంస గురునిర్దేశంలో వివేకానందుడిగా తనను తాను నిర్దేశించుకున్నారు. తారీఖులు, దస్తావేజుల ప్రస్తావనకు పోకుండా వివేకానందుడు అందించిన సందేశం, సంకల్పం, ఆధ్యాత్మిక పథాన్ని రేఖామాత్రంగా స్పృశించుకునే ప్రయత్నం చేస్తే మొదట మనం దరికీ తట్టేది.. అమెరికాలోని చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనంలో తోటి మానవులను ప్రియమైన సోదర సోదరీ మణులారా అని సంబోధించి మానవతా వాదాన్ని, మానవ హితాన్ని పాశ్చాత్యులకు ఆయన రుచి చూపించిన ఘటన మాత్రమే.



ఆనాటి నుంచి ఆయన జీవితం సమస్తం సందేశాత్మకమే. ఆదర్శాత్మకమే. ఆచరణాత్మకమే. దేశభక్తే కాదు.. సంస్కృతి, సనాతనత్వం, సంప్రదాయం, నిబద్ధత, కార్యోన్ముఖం. బోధలు, ప్రబోధలు, పట్టుదల, అంకితభావం, సామాజిక దృష్టి, ఐక్యతా భావం, విలువలు, విశ్వసనీయత ఇలా.. ఏ కోణంలో చూసినా, ఆయనకు ఆయనే సాటి. స్వామి వివేకానంద జీవితం యావత్తూ సమస్త మానవాళికి ఓ సందేశమే, ఓ ప్రేరణాత్మకమే. 1893లో ప్రపంచ సర్వమత సమ్మేళనంలో భారతదేశాన్ని, హిందూమతాన్ని ఉద్దేశించి వివేకానందుడు చేసిన ప్రసంగం భారత యువతపైనే కాకుండా పాశ్చాత్య ప్రపంచంపై కూడా మహత్తర ప్రభావం కలిగించింది. అందుకే వివేకానందుని జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా కూడా జరుపుకుంటున్నాం. జాతిని ఉద్దీప్తం చేయడానికి యువతకు ఉక్కునరాలు కావాలని ప్రేరేపించిన వివేకానందుడి స్ఫూర్తి నేటికీ అవసరమే.

(నేడు స్వామి వివేకానంద జయంతి)
రమాప్రసాద్ ఆదిభట్ల,
విశాఖపట్నం । 93480 06669

జనం కోసం నడిచి.. నడిచి.. నడిచి



శ్రీరమణ

పాదయాత్ర... సుదూర పాదయాత్ర.. అలుపెరుగని పాదయాత్ర ఒక అపూర్వ ఘట్టం. జనం మధ్యలోంచి, ప్రజల గుండె చప్పుళ్లు వింటూ, వారి నిరాశా నిస్పృహల్ని, ఆవేదనల్ని, ఆర్తనాదాల్ని సాకల్యంగా అర్థం చేసుకుంటూ, దగాపడిన తెలుగింటి ఆడపడుచుల కన్నీళ్లు తుడుస్తూ, ఇడుపులపాయ నించి ఇచ్ఛాపురం దాకా జనం కోసం ఆ కొస నించి ఈ కొస దాకా నడిచి.. నడిచి.. నడిచి – సత్యం కల్పయాత్ర విజయ యాత్రగా ముగిసింది. 3,648 కిలోమీటర్ల దారిలో అణువణువునా నేలతల్లిని స్పృశిస్తూ, 2,516 పొలిమేరల నీళ్ల రుచిచూసి, అన్ని గ్రామాల గాలిపీల్చి సంకల్ప దీక్షతో జగన్‌మోహన్ రెడ్డి విజేతగా నిలిచారు. ఇది ఆయన తెలుగుతల్లికి ఇచ్చిన నీరాజనం. 3,648 కిలోమీటర్లు నడిచి, అడుగడుగునా ఆగి, గతాన్ని అడిగి తెలుసుకుని, భవిష్యత్తుకి భరోసా ఇచ్చి అడుగు ముందుకు వేయడం జగనన్న దిన చర్య.

నవంబర్ 6, 2017న కదిలిన పాదం జనవరి 9, 2019న ఆగింది. మూడు సంవత్సరాలు ఈ నడకలో మారాయి. గ్రీష్మాలు, వసంతాలు వచ్చాయి, వెళ్లాయి. ఏ మార్పులు వచ్చినా జగనన్న లక్ష్యంలో మార్పులేదు. అన్నివర్గాల ప్రజల గోడుని వినాలి. వారిని నిండు గుండెతో ఓదార్చాలి. నిండు దోసిలితో భరోసా ఇవ్వాలి. నాలుగున్నరేళ్లుగా సాగుతున్న ఒట్టి మాటల్ని కట్టి పెట్టించి, గట్టి మేల్ తలపెట్టే దిశగా జగనన్న ఆలోచనలు పల్లవించాయి. 'నేనున్నా... ఏడవకండేడవ కండని' ఎలుగెత్తి అరుస్తూ ఆంధ్రప్రదేశ్ నలు చెరగుల్ని ఊరడించారు. తెలుగు జాతి పక్షాన ఆ నేతకు శుభాభినందనలు. జన సామాన్యం హితం కోసం తన మనసుని, గుండెని, పాదాలని బొబ్బలెత్తించుకున్న జగనన్నకి మేలగుగాక!

అక్షర తూణీరం



చంద్రబాబు హయాంలో ఇచ్చిన మాటలకు, చేసిన పనులకు కోసెడు దూరం. ఉన్నట్టుండి ఒక సర్కస్ డేరా రంగుల్లో వెలుస్తుంది. మెరుపులు, మేళాలు, లైటింగ్ దిగుతాయి. డేరాలో కొందరు పిచ్చి పిచ్చి ఫీట్లు చేస్తారు. గడసానులు తీగెమీద నడుస్తారు. దీనంగా తిండి చాలక ఎండుపడ్డ అడవి జంతువుల్ని కొరడా ఝళిపిస్తూ గ్యాలరీ ముందు గుండ్రంగా తిప్పుతారు. కోతులు సైకిళ్లు తొక్కుతాయ్. చిలుక రివాల్వర్ పేలుస్తుంది. అంతా కనికట్టు! బఫూన్ పిచ్చి అల్లరితో వినోద పరుస్తాడు. చెక్కల బావిలో మోటార్ బైకు చక్కర్లు కొడుతుంది. ఉన్నట్టుండి బఫూన్ పులినోట్లో తలకాయ పెడతాడు. రోజూ రెండు ఆటలు ఒకే క్రమంలో సాగుతాయ్.

ఇక్కడ కలెక్షన్లు పడిపోగానే ఇంకో టౌన్లో వెలుస్తుంది రంగుల డేరా. మళ్లీ మేళాలు... మళ్లీ ప్రచార హోరు... షరా మామూలే! రాయలసీమ కరువు జిల్లాల్లో రెయిన్‌గన్లతో లక్షల హెక్టార్ల భూమిని రక్షించామని ప్రచారం చేసుకున్న చంద్రబాబు తీరు సర్కస్ డేరాని తలపించిందని జగన్ మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నిజం, చంద్రబాబు ఎంతటి వాగ్దానాన్నైనా ఇచ్చేస్తారు. సానుకూలంగా దాన్ని గాలికి వదిలేస్తారు.

జగన్ పాదయాత్ర పొడుగునా చంద్రబాబు, ఆయన సహచరులు రకరకాల విమర్శలు, వ్యాఖ్యానాలు చేస్తూనే ఉన్నారు. ఇవి సామాన్య జనంలో అధిక ప్రచారం కల్పించి విజయానికి దోహదపడ్డాయ్. అన్నిచోట్లా ఆగి, స్థానిక సమస్యల్ని మనసు కెక్కించుకోవడం, వాటి పరిష్కారాల గురించి చర్చించడం విలక్షణమైన చర్య.

అన్ని ప్రాంతాల ప్రజలు, వారి సాంఘిక, ఆర్థిక పరిస్థితులపై జగన్ స్పష్టమైన అవగాహన సాధించుకున్నారు. ఇది నేతకు కావల్సిన మొట్టమొదటి లక్షణం. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ జగనన్న అరచేతిలో ఉంది. ఏ ప్రాంతం అయినా ఆయనకు కొట్టిన పిండి. రహదార్లు, రోడ్లు, నీటి వసతులు, పండే పంటలు, విద్యా వసతులు, వైద్య సదుపాయాలు ఇంకా సమస్త విషయాలమీద సుస్పష్టమైన అవగాహన ఉంటుంది. నిజంగా ప్రజలకి పాటుపడాలనే స్థిర చిత్తం ఉన్న నేతకి సరైన అవగాహన ఉంటే ఇక కానిదేముంటుంది?

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

ఇది ఫెడరల్ స్ఫూర్తేనా?

మొన్న మొన్న గుంటూరు మైనార్టీల సదస్సును చంద్రబాబు జరుపుతున్న సందర్భంగా నంద్యాలకు చెందిన నవరత్నాలైన ముస్లిం యువకులు మైనార్టీల శ్రేయస్సుకు ఇచ్చిన వాగ్దానాలను అమలు పరచాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ నిరసన చర్య ప్రజాస్వామిక విధానాలలో ఆగమే. అయితే చంద్రబాబు ఆ యువకులపై దేశ ద్రోహం నేరం కింద కుట్ర కేసు పెట్టి పలు విధాలుగా హింసించి పలు పోలీస్‌స్టేషన్‌లు తిప్పుతూ చివరకు కోర్టులో హాజరు పరిచారు. రాష్ట్రమంతా ఈ అరెస్టులను ముక్త కంఠంతో ఖండించారు. ఇలా కేవలం నిరసన తెలిపిన ముస్లిం యువకులను దేశ ద్రోహ నేరం మోపి అరెస్టు చేసిన చంద్రబాబు నేడు అనుసరిస్తున్నది ఏమిటి..?

రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీకి వ్యతిరేక రాజకీయ పవనాలు వీస్తున్నాయని ఒకవైపు, మరోవైపు జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు విశేషంగా ప్రజలు స్పందించడం చూసి బాబుకు వెన్నులో వణుకు పుట్టింది. బాబు ఆయన అనుచరులు సీఎం రమేశ్, సుజనా చౌదరి, బీద మస్తాన్‌రావు తదితరుల మీద కేంద్రం ఐటీ దాడులు నిర్వహించింది. వీటిని రాష్ట్ర ప్రభుత్వంపై దాడిగా బాబు పదే పదే ప్రకటిస్తున్నారు. ప్రత్యేకంగా ఇటీవల విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనను నీరుగార్చి కేసును మసి పూసి మారేడు కాయలా చేయాలని బాబు ప్రయత్నాలు రాష్ట్ర ప్రజలు అందరూ గమనించారు. చివరకు న్యాయం కోసం ప్రతిపక్షనేత హైకోర్టును సంప్రదించారు. హైకోర్టు కేంద్ర ప్రభుత్వంలోని హోంశాఖను ఈ కేసును ఎందుకు ఎన్ఐఏ పరిధిలోకి పరిగణించకూడదో వివరణ ఇవ్వాలని కోరింది. తమకు అభ్యంతరం ఏమీ లేదని ఎన్ఐఏకు విచారణ జరపవచ్చని ఆమోదం తెలిపింది.

అందుకు చంద్రబాబు తిరస్కరిస్తున్నారు. రాష్ట్రంలోని పోలీసు అధికారులకు సహాయ నిరాకరణ ప్రకటించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. కేంద్రంతో నేరుగా తగాదా పెట్టుకుంటున్నారు. ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. సున్నితమైన, క్లిష్టమైన అనేక సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యం దక్షత కలిగిన ఎన్ఐఏ విచారణను వ్యతిరేకించడం బాబు అహంకారానికి నిదర్శనం. అసలు దోషులు బాబు అండ్ కో కాకపోతే జగన్‌పై జరిగిన హత్యలో భాగస్వామ్యం లేకపోతే ఎందుకు బాబు తిరస్కరిస్తున్నారు. భారత రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వ పరిధిని దాటి ప్రవర్తిస్తున్న చంద్రబాబు చర్యలు జాతి వ్యతిరేకమైనవి.

ఇమామ్, కదలిక సంపాదకులు

ఏపీ నర్సుల అసోసియేషన్
రాష్ట్ర కమిటీ ఎన్నిక

తిరుపతి (అలిపిరి): చిత్తూరు జిల్లా తిరుపతిలోని రుయా ఆస్పత్రి క్లీనికల్ లెక్చర్ గ్యాలరీలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా హెడ్ నర్సు ఎంఎస్ నిర్మల కుమారి (విజయవాడ), కోశాధికారిగా రుయా ఆస్పత్రి స్టాఫ్ నర్సు ఎస్.రాధమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పదవికి డీవీ రజని (గుంటూరు), హెడ్‌నర్స్ ఎంజే సుభాషిణి (కర్నూలు) పోటీ పడ్డారు. అనంతరం సుభాషిణి అసోసియేషన్ కార్యదర్శిగా గెలుపొందారు. ఎన్నికల అధికారులుగా శ్రీహరి, సురేష్ బాబు, రాజ వ్యవహరించారు. ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది.



నూతన కార్యవర్గంతో నర్సింగ్ అసోసియేషన్ సభ్యులు

నేడు జన్ సదరన్ ప్రత్యేక రైళ్లు



సాక్షి, విజయవాడ: సంక్రాంతి పండుగ సందర్భంగా రైళ్లలో రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే శనివారం పలు మార్గాల్లో జన్ సదరన్ ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్లలో రిజర్వేషన్లు ఉండవు. కేవలం 16 సెకండ్ క్లాస్ బోగీలు, రెండు లగేజ్, బ్రేక్ వ్యాన్‌లు మాత్రమే ఉంటాయి. ప్రత్యేక చార్జీలు వసూలు చేయరు. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు సాధారణ టికెట్ రూ.130, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు రూ.135, తిరుపతి నుంచి కాకినాడకు రూ.175, విజయవాడ నుంచి విజయనగరానికి రూ.145 చార్జీగా వసూలు చేస్తారు. సికింద్రాబాద్–విజయవాడ (07192) ప్రత్యేక రైలు 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. సికింద్రాబాద్–విజయవాడ (07194) ప్రత్యేకరైలు 12వ తేదీ రాత్రి 11.30 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. విజయవాడ–హైదరాబాద్ (07193) ప్రత్యేక రైలు 12వ తేదీ రాత్రి 8.30 గంటలకు విజయవాడలో బయలు దేరుతుంది. తిరుపతి–కాకినాడ (07190) ప్రత్యేక రైలు 12వ తేదీ రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరుతుంది. విజయవాడ–విజయనగరం (07184) ప్రత్యేక రైలు 12వ తేదీ రాత్రి 10.10 గంటలకు విజయవాడలో బయలుదేరుతుంది. వీటితోపాటు విజయవాడ–సికింద్రాబాద్ (07195), విజయనగరం–విజయవాడ (07185) ప్రత్యేకరైళ్లు 12వ తేదీ నడుస్తాయి.

దుర్గమ్మ సేవలో జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి


కప్పస్తంభానికి మొక్కుతున్న జస్టిస్ చౌహాన్


జస్టిస్ రాజశేఖర్‌రెడ్డికి అమ్మవారి క్యాలెండర్ అందజేస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)/సింహాచలం: విజయవాడ ఇంద్ర కీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి సాదరంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం జస్టిస్ రాజశేఖర్ రెడ్డికి వేద పండితులు ఆశీర్వచనం చేయగా, ఈవో వి.కోటేశ్వరమ్మ క్యాలెండర్, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కాగా, విశాఖ జిల్లా సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర ఎస్ చౌహాన్ శుక్రవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని అంత రాలయంలో అష్టోత్తర పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఆరోగ్యశ్రీకి అనారోగ్యం

- నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.వందల కోట్ల బకాయి
- వైద్య సేవలందించలేమని చేతులెత్తేసిన వైనం
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పేదలు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



విజయవాడ సిటీ: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్యశ్రీకి సంబంధించి లక్షలాది క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం రూ.వందల కోట్లు బకాయి పడిందని మండిపడ్డారు. దీంతో ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదవాడికి సైతం కార్పొరేట్ వైద్యం అందించేలా చేసి వారికి భరోసా అందించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీంకు సంబంధించిన బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయని 'ఆషా' ఆందోళన వ్యక్తం చేసిందని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వానికి ఎంతసేపూ ప్రతిపక్షాన్ని ఏ విధంగా అధికారంలోకి రాకుండా చూడాలి..ఇందుకోసం ఎవరికి తాయిలాలు అందించాలి.. బదిలీలు, పోస్టింగులు, లాలూచీలు మినహా పేదవాడికి వైద్యం అందిద్దాం అనే ఆలోచన ఏ కోశానా లేదన్నారు. ఆరోగ్యశ్రీ పథకం నిర్వహిస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు పూర్తిస్థాయి సీఈవో లేరని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రుల్లో అత్యధిక శాతం డెలివరీలు జరుగుతుండగా, ఆ డెలివరీలు కూడా ప్రైవేటు ఆస్పత్రుల్లో చేయించుకోవచ్చని ప్రభుత్వం చెప్పడం వల్ల ప్రభుత్వాస్పత్రులు నిర్వీర్యం అవుతాయన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు స్పందించి ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అనగనగా ఓ మృతదేహం

- తమిళనాడులో అదృశ్యం
- కర్నూలు జిల్లాలో ప్రత్యక్షం



లారీలో పడి ఉన్న మృతదేహం, (సుధాకర్ ఫైల్)

ప్యాపిలి: తమిళనాడు రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి చనిపోయాడు. కానీ మృతదేహం అక్కడ కన్పించలేదు. ఆచూకీ చెప్పాలని బంధువులు ఆందోళన చేపట్టారు. అక్కడి పోలీసులు దిక్కుతోచని స్థితిలో ఉండగా.. సినీఫక్కీలో ఆ మృతదేహం కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం రాచర్లలో శుక్రవారం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు .. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి తాలూకా అత్తిపట్టు గ్రామానికి చెందిన సుధాకర్ (33)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాకలూరు సిఫ్‌కార్టు పరిశ్రమలో పని చేస్తున్న సుధాకర్ ఈనెల 9న రాత్రి 10 గంటలకు డ్యూటీ ముగించుకుని ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. పాండూర్ వద్ద ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా.. ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని బైక్ ఒక వైపు, హెల్మెట్ మరో వైపు ఎగిరి పడ్డాయి. సంఘటనా స్థలంలో సుధాకర్ కాలు మాత్రమే ఉంది. మృతదేహం కోసం ఎంత గాలించినా ఆచూకీ దొరకలేదు. విషయం తెలుసుకున్న తిరువళ్లూరు పోలీసులు అటు చెన్నై వరకు, ఇటు తిరుపతి వరకు ఉన్న అన్ని వైద్యశాలల్లో తనిఖీలు నిర్వహించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. మరోవైపు మృతదేహం కోసం అతని బంధువులు రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. పోలీసులు విధిలేని పరిస్థితుల్లో 140 మందిని అరెస్టు చేయాల్సి వచ్చింది.

ఎట్టకేలకు లభ్యం

కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం రాచర్లలోని ప్రియా సిమెంట్ ఫ్యాక్టరీకి శుక్రవారం అరుణాచల ట్రాన్స్‌పోర్టుకు చెందిన టీఎన్ 70జే4507 నంబర్ గల లారీ సిమెంట్ లోడ్ కోసం చేరుకుంది. ఫ్యాక్టరీలోకి వెళ్లే ముందు సెక్యూరిటీ గార్డులు లారీని తనిఖీ చేశారు. అందులో మృతదేహం కన్పించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదం జరిగిన తర్వాత తమిళనాడు పోలీసులు పత్రపెరంబదూరు టోల్‌గేట్ సీసీ కెమెరాలను పరిశీలించారు. ప్రమాదం సమయంలో రెండు సిమెంట్ లారీలు వెళ్లినట్లు గుర్తించారు. కర్నూలు, కడప, నెల్లూరు, చిత్తూరు పోలీసులకు సమాచారం అందించారు. ఇదే తరుణంలో అరుణాచల ట్రాన్స్‌పోర్టు లారీలో మృతదేహం పడి ఉన్నట్లు తేలడంతో ఇక్కడి పోలీసులు తిరువళ్లూరు ఎస్పీకి మృతదేహం ఫొటోలు పంపించారు. ఫొటోలు పరిశీలించిన అక్కడి పోలీసులు ఈ మృతదేహం సుధాకర్‌దేనని గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో కారు ఢీకొన్న వేగానికి మృతదేహం పైకి ఎగిరి పక్కనే వెళ్తున్న లారీలో పడి ఉండొచ్చని భావిస్తున్నారు. తిరువళ్లూరు సీఐ తమిళవన్నన్, ఎస్ఐ రవి రాచర్లకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

జగన్ సీఎం కాకుండా బాబు కుట్రలు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి నాని ధ్వజం
- కొనుగోలు చేసిన గొర్రెలతో జగన్‌కు లేఖ రాయించాడు
- బాబు పదవీ కాలం ఇక 125 రోజులే
- నాలుగున్నరేళ్లలో రూ.6 లక్షల కోట్లు దోచేశారు
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వ్యక్తిగతంగా తిడితే ఊరుకోబోమని హెచ్చరిక



సాక్షి, అమరావతి: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాసింది ముఖ్యమంత్రి చంద్రబాబు అయితే అందులో సంతకాలు చేసింది అమ్ముడుపోయిన గొర్రెలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొడాలి వెంకటేశ్వరరావు(నాని) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం విజయవాడలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో కొందరిని సంతలో గొర్రెల్లా చంద్రబాబు కొనుగోలు చేశాడని, వారితో జగన్‌కు లేఖ రాయించాడని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతకు లభిస్తున్న ప్రజాదరణ చూసి టీడీపీ నేతలకు మతితప్పి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. అశేష ప్రజాభిమానం ఉన్న వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాకుండా అడ్డుకునేందుకు చంద్రబాబు కుట్రలు సాగిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు గడువు ఇక 125 రోజులే ఉందని, ఇప్పటికైనా నా కొన్ని మంచి పనులు చేయాలని హితవు పలికారు. కొడాలి నాని ఇంకా ఏం మాట్లాడారంటే... ''రాజకీయాల్లో చంద్రబాబు లాంటి నీచమైన వ్యక్తిలేడు. సోనియాగాంధీని ఎదిరించిన ధీరుడు జగన్‌మోహన్‌రెడ్డి అయితే పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి చంద్రబాబు. జగన్‌ఒక్కసారి అధికారంలోకి వస్తే ఆయనను పదవి నుంచి దించేయడం ఎప్పటికీ సాధ్యం కాదని చంద్రబాబు కుట్రలు చేస్తున్నాడు. సీఎం చంద్రబాబు, టీడీపీ నేతలు నాలుగున్నరేళ్లలో రూ.6 లక్షల కోట్లు దోపిడీ చేశారు. రాష్ట్ర బడ్జెట్ రూ.6 లక్షల కోట్లు లేదని చంద్రబాబు అంటున్నాడు. మరి దోచేసిన ఇసుకను బడ్జెట్‌లో పెట్టారా? ఇసుక నుంచి రూ.25 వేల కోట్లు, నీరు–చెట్టు కింద కేంద్రం ఇచ్చిన నిధులు రూ.45 వేల కోట్లు, రాజధానిలో లక్షల కోట్ల భూములను మింగేశారు. ఇవన్నీ బడ్జెట్‌లో పెట్టారా? వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాలు అమలు చేయడం సాధ్యం కాదన్న చంద్రబాబు ఎన్నికలొస్తున్నాయని ఇప్పుడు రూ.2 వేలు పింఛన్ ఇస్తానని అంటున్నారు. ఇదంతా వైఎస్ జగన్ చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర ప్రభావమే.

సోనియాగాంధీకి సూట్‌కేసులు ఇచ్చాడు

నాలుగున్నరేళ్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఊడిగం చేసిన చంద్రబాబు నిన్నగాక మొన్న ఢిల్లీ వెళ్లి, సోనియాగాంధీకి సూట్‌కేసులు ఇచ్చాడు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో పొత్తులు కుదుర్చుకున్నది చంద్రబాబే. పొత్తులు లేకుండా ఒంటరిగా ఎన్నికలకు వెళ్లేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక్కటే. చంద్రబాబులా ముసుగు వేసుకొని ఒకరి దగ్గరకు, ముసుగు లేకుండా మరొకరి వద్దకు జగన్ ఎన్నడూ వెళ్లలేదు. చంద్రబాబుకు సిగ్గు శరం అనేవి లేవు. కాంగ్రెస్, పవన్ కల్యాణ్ తనతో ఉండాలని చంద్రబాబు కోరడం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట. దొడ్డిదారిన అధికారంలోకి రావాలనే చిల్లర రాజకీయాలు చంద్రబాబు మానుకోవాలి.

చంద్రబాబు పెద్ద సైకో..

అసెంబ్లీకి రాని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు జీతాలు ఎందుకు తీసుకుంటారని చంద్రబాబు పదేపదే మాట్లాడుతున్నాడు. అసెంబ్లీని 30 రోజులపాటు మాత్రమే నిర్వహించినా టీడీపీ ఎమ్మెల్యేలు 365 రోజులకు జీతాలు తీసుకోవడం లేదా? టీడీపీ సభ్యులు మిగిలిన 335 రోజుల జీతం వెనక్కి ఇస్తే వైఎస్సార్‌సీపీ సభ్యులు కూడా జీతాలు వెనక్కు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ కోడికత్తి పార్టీ అయితే మరి టీడీపీ కట్టప్ప కత్తి పార్టీనా? తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడ ప్రజలు చంద్రబాబును గుడ్డలు ఊడదీసి పంపారు. అక్కడి సీఎం కేసీఆర్ వేసిన 20 ప్రశ్నలకు సమాధానం చెప్పలేక చంద్రబాబు ఊరకుక్కలతో మొరిగించాడు. ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి ప్రజలను మోసం చేసేందుకు రోజుకో శంకుస్థాపన చేస్తున్నాడు. చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి నుండి ఎప్పుడు దిగిపోతాడా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. చంద్రబాబు పెద్ద సైకో. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వ్యక్తిగతంగా తిడితే ఊరుకునే ప్రసక్తే లేదు'' అని కొడాలి నాని హెచ్చరించారు.

స్వామి వివేకానంద పురస్కారాలకు పలువురి ఎంపిక

అనపర్తి: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులను వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలకు ఎంపిక చేసినట్లు రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అందించే ఈ పురస్కారాలకు ఆధ్యాత్మిక, వైద్య, పోలీస్, సామాజిక సేవా రంగాలకు చెందిన ప్రముఖులను ఎంపిక చేసినట్లు చెప్పారు. సామాజిక సేవా రంగంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్.జయప్రకాష్ నారాయణ, ఆధ్యాత్మిక, సామాజిక సేవా రంగాలకుగాను హైదరాబాద్‌కి చెందిన భారతీయం వ్యవస్థాపకురాలు జి.సత్యవాణి, వైద్య, సామాజిక సేవా రంగాల్లో రాజమహేంద్రవరానికి చెందిన మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డిలను పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. స్వామి వివేకానంద ఎక్స్‌లెన్స్ అవార్డుకు మాజీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వీవీ.లక్ష్మీనారాయణను ఎంపిక చేసినట్లు చెప్పారు. అనపర్తి జీబీఆర్ విద్యా సంస్థల ఓపెన్ ఆడిటోరియంలో ఈ నెల 22న జరిగే వివేకానంద జయంతి వేడుకల్లో రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి వినిశ్చలానందజీ మహరాజ్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి చేతుల మీదుగా పురస్కార గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించనున్నట్లు దుర్గా ప్రసాద్ తెలిపారు.

తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కు టికెట్ ఇవ్వొద్దు

- నియోజకవర్గ టీడీపీ నేతల డిమాండ్
- దళితుల ఆత్మగౌరవ సభ పేరుతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నగరంపాలెం(గుంటూరు): గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌పై తెలుగుదేశం పార్టీలో అసంతృప్తి జ్వాలలు ఆరడం లేదు. శ్రావణ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఇప్పటివరకూ మండలాల వారీగా రహస్యంగా సమావేశాలు నిర్వహిస్తూ వచ్చిన టీడీపీలోని ఒక వర్గం ఇప్పుడు ఏకంగా బహిరంగ సమావేశాలు నిర్వహిస్తోంది. బలమైన సామాజిక వర్గానికి చెందిన కొందరు నేతలు ఇటీవల ఒక సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చే ఎన్నికల్లో శ్రావణ్‌కుమార్‌కు టీడీపీ టికెట్ కేటాయించవద్దని కోరుతూ తీర్మానించారు. నియోజకవర్గంలోని దళితులు సైతం ఎమ్మెల్యే శ్రావణ్‌కు టికెట్ ఇవ్వొద్దంటూ పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేస్తున్నారు. తాడికొండ నియోజకవర్గ టీడీపీ దళితుల ఆత్మగౌరవ సభ పేరుతో శుక్రవారం సభ నిర్వహించారు. సభలో పాల్గొన్న వివిధ మండలాల టీడీపీ నాయకులు మాట్లాడుతూ 1982 నుంచి తాడికొండ నియోజకవర్గంలో స్థానికేతరులకు టికెట్ ఇవ్వడంతో వారెవరూ నియోజకవర్గం గురించి పట్టించుకోవటం లేదన్నారు. గత ఎన్నికల్లో శ్రావణ్‌కుమార్ గెలుపు కోసం కృషి చేసిన వారిని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా వారిపై కేసులు పెట్టించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో స్థానికులకు టికెట్ కేటాయిస్తే గెలిపించుకొని, సమస్యలను పరిష్కరించుకొంటామని అన్నారు. స్థానికుల అభిప్రాయం కాదని శ్రావణ్‌ను అభ్యర్థిగా ప్రకటిస్తే ఆయనను ఓడిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ దళిత వర్గానికి చెందిన వాడు కావడంతో పొమ్మనకుండానే పొగబెట్టే కార్యక్రమాన్ని జిల్లాలోని బలమైన సామాజికవర్గం చేస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

అగ్రిగోల్డ్‌లో అంతుబట్టని రహస్యాలు

- సీఐడీ దర్యాప్తుపై అనుమానాలు
- బాధితుల జాబితాలపై గోప్యమెందుకు?
- బాధితులకు సత్వర న్యాయం చేయండి
- సీఐడీ ఏడీజీని కలిసిన వైఎస్సార్‌సీపీ అగ్రిగోల్డ్ బాసట కమిటీ


సీబీసీఐడీ అడిషనల్ డీజీ అమిత్ గార్గ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సాక్షి, అమరావతి/ తాడేపల్లి రూరల్ (మంగళగిరి): రాష్ట్రంలో 19.52 లక్షల ఖాతాదారులను నిండా ముంచిన అగ్రిగోల్డ్ వ్యవహారంలో అంతుబట్టని రహస్యాలు బాధితులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రిగోల్డ్ బాసట కమిటీ పునరుద్ఘాటించింది. అగ్రిగోల్డ్ సమస్యను సత్వరం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సీబీసీఐడీ అడిషనల్ డీజీ అమిత్‌గార్గ్‌తో వైఎస్సార్‌సీపీ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ భేటీ అయ్యింది. ఈ సందర్భంగా పలు అంశాలపై అమిత్‌గార్గ్‌కు వినతిపత్రం అందించిన బాసట కమిటీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్‌లు మీడియాతో మాట్లాడారు. అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరించడంలో సీఐడీ అనుసరిస్తున్న వైఖరిలో అనేక అనుమానాలున్నాయని అమిత్‌గార్గ్ దృష్టికి తెచ్చినట్టు చెప్పారు. రాష్ట్రంలో గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా న్యాయం జరగకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురై గుండె ఆగి, ఆత్మహత్యలు, మానసిక వేదనతో మృతి చెందుతున్న బాధితుల సంఖ్య పెరుగుతోందని వారు వివరించారు. అగ్రిగోల్డ్ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దలు చెబుతున్న దానికి, సీఐడీ దర్యాప్తునకు పొంతనలేక బాధితుల్లో రోజురోజుకు ఆందోళన పెరుగుతోందన్నారు. ఏపీ సీఐడీ ఏడీజీ అమిత్‌గార్గ్‌ను కలిసిన వారిలో బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్త నందిగం సురేష్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త చంద్రగిరి ఏసురత్నం, బాసట కమిటి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ అడపా శేషు తదితరులున్నారు.

ఈ ప్రశ్నలకు బదులేది?

అగ్రిగోల్డ్ వ్యవహారంలో అనేక ప్రశ్నలకు సీఐడీ, ప్రభుత్వం బదులివ్వాల్సి ఉందని, పలు అంశాల్లో సందేహాలను నివృత్తి చేయాల్సి ఉందని అమిత్‌గార్గ్‌కు ఇచ్చిన వినతిపత్రంలో అగ్రిగోల్డ్ బాధిత బాసట కమిటీ పేర్కొంది. రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితుల సంఖ్య 19.52 లక్షలని సీఐడీ నివేదికలో స్పష్టం చేసినట్టు సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటించగా, బాధితులు 10 లక్షల లోపే ఉంటారంటూ ప్రభుత్వ సలహాదారుడు కుటుంబరావు చెప్పడం దేనికి సంకేతమని కమిటీ ప్రశ్నించింది. కోర్టుకు చూపించని ఆస్తులను ప్రభుత్వం తీసుకుని బాధితులకు రూ. 300 కోట్లు ఇస్తుందని కుటుంబరావు ప్రకటించారని, అంటే సీఐడీ దర్యాప్తులో కోర్టుకు చూపిన ఆస్తులు, చూపించని ఆస్తులు ఉన్నాయా? అని అనుమానం వ్యక్తం చేసింది. అగ్రిగోల్డ్ యాజమాన్యానికి బినామీగా ఉన్న 156 కంపెనీలకు సంబంధించిన ఆస్తులపై గోప్యం ఎందుకు? చెక్ పవర్ ఉన్న డైరెక్టర్‌లను కేసుల్లో ఎందుకు పెట్టలేదో చెప్పాలని నిలదీసింది. అగ్రిగోల్డ్ ఆస్తులు, అప్పులు, బాధితుల వివరాలు ఆన్‌లైన్‌లో వెంటనే పెట్టాలని కమిటీ అమిత్‌గార్గ్‌ను కోరింది.

30 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- మంత్రి పుల్లారావు అనుచరులవిగా సమాచారం
- విడిపించేందుకు టీడీపీ నేతల ప్రయత్నాలు


పోలీస్ స్టేషన్ వద్ద రేషన్ బియ్యంతో లారీ

కావలి రూరల్: అక్రమంగా తరలిస్తున్న 30 టన్నుల రేషన్ బియ్యాన్ని శుక్రవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కావలి రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు ప్రాతినిధ్యం వహిస్తున్న చిలకలూరిపేట నియోజకవర్గం గణపవరం నుంచి కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తుండగా పట్టుకున్నారు. అయితే ఈ లారీని విడిపించేందుకు రూరల్ పోలీసులపై టీడీపీ నాయకులు తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. కావలి రూరల్ సీఐ టి.మురళీకృష్ణ కథనం మేరకు. ముందుగా అందిన సమాచారం మేరకు సీఐ, ఎస్ఐ జి.పుల్లారావు సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తుండగా.. రేషన్ బియ్యంతో వెళ్తున్న లారీని గుర్తించారు. పత్రాలు తనిఖీ చేయగా.. అందులో ఉన్నవి నకిలీ పత్రాలుగా గుర్తించి లారీని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీలో రూ.6 లక్షల విలువైన 30 టన్నుల (600 బస్తాలు) రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వీటిని ముప్పాళ్ల కోటయ్య అనే వ్యక్తి ఆధ్వర్యంలో కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నట్లు లారీ డ్రైవర్ తెలిపాడు. దీంతో లారీ డ్రైవర్ కాయలగుంట మురళీని, క్లీనర్ పేరుకొండ ఖాదరయ్యను అదుపులోకి తీసుకుని, లారీని సీజ్ చేసి కేసు నమోదు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) 2019 డైరీని ఎస్సీ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ జీఎస్‌ఆర్ కేఆర్ విజయకుమార్ ఆవిష్కరించారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. కుల వివక్షకు గురైన వారి పక్షాన కేవీపీఎస్ నిలిచిందని కొనియాడారు. సమాజంలో కొనసాగుతున్న అంటరానితనం రుగ్మతను రూపుమాపాలని.. దీని వల్ల సమాజం తిరోగమనంలోకి వెళుతుందన్నారు. కార్యక్రమంలో దళిత శోషణ్ ముక్తి మంచ్ జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దడాల సుబ్బారావు, పలువురు సీపీఎం, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.



అధికారంలోకి వచ్చిన వెంటనే ఏపీకి ప్రత్యేకహోదా

దుబాయ్ పర్యటనలో రాహుల్ గాంధీ



దుబాయ్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటిస్తామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. రెండురోజుల పర్యటన నిమిత్తం దుబాయ్ వెళ్లిన ఆయన శుక్రవారం స్థానిక లేబర్ కాలనీలో భారతీయ కార్మికులనుద్దేశించి మాట్లాడారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే మేము చేసే మొదటి పని ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడమేనని రాహుల్ అన్నారు. ప్రత్యేక హోదా సాధన కోసం గతేడాది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాయకులు జంతర్ మంతర్ వద్ద ధర్నా చేశారని, అయినా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం దాన్ని ఎంతమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి ఇవ్వాల్సిన ముఖ్యమైన హామీని ప్రధాని మోదీ విస్మరించారని, ఏపీకి దక్కాల్సిన హామీల విషయంలో మనమంతా కేంద్రానికి అర్థమయ్యేలా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. భారత కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యద్భుత నగరంగా దుబాయ్ నిలవడంలో మీ శ్రమ ఎంతో ఉందన్నారు.

ముంచుకొస్తున్న 'ప్రమాదం'



- ప్రభుత్వాసుపత్రులకు వస్తున్న ప్రమాద బాధితుల సంఖ్య పెరుగుతోంది
- రోజుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్న 1,720 మంది
- గడిచిన తొమ్మిది మాసాల్లో 4.64 లక్షల మంది వచ్చినట్టు లెక్కలు
- అత్యధికంగా ప.గో.లో 58 వేల పైచిలుకు బాధితులు
- సిబ్బంది నియామకం చేయకపోవడంతో ట్రామాకేర్ కేంద్రాలు వెలవెల
- కేంద్రం ఇచ్చిన నిధులకు ఇప్పటికీ వినియోగపత్రాలివ్వని సర్కారు

సాక్షి, అమరావతి: ప్రమాదాలు ఆస్పత్రులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఏ పెద్దాసుపత్రిలో చూసినా రోజూ వందల మంది ప్రమాద బాధితులతో కిటకిటలాడుతున్నాయి. అసలే మౌలిక వసతులు లేక అల్లాడుతున్న ఆస్పత్రులకు క్షతగాత్రులతో గోరుచుట్టు మీద రోకటిపోటు చందంలా తయారైంది. వివిధ ప్రమాదాల్లో గాయపడి ఆస్పత్రులకు వస్తున్న క్షతగాత్రుల సంఖ్య రోజూ సగటున 1700 ఉంటోంది. ఈ పరిణామం భీతి గొలుపుతున్నట్టు వైద్య నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. బాధితులు రక్తమోడుతూ చావుబతుకుల్లో వస్తుంటారు, క్యాజువాలిటీ వార్డులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పైగా పడకలు సరిపడా లేవు. దీంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని శ్రీకాకుళం జిల్లా రిమ్స్ ఆస్పత్రికి చెందిన ఓ వైద్యుడు వాపోయారు.

వెలవెలపోతున్న ట్రామాకేర్ సెంటర్లు

రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర నిధులతో ఏర్పాటు చేసిన ట్రామాకేర్ ఆస్పత్రులు వెలవెలపోతున్నాయి. శ్రీకాకుళం, విశాఖపట్నం, గుంటూరు, అనంతపురం, కర్నూలులో బోధనాసుపత్రుల్లోనూ, టెక్కలి, తుని, రాజమండ్రి, ఏలూరు, పెనుగొండ, నాయుడుపేట ఏరియా ఆస్పత్రుల్లోనూ కొత్తగా ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆయా సెంటర్లకు రూ.96.35 కోట్లు మంజూరు చేసి ఇప్పటికే రూ.50.17 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులకు వినియోగ పత్రాలు ఇస్తే మిగతా నిధులు ఇస్తామని కేంద్రం చెబుతోంది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన ట్రామాకేర్ కేంద్రాల్లో డాక్టర్లు, ఫిజియోథెరపిస్టులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, సహాయక సిబ్బంది తదితర 450 ఖాళీలున్నా భర్తీ చేయలేదు. దీంతో బాధితులు ఆయా కేంద్రాలకు వచ్చినా వైద్యం అందే పరిస్థితి లేదు. తొలిగంటలో (గోల్డెన్ అవర్) వైద్యం అందితేనే ప్రాణాపాయం నుంచి బయటపడే పరిస్థితి... ఇలాంటి వైద్యం 29 శాతం మందికి కూడా అందడం లేదని తేలింది. ప్రస్తుత పరిస్థితుల్లో 150 అంబులెన్సులు అదనంగా కావాలని, జాతీయ రహదారుల్లో ప్రమాదాలు తీవ్రంగా ఉన్నాయని ప్రభుత్వానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతిపాదన చేసినా దిక్కులేదు.

నెలకు 51 వేల మంది బాధితులు

రాష్ట్రంలో 11 బోధనాసుపత్రులు, 8 జిల్లా ఆస్పత్రులు ఉన్నాయి. ప్రమాదంలో గాయపడిన బాధితులు ఎక్కువగా వీటికే వెళుతుంటారు. 2018 ఏప్రిల్ 1 నుంచి 2018 డిసెంబర్ 30 వరకూ 4.64 లక్షల మంది ప్రమాద బాధితులు వచ్చినట్టు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. అంటే నెలకు సగటున 51వేల మంది వస్తున్నట్లు లెక్క తేలింది. ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మూడవ స్థానంలో ఉన్నట్టు తేలింది. రాష్ట్రంలో ప్రమాద బాధితులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాలో పశ్చిమగోదావరి జిల్లా 58 వేలతో మొదటి స్థానంలో ఉండగా, 51,525 తో కృష్ణా జిల్లా రెండో స్థానంలో ఉంది. బాధితుల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులే ఉండటం విశేషం. అత్యంత విపత్కర పరిస్థితుల్లో వచ్చిన ఈ బాధితులకు సమయానికి పడకలు ఉండవు, శ్వాస తీసుకోలేని పరిస్థితుల్లో వెంటిలేటర్ వైద్యం ఉండదు, ఐసీయూ (ఇంటెన్సివ్ కేర్ యూనిట్)లు సరిపడా లేవు. ట్రామాకేర్‌లో శిక్షణ పొందిన ఆర్థోపెడిక్ వైద్యులు కూడా మనకు అందుబాటులో లేరని వైద్య వర్గాలు చెబుతున్నాయి. విచిత్రమేమంటే బాధితులెవరైనా అందుబాటులో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే... అక్కడ ఆరోగ్యశ్రీ వర్తించదు.. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లండి అంటూ సెలవిస్తున్నారు.

ఆస్పత్రుల్లో పరిస్థితులు ఇవీ

- అత్యవసర వైద్యం అందించే క్యాజువాలిటీ వార్డుల్లో అధ్వాన్న పరిస్థితులు
- శిక్షణ పొందిన వైద్యుల కొరత
- రాత్రిపూట క్షతగాత్రులకు వైద్యం అందడంలో తీవ్ర జాప్యం
- సమయానికి అంబులెన్సులు అందుబాటులో లేక ప్రాణాపాయం
- ఎముకలు విరిగిన బాధితులకు ఇంప్లాంట్స్ అందుబాటులో ఉండటం లేదు
- వైద్యం సకాలంలో అందకపోవడంతో ఎక్కువ మంది శాశ్వత వైకల్యం బారిన పడుతున్నారు.

గడిచిన 9 నెలల్లో జిల్లాల వారీ ఆస్పత్రులకు వచ్చిన క్షతగాత్రుల సంఖ్య

జిల్లా	బాధితుల సంఖ్య
శ్రీకాకుళం	36798
విజయనగరం	42032
విశాఖపట్నం	23590
తూర్పుగోదావరి	25755
పశ్చిమగోదావరి	58156
కృష్ణా	51625
గుంటూరు	34150
ప్రకాశం	24826
నెల్లూరు	38121
చిత్తూరు	36087
వైఎస్సార్ కడప	37086
అనంతపురం	28558
కర్నూలు	27708

100 అడుగుల దోసె

చెన్నైలో శరవణభవన్ చెఫ్‌ల ఆధ్వర్యంలో తయారు



కొరుక్కుపేట (చెన్నై): వంద అడుగుల దోసెను తయారు చేసి చెన్నై చెఫ్‌లు గిన్నిస్ రికార్డు నెలకొల్పారు. శుక్రవారం సాయంత్రం ఐఐటీ మద్రాస్ ఆవరణలో ప్రముఖ చెఫ్ వినోద్‌కుమార్ సారథ్యంలో శరవణభవన్‌కు చెందిన 60 మంది చెఫ్‌లు 100 అడుగుల దోసెను తయారు చేశారు. ఈ సందర్భంగా చెఫ్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. 2014లో అహ్మదాబాద్‌లోని హోటల్ దాస్పల్లాలో 54 అడుగుల దోసె తయారు చేశారని.. ఇప్పుడు ఆ రికార్డును తాము బ్రేక్ చేసినట్టు తెలిపారు.

తెలంగాణ

ఈసారి తాత్కాలిక బడ్జెట్

- ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు వెల్లడి
- కేంద్రం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలోనే..
- లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పూర్తిస్థాయి బడ్జెట్
- అప్పుడే పంచాయతీలకు నిధులు సాధ్యం
- సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు శిక్షణపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్ (ఓట్ ఆన్ అకౌంట్)ను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక బడ్జెట్‌నే ప్రవేశపెట్టనుందని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తర్వాతే పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతామని, ఆ బడ్జెట్‌లోనే గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించడం సాధ్యమవుతుందని చెప్పారు. సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చే అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్ శర్మ, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, కాలె యాదయ్య, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు ఈ భేటీలో పాల్గొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, ఉపసర్పంచులకు శిక్షణ ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. కొత్తగా నియమితులయ్యే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కలిసికట్టుగా పనిచేయడానికి అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. కొత్తగా ఎన్నికయ్యే సర్పంచులు మూస పద్ధతిలో కాకుండా గ్రామాల సమగ్ర వికాసం కోసం పాటుపడే ఉద్యమకారులుగా మారాలని కేసీఆర్ ఆకాంక్షించారు. 'కొత్తగా ఎన్నికయ్యే సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలి. గ్రామాలను అద్భుతంగా తీర్చిదిద్దే విషయంలో వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలి. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచడం లక్ష్యంగా కొత్తగా రూపొందించిన చట్టంపై గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాలి. ప్రతి గ్రామ పంచాయతీకీ కొత్త చట్టం తెలుగు ప్రతులను పంపించాలి. గ్రామాభివృద్ధిలో సర్పంచ్, గ్రామ కార్యదర్శుల పాత్ర చాలా కీలకం. గ్రామ పంచాయితీలకు విధులు, బాధ్యతలు అప్పగించే విషయంలో కొంత జాప్యం అనివార్యమవుతుంది. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఏప్రిల్, మేలలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాతే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతాం. ఆలోగా సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇప్పించాలి' అని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు.

తెలుగులోకి పలు నివేదికలు

బీసీ కమిషన్‌ను అభినందించిన గవర్నర్

సాక్షి, హైదరాబాద్: భారతదేశ సామాజిక నేపథ్యం, ప్రజలకు రిజర్వేషన్ల ఆవశ్యకతకు గల ప్రామాణికమైన మండల్, అనంతరామన్, హవనూర్ కమిషన్ నివేదికలను తెలుగులోకి తీసుకువచ్చి బీసీ కమిషన్ గొప్పపని చేసిందని గవర్నర్ నరసింహన్ అభినందించారు. దేశంలో బీసీలకు రిజర్వేషన్ల అమలుకు మూలాధారంగా నిలిచిన ఈ నివేదికలను దేశంలోనే తొలిసారిగా ప్రాంతీయ భాషలోకి తీసుకురావడం గొప్ప ప్రయత్నమన్నారు. శుక్రవారం రాజ్‌భవన్‌లో తెలంగాణ బీసీ కమిషన్ తెలుగులోకి అనువదించి, ప్రచురించిన మండల్ కమిషన్, హవనూర్, అనంతరామన్, ఇంగ్లీషులో ప్రచురించిన 'బీసీ నోట్‌బుక్' గ్రంథాల తొలిప్రతులను గవర్నర్‌కు అందజేసింది. ఈ సందర్భంగా బీసీ కమిషన్‌తో పలు అంశాలపై గవర్నర్ చర్చించారు.

ఏపీ టూరిజంపై ఢిల్లీలో వర్క్‌షాప్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆ శాఖ శుక్రవారం ఢిల్లీలో ప్రత్యేక వర్క్‌షాప్ ఏర్పాటు చేసింది. దీనికి రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, ఏపీ భవన్ ఆర్సీ ప్రవీణ్ ప్రకాశ్ తదితరులు హాజరయ్యారు. పర్యాటక రంగంలో ఏపీలో పెట్టుబడులను ప్రోత్రహించేందుకు కల్పిస్తున్న వివిధ రాయితీలు, భూములు, మౌలికసదుపాయాల కల్పనపై వారు ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో ఐదు పర్యాటక జోన్లు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నామని, పెట్టుబడులకు రాష్ట్రంలో అనేక అవకాశాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో పలు టూరిజం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కన్నా రాకతో బీజేపీని వీడుతున్నారు

బీజేపీ కార్యవర్గ మాజీ సభ్యుడు ఉంగరాల చినబాబు విమర్శ

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కన్నా లక్ష్మీనారాయణ బాధ్యతలు చేపట్టాక ఒక్కొక్కరుగా నేతలు పార్టీ వీడే పరిస్థితి నెలకొందని బీజేపీ కార్యవర్గ మాజీ సభ్యుడు ఉంగరాల చినబాబు విమర్శించారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కన్నా లక్ష్మీనారాయణ తన వారికే పదవులు కట్టబెడుతూ పార్టీ కోసం పనిచేస్తున్నవారిని విస్మరిస్తున్నారని ఆరోపించారు. బీజేపీలో కొంత మంది నాయకుల వ్యవహారశైలిపై తాను పార్టీ అధ్యక్షుడికి లేఖ రాసి కార్యవర్గ సభ్యుడిగా రాజీనామా చేసినట్టు తెలిపారు. అయితే తాను చేసిన ఫిర్యాదులను పట్టించుకోకుండా రాజీనామాను ఆమోదించడం సరికాదన్నారు.

పోలీసు పదోన్నతుల్లో కుతంత్రం!

- ఖాళీ అయిన పోస్టులను ప్రకటించని ప్రభుత్వం
- ఖజానాపై భారంపడకుండా జాగ్రత్తపడ్డ వైనం
- హెడ్‌కానిస్టేబుళ్ల పదోన్నతుల్లోనూ ఇదే వైఖరి
- అసలు విషయం గుర్తించకుండా సీఎంపై ప్రశంసల వర్షం
- ఏఆర్, మహిళా పోలీసుల విషయంలోనూ ఇదే ఎత్తుగడ?



సాక్షి, అమరావతి : పదోన్నతులు ఇచ్చినట్లుగా ఉండాలి.. కానీ, పోస్టులు పెరగకూడదు. అలాగే, ఉన్నవారికే పదోన్నతులను సర్దుబాటు చేయాలి.. కానీ, ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకూడదు.. ఇదీ ఇటీవల పోలీస్ శాఖలో ఇచ్చిన ప్రమోషన్లపై సీఎం చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించిన తీరు. ఇది ఆశ్చర్యంగా ఉన్నా అసలు నిజం ఇదే. రాష్ట్రంలో ఇటీవల 2019 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లగాను, 566 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగాను పదోన్నతి ఇచ్చిన విషయం తెలిసిందే. వీరి స్థానంలో కొత్తగా పోస్టులు పెంచలేదు. పైగా పదోన్నతి పొందిన వారి స్థానంలో ఉండాల్సిన కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ పోస్టులను కుదించారు. దీనివల్ల పదోన్నతి పొందిన వారికి కేవలం ఒకటి, రెండు ఇంక్రిమెంట్లు పెరుగుతాయి తప్పప్రభుత్వంపై పెద్దగా ఆర్థిక భారం పడదని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. వాస్తవానికి 2019 మంది కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందినప్పుడు ఆ మేరకు కానిస్టేబుల్ పోస్టులు ఖాళీ అవుతాయి. వాటి సంఖ్య పెంచకపోవడంతో అంత మంది కొత్తవారికి అవకాశం లేకుండాపోతోంది. హెడ్‌కానిస్టేబుల్ పదోన్నతుల్లోను ప్రభుత్వం ఇలాగే చేసింది. మరోవైపు.. ఒక్కసారిగా 2019 మంది కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందడంతో వారి విధులు కూడా మారిపోతాయి. ఉదాహరణకు.. ఒక బీటు (డ్యూటీ) వేయాలంటే ఒక హెడ్ కానిస్టేబుల్ నేతృత్వంలో ముగ్గురు నుంచి నలుగురు కానిస్టేబుళ్ల బృందం ఉంటుంది. అదే హెడ్ కానిస్టేబుళ్ల సంఖ్య పెరగడంతో ఒకే బీటుకు ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు నేతృత్వం వహించే పరిస్థితి రావడంతో సమన్వయలోపం, సీనియర్, జూనియర్ వివాదాలకు ఆస్కారం ఇచ్చినట్లు అవుతుంది. ఈ నేపథ్యంలో పదోన్నతులు పొందిన వారి స్థానంలో కొత్త పోస్టులు పెంచకుండా ఖజానాకు ఆర్థిక భారం కాకుండా ప్రభుత్వం పన్నిన ఎత్తుగడను గమనించని పోలీసులు కొందరు ముఖ్యమంత్రిపై ప్రశంసల వర్షం కురిపించారని.. అసలు విషయం లోతుగా గుర్తిస్తే వారే తిట్టుకుంటారని ఒక ఐపీఎస్ అధికారి వ్యాఖ్యానించారు.

ఏఆర్, మహిళా పోలీసుల పదోన్నతులపై ప్రతిపాదనలు

ఇదిలా ఉంటే.. కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతులు కల్పించడంతో ఏపీఎస్పీ నుంచి వచ్చిన ఏఆర్ పోలీసులతోపాటు మహిళా పోలీసుల మాటేమిటనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో కానిస్టేబుళ్లకు వాడిన తంత్రాన్నే వీరికి కూడా ప్రయోగించాలని సర్కారు ఎత్తుగడ వేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఏపీఎస్పీలో ఆరేళ్లు పనిచేస్తే హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి వస్తుంది. కానీ, సివిల్ పోలీసులకు క్రేజ్ ఉండటంతో ఏపీఎస్పీ నుంచి ఏఆర్ కానిస్టేబుల్‌గాను, ఆ తరువాత సివిల్ పోలీసుగాను మారి పదేళ్లపాటు పనిచేస్తే పదోన్నతి అవకాశం వస్తుంది. దీంతో ఏపీఎస్పీ నుంచి పెద్ద సంఖ్యలోనే ఏఆర్, సివిల్ పోలీసులుగా మారిన వారున్నారు. ఫలితంగా ఏపీఎస్పీలో దాదాపు 600–700 వరకు హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏపీఎస్పీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయకుండా ఆ పోస్టులను ఏఆర్ కానిస్టేబుళ్లకు పదోన్నతులు ఇచ్చేలా బదలాయించాలని ప్రతిపాదనలు సిద్ధంచేశారు. ఏఆర్ విభాగంలో 637 మంది కానిస్టేబుళ్లకు, 546 హెడ్ కానిస్టేబుళ్లకు, 91 ఏఆర్ ఎస్సైలకు పదోన్నతులు ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధంచేశారు. అలాగే, మహిళా పోలీసుల పదోన్నతికి అడ్డంకిగా మారిన జీవో నెంబర్ 84ను రద్దుచేయాలనే ప్రతిపాదన ఉంది. కాగా, మరో 15 రోజుల్లో ఏఆర్, మహిళా కానిస్టేబుళ్ల పదోన్నతులకు లైన్ క్లియర్ అయ్యే అవకాశముంది.

టీడీపీ కార్యకర్తల లబ్ధి కోసమే చంద్రబాబు పనిచేస్తున్నారు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ




అనంతపురం అర్బన్: టీడీపీ నాయకులు, కార్యకర్తలకు లబ్ధి చేకూర్చేందుకే సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అనంతపురం పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి జగదీశ్‌తో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రభుత్వ భూములను ఆక్రమించారని ఆరోపించారు. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా భూములను క్రమబద్ధీకరించాలని అధికారులను సీఎం ఆదేశించడాన్ని ఆయన తప్పుబట్టారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను సంక్రాంతి తరువాత సీఎంకు వివరిస్తానని అప్పటికీ స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని చెప్పారు.

తెలంగాణ

ముంచేస్తున్న 'మల్టీ' మోసం

- వేల కోట్లు కొల్లగొడుతున్న కంపెనీలు
- తెలంగాణలోనే రూ.20 వేల కోట్లకుపైగా హాంఫట్
- ఈడీ, ఐటీ, సీబీఐ, ఎన్ఐఏలకు లేఖలు రాసినా పట్టించుకోని వైనం



సాక్షి, హైదరాబాద్: మల్టీలెవల్ మార్కెటింగ్ దందా అమాయకులను అప్పులపాలు చేస్తోంది. గడిచిన మూడు నెలల్లో రాష్ట్ర పోలీసులు పట్టుకున్న కేసుల్లో రూ.20 వేల కోట్ల మేర మల్టీ లెవల్ మార్కెటింగ్‌లో వేలాదిమంది మోసపోవడం సంచలనం రేపుతోంది. దేశవ్యాప్తంగా మల్టీలెవల్ మార్కెటింగ్‌పై నిషేధం విధిస్తూ కేంద్రం 1978లోనే చట్టాన్ని తీసుకువచ్చింది. మనీ సర్క్యులేషన్ స్కీం నిషేధిత యాక్ట్ కింద గిఫ్ట్‌ల పేరిట డబ్బులు వసూలు చేసి చెయిన్ లింక్ ద్వారా మార్కెటింగ్ చేయడం పూర్తిగా అక్రమమేనని ఈ చట్టం ద్వారా స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఐదేళ్ల క్రితం రాష్ట్రంలో ఆమ్వే ప్రొడక్ట్‌పై ఇదే తరహా మల్టీలెవల్ మార్కెటింగ్ కేసును సీఐడీ నమోదు చేసింది. ఇటీవల బయటపడుతున్న మల్టీలెవల్ కంపెనీ మోసాలు వేలకోట్లకు చేరడంతో రాష్ట్రంలో మళ్లీ మల్టీ లెవల్ మార్కెటింగ్ మాఫియా చాపకింద నీరులా దందా సాగిస్తున్నట్టు స్పష్టమవుతోంది.

➡ హైదరాబాద్ కేంద్రంగా చేసుకొని గోల్డ్‌స్కీం పేరుతో దేశవ్యాప్తంగా డిపాజిట్లు వసూలు చేసిన హీరా గ్రూప్ మోసాన్ని నగర సీసీఎస్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఆ గ్రూపు ఎండీ నౌహీరా షేక్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా, వివిధ రాష్ట్రాల్లో నమోదైన కేసుల్లో ఆమెను పోలీసులు విచారిస్తున్నారు. దేశవ్యాప్తంగా రూ.8 వేల కోట్లకుపైగా నౌహీరా షేక్ బంగారం స్కీం పేరుతో డిపాజిట్లు వసూలు చేసినట్టు బయటపడింది.

➡ ఎఫ్ఎంఎల్ సీ(ఫ్యూచర్ మేకర్ లైఫ్ కేర్) ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ దేశవ్యాప్తంగా రూ.1,200 కోట్ల వసూలు చేసింది. ఈ కంపెనీలో సభ్యులుగా చేరి, వారి వద్ద ఉన్న హెల్త్ ప్రొడక్టు కొనుగోలు చేయాలి. తర్వాత మరో ఇద్దరిని చేర్చి ప్రొడక్టు కొనుగోలు చేయించాలి. ఇలా చేయడం వల్ల నెలవారీగా ఇంత మొత్తం వస్తుందని డిపాజిట్ చేయిస్తారు. ఇలా రాష్ట్రంలో 650 మందిని మోసం చేసినట్టు గుర్తించారు.

➡ కరక్కాయల పౌడర్ పేరుతో మల్టీలెవల్ మార్కెటింగ్ చేస్తూ రూ.13 కోట్లు మోసం చేసిన వ్యవహారాన్ని ఛేధించారు. రూ.1,000 పెట్టి కిలో కరక్కాయలు కొని పౌడర్ చేసి ఇస్తే 1,300 రూపాయలకు కొనుగోలు చేస్తామని డిపాజిట్ల రూపంలో రూ.20 కోట్లకుపైగా వసూలు చేసి బోర్డు తిప్పేశారు.

➡ హెల్త్ బిజ్ ప్రొడక్ట్స్ కంపెనీ పేరుతో మెంబర్‌షిప్ చేయించి ప్రొడక్టు కొనుగోలు చేసి, మరో ఇద్దరితో డిపాజిట్ చేయిస్తే పెట్టిన డబ్బులు రెట్టింపు ఇస్తామంటూ రూ.30 కోట్ల మేర కొల్లగొట్టారు.

➡ సన్ పవర్ కంపెనీ పేరుతో రూ.200 కోట్ల మేర మోసం చేశారు. సభ్యులుగా చేరి, మరో ఇద్దరిని చేర్పిస్తే ప్రతి ఏడాదికి పెట్టిన డబ్బులతోపాటు వడ్డీ రెట్టింపు ఇస్తామంటూ మోసం చేశారు. స్టాక్ మార్కెట్‌లో సులభంగా డబ్బులు సంపాదించాలంటే తమ కంపెనీలో సభ్యులుగా నమోదవ్వాలంటూ డిపాజిట్ల పేరుతో బురిడీ కొట్టించారు. ఇలా 2 వేలమంది నుంచి రూ.2 వేల కోట్ల మేర వసూలు చేశారు.

➡ క్యూనెట్ కంపెనీ పేరుతో వేల కోట్లు కొల్లగొట్టిన వ్యవహారం మరోసారి సంచలనంగా మారింది. గతంలో ఇదే కంపెనీ నిర్వాహకులు గోల్డ్‌క్వెస్ట్ పేరుతో రాష్ట్రంలో మల్టీ లెవల్ మార్కెటింగ్ నిర్వహించి రూ.800 కోట్లకుపైగా అమాయకులకు ఎగనామం పెట్టారు.

➡ ఇప్పుడిదే నిర్వాహకులు పేరు మార్చి క్యూ-నెట్ పేరుతో దందా ప్రారంభించారు. సుమారు రూ.5 వేల కోట్లకుపైగా ప్రొడక్ట్ కొనుగోలు చేసి సభ్యత్వం పేరుతో వసూలు చేసినట్టు సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. దీనిపై విచారణ జరిపిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసు కమిషనర్ సజ్జనార్ స్పష్టం చేశారు.

ఎకనామిక్ ఇంటలిజెన్స్ యూనిట్ వద్దా?

మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో ప్రచారం చేసినా, టీవీల్లో ప్రకటనలిచ్చినా, సంక్షిప్త సందేశాలతో ప్రలోభపెట్టినా దర్యాప్తు విభాగాలు నేరుగా సుమోటోగా కేసు నమోదు చేయవచ్చు. కానీ, బాధితులు ఫిర్యాదు చేస్తే తప్పా ఇలాంటి మోసపూరిత కంపెనీలపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇలాంటి మల్టీలెవల్ మార్కెటింగ్ వ్యవహారాలను గుర్తించడం, కట్టడి చేయడంతోపాటు రూ.వేల కోట్లు కొల్లగొట్టకుండా అడ్డుకునేందుకు రాష్ట్రంలో 'ఎకనామిక్ ఇంటలిజెన్స్ యూనిట్'ఏర్పాటు తప్పనిసరి అని సీనియర్ ఐపీఎస్ అధికారులు అభిప్రాయపడ్డారు. మల్టీ లెవల్ మార్కెటింగ్ సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇన్‌కమ్ ట్యాక్స్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలకు రాష్ట్ర పోలీసులు లేఖలు రాసినా ఇంతవరకు దృష్టి సారించలేదని, ఇప్పటికైనా దృష్టి పెట్టాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్పష్టమైన హామీ వచ్చే వరకు సర్వీసులు నిలిపివేత

ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల సంఘం వెల్లడి

సాక్షి, అమరావతి: తమకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల సంఘం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ, ఉద్యోగుల వైద్య పథకానికి సంబంధించి ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో సర్వీసులను నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారంమంత్రి ఫరూక్‌తో ఆషా ఆస్పత్రుల సంఘం భేటీ అయ్యింది. ఆస్పత్రుల సంఘం ప్రతినిధులు మంత్రి ముందు పలు డిమాండ్లు ఉంచారు. బకాయిలు 50 శాతం చెల్లించాలని, ఈహెచ్ఎస్ టారిఫ్‌ను ఆరోగ్య రక్ష పథకానికి అమలు చేయాలని, రానున్న బడ్జెట్‌లో ప్రస్తుతమున్న పథకాలకు బడ్జెట్ కేటాయించాలని మంత్రిని డిమాండ్ చేసినట్లు ఆస్పత్రుల సంఘం పేర్కొంది.

పవర్ జనరేటింగ్ ఎంప్లాయీస్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ విజయానంద్

విజయవాడ: ఏపీ పవర్ జనరేటింగ్ ఎంప్లాయీస్ యూనియన్ 2019 డైరీని ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కె.విజయానంద్ శుక్రవారం గుణదల పవర్ హౌస్‌లో ఆవిష్కరించారు. డైరీలో కార్మికులకు అవసరమైన జీవోలు పొందుపరచటం పట్ల యూనియన్ నాయకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నే శ్రీనివాసకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రాధాకృష్ణ, ప్రాంతీయ కార్యదర్శి ఎన్.వెంకట్రావు, కోశాధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి చెందిన 66 రుచులతో ప్రత్యేక పుస్తకం

నోవాటెల్‌లో ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన ముఖేష్ కుమార్ మీనా

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 66 రకాల ఆహార రుచులతో నూతనంగా ఒక పుస్తకాన్ని తీసుకురానున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. విజయవాడ నోవాటెల్ వేదికగా నిర్వహిస్తున్న 'ఆంధ్రా ఫుడ్ ఫెస్టివల్'ను శుక్రవారం ముఖేష్ కుమార్ మీనా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలుగు ప్రజలకు మాత్రమే పరిమితమైన ప్రత్యేక అంశాలకు భౌగోళిక సూచీలు పొందేందుకు పర్యాటకశాఖ కృషి చేస్తుందన్నారు. నిబంధనల ప్రకారం హక్కుదారులు మాత్రమే సూచీలు పొందేందుకు అర్హులు అయినప్పటికీ రాష్ట్ర విస్తృత ప్రయోజనాల దృష్ట్యా పర్యాటక శాఖ సమన్వయ బాధ్యతను తీసుకోనుందని వివరించారు. రాష్ట్రానికి వస్తున్న దేశీయ పర్యాటకుల సంఖ్య నానాటికీ పెరుగుతుందని మీనా తెలిపారు. ఈ ఫుడ్ ఫెస్టివల్‌ను ఈ నెల 24వ తేదీ వరకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నోవాటెల్ జీఎం టీవీ మధుపాల్ మాట్లాడుతూ.. ఈ ఉత్సవంలో ఆంధ్రులు ఇష్టంగా ఆరగించే అన్ని రుచులు ఇక్కడ సిద్ధంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

విజయవాడలో ఫైట్ ఫర్ హౌస్ ఆధ్వర్యంలో ధర్మ దీక్ష



ధర్మ దీక్ష చేస్తున్న జర్నలిస్టులు


గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): జర్నలిస్టులకు తక్షణమే ఇళ్ల నిర్మాణం చేపట్టి, కేటాయింపు పత్రాలను అందజేయాలని కోరుతూ 'ఫైట్ ఫర్ హౌస్' ఆధ్వర్యంలో శుక్రవారం ధర్మ దీక్ష జరిగింది. దీక్షను పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.రవిచంద్ర ప్రారంభించారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో ఫైట్ ఫర్ హౌస్ ఆధ్వర్యంలో పులిగడ్డ సత్యనారాయణ చేపట్టిన ఈ ధర్మ దీక్షకు పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్‌ను తక్షణం పరిష్కరించాలని ఆయా సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జర్నలిస్టులకు అండగా పోరాడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎ.రవిచంద్ర, జనసేన పార్టీ లీగల్ సెల్ నాయకుడు రాయపూడి వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులు తమ సొంతింటి కోసం రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ నాయకులు తోట సాంబశివరావు, బీజేపీ నాయకులు విల్సన్, గణేష్, కాపు నాయకులు వేల్పూరి శ్రీనివాసరావు, కబడ్డీ శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కోటి దీక్షకు మద్దతిచ్చారు.

టీచర్ల అంతర్‌జిల్లా బదిలీలకు ఓకే

సీఎం ఆమోదముద్ర

సాక్షి, అమరావతి: జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లోని టీచర్లకు అంతర్ జిల్లా బదిలీలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆమోదముద్ర వేశారు. దీనికి సంబంధించి వెంటనే ఆయా టీచర్లను రిలీవ్ చేస్తూ, పాత పాఠశాలల్లో డిప్యూటేషన్‌పై పనిచేసి ఏప్రిల్ చివరి పనిదినాల్లో కొత్త పాఠశాలల్లో (కొత్త జిల్లాలో) పనిచేయడానికి వీలుగా చర్యలు తీసుకునేలా సీఎం ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం ఈ ఫైల్ పాఠశాల విద్యాశాఖ నుంచి ఆర్థికశాఖకు పంపుతున్నారని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, జి.హృదయరాజు తెలిపారు. ఆర్థికశాఖ అనుమతి అనంతరం పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ జీవో జారీ చేస్తారన్నారు.

18న వైఎస్సార్ జిల్లాలో అమిత్‌షా పర్యటన



సాక్షి, అమరావతి: బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఈ నెల 18న వైఎస్సార్ జిల్లా కడపలో పర్యటించనున్నారు. రాయలసీమలోని నాలుగు జిల్లా పరిధిలోని 8 లోక్‌సభ స్థానాల పరిధిలోని 6 వేల మంది పోలింగ్ బూత్ అధ్యక్షులు, పార్టీ పదాధికారులతో సమావేశం కానున్నారు. అలాగే, ఫిబ్రవరి మొదటి వారంలో విశాఖలో పర్యటించి, 6 లోక్‌సభ నియోజకవర్గాల బూత్ కమిటీ అధ్యక్షులతో భేటీ అవుతారు. ఫిబ్రవరి మూడో వారంలో గుంటూరులో మరో 8 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని బూత్ కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారు.

ఆక్టోపస్ ఎస్పీ రాధికకు డీజీపీ అభినందనలు


సాక్షి, అమరావతి: అంటార్కిటికాలోని అతి ఎత్తు అయిన శిఖరం మౌంట్ విన్సన్‌ను అధిరోహించిన ఏపీ ఆక్టోపస్ ఎస్పీ జీఆర్ రాధికను డీజీపీ ఆర్పీ ఠాకూర్ అభినందించారు. మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆమె శుక్రవారం డీజీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె ఏడు ఖండాల్లోని ఏడుఎత్తు అయిన శిఖరాలను అధిరోహించి, అరుదైన రికార్డును సొంతం చేసుకున్న సంగతి తెల్సిందే. గత నెల 16వ తేదీన మౌంట్ విన్సన్ పర్వతాన్ని అధిరోహించి తాజా రికార్డును సాధించారు. ఆమె 7 సవాళ్లను అధిగమించి, ఏడు ఖండాల్లోని ఎత్తు అయిన శిఖరాలు అధిరోహించి పోలీస్ శాఖకు మంచి పేరు తెచ్చారని డీజీపీ ఈ సందర్భంగా ప్రశంసించారు.

17న ఢిల్లీలో సమావేశానికి అనురాధ

సాక్షి, అమరావతి: ఈ నెల 17న ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి కీలక సమావేశానికి రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ హాజరయ్యేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర హోం శాఖ, ఆంతరంగిక వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి నిర్వహించే ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చించనున్నారు.

గాలి మనవైపే వీస్తోంది

- పార్టీ అభిమానుల సమావేశంలో పవన్‌కల్యాణ్
- జిల్లాల వారీగా పార్టీ సమావేశాలు ముగింపు



సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల గాలి మనవైపే వీస్తోందని.. మనం కోరుకున్న గుర్తు 'టీ గ్లాసు'ను ఎన్నికల సంఘం పార్టీకి కేటాయించడమే దీనికి సంకేతమని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు. జిల్లాల వారీ సమీక్షా సమావేశాల్లో భాగంగా శుక్రవారం విజయవాడలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల పార్టీ అభిమానులు, కార్యకర్తలతో ఆయన విడివిడిగా సమావేశమయ్యారు. ఈ నెల 3వ తేదీ నుంచి జిల్లాల వారీగా జరుగుతున్న సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. పశ్చిమగోదావరి జిల్లా సమావేశంలో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ..దెందులూరు ఎమ్మెల్యే వేధిస్తున్నాడని పలువురు దళితులు నాకు చెప్పారన్నారు. అటువంటి వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు పెట్టి అరెస్టు చేయాలని..అయితే ప్రభుత్వం ఆ పని చేయడం లేదని విమర్శించారు. ప్రజలు, ముఖ్యంగా మహిళలు ప్రభుత్వంపై ఎంతో ఆగ్రహంతో ఉన్నారన్నారు. కృష్ణా జిల్లా అభిమానుల సమావేశంలో.. జిల్లా స్థాయి కమిటీలను కాకుండా పార్లమెంటరీ స్థాయి కమిటీలు వేయాలన్న నిర్ణయానికి వచ్చానని పవన్ తెలిపారు.

కోడి పందేల దాడుల్లో ఇద్దరు మృతి

- పోలీసుల అత్యుత్సాహం
- పారిపోతూ నేలబావిలో పడ్డ యువకులు



శ్రీనివాసరావు, చెన్నకేశవరావు మృతదేహాలు

చిత్తపూరు (చాట్రాయి): కోడి పందేలపై పోలీసులు నిర్వహించిన దాడుల్లో కృష్ణా జిల్లాలో ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. నూజివీడు నియోజకవర్గంలోని చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామ శివారు గొల్లగూడెంలో గురువారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో కోడి పందేలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న చాట్రాయి ఎస్‌ఐ షబ్బీర్‌అహ్మద్ సిబ్బందితో అర్ధరాత్రి దాటాక దాడులు నిర్వహించారు. దీంతో భయాందోళనకు గురైన పందెంరాయుళ్లు తలోదిక్కు పరుగులు దిశారు.మ పోటీలను వీక్షించడానికి వచ్చిన చిత్తపూరు శివారు వీరయ్య నగర్‌కి చెందిన చిట్టూరి శ్రీనివాసరావు (21), విసన్నపేట మండలం కొండపర్వ గ్రామానికి చెందిన కుక్కల చెన్నకేశవరావు (26) కూడా పారిపోతూ అక్కడికి సమీపంలోనే ఉన్న నేలబావిలో పడిపోయి నీళ్లల్లో మునిగిపోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు వారిని రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే వారు మృతి చెందారు. శుక్రవారం ఉదయం విసన్నపేట అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మృతదేహాలను వెలికితీశారు.

బెల్టు షాపులపై ఫిర్యాదులు బుట్టదాఖలు

సాక్షి, అమరావతి: బెల్టు షాపులను తొలగించి విచ్చలవిడి మద్యం విక్రయాలను అరికట్టాలంటూ జన్మభూమి కార్యక్రమం సందర్భంగా మహిళలు ఇచ్చిన అర్జీలన్నీ బుట్టదాఖలేనా? జన్మభూమి గ్రామసభలు జరిగిన తీరు చూస్తే అవుననే అంటున్నారు. శుక్రవారం ప్రత్యేకంగా ఫిర్యాదులు స్వీకరిస్తామని చెబుతూ సర్కారు మభ్యపెట్టింది. అయితే చివరి రోజు ఫిర్యాదులు స్వీకరించకుండానే రాష్ట్ర వ్యాప్తంగా సభల్ని హడావుడిగా ముగించడం గమనార్హం. బెల్టు షాపులపై ఫిర్యాదులు స్వీకరించవద్దని జన్మభూమి సభల్లో పాల్గొంటున్న అధికారులకు అంతర్గతంగా ఆదేశాలు అందినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా, బెల్టు షాపులు, కాపు సారా తయారీపై ఫిర్యాదులు చేసేందుకు వచ్చిన వారిపై అధికార పార్టీ నేతలు దురుసుగా ప్రవర్తించారు. గుంటూరు, కృష్ణా, శ్రీకాకుళం, విజయనగరం, ప్రకాశం, తూర్పు గోదావరి జిల్లాల్లో ఫిర్యాదులు అందినా ఎక్కడా నమోదు చేయలేదు. గ్రామసభల్లో బెల్టు షాపులపై అర్జీలను స్వీకరిస్తే ఇలాంటి దుకాణాలు ఉన్నాయని అంగీకరించినట్లే అవుతుందని అధికారులు ఇలా ఈ వ్యవహరించినట్టు తెలుస్తోంది.





మాజీ రాజ్యసభ సభ్యుడు యలమంచిలి శివాజీ శుక్రవారం ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

వరి..ఇక సరి!



ఎత్తిపోతల పథకాల కింద ఆరుతడి పంటలే వెయ్యాలని సర్కార్ ఉత్తర్వులు

- సర్కారు నిర్ణయంతో మొత్తం 30.55 లక్షల ఎకరాల్లో వరి సాగుకు దెబ్బ
- వచ్చే ఖరీఫ్ నుంచి వరికి నీటిని సరఫరా చేసేదిలేదని స్పష్టీకరణ
- నీటి యాజమాన్య పద్ధతుల ముసుగులో విద్యుత్ చార్జీల భారం తగ్గింపు!
- నీటి పన్ను అడ్డగోలుగా పెంచేసిన సర్కార్
- ప్రభుత్వ తీరుపై రైతులు మండిపాటు
- పలు జిల్లాల్లోని భూములు ఆరుతడి పంటలకు అనువుగా లేవంటున్న శాస్త్రవేత్తలు
- ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తల సూచనలూ బేఖాతరు

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో వివిధ ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టులో వరి సాగుకు ప్రభుత్వం మంగళం పాడుతోంది. వచ్చే ఖరీఫ్ నుంచి కేవలం ఆరుతడి పంటలకు.. అదీ 90 నుంచి 100 రోజులు మాత్రమే నీటిని సరఫరా చేయాలని నిర్ణయించింది. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా ఆయకట్టును స్థిరీకరించామని సర్కార్ చెబుతున్న కృష్ణా డెల్టాలోని 13.08 లక్షల ఎకరాల్లోనూ వరి సాగుకు బ్రేక్ వేయనుంది. పుష్కర, తాడిపూడి, వెంకటనగరం, తొర్రిగడ్డ పంపింగ్ స్కీం, పురుషోత్తపట్నం ఎత్తిపోతలతోపాటు ఏపీఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ) పరిధిలోని ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టులోనూ ఆరుతడి పంటలకు మాత్రమే నీటిని అందించాలని నిర్ణయించింది. యాజమాన్య పద్ధతుల ద్వారా సమర్థవంతంగా నీటిని వినియోగించుకుని.. అధిక ఆయకట్టుకు నీళ్లందించాలనే ముసుగులో వరి సాగు చేయకూడదని సర్కార్ షరతులు విధించడాన్ని జలవనరుల శాఖ అధికారులు, రైతులు తప్పుబడుతున్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించుకోవడానికే సర్కార్ ఈ కుట్రకు తెరతీసిందని జలవనరుల శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కాగా, ఉభయ గోదావరి జిల్లాలతోపాటు కృష్ణా డెల్టా సహా ఉత్తరాంధ్ర, గుంటూరు జిల్లాల్లో వరి సాగుకు మాత్రమే భూములు అనువుగా ఉంటాయని.. ఆరుతడి పంటల సాగుకు అక్కడి భూములు అనుకూలంగా ఉండవని వ్యవసాయ శాస్త్రవేత్తలు చేస్తున్న సూచనలను కూడా సర్కార్ తోసిపుచ్చుతుండటం గమనార్హం. రాష్ట్రంలో ఏపీఎస్ఐడీసీ పరిధిలోని 1,166 ఎత్తిపోతల పథకాల కింద 7,40,260.27 ఎకరాల ఆయకట్టు ఉంది. పుష్కర, తాడిపూడి, తొర్రిగడ్డ, వెంకటనగరం తదితర భారీ, మధ్య తరహా ఎత్తిపోతల పథకాల కింద మరో 9.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా డెల్టాలోని 13.08 లక్షల ఎకరాలను స్థిరీకరించామని సర్కార్ చెబుతోంది. ఏలేరు రిజర్వాయర్ కింద ఉన్న 67,614 ఎకరాల ఆయకట్టును పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా స్థిరీకరించామని ప్రభుత్వం ప్రకటించింది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. ఎత్తిపోతల పథకాల కింద 30.55 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లుగా సర్కార్ అంచనా వేస్తోంది. హంద్రీ–నీవా సుజల స్రవంతి, గాలేరు–నగరి సుజల స్రవంతి పథకాల్లో తొలి దశ పనులు పూర్తయినా.. ఆయకట్టుకు నీళ్లందించడంలేదు. పట్టిసీమ, పురుషోత్తపట్నం సహా ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని తోడేందుకు ఏటా రూ.1,400 కోట్ల మేర విద్యుత్ చార్జీలను సర్కార్ చెల్లిస్తోంది. ఎత్తిపోతల పథకాల కింద సింహభాగం వరి పంటనే రైతులు సాగు చేస్తున్నారు.

కాడ్వామ్ ముసుగులో..

వర్షాభావ ప్రాంతాల్లో నీటిని సమర్థవంతంగా వినియోగించుకుని, అధిక ఆయకట్టుకు నీళ్లందించి, ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో కేంద్రం కాడ్వామ్ (ఆయకట్టు అభివృద్ధి, నీటి యాజమాన్యం) పథకాన్ని అమలు చేస్తోంది. ఏఐబీపీ (సత్వర సాగునీటి ప్రయోజన పథకం) కింద పూర్తిచేసిన ప్రాజెక్టుల ఆయకట్టులో సూక్ష్మ నీటిపారుదల (బిందు, తుంపర సేద్యం) విధానం ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు కాడ్వామ్‌ను కేంద్రం ప్రారంభించింది. రాష్ట్రంలో ఏఐబీపీ కింద పుష్కర, తాడిపూడి, తోటపల్లి, ఎర్రకాల్వ, తారకరామ తీర్థసాగరం, గుండ్లకమ్మ, ముసురుమిల్లి, మద్దిగెడ్డ ప్రాజెక్టులకు కేంద్రం నిధులు విడుదల చేసింది. ఇందులో పుష్కర, తాడిపూడి, తోటపల్లి, ఎర్రకాల్వ.. గుండ్లకమ్మ, మద్దిగెడ్డ, ముసురుమిల్లి ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు నీళ్లందిస్తున్నారు. తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టు పూర్తికాలేదు. వీటిలో వర్షాభావ ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టు గుండ్లకమ్మ మాత్రమే. కేంద్రం మార్గదర్శకాల మేరకు కాడ్వామ్‌ను అమలుచేస్తే గుండ్లకమ్మ ప్రాజెక్టులో మాత్రమే అమలుచేసే అవకాశం ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నీటి యాజమాన్య పద్ధతులను అమలుచేయకుండా ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టులో వరి సాగు చేయకూడదని ఆదేశాలు జారీచేయడాన్ని అధికారులు తప్పుబడుతున్నారు.

రాయితీల భారం తగ్గించుకోడానికే..

ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టులో నీటి పన్నుగా ఎకరానికి రూ.రెండు వందల చొప్పున గతంలో సర్కార్ వసూలుచేసేది. ఆ పథకాల నిర్వహణ, విద్యుత్ చార్జీలకు రాయితీల కింద బడ్జెట్‌లో సర్కార్ నిధులు కేటాయించేది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం రాయితీల భారాన్ని తగ్గించుకోవడానికి ఆది నుంచి పావులు కదుపుతూ వచ్చింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఏపీడబ్ల్యూఆర్‌డీసీ) ద్వారా తీసుకున్న రుణాలు చెల్లించేందుకు ఖరీఫ్ నుంచి నీటి పన్నును ఎకరానికి రూ.వెయ్యి చొప్పున వసూలుచేయాలని ఇటీవల కేబినెట్‌లో నిర్ణయించింది. తాజాగా ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టులో కేవలం ఆరుతడి పంటలను మాత్రమే సాగుచేయాలని ఉత్తర్వులు జారీచేసింది. వరి పంటకు కనీసం 120 నుంచి 150 రోజులుపాటు నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఆరుతడి పంటలకు 90 రోజులు సరఫరా చేసినా సరిపోతుంది. కానీ, విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించుకోడానికే ఆరుతడి పంటలు మాత్రమే సాగుచేయాలని సర్కార్ ఉత్తర్వులు జారీచేసిందని అధికారులు చెబుతున్నారు.

రైతులు, శాస్త్రవేత్తల సూచనలు బేఖాతరు

ఇదిలా ఉంటే.. కృష్ణా, గోదావరి డెల్టాలతోపాటు రాష్ట్రంలో వివిధ ఎత్తిపోతల పథకాల కిందనున్న భూములు వరి సాగుకు మాత్రమే అనువుగా ఉంటాయని.. అందులో అధిక శాతం నేలలు ఉప్పుబారి పోవడంవల్ల ఆరుతడి పంటల సాగుకు ప్రతికూలంగా ఉంటాయని రైతులు, శాస్త్రవేత్తలు పలు సందర్భాల్లో సర్కార్‌కు నివేదించారు. కానీ, సర్కార్ వారి సూచనలను ఏమాత్రం ఖాతరు చేయకపోవడం గమనార్హం.

విపక్షనేతకు ప్రొటోకాల్ పాటించని టీటీడీ

- శ్రీవారి దర్శనానికి వచ్చిన జగన్‌ను కలవని టీటీడీ ఉన్నతాధికారులు
- వేద ఆశీర్వచనం సమయంలో సంప్రదాయాలకు నీళ్లు
- వెల్లువెత్తుతున్న విమర్శలు

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం ప్రతిపక్షనేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తిరుమల వెళ్లిన సందర్భంగా తిరుమల–తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రొటోకాల్ పాటించలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో ముఖ్యమంత్రి తర్వాత స్థానం ప్రతిపక్షనేతదే. ప్రతిపక్షనేత స్వామి వారి దర్శనానికి వస్తే టీటీడీ ఉన్నతాధికారులు స్వాగతం పలకడం ఆనవాయితీగా వస్తోంది. వైఎస్ రాజశేఖరరెడ్డి విపక్షనేత హోదాలో పాదయాత్ర చేసి తిరుమలకు వచ్చిన సందర్భంగా అప్పటి కార్యనిర్వహణాధికారి (ఈవో) అజేయ కల్లం సాదరంగా ఆహ్వానించి సంప్రదాయాన్ని పాటించారు. ప్రస్తుత విపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తిరుమలకు వచ్చిన సందర్భంగా దీనికి పూర్తి విరుద్ధంగా జరిగింది. జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు (జేఈవో) స్థానికంగానే ఉండి కూడా కనీసం కలవకుండా ఎవరినో కిందిస్థాయి ఉద్యోగిని పంపి చేతులు దులుపుకున్నారు. జగన్ తిరుమల పర్యటన గురించి టీటీడీ అధికారులకు సమాచారం రాలేదా? అని వాకబు చేయగా పూర్తిగా పర్యటన, స్వామివారి దర్శనం గురించి ముందుగానే సమాచారం పంపించారని తెలిసింది. అయినా ప్రతిపక్షనేత జగన్ విషయంలో టీటీడీ ఉన్నతాధికారులు సంప్రదాయాలను పాటించకపోవడం గమనార్హం. రాజకీయాలకు అతీతంగా ఉండాల్సిన అతి పెద్ద ధార్మిక సంస్థ టీటీడీలో ఇలా జరగడానికి ప్రభుత్వ పెద్దల ఆదేశాలే కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదేమి వైచిత్రి!

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులను రంగనాయకుల మండపంలో టీటీడీ వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించడం సంప్రదాయం. ఇలా ప్రముఖులను ఆశీర్వదించే సమయంలో టీటీడీనే ఫొటోలు తీయించి మీడియాకు విడుదల చేస్తుంది. విపక్షనేత జగన్‌ను ఆశీర్వదించి ప్రసాదం అందజేసిన ఫొటోలను టీటీడీ కనీసం విడుదల చేయకపోవడం గమనార్హం. ప్రొటోకాల్ లేని పారిశ్రామికవేత్తలు, సినీ రంగం వారికి ఇచ్చిన గౌరవం కూడా టీటీడీ ప్రతిపక్ష నేతకు ఇవ్వకపోవడం దారుణమని అన్ని వర్గాలూ విమర్శిస్తున్నాయి. 'ఎవరి ఒత్తిడి వల్ల ఇలా చేశారోగానీ విపక్ష నేత విషయంలో ఇలా వివక్ష చూపడం తప్పిదమే. అధికార పార్టీ పెద్దలు చెప్పిన పనులు చేయడం, ఆ పార్టీ నేతలు చెప్పే అంశాలకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వడం సాధారణమే. అత్యున్నత సర్వీసుకు చెందిన ఐఏఎస్ అధికారులు సైతం విచక్షణ మరచి పాలకుల ముందు మోకరిల్లుతూ గౌరవాన్ని కోల్పోయేలా వ్యవహరించడం సరికాదు. ఇలా బాస్‌ల అడుగులకు మడుగులొత్తుతూ సంప్రదాయాలను కాలరాయడం వల్ల ఐఏఎస్‌లపై గౌరవం సన్నగిల్లుతోంది' అని సీనియర్ ఐఏఎస్ అధికారులు వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై బయటి వ్యక్తులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనిస్టు నేత శివరామిరెడ్డి కన్నుమూత

- హైదరాబాద్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు
- తొలితరం రాజకీయ నేతగా గుర్తింపు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి, అమరావతి: కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు, వైఎస్సార్ జిల్లా కమలాపురం మాజీ ఎమ్మెల్యే నర్రెడ్డి శివరామిరెడ్డి (97) చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. గతవారం తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రిలో చేరిన శివరామిరెడ్డికి గుండె సంబంధిత శస్త్రచికిత్స జరిగింది. ఈ నేపథ్యంలో గురువారం శివరామిరెడ్డి బ్రెయిన్‌డెడ్‌కు గురికావడంతో ఆయనను ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తుండగా, శుక్రవారం ఉదయం కన్నుమూశారు. ప్రజల సందర్శనార్థం శుక్రవారం ఉదయం 8.45 నుంచి సాయంత్రం 3 గంటల వరకు శివరామిరెడ్డి మృతదేహాన్ని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12లోని ఆయన కుమార్తె సజ్జల భగీరథి నివాసంలో ఉంచారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతులు, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, ఏపీ ఏఐటీయూసీ కార్యదర్శి గుజ్జుల ఓబులేశు, సీపీఐ వైఎస్సార్ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య పార్టీ జెండాను శివరామిరెడ్డి భౌతికాయంపై ఉంచి విప్లవ జోహార్లు అర్పించారు. ప్రఖ్యాత జర్నలిస్టు ఏబీకే ప్రసాద్ అక్కడికి చేరుకొని ఎన్‌ఎస్ కుటుంబీకులను ఓదార్చారు. అనంతరం సాయంత్రం 3 గంటల తర్వాత శివరామిరెడ్డి భౌతికకాయన్ని ప్రత్యేక వాహనంలో అంతియాత్రగా మహాప్రస్థానం తీసుకెళ్లి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.



తొలితరం ప్రజాప్రతినిధి


వైఎస్సార్ జిల్లా గడ్డంవారిపల్లెలో 1922 ఫిబ్రవరి 25న పుట్టిన నర్రెడ్డి శివరామిరెడ్డి (ఎన్‌ఎస్).. స్వాతంత్ర్య సమరయోధుడిగా, కమ్యూనిస్టు నాయకుడిగా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చట్టసభకు ఎన్నికైన తొలితరం ప్రజాప్రతినిధుల్లో ఆయన ఒకరు. 1952లో కమలాపురం– పులివెందుల ఉమ్మడి నియోజకవర్గం సీపీఐ ఎమ్మెల్యేగా శివరామిరెడ్డి ఎన్నికయ్యారు. గతంలో సీపీఐ కడప జిల్లా కార్యదర్శిగా, సీపీఐ రాష్ట్ర నేతగా ఆయన పని చేశారు. రైతులోకం, అరుణోదయ పత్రికలకు సంపాదకుడిగా పనిచేశారు. 2000 ఫిబ్రవరి 1 నుంచి సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఉంటూ నీలం రాజశేఖర్‌రెడ్డి, వైవీ కృష్ణారావుల అభినందన సంచికల సంపాదకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. 'సాక్షి'తో పాటు పలు పత్రికలకు వ్యాసాలు రాసి గుర్తింపు పొందారు. ఎన్‌ఎస్‌లేని లోటు తీర్చలేనిదని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వైఎస్ జగన్ సంతాపం

మాజీ ఎమ్మెల్యే శివరామిరెడ్డి మృతి పట్ల ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. శివరామిరెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

నిరసనలు.. నిలదీతలు..!

- లోకేష్ సహా మంత్రులకు తప్పని సెగ
- సమాధానం చెప్పలేక మధ్యలోనే వెళ్లిపోయిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు
- ముగిసిన జన్మభూమి–మాఊరు
- తంతు ముగిసిందంటూ ఊపిరి పీల్చుకున్న అధికారులు



సాక్షి, అమరావతి: ప్రజా అవసరాలు, కనీస సదుపాయాలు కల్పించలేని సభలు ఎందుకంటూ జనం నిలదీతలు, నిరసనలు, పోలీసుల అడ్డుకట్టలు, రకరకాల ఆంక్షల మధ్య జన్మభూమి–మాఊరు కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈనెల రెండో తేదీ నుంచి పది రోజుల పాటు ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. అయితే గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. ఎప్పుడో.. ఏవేవో చేస్తామని మభ్యపెట్టడం కోసమే ఈ కార్యక్రమం చేపట్టారంటూ చాలా చోట్ల ఆరంభం నుంచే ఈ సభలను జనం స్తంభింపజేశారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, రైతు రథాలు (రైతులకు ట్రాక్టర్లు), వ్యవసాయ పరికరాలు లాంటి సంక్షేమ పథకాలకు అధికార పార్టీ వారినే ఎంపిక చేస్తూ తటస్థులు, విపక్ష సానుభూతి పరులు, కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నతీరుపై తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వం పచ్చ చొక్కాల వారి కోసమే పనిచేస్తున్నప్పుడు.. ఈ సభలు ఎందుకంటూ తూర్పుగోదావరి జిల్లాలో మంత్రి లోకేష్‌ను మహిళలు నిలదీశారు. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూపై ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించడంతో ఆయన సమాధానం చెప్పలేకపోయారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు నియోజకవర్గంలో జన్మభూమి గ్రామసభలో సమస్యలపై నిలదీస్తారనే భయంతో వైఎస్సార్‌సీపీ అభిమానులను దగ్గరకు రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఇదే జిల్లాలోని మైలవరం నియోజకవర్గంలోనూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించారు. సమస్యలను ప్రస్తావిస్తే పోలీసులతో బెదిరించారు. తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీ నేతల అవినీతిపై విచారణ చేయమని కోరిన దళితులను బెదిరించారంటూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూపై కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ భూములను అన్యాయంగా లాక్కున్నారని జన్మభూమి గ్రామసభలో మొరపెట్టుకున్నందుకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్ అక్కడి వారిని అంతుచూస్తానంటూ బెదిరించారు. పోలీసులతో అరెస్టు చేయించారు. ఇవి మచ్చుకు కొన్ని ఘటనలు మాత్రమే. పోలీసు రక్షణ కవచం మధ్య అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు వెళ్లి వచ్చారు. ప్రజలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పుకోలేక తాము అవస్థలు పడాల్సివచ్చిందని అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు.

సర్కారు గణాంకాలివీ..

పది రోజుల జన్మభూమి–మాఊరు కార్యక్రమం కింద శుక్రవారం సాయంత్ర 7 గంటల వరకు అందిన సమాచారం మేరకు 5,25,219 అర్జీలు అందాయని ప్రభుత్వానికి చెందిన రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ప్రకటించింది. పశ్చిమ గోదావరి జిల్లాలో అత్యధికంగా 72,115, వైఎస్సార్ కడప జిల్లాలో అతి తక్కువగా 19,157 వినతులు వచ్చాయని తెలిసింది. మొత్తం వినతుల్లో 29,018 పరిష్కరించారని, 42,370 వివిధ కారణాల వల్ల తిరస్కరించినట్లు ఆర్టీజీఎస్ పేర్కొంది.

ఎక్కడ అభివృద్ధి?

- మంత్రి లోకేష్‌కు తూర్పుగోదావరి జిల్లా కట్టమూరులో చుక్కెదురు
- అభివృద్ధి చేశామంటూ ప్రసంగిస్తుండగా అడ్డుకున్న గ్రామ మహిళలు
- అర్ధాంతరంగా సమావేశం ముగించి వెనుదిరిగిన లోకేశ్



కట్టమూరులో లోకేష్‌ను నిలదీస్తున్న మహిళలు

పెద్దాపురం: అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వంలోనే సాధ్యమంటూ ప్రసంగిస్తున్న రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు చుక్కెదురైంది. తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం మండలం కట్టమూరులో శుక్రవారం రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించిన ఆయన.. ఉప ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధ్యక్షతన జరిగిన సభలో ప్రసంగించారు. గ్రామాభివృద్ధికి మంత్రి చినరాజప్ప కృషి చేస్తున్నారని, ప్రజా సంక్షేమం, అభివృద్ధి తమ ప్రభుత్వంలోనే సాధ్యపడుతుందని చెబుతుండగా.. గ్రామానికి చెందిన ఘట్టం సత్యవేణి, మహాలక్ష్మి తదితరులు లేచి ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు. 'లేదు లేదు. ఎక్కడ అభివృద్ధి? మా గ్రామంలో ఎక్కడా రోడ్లు, డ్రెయిన్లు, సరైన మంచినీటి వసతి లేదు' అంటూ నిలదీశారు. దీంతో అవాక్కైన మంత్రి లోకేష్, చినరాజప్పలు.. మీ గ్రామంలో రూ.10 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. దీనిపై ''ఎక్కడ.. చూపించండి. మా ఐదో వార్డులో ఇప్పటికీ సరైన రోడ్డు వ్యవస్థ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సరైన మంచినీటి వసతి కూడా లేదు' అంటూ ప్రజలు అరుపులు, కేకలు వేశారు. దీంతో.. 'చేస్తాం.. తప్పనిసరిగా అన్ని రోడ్లూ పూర్తి చేస్తాం' అంటూ మంత్రి లోకేశ్ తన ప్రసంగాన్ని అర్ధాంతరంగా ముగించి వెనుదిరిగారు.

సోషల్ మీడియా పోస్టులను ఆపలేం

- ప్రైవేటు వ్యక్తులు చేసే వ్యాఖ్యలను ఎలా ఆపగలం
- ఎన్నికల రోజుకు 48 గంటల ముందు ప్రచారాలపై నిషేధం ఉంది
- బాంబే హైకోర్టుకు కేంద్ర ఎన్నికల సంఘం వివరణ

ముంబై: ఎన్నికల రోజుకు 48 గంటల ముందు ఏదైనా రాజకీయ పార్టీకి అనుగుణంగా లేదా వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రైవేటు వ్యక్తులు చేసే పోస్టులు, వ్యాఖ్యలను తాము నిరోధించలేమని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) బొంబాయి హైకోర్టుకు స్పష్టం చేసింది. సోషల్ మీడియా వేదికగా రాజకీయ చర్చ, పెయిడ్ కంటెంట్‌ను ఆపేలా ఈసీఐని ఆదేశించాలని సాగర్ సూర్యవంశి అనే న్యాయవాది బాంబే హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నరేశ్ పాటిల్, న్యాయమూర్తి జస్టిస్ ఎన్ఎం జామ్‌దార్‌లు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఈసీఐ తరపు న్యాయవాది ప్రదీప్ రాజగోపాల్ మాట్లాడుతూ.. ఎన్నికల రోజుకు 48 గంటల ముందు రాజకీయ పార్టీలు, నేతలు ఎలాంటి ప్రచారం, ప్రకటనలపై నిషేధం విధిస్తూ ఇప్పటికే పలు నిబంధనలు ఉన్నాయని కోర్టుకు తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 126 ఇదే విషయాన్ని చెబుతోందని వివరించారు. ఎలక్ట్రానిక్ మీడియాలో, సోషల్ మీడియాలో కూడా ఎలాంటి ప్రకటనలు చేయొద్దన్న నిబంధన కూడా ఉందని చెప్పారు. అయితే ఎవరైనా వ్యక్తి బ్లాగ్‌లో కానీ, ట్విటర్‌లో కానీ వ్యక్తిగతంగా ఏదైనా పార్టీని పొగడటం కానీ, వ్యతిరేకంగా వ్యాఖ్యలు కానీ చేస్తే ఎన్నికల కమిషన్ వారిని ఆపలేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది అభినవ్ చంద్రచూడ్ వాదనలు వినిపిస్తూ.. ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ప్రకటనలకు సంబంధించి అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో పాలసీలు ఉన్నాయని, ముందుగా వెరిఫికేషన్ చేసిన తర్వాతే వాటిని అనుమతిస్తారని వివరించారు.

టీడీపీ నేతల జులుం

- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాష్టీకం
- కృష్ణాజిల్లా జన్మభూమి సభల్లో ఉద్రిక్తత

సాక్షి, నెట్‌వర్క్: కృష్ణా జిల్లాలో శుక్రవారం జరిగిన జన్మభూమి గ్రామసభల్లో టీడీపీ నేతలు రెచ్చిపోయారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జులుం ప్రదర్శించారు. తీవ్రంగా దుర్భాషలాడడమేగాక భౌతిక దాడులకు సైతం ప్రయత్నించారు. దీంతో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు సైతం టీడీపీ నేతలకు వత్తాసు పలుకుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అడ్డుకున్నారు. జిల్లాలోని ఉయ్యూరు మండలం పెద ఓగిరాల జన్మభూమి సభకు హాజరయ్యేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి, ఇతర నాయకులను ఊరి మొదట్లోనే పోలీసులు అడ్డుకున్నారు. తర్వాత సభ నుంచి వెళుతున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వారిపై దుర్భాషలకు దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. ఆగ్రహంతో ఊగిపోయిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకులపై రాళ్లు రువ్వారు. మరోవైపు మైలవరం గ్రామసభలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై మంత్రి దేవినేని ఉమా అనుచరులు భౌతిక దాడులకు దిగారు. సమస్యలు తెలిపేందుకు వస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వసంత వెంకట కృష్ణప్రసాద్‌పై దాడులకు యత్నించారు. పోలీసులు సైతం టీడీపీకి వంతపాడారు. విలేకరులను సైతం ఏఎస్ఐ దుర్భాషలాడారు. దాడులకు నిరసనగా కార్యక్రమానికి వెళ్లకుండా బోసు బొమ్మ సెంటర్లో వసంత ధర్నా నిర్వహించారు. గన్నవరం సభలో ప్రభుత్వ అధికారి అయిన ఎంపీడీఓ మళ్లీ చంద్రబాబును గెలిపించాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది.



వైఎస్సార్‌సీపీ నేత పార్థసారథిని అడ్డుకుంటున్న ఉయ్యూరు సీఐ

పౌరసత్వం దిశగా హెచ్1బీ



తగు సంస్కరణలు చేస్తాం: ట్రంప్

వాషింగ్టన్: విధాన ప్రక్రియలో సరళత్వం, స్థిర నివాసానికి సంబంధించి కచ్చితమైన హామీతో పాటు పౌరసత్వానికి వీలు కల్పించేలా హెచ్1బీ వీసా విధానంలో త్వరలో సమూల సంస్కరణలు తీసుకురాబోతున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. సమర్థత కలిగిన, అత్యంత నైపుణ్యవంతులు అమెరికాలో ఉద్యోగాలు చేయడాన్ని ప్రోత్సహించేలా కొత్త నిబంధనలు ఉంటాయన్నారు. 'హెచ్–1బీ వీసాదారులు నిశ్చింతగా ఉండొచ్చు. పౌరసత్వం, స్థిర నివాసం సహా మీకు ప్రయోజనం కల్పించే పలు మార్పులు త్వరలోనే రాబోతున్నాయి. ప్రతిభావంతులను మేం ప్రోత్సహించాలనుకుంటున్నాం' అని శుక్రవారం ట్వీట్ చేశారు. హెచ్1బీ వీసాపై అమెరికాలో ఉంటున్నవారిలో అధికులు భారతీయ ఐటీ నిపుణులే కావడం గమనార్హం. ట్రంప్ ప్రకటన అమెరికా గ్రీన్ కార్డ్ కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న వేలాది భారతీయులకు శుభవార్తేనని భావిస్తున్నారు. ట్రంప్ అధికారం చేపట్టాక తొలి రెండేళ్ల పాటు హెచ్–1బీ నిబంధనలను కఠినతరం చేయాలని పట్టుబట్టడం తెలిసిందే. అయితే ఇటీవలి కొద్ది కాలంగా ప్రతిభ ఆధారిత వలస విధానాన్ని తాము ప్రోత్సహిస్తామనీ, మిగతా వలసలను బాగా తగ్గిస్తామని ట్రంప్ చెబుతున్నారు. హెచ్–1బీ వీసాకు దరఖాస్తు చేసుకున్న వాళ్లలో అత్యుత్తములనే ఎంపిక చేసేలా ప్రభుత్వం కృషి చేయాలని గత నెలలో హోం ల్యాండ్ సెక్యూరిటీ విభాగ మంత్రి కిర్‌స్టెన్ నీల్సెన్ చట్టసభ్యులకు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వీసా మోసాలను గుర్తించి నిరోధించేందుకు ట్రంప్ ప్రభుత్వం చర్యలను ముమ్మరం చేసిందనీ, అమెరికన్ ఉద్యోగుల హక్కులను కాపాడాలంటే వలసయేతర వీసాల్లో సంస్కరణలు అవసరమన్నారు.

భారతీయ వీసాదారుల హర్షం

ట్రంప్ ప్రకటనపై పలువురు భారతీయ హెచ్–1బీ వీసాదారులు హర్షం వ్యక్తం చేశారు. 'మాకు ఆశ కనిపిస్తోంది ప్రెసిడెంట్ సర్. కొండలా పేరుకుపోయిన గ్రీన్‌కార్డు దరఖాస్తులను మీరు త్వరగా పరిష్కరిస్తే అదే మాకు సంతోషం. అప్పుడు మీరే పది లక్షల మంది భవిష్యత్ పౌరులకు నిర్వివాదంగా నాయకులవుతారు' అని అమెరికాలో పనిచేస్తున్న జ్యోత్స్న శర్మ అనే ఓ భారతీయ ఉద్యోగిని ట్వీట్ చేశారు. చట్టబద్ధ వలసదారులమైన తాము అమెరికా ఆర్థికవ్యవస్థ బలోపేతానికి ఎంతో సహకరిస్తున్నామని మనోజ్ అనే మరో టెకీ ట్వీట్ చేశారు. ట్రంప్ మాటలు నిజమైతే మంచిదేగానీ ఇప్పటి నుంచే ఆశలు పెట్టుకోవద్దని ఒబామా కాలంలో హెచ్–1బీ అధికారిగా పనిచేసిన ఒకరు హెచ్చరించారు.

గోడను అడ్డుకుంటే ఎమర్జెన్సీనే!

ట్రంప్ హెచ్చరిక


రోనిల్ సోదరుడితో ట్రంప్ కరచాలనం

వాషింగ్టన్: మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి ట్రంప్ తన ప్రయత్నాల్ని ముమ్మరం చేశారు. కాంగ్రెస్ అనుమతి లేకుండానే ఇందుకు అవసరమైన నిధులు పొందడానికి జాతీయ అత్యవసర పరిస్థితి విధించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. గోడ నిర్మాణానికి 5.6 బిలియన్ డాలర్లు మంజూరు చేయాలని ట్రంప్ ప్రభుత్వం కోరగా డెమొక్రాట్లు అడ్డుపడిన సంగతి తెలిసిందే. గోడ నిర్మాణ ప్రణాళికలకు మద్దతు కూడగట్టేందుకు ట్రంప్ టెక్సస్‌లో పర్యటించారు. అత్యవసర పరిస్థితి ప్రకటించే అవకాశాలపై మీడియా ప్రశ్నించగా..ఆ దిశగా ఆలోచిస్తున్నామని సమాధానమిచ్చారు.

గోడకు రోనిల్ సోదరుడి మద్దతు..

ఇటీవల అక్రమ వలసదారుడి చేతిలో హత్యకు గురైన భారత సంతతి పోలీసు అధికారి రోనిల్ రాన్ సింగ్ సోదరుడు రెగ్గీ సింగ్..ట్రంప్ గోడ నిర్మాణ ప్రతిపాదనకు మద్దతిచ్చారు. తమ కుటుంబం మాదిరిగా ఇతరులు బాధపడకూడదంటే సరిహద్దును పటిష్టపరచాలని అన్నారు. టెక్సాస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రెగ్గీ సింగ్.. ట్రంప్ పక్కనే కూర్చుని కాసేపు ముచ్చటించారు. 'నా సోదరునిలా మరో పోలీసు అధికారి బలికావొద్దు. ఈ ముప్పును తగ్గించడానికి ఏం చేయాలో చేయండి. మా కుటుంబం మద్దతుగా నిలుస్తుంది' అని ట్రంప్‌తో రెగ్గీ అన్నారు.

మీడియానే ప్రతిపక్షం..

'సరిహద్దుల్లో ఏం జరుగుతుందో చెప్పడానికి ప్రయత్నిస్తుంటే డెమొక్రాట్లు వినడం లేదు. అక్కడ కృత్రిమ సంక్షోభం ఉందని కొత్తగా చెబుతున్నారు. నకిలీ మీడియా సంస్థల సృష్టే ఇది. వారు ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తున్నారు' అని సరిహద్దు భద్రత, వలసలపై టెక్సాస్‌లో జరిగిన సమావేశంలో ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఆర్మీ డబ్బులతో గోడ నిర్మాణం?

ఆర్మీ కోర్ ఇంజినీర్ల విభాగంలో నిరుపయోగంగా ఉన్న నిధులతో గోడ నిర్మాణం చేపట్టాలని ట్రంప్ యోచిస్తున్నట్లు తెలిసింది. గోడ నిర్మాణానికి కాంట్రాక్టులు కుదుర్చుకోవడానికి ఎంత సమయం పట్టొచ్చు? నిర్మాణం 45 రోజుల్లో ప్రారంభించొచ్చా? అనే విషయాలు తేల్చాలని ఆర్మీ కోర్‌ను ట్రంప్ ఆదేశించారు. మరోవైపు, కాంగ్రెస్ అనుమతి లేకుండానే నిధులు పొందేందుకు ట్రంప్ జాతీయ అత్యవసర పరిస్థితి ప్రకటిస్తే ఏం చేయాలని డెమొక్రాట్లు, రిపబ్లికన్లు యోచిస్తున్నారు. ట్రంప్ ఎమర్జెన్సీ విధిస్తే ఆ నిర్ణయాన్ని కోర్టులో సవాలు చేయడానికి ఉన్న అవకాశాలను ప్రతిపక్ష డెమొక్రాటిక్ నాయకత్వం పరిశీలిస్తోంది.

మోదీ ఓ ఎద్దు.. స్మృతి బలిష్టమైన ఆవు

ఆర్‌ఎల్డీ అధినేత అజిత్‌సింగ్ నోటి దురుసు



మథుర: రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్‌ఎల్డీ) అధినేత అజిత్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి, కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీని ఆయన ఎద్దు–దూడ–బలిష్టమైన ఆవుగా అభివర్ణించారు. ఉత్తరప్రదేశ్‌లోని కోసీకలాన్‌లో రైతులతో చర్చ కార్యక్రమంలో మాట్లాడుతూ..'తప్పుడు వ్యక్తిని ప్రధానిగా ఎన్నుకుంటే ఐదేళ్ల తర్వాత మార్చగలిగే హక్కు ప్రజలకు ఉండటం నిజంగా ప్రజాస్వామ్యం గొప్పతనమే. మీ ఆవులు, ఎద్దులు, దూడలు ఈ మధ్య విచ్చలవిడిగా తిరుగుతున్నాయని వార్తాపత్రికల్లో చూస్తున్నాను. వాటిని మీరు స్కూళ్లు, కాలేజీ భవనాల్లో కట్టేస్తున్నారు. ప్రజలేమో వాటిని మోదీ–యోగి అని పిలుస్తున్నారు. మరికొందరేమో బాగా బలిష్టమైన ఆవు ఒకటి వచ్చిందని చెబుతున్నారు. స్మృతీ ఇరానీ కూడా ఈ మధ్య బాగా తిరుగుతున్నారు' అని అజిత్ సింగ్ వ్యాఖ్యానించారు.

సీబీఎస్‌ఈ 'గణితం'లో రెండు పేపర్లు

2020, మార్చి నుంచి అమలు

న్యూఢిల్లీ: పరీక్షల వేళ విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్‌ఈ) కీలక నిర్ణయం తీసుకుంది. గణితం పరీక్షను స్టాండర్డ్, బేసిక్ అని రెండు విభాగాలుగా విడగొట్టి నిర్వహిస్తామని సీబీఎస్‌ఈ ప్రకటించింది. విద్యార్థులు తమ సామర్థ్యానికి అనుగుణంగా కఠినంగా ఉండే గణితం–స్టాండర్డ్ లేదా సులభంగా ఉండే గణితం–బేసిక్ పేపర్‌ను ఎంచుకోవచ్చు. 2020 మార్చి నుంచి దీన్ని అమల్లోకి తీసుకొస్తారు. ఈ 2 పేపర్లకు సంబంధించి పాఠ్యాంశాలు, బోధన, అంతర్గత మదింపులో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొంది.

సైక్లింగ్ @ 1.8లక్షల కోట్లు!

న్యూఢిల్లీ: సైకిల్ తొక్కడం నామోషీగా భావించొద్దు.. సైకిల్ తొక్కితే ఆరోగ్యానికే కాదు, దేశానికీ మేలే అని ఓ అధ్యయనం తేల్చింది. ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్(టెరి) సంస్థ 'బెనిఫిట్స్ ఆఫ్ సైక్లింగ్ ఇన్ ఇండియా: యాన్ ఎకనామిక్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ సోషల్ అసెస్‌మెంట్' పేరుతో నిర్వహించిన అధ్యయనం పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. స్వల్ప దూరాలకు ప్రయాణించే వారు ద్విచక్ర వాహనాలు, కార్లు బదులు సైకిల్ వాడటం వల్ల దేశానికి ఏడాదిలో రూ.1.80 లక్షల కోట్ల మేర ఆదా అవుతుందని అంచనా వేసింది. ఈ మొత్తం 2015–16 సంవత్సరంలో దేశ జీడీపీలో 1.6 శాతానికి సమానమని తెలిపింది. సైకిల్ వాడకం పెరిగితే ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ స్థలం కొరత, కాలుష్యం బెడద ఉండవని పేర్కొంది. సైకిళ్ల విక్రయాలు పెంచేందుకు రూ.5వేల లోపు ఖరీదు చేసే వాటిపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని కోరింది.

జర్నలిస్ట్ కేసులో డేరా బాబా దోషే



పంచకుల: 16 ఏళ్ల క్రితం జరిగిన హత్య కేసులో డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌తో పాటు మరో ముగ్గురు దోషులుగా తేలారు. ఈ మేరకు పంచకుల ప్రత్యేక సీబీఐ కోర్టు జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు. ఇద్దరు మహిళా భక్తురాళ్లపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఇప్పటికే 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న గుర్మీత్ జైలు నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరయ్యారు. దోషులకు శిక్షను ఈ నెల 17న ఖరారు చేయనున్నారు. దీంతో హరియాణాలోని డేరా ఆశ్రమం పరిసరాల్లో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. డేరా ఆశ్రమంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దోపిడీని వివరిస్తూ గుర్తుతెలియని వ్యక్తి రాసిన లేఖ 2002 అక్టోబర్‌లో 'పూరా సచ్' అనే పత్రికలో ప్రచురితమైంది. ఆ తర్వాత అదే పత్రికలో పనిచేస్తున్న రామ్‌చందర్ ఛత్రపతి అనే పాత్రికేయుడిని తుపాకీతో కాల్చి చంపేశారు.

21 నుంచి ప్రవాసీ భారతీయ దివస్

న్యూఢిల్లీ: 15వ ప్రవాసీ భారతీయ దివస్ వేడుకలు ఈ నెల 21–23 మధ్య వారణాసిలో జరగనున్నాయి. 22న జరిగే ప్రారంభ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. అంతకుముందు, జనవరి 21న యూత్ ప్రవాసీ భారతీయ దివస్‌ను నిర్వహించనున్నారు. చివరి రోజున రాష్ట్రపతి కోవింద్ ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డును ప్రదానం చేస్తారు. విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ చెప్పారు. ప్రవాసులకు వారణాసి ప్రజలు తమ ఇళ్లల్లోనే ఆతిథ్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు.

మందిర నిర్మాణం తథ్యం

కాంగ్రెస్ వల్లే జాప్యం

- వచ్చే ఎన్నికలు సాంస్కృతిక జాతీయ వాదానికి, విపక్ష అధికార దాహానికి మధ్యనే
- బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశంలో అమిత్ షా



బీజేపీ జాతీయ మండలి సమావేశం వేదికపై అమిత్ షా. చేతిలో కమలంతో మోదీ

న్యూఢిల్లీ, సాక్షి ప్రతినిధి: అయోధ్యలో రామ మందిరం నిర్మించి తీరుతామని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా స్పష్టం చేశారు. అయితే, కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు కల్పిస్తోందని మండిపడ్డారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలు దేశ చరిత్రను మలుపు తిప్పిన మూడో పానిపట్ యుద్ధం వంటివన్నారు. ఈ ఎన్నికలు బీజేపీ సాంస్కృతిక జాతీయ వాదానికీ, ప్రతిపక్షాల అధికార దాహానికి మధ్యనే జరగనున్నాయని తెలిపారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో శుక్రవారం ఆయన బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించి, ప్రసంగించారు. 'అయోధ్యలో తొందరగా రామ మందిర నిర్మాణాన్ని చేపట్టాలని పార్టీ పట్టుదలతో ఉండగా కాంగ్రెస్ అడ్డంకులు కల్పిస్తోంది. అయితే, బీజేపీ రామ మందిరాన్ని నిర్మించి తీరుతుంది' అని అన్నారు. మందిర నిర్మాణంపై కాంగ్రెస్ పార్టీ తన వైఖరేంటో స్పష్టం చేయాలని అమిత్ షా డిమాండ్ చేశారు. 'ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ, అద్భుతమైన, పారదర్శక, కష్టపడి పనిచేసే నేత బీజేపీకి ఉన్నారు. 1987 నుంచి ఆయన ఓటమి ఎరుగని నాయకుడు. ప్రతిపక్షంలో ఆయనకు సరితూగగల నేత లేరు. మోదీ మాదిరిగా మరెవ్వరూ స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేరు' అని పేర్కొన్నారు.

వారంలో రెండు కీలక నిర్ణయాలు

మోదీ ప్రభుత్వం ఈ వారంలో రెండు కీలక నిర్ణయాలు తీసుకుందని అమిత్ చెప్పారు. ఒకటి.. జనరల్ కేటగిరీలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం. రెండోది జీఎస్టీ మినహాయింపు పరిమితిని పెంచడం. జనరల్ కేటగిరీలో రిజర్వేషన్ల ద్వారా కోట్లాది మంది యువత ఆకాంక్షలను ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు. దీంతోపాటు వస్తు సేవల పన్ను(జీఎస్టీ) పరిమితిని రెట్టింపు చేస్తూ రూ.40 లక్షలకు పెంచుతూ జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించారు. దీని ప్రకారం రూ.40 లక్షల వరకు టర్నోవర్ ఉన్న చిన్న వ్యాపారులకు జీఎస్టీ నుంచి ప్రభుత్వం మినహాయింపు కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా రూ.1.5 కోట్ల టర్నోవర్ ఉన్న వారు 1 శాతం పన్ను చెల్లించేలా జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుందని ప్రకటించారు. అక్రమాలకు పాల్పడిన నీరవ్ మోదీ, విజయ్ మాల్యా, మెహుల్ చోక్సీవంటి వారు కాంగ్రెస్ హయాంలో దేశం విడిచి ఎందుకు పారిపోలేదు? కాంగ్రెస్ దేశంలో అవినీతిని ఎలా పెంచి పోషించిందో దీన్నిబట్టి స్పష్టమవుతుంది అని వ్యాఖ్యానించారు. బీజేపీ హయాంలోనే ఈ ఆర్థిక నేరగాళ్లంతా ఎందుకు పారిపోయారు? ప్రధాని మోదీ చౌకీదార్ మాదిరిగా ఇలాంటి వారిని ఉపేక్షించబోరని అన్నారు.రైతులకు అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తున్న మోదీ సర్కారును 'రైతు హిత' ప్రభుత్వంగా పేర్కొంటూ బీజేపీ జాతీయ కౌన్సిల్ ఒక తీర్మానం ఆమోదించింది. దీంతోపాటు గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మరో తీర్మానం చేసింది. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ప్రారంభమైన బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశానికి ఎన్నికైన ప్రజాప్రతినిధులు, వివిధ హోదాల్లోని పార్టీ నేతలు కలిపి 14వేల మంది వరకు హాజరయ్యారు.

మోదీకి, మిగతా వారికి మధ్యనే పోటీ

ప్రధాని మోదీని ఓడించాలనే చౌకబారు ఎత్తుగడతోనే మహా కూటమి ఏర్పడుతోందనీ, ఈ కూటమికి ఒక విధానం కానీ, నాయకుడు గానీ లేరని అమిత్ అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేసిన మోదీ మళ్లీ అధికారంలోకి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. 'వచ్చే సాధారణ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య పోరాటంగా సాగనున్నాయి. సాంస్కృతిక జాతీయ వాదం, పేదల అభ్యున్నతే బీజేపీ పార్టీ లక్ష్యం కాగా, ప్రతిపక్షాలు అధికారమే పరమావధిగా ఏకమవుతున్నాయి' అని పేర్కొన్నారు. 'కూటమిలోని పార్టీలన్నీ 2014 ఎన్నికల్లో బీజేపీ చేతిలో ఓటమి పాలైనవే. ఉత్తరప్రదేశ్‌లో ఈసారి బీజేపీ 2014 ఎన్నికల్లో కంటే ఎక్కువ స్థానాలు సాధించడం ఖాయం' అని విశ్వాసం వ్యక్తం చేశారు.

2021 డిసెంబర్‌లో 'గగన్‌యాన్'!

ఇస్రో చైర్మన్ డాక్టర్ శివన్ వెల్లడి



సాక్షి, బెంగళూరు: దేశ అంతరిక్ష చరిత్రలో మైలురాయిగా నిలవనున్న మానవ సహిత అంతరిక్ష ప్రయోగం 'గగన్‌యాన్' ప్రాజెక్టును డిసెంబర్ 2021లోగా చేపట్టే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఇస్రో చైర్మన్ డాక్టర్ శివన్ వెల్లడించారు. గగన్‌యాన్ ప్రాజెక్టు ద్వారా పంపే ముగ్గురు వ్యోమగాముల్లో భారతీయులే ఉండే అవకాశం ఉందని, వీరిలో ఒక మహిళా వ్యోమగామిని కూడా పంపనున్నట్లు తెలిపారు. వీరిలోనే భారత వాయుసేనకు చెందిన వ్యక్తి కూడా ఉండనున్నట్లు చెప్పారు. శుక్రవారం బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో మీడియాతో శివన్ మాట్లాడారు. 2021లో చేపట్టే మానవసహిత అంతరిక్ష ప్రయోగాని కంటే ముందే డిసెంబర్ 2020–జూలై 2021 మధ్య మానవ రహిత మిషన్లను ప్రయోగించనున్నట్లు పేర్కొన్నారు. మానవసహిత అంతరిక్ష ప్రయోగం కోసం ఇస్రోకు రూ.9,023 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం లభించినట్లు చెప్పారు. గగన్‌యాన్‌కు సంబంధించి వ్యోమగాములకు భారత్‌లోనే శిక్షణ ఇస్తామని చెప్పారు. ముఖ్య శిక్షణ రష్యా లేదా ఇతర దేశాల్లో ఇప్పించాలని యోచిస్తున్నారు.

ఏప్రిల్‌లో చంద్రయాన్–2

ప్రతిష్టాత్మక చంద్రయాన్–2 ప్రయోగాన్ని ఏప్రిల్ నెలలో చేపట్టేందుకు ఇస్రో ఏర్పాట్లు చేస్తున్నట్లు శివన్ శుక్రవారం తెలిపారు. ముందుగా చంద్రుడిపైకి చంద్రయాన్–2ను ఈ ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరి 16 తేదీల మధ్యలో పంపుతామని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పలు పరీక్షలు పూర్తికాకపోవడం వల్ల ప్రయోగ తేదీని వాయిదా వేసినట్లు తెలిపారు. 10 ఏళ్ల కిందట చేపట్టిన చంద్రయాన్–1కు ఆధునిక రూపమైన చంద్రయాన్–2ను రూ.800 కోట్ల వ్యయంతో చేపట్టారు. చంద్రయాన్–2 రోవర్ ద్వారా చంద్రుడిపై వాతావరణాన్ని పరీక్షిస్తామని శివన్ తెలిపారు. చంద్రయాన్–2 నౌక చంద్రుడి దక్షిణ ధ్రువంలో దిగేలా తొలిసారి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మరో 3 నెలల్లో ఇస్రో టీవీని తీసుకొస్తామని తెలిపారు. ఇస్రో టీవీ ద్వారా సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యవసాయం తదితర అంశాలను ప్రసారం చేస్తామని చెప్పారు. 2020 జనవరిలో అంతర గ్రహ గగన యానానికి సంబంధించిన ఆదిత్య ఎల్–1 ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో జీశ్యాట్–20 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపిస్తామని చెప్పారు.

కాంగ్రెస్ లేకుండానే ఎస్పీ, బీఎస్పీ కూటమి



లక్నో: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో తలపడేందుకు కలిసి పోటీ చేయాలని ఉత్తరప్రదేశ్‌లోని సమాజ్ వాదీ పార్టీ(ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)లు నిర్ణయించుకున్నాయి. అయితే, ఎంతో కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ లేకుండానే ఈ కూటమి రూపుదాల్చనుండటం గమనార్హం. కూటమి ఏర్పాటును ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి నేడు లక్నోలోని ఓ హోటల్‌లో జరిగే ఉమ్మడి మీడియా సమావేశంలో అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ విషయాన్ని ధ్రువీకరించిన అఖిలేశ్.. కాంగ్రెస్‌ను కలుపుకుని పోవడంపై సమాధానం దాటవేశారు. తమ కూటమిని చూసి బీజేపీతోపాటు కాంగ్రెస్ భయపడుతున్నాయన్నారు. ఈ రెండు పార్టీలు యూపీలోని 80 స్థానాల్లో చెరి 37 సీట్లలో పోటీ చేయాలని భావిస్తున్నాయి. బీజేపీ నియంతృత్వ పాలనకు ముగింపు పలకడమే ప్రతిపక్షాల లక్ష్యం కావాలి. కానీ, మమ్మల్ని వదిలేసి కూటమి ఏర్పాటు చేయడం చాలా ప్రమాదకరమైన పొరపాటు' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి అన్నారు. కాంగ్రెస్‌కు అమేథీ, రాయ్‌బరేలీ సీట్లను మాత్రమే వదిలివేసేందుకు ఎస్పీ, బీఎస్పీ నిర్ణయించుకున్నట్లు వచ్చిన వార్తలపై యూపీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాజీవ్ బక్షి స్పందించారు. యూపీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా బరిలోకి దిగేందుకు సైతం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎస్పీ, బీఎస్పీ కూటమిలో చేరే విషయమై ఆర్‌ఎల్‌డీ అధ్యక్షుడు అజిత్ సింగ్ స్పందించారు. తాము ఆరు సీట్లు కోరుతున్నామనీ, చర్చలు సాగుతున్నాయని తెలిపారు.

మీ 'మన్‌కీ బాత్' చెప్పండి!

దుబాయ్‌లో భారతీయ కార్మికులతో రాహుల్



దుబాయ్: యూఏఈ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న భారతీయ కార్మికుల కృషిని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ ప్రశంసించారు. దుబాయ్‌లోని జబెల్ అలీ లేబర్ కాలనీలో సమావేశంలో భారతీయ కార్మికులతో రాహుల్ మాట్లాడారు. 'నా మనసులో మాట(మన్ కీ బాత్) చెప్పేందుకు రాలేదు. మీరు పడుతున్న కష్టాలను మీ ద్వారానే తెలుసుకుని సాయం చేద్దామని వచ్చా' అంటూ మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. 'ఇక్కడ భారీగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. పెద్ద ఎయిర్‌పోర్టులు, మెట్రో స్టేషన్లు, ఆకాశ హర్మ్యాల నిర్మాణం వంటివి మీ సహకారం లేనిదే సాధ్యం కాదు. ఈ నగరం అభివృద్ధికి మీ స్వేదం, రక్తం ధారపోస్తున్నారు. ప్రతి రాష్ట్రం, ప్రతి మతం, ప్రతి కులం ఖ్యాతిని మీరు చాటుతున్నారు. మీ కృషి భారతీయులను గర్వపడేలా చేస్తోంది' అంటూ వారిపై ప్రశంసలు కురిపించారు.

వర్మ అవినీతిపై ఆధారాలున్నాయనే!

సీబీఐ చీఫ్ తొలగింపుపై జస్టిస్ సిక్రీ వివరణ తీసుకున్న జస్టిస్ కట్జూ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సిక్రీ, లోక్‌సభలో విపక్ష నేత ఖర్గేల అత్యున్నత కమిటీ సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి ఆలోక్ వర్మను తొలగిస్తూ తీసుకున్న నిర్ణయానికి సంబంధించి సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ మార్కండేయ కట్జూ ఒక ఆసక్తికర అంశాన్ని ఫేస్‌బుక్‌లో పోస్ట్‌చేశారు. వర్మను తొలగించే ప్రతిపాదనకు ఎందుకు మద్దతిచ్చావని శుక్రవారం ఉదయమే ఫోన్ చేసి జస్టిస్ సిక్రీని తాను ప్రశ్నించానని, అందుకు ఆయన సమాధానమిచ్చారని కట్జూ చెప్పారు. వర్మపై వచ్చిన తీవ్రమైన అవినీతి ఆరోపణలకు సంబంధించి సీవీసీ వద్ద కచ్చితమైన ఆధారాలున్నాయని, అవి చూశాకే.. విచారణ ముగిసేవరకు సీబీఐ డైరెక్టర్ పదవిలో వర్మ కొనసాగడం సరికాదని తాను భావించినట్లు జస్టిస్ సిక్రీ వివరించారని కట్జూ వెల్లడించారు వర్మ వివరణ తీసుకున్నాకే సీవీసీ ఆ నివేదిక రూపొందించిన విషయాన్ని జస్టిస్ సిక్రీ చెప్పారన్నారు. ఈ విషయాన్ని బహిర్గతం చేసేందుకు ఆయన నుంచి తాను అనుమతి తీసుకున్నానన్నారు. అయితే, సీబీఐ చీఫ్‌గా వర్మను తప్పించిన తీరును తాను వ్యతిరేకిస్తున్నానని జస్టిస్ కట్జూ స్పష్టం చేశారు. సీబీఐ చీఫ్‌గా తొలగించే ముందు వర్మ వివరణ ఎందుకు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. 'సాధారణంగా, సస్పెండ్ చేసే ముందు కూడా సంబంధిత వ్యక్తి నుంచి వివరణ తీసుకున్నాకే చర్య తీసుకుంటారు. వర్మను సస్పెండ్ చేయలేదు.. డిస్మిస్ చేయలేదు. కేవలం సమాన హోదా కలిగిన పోస్ట్‌కు బదిలీ చేశారు' అని జస్టిస్ కట్జూ గుర్తు చేశారు. వర్మను సీబీఐ చీఫ్‌గా తొలగించే ప్రతిపాదనను ఖర్గే వ్యతిరేకించారు.

ఆస్థానాకు ఢిల్లీ హైకోర్టు షాక్

ఎఫ్‌ఐఆర్ కొట్టేసేందుకు నో



న్యూఢిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాకు ఓ అవినీతి కేసులో ఢిల్లీ హైకోర్టు షాక్ ఇచ్చింది. హైదరాబాద్ వ్యాపారి సతీశ్ సానా ఫిర్యాదు మేరకు నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని ఆస్థానా దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. ఆస్థానాపై క్రిమినల్ విచారణ జరపకుండా, అరెస్ట్ చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఉపసంహరించుకుంది. ఆస్థానాతో పాటు సీబీఐ డీఎస్పీ దేవేందర్, మధ్యవర్తి మనోజ్ ప్రసాద్‌లపై దాఖలైన ఎఫ్‌ఐఆర్‌ను రద్దుచేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి వజీరీ మాట్లాడుతూ.. ఆస్థానా, కుమార్‌లను విచారించేందుకు, అరెస్ట్ చేసేందుకు ఇకపై కోర్టు అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కేసు విచారణను 10 వారాల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీబీఐ అప్పటి డైరెక్టర్ ఆలోక్ వర్మపై చేసిన అభియోగాలకు తగిన ఆధారాల్లేవని అభిప్రాయపడ్డారు. ఓ కేసులో తనకు ఊరట కల్పించేందుకు ఆస్థానా లంచం తీసుకున్నారని సతీశ్ సానా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా సీబీఐ స్పెషల్ డైరెక్టర్ హోదాను దుర్వినియోగం చేస్తూ తనను వేధించారని, దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని అందులో ఆరోపించారు. దీంతో ఆస్థానాపై అవినీతి నిరోధక చట్టంలోని నేరపూరిత కుట్ర, అవినీతి, నేరపూరిత దుష్ప్రవర్తన తదితర సెక్షన్ల కింద సీబీఐ అధికారులు కేసు నమోదుచేశారు. మరోవైపు ఈ తీర్పును ఆస్థానా సుప్రీంకోర్టులో సవాలు చేసే అవకాశముంది.

ఆలోక్ పదవీ విరమణ

- ఉద్యోగానికి గుడ్‌బై చెప్పిన ఉద్వాసనకు గురైన సీబీఐ చీఫ్
- అగ్నిమాపక శాఖలో చేరబోను
- అబద్ధపు ఆరోపణలపై బదిలీ చేశారని ఆవేదన



న్యూఢిల్లీ: అగ్నిమాపక శాఖలో తాను పనిచేయబోవడం లేదనీ, తనను ఇక పదవీ విరమణ పొందినట్లుగా గుర్తించాలని సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి ఉద్వాసనకు గురైన ఆలోక్‌వర్మ కేంద్ర సిబ్బంది విభాగానికి తెలియజేశారు. తాను ఇప్పటికే పదవీవిరమణ వయసును దాటిపోయినందున ఇక తనను రిటైర్ అయినట్లుగానే భావించాలని ఆయన కోరారు. 2017 జూలై 31 నాటికి ఆలోక్ వర్మ పదవీ విరమణ వయసుకు చేరుకున్నారు. అయితే ఆయన అప్పటికే సీబీఐ చీఫ్‌గా నియమితులై ఉండటం, ఆ పదవీకాలం నిర్దిష్ట రెండేళ్లు కావడంతో ఇప్పటివరకు కొనసాగారు. అత్యున్నత స్థాయి ఎంపిక కమిటీ ఆయనను సీబీఐ డైరెక్టర్‌గా తప్పించి అగ్నిమాపక శాఖ డీజీగా బదిలీ చేయడం తెలిసిందే. తనను అబద్ధపు ఆరోపణలపై బదిలీ చేశారనీ, అవి కూడా తన విరోధి అయిన ఒకే ఒక్క వ్యక్తి దురుద్దేశంతో చేసిన ఆరోపణలు తప్ప ఇతరులెవరూ తనను వేలెత్తి చూపలేదని వర్మ ఉద్ఘాటించారు. సీబీఐ డైరెక్టర్ పదవికి ఆలోక్ వర్మను సుప్రీంకోర్టు మళ్లీ నియమించిన రెండ్రోజుల్లోనే, అత్యున్నత స్థాయి త్రిసభ్య ఎంపిక కమిటీ ఆయనను 2:1 ఆధిక్యంతో ఆ పదవి నుంచి తప్పించి, అగ్నిమాపక సేవల డీజీగా బదిలీ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత తొలిసారి ఆయన మౌనం వీడుతూ గురువారం రాత్రి పీటీఐకి ఓ ప్రకటన పంపారు. 'సీబీఐ దేశంలోనే అత్యున్నత దర్యాప్తు సంస్థల్లో ఒకటి. దాని స్వతంత్రతను కాపాడాలి. బయటి శక్తుల ప్రమేయం లేకుండా అది పనిచేయాలి. సీబీఐని నాశనం చేయడానికి కొందరు చూస్తున్నప్పుడు, ఆ సంస్థ నిజాయితీని, ప్రతిష్ఠను కాపాడేందుకు నేను ప్రయత్నించాను. నాకు వ్యతిరేకంగా ఉన్న ఒకే ఒక్క వ్యక్తి చేసిన అబద్ధపు ఆరోపణలపై నన్ను బదిలీ చేయడం బాధాకరం' అని వర్మ వాపోయారు. ప్రధాని నరేంద్ర మోదీ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిక్రీ, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేల అత్యున్నత స్థాయి ఎంపిక కమిటీ ఆలోక్‌ను పదవి నుంచి బదిలీ చేసింది. ఖర్గే కూడా ఆలోక్ బదిలీని వ్యతిరేకిస్తూ ఆయన వాదన వినాలని పట్టుబట్టినా, మోదీ, జస్టిస్ సిక్రీ కలిసి ఆలోక్‌ను బదిలీ చేశారు.

మళ్లీ బదిలీలన్నీ రద్దు

గురువారం రాత్రి మళ్లీ సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.నాగేశ్వర రావు, సంస్థలో అంతకుముందు ఆలోక్ వర్మ చేసిన బదిలీలన్నింటినీ రద్దు చేశారు. గతేడాది అక్టోబర్‌లో నాగేశ్వరరావు డైరెక్టర్ బాధ్యతలు స్వీకరించగానే, ఆగమేఘాల మీద పలువురు అధికారులను బదిలీ చేశారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు తర్వాత మళ్లీ బాధ్యతలు చేపట్టిన ఆలోక్‌వర్మ ఆ బదిలీలన్నింటినీ రద్దు చేయడం తెలిసిందే. తాజాగా, మళ్లీ నాగేశ్వరరావుకు బాధ్యతలు వచ్చాక, ఆలోక్ వర్మ ఇచ్చిన బదిలీ ఉత్తర్వులను అన్నింటినీ రద్దు చేశారు.

ప్రభుత్వం రాజకీయ బుల్లెట్లు పేలుస్తోంది

ప్రభుత్వం సీబీఐని బలహీనపరుస్తోందనీ, సీవీసీ భుజాల నుంచి రాజకీయ బుల్లెట్లను పేలుస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రభుత్వంతో కలిసి రాజ్యాంగాన్ని సీవీసీ ఉల్లంఘిస్తోందంది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ మాట్లాడుతూ ఊహలు, వాదనల ఆధారంగా సీవీసీ ఇచ్చిన నివేదికను అనుసరించి సీబీఐ డైరెక్టర్‌గా ఆలోక్ వర్మను తొలగించడాన్ని తాము ఖండిస్తున్నామని తెలిపారు. అయితే రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి మాత్రం సంబంధిత పత్రాలు సమర్పించినా సీవీసీ స్పందించడం లేదని ఆరోపించారు.

సాక్షి బిజినెస్
శనివారం 12-1-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం రాత్రి 11.30)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
97 ▼	27 ▼
36,010	10,794

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	6,970	▼ 15
డోజోన్స్	23,949	▼ 52
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,918	▼ 25
డాక్స్	10,887	▼ 34
షాంఘై	2,554	▲ 19
నిక్కాయ్	20,360	▲ 196

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	69.65	71.29
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	88.28	91.43
€	యూరో	ఎస్‌బీఐ	79.75	82.7
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	63.84	66.29
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.63	51.86
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	51.21	53
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.45	20.55
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.4	11.1

మరి అమెజాన్ పరిస్థితేంటి?



- బెజోస్ విడాకులతో కంపెనీ భవితపై నీలినీడలు
- కంపెనీ మీద నియంత్రణాధికారాలపై సందేహాలు
- అత్యంత సంపన్నురాలిగా మారనున్న మెకంజీ
- బిల్‌గేట్స్ తరవాత రెండోస్థానంలోకి జెఫ్ బెజోస్

న్యూయార్క్: అమెరికా ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ విడాకుల వ్యవహారం కంపెనీ భవితవ్యంపై సందేహాలను రేకెత్తిస్తోంది. దాదాపు 136 బిలియన్ డాలర్ల బెజోస్ సంపదను భార్యాభర్తలిద్దరూ ఎలా పంచుకుంటారు? కంపెనీలో బెజోస్ భార్య మెకంజీకి కూడా ఆయనతో సమానంగా వాటా లభిస్తుందా? ఒకవేళ లభిస్తే... అమెజాన్ నిర్వహణపై ఆ ప్రభావాలు ఎలా ఉండొచ్చు? అన్న అంశాలు ప్రస్తుతం చర్చనీయమయ్యాయి. అమెజాన్ వ్యవస్థాపకుడు బెజోస్‌కి ఇప్పుడు కంపెనీలో 16 శాతం వాటాలున్నాయి. దీని ప్రకారం ఆయన సంపద విలువ 136 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని అంచనా. విడాకుల సెటిల్మెంట్ కింద భార్యకు సగం సంపద ఇచ్చిన పక్షంలో బెజోస్‌కి అమెజాన్‌లో ఎనిమిది శాతం వాటా మాత్రమే మిగులుతుంది.

సామరస్యంగానే ఉంటే..

విడాకుల విషయంలో ఇద్దరూ సామరస్యంగానే ఉన్న నేపథ్యంలో.. జెఫ్, మెకంజీలు తమ షేర్లను ఉమ్మడిగా ఏదైనా ట్రస్ట్‌లో ఉంచడం ద్వారా కంపెనీపై నియంత్రణాధికారాలు కోల్పోకుండా జాగ్రత్తపడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మరో రకంగా .. మెకంజీ తన ఓటింగ్ హక్కులను జెఫ్‌కి బదలాయించవచ్చని.. అయితే, ప్రస్తుతం ఆయన మైనారిటీ షేర్‌హోల్డరే కనక దీనివల్ల పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చని వారు చెబుతున్నారు. వాటాలపరమైన ఓటింగ్ హక్కులతో కాకుండా కంపెనీ వ్యవస్థాపకుడి హోదా కారణంగానే జెఫ్.. అమెజాన్‌ను నడిపించగలుగుతున్నారనేది విశ్లేషకుల అభిప్రాయం. ఒకవేళ కంపెనీని కాపాడుకోవాలంటే.. సంస్థ నిర్వహణపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడకుండా.. మరేదైనా రూపంలో మెకంజీకి వాటాలు ఇచ్చే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

విభేదాలు తలెత్తితే..

ఒకవేళ బెజోస్ విడాకుల వ్యవహారం వివాదాస్పదమైన పక్షంలో ఇటు స్టాక్ మార్కెట్ పరంగానూ అటు పబ్లిక్ రిలేషన్స్ పరంగానూ అమెజాన్ కంపెనీ భవితపై కచ్చితంగా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందనే మరో వాదన కూడా వినవస్తోంది. దీనితో లాయర్లు అత్యధికంగా ప్రయోజనం పొందవచ్చని కెస్లర్ అండ్ సోలోమియాని లీగల్ సంస్థ పార్ట్‌నర్ రాండల్ కెస్లర్ పేర్కొన్నారు.

అత్యంత సంపన్నురాలిగా మెకంజీ

దాదాపు పాతికేళ్ల దాంపత్య బంధానికి ఫుల్‌స్టాప్ పెడుతూ జెఫ్ బెజోస్ (54), మెకంజీ (49) విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. లారెన్ సాంచెజ్ అనే మాజీ న్యూస్ యాంకర్‌కి, బెజోస్‌కి మధ్య అఫైర్ నడుస్తుండటం ఇందుకు కారణం. విడాకులతో మెకంజీకి.. జెఫ్ బెజోస్ ఆస్తిలో సగం వాటాలు దక్కే అవకాశం ఉంది. దీని విలువ భారత కరెన్సీలో రూ. 4.5 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. దీంతో ఈ విడాకుల డీల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైనదిగా ఉండనుంది. విడాకులతో మెకంజీ ప్రపంచంలోనే అత్యంత సంపన్నురాలిగా మారతారు. అదే సమయంలో ప్రస్తుతం నంబర్ వన్ స్థానంలో ఉన్న జెఫ్ బెజోస్ సంపద సగానికి తగ్గిపోవడంతో మైక్రోసాఫ్ట్ బిల్‌గేట్స్ తర్వాత రెండో స్థానానికి పరిమితం కావొచ్చు.

జీఎస్టీ పరిధిలోని వర్తకులకు బీమా

- రాయితీతో రుణాలు కూడా
- కేంద్ర ప్రభుత్వం పరిశీలన



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం పలు వర్గాలను ఆకట్టుకునే చర్యలను ఒక్కొక్కటిగా ముందుకు తీసుకొస్తోంది. జీఎస్టీ పరిధిలోని చిన్న వ్యాపారుల కోసం ఓ బీమా పథకాన్ని ప్రవేశపెట్టే ప్రతిపాదనను తాజాగా పరిశీలిస్తోంది. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన తరహాలోనే, ప్రమాద బీమా కవరేజీని ఈ పథకం కింద వర్తకులకు అందించనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం వర్తకుల కోసం అమలు చేస్తున్న పథకం దీనికి ఆధారమని ఆ వర్గాలు తెలియజేశాయి. ఈ పథకం కింద చిన్న వర్తకులకు రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా లభించవచ్చని తెలిపాయి. ప్రభుత్వ ఆమోదం లభిస్తే ఈ నెలాఖరులో బడ్జెట్ సమావేశాలకు ముందు దీనిపై ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్రధానమంత్రి సురక్షా బీమా పథకం కింద ప్రస్తుతం రూ.2 లక్షల ప్రమాద బీమాను ఏడాదికి రూ.12 ప్రీమియానికే కేంద్ర ప్రభుత్వం ఆఫర్ చేస్తోంది. 18– 70 ఏళ్ల వయసు వారికి, సేవింగ్స్ బ్యాంకు ఖాతాలుంటే ఈ బీమా కవరేజీని పొందే అవకాశాన్ని కేంద్రం కల్పించింది. ఇక తమ వ్యాపారాన్ని అప్‌గ్రేడ్ చేసుకునేందుకు, కంప్యూటరైజేషన్ చేసుకునేందుకు ముందుకు వచ్చే వ్యాపారులకు రాయితీతో రుణాలివ్వాలన్న ప్రతిపాదనను కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. మహిళా వ్యాపారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక విధానాన్ని తీసుకురావచ్చని అధికార వర్గాలు తెలిపాయి. ఈ వర్గాలకు అధిక వడ్డీ రాయితీలు కూడా ఇవ్వొచ్చని పేర్కొన్నాయి. ప్రభుత్వం కొనుగోళ్లలో కొంత శాతాన్ని మహిళా వ్యాపారుల నుంచే తీసుకునేలా రిజర్వ్ చేసే అవకాశం కూడా ఉందని తెలిపాయి.

ఇన్ఫీ అంచనాలు మిస్..!

- క్యూ3లో లాభం 30 శాతం డౌన్
- రూ.3,610 కోట్లకు పరిమితం
- 20 శాతం పెరిగి రూ.21,400 కోట్లకు ఆదాయం
- రూ.4 స్పెషల్ డివిడెండ్



ఫలితాలను ప్రకటిస్తున్న ఇన్ఫీ సీఈఓ సలిల్ పారేఖ్(మధ్య వ్యక్తి)

న్యూఢిల్లీ: రికార్డు లాభాలతో దేశీ ఐటీ దిగ్గజం టీసీఎస్ మూడో త్రైమాసిక ఫలితాల (క్యూ3) సీజన్‌కు శుభారంభాన్నివ్వగా.. రెండో అతి పెద్ద ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ మాత్రం అంచనాలు అందుకోలేకపోయింది. శుక్రవారం ప్రకటించిన ఆర్థిక ఫలితాల ప్రకారం ఆదాయం 20 శాతం ఎగిసినప్పటికీ ... నికర లాభం 30 శాతం క్షీణించింది. మరోవైపు, రూ.8,260 కోట్లతో రెండోసారి షేర్ల బైబ్యాక్ ప్రణాళికతో పాటు షేరుకి రూ. 4 చొప్పున ప్రత్యేక డివిడెండ్ చెల్లించనున్నట్లు ఇన్ఫీ ప్రకటించింది. స్థిర కరెన్సీ ప్రాతిపదికన వార్షికంగా చూస్తే రెండంకెల స్థాయిలో 10.1 శాతం మేర క్యూ3లో వృద్ధి సాధించినట్లు ఇన్ఫోసిస్ సీఈవో, ఎండీ సలిల్ పరేఖ్ తెలిపారు. 'చాలా మటుకు విభాగాలన్నీ మెరుగ్గా రాణిస్తున్నాయి. భారీ డీల్స్ దక్కించుకున్నాం. మరిన్ని కుదుర్చుకోనున్నాం. ఇవన్నీ మరింత ధీమానిస్తున్నాయి' అని ఆయన పేర్కొన్నారు. ఫలితాలు వివరంగా చూస్తే..

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికం ఆర్థిక ఫలితాలు వివరంగా చూస్తే.. నికర లాభం 30 శాతం క్షీణించి రూ. 3,610 కోట్లకు పరిమితమైంది. 2017–18 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో ఇది రూ. 5,129 కోట్లు. అటు ఆదాయం 20.3 శాతం పెరిగి రూ. 17,794 కోట్ల నుంచి రూ. 21,400 కోట్లకు చేరింది. మార్కెట్ వర్గాలు నికర లాభం రూ. 4,115 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేశాయి. కీలకమైన డిజిటల్ వ్యాపార విభాగం 33.1 శాతం వృద్ధి సాధించింది.
- సీక్వెన్షియల్‌గా చూస్తే.. నికర లాభం 12 శాతం క్షీణించింది. సెప్టెంబర్ క్వార్టర్‌లో ఇది రూ. 4,110 కోట్లు. ఆదాయం 3.8 శాతం పెరిగింది. త్రైమాసికాల వారీగా చూస్తే.. రూపాయి మారకంలో ఆదాయం 3.8 శాతం పెరగ్గా, డాలర్ మారకంలో 2.3 శాతం వృద్ధి నమోదైంది.
- 2018–19కి సంబంధించిన గైడెన్స్‌ను కరెన్సీ విలువ స్థిరంగా ఉండే ప్రాతిపదికన 8.5–9 శాతానికి పెంచింది. ఇది 6–8 శాతంగా ఉండొచ్చని గతేడాది ఏప్రిల్‌లో కంపెనీ అంచనా వేసింది. ఇక తాజాగా ఆపరేటింగ్ మార్జిన్ గైడెన్స్ మాత్రం యథాతథంగా 22–24శాతంగా ఉంచింది. క్యూ3లో ఆపరేటింగ్ మార్జిన్ సుమారు 110 బేసిస్ పాయింట్లు క్షీణించి 22.6 శాతంగా నమోదైంది.
- డిసెంబర్ క్వార్టర్‌లో 1.57 బిలియన్ డాలర్ల డీల్స్ దక్కించుకుంది. మొత్తం మీద చూస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడు త్రైమాసికాల్లో 4.7 బిలియన్ డాలర్ల డీల్స్ సాధించినట్లవుతుంది. రెండో త్రైమాసికంలో ఇన్ఫీ 2 బిలియన్ డాలర్ల కాంట్రాక్టులు దక్కించుకుంది.
- బయోకాన్ చీఫ్ కిరణ్ మజుందార్–షాను లీడ్ ఇండిపెండెంట్ డైరెక్టరుగా మరోసారి నియమించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. రెండో దఫా పదవీకాలం 2019 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి దాకా ఉంటుంది. కొత్త సీఎఫ్‌వోగా నీలాంజన్ రాయ్ మార్చి 1 నుంచి బాధ్యతలు చేపడతారు.
- సీఈవో సలిల్ పరేఖ్‌కు రూ. 3.25 కోట్ల విలువ చేసే షేర్లు కేటాయించడానికి బోర్డు ఆమోదం తెలిపింది.
- వివాదాస్పదమైన పనయాతో పాటు మరో రెండు అనుబంధ సంస్థలైన స్కావా, కాలిడస్ కొనుగోలుకు ఏ సంస్థా ముందుకు రాకపోవడంతో వీటి విక్రయ ప్రతిపాదనలను ఉపసంహరించుకున్నట్లు ఇన్ఫీ తెలిపింది. ఈ ఏడాది మార్చికల్లా వీటి విక్రయం పూర్తి కాకపోవచ్చన్న అంచనాతో.. వాటికి సంబంధించిన తరుగుదల మొదలైనవి కూడా క్యూ3 ఫలితాల్లో చేర్చినట్లు పేర్కొంది.

డివిడెండ్‌కు రూ. 2,107 కోట్లు..

షేరు ఒక్కింటికి రూ.4 ప్రత్యేక డివిడెండ్ చెల్లింపుల కోసం ఇన్ఫీ సుమారు రూ.2,107 కోట్లు వెచ్చించనుంది. దీనికి రికార్డు తేదీ జనవరి 25 కాగా, చెల్లింపు తేదీ జనవరి 28. గతేడాది జూన్‌లో చెల్లించిన రూ. 2,633 కోట్ల డివిడెండ్‌తో పాటు తాజా స్పెషల్ డివిడెండ్, బైబ్యాక్ ఆఫర్ కూడా కలిపితే ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో నిర్దేశించుకున్నట్లుగా మొత్తం రూ.13,000 కోట్ల మేర షేర్‌హోల్డర్లకు చెల్లించినట్లవుతుందని ఇన్ఫీ తెలిపింది. 2019 జనవరి 9 నాటికి ఇన్ఫీలో ప్రమోటర్లు, ప్రమోటర్ల గ్రూప్‌నకు 12.82% వాటాలు ఉన్నాయి.

బైబ్యాక్ రేటు @ రూ. 800..

ఇన్ఫోసిస్ మరోసారి షేర్ల బైబ్యాక్ ప్రకటించింది. దేశీ ఎక్స్ఛేంజీల్లో ఓపెన్ మార్కెట్ మార్గంలో కొనుగోలు జరిపే షేర్లకు సంబంధించి ఒక్కో షేరుకు గరిష్టంగా రూ. 800 ధర నిర్ణయించింది. రూ.8,260 కోట్లతో షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనకు కంపెనీ బోర్డు ఆమోదముద్ర వేసింది. దీనికింద 10.32 కోట్ల ఈక్విటీ షేర్లను కొనుగోలు చేయనుంది. ఇది 2018 డిసెంబర్ 31 నాటికి కంపెనీ పెయిడ్ క్యాపిటల్‌లో సుమారు 2.36 శాతంగా ఉంటుంది. అమెరికన్ డిపాజిటరీ షేర్లను (ఏడీఎస్) కూడా షేర్‌హోల్డర్లు.. ఈక్విటీ షేర్ల కింద మార్చుకుని, దేశీ ఎక్స్ఛేంజీల్లో బైబ్యాక్ ఆఫర్లో పాల్గొనవచ్చని ఇన్ఫీ తెలిపింది. దీనికి సంబంధించిన విధివిధానాలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది. ఇన్ఫోసిస్ 2017 డిసెంబర్‌లో తొలిసారి బైబ్యాక్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పట్లో షేరు ఒక్కింటికి రూ. 1,150 చొప్పున మొత్తం 11.3 కోట్ల షేర్లను బైబ్యాక్ చేసింది. ఇందుకోసం రూ.13,000 కోట్లు వెచ్చించింది. మూడు దశాబ్దాల కంపెనీ చరిత్రలో తొలిసారిగా ప్రకటించిన షేర్ల బైబ్యాక్‌లో వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణ మూర్తి కుమారుడు రోహన్ మూర్తి, క్రిష్ గోపాలకృష్ణన్ భార్య సుధా గోపాలకృష్ణన్ మొదలైన వారితో పాటు ఎల్ఐసీ కూడా షేర్లను విక్రయించింది.

శుక్రవారం బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేరు 0.58 శాతం లాభంతో రూ. 683.70 వద్ద ముగిసింది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెల్లడయ్యాయి.

'ఫ్యూచర్' వ్యాపారం.. రూ. 40కే భోజనం!

డోర్‌డెలివరీ కూడా... బియానీ ప్రకటన



పంజాబ్: ఆహారోత్పత్తుల వ్యాపారంలోకి ఫ్యూచర్ గ్రూప్ అడుగుపెడుతోంది. భోజనప్రియులకు సరసమైన ధరలకే నోరూరించే వంటకాలను అందించేందుకు సిద్ధమవుతున్నట్లు ఫ్యూచర్ గ్రూప్ వెల్లడించింది. సొంత వంటశాలలను ఏర్పాటు చేసి.. ఇక్కడ నుంచి రూ.40కే భోజనం, రూ.10కే రెండు సమోసాలను అందించే దిశగా నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ సీఈఓ కిషోర్ బియానీ తెలియజేశారు. ఫ్యూచర్‌పే యాప్ ద్వారా కస్టమర్లకు ఆహారాన్ని అందిస్తామని వెల్లడించిన ఆయన.. హోటల్ ఏర్పాటు లేదని, కేవలం డోర్ డెలివరీలు మాత్రమే ఉంటాయని స్పష్టంచేశారు. 'తథాస్తు' పేరిట యాప్‌లో ప్రత్యేక ప్లాట్‌ఫాం ఏర్పాటుచేయడం ద్వారా ఈ సేవలను ప్రారంభించనున్నామని తెలిపారు. తమ బ్రాండ్ బియ్యం, గోధుమ పిండి వినియోగం పెంచడంలో ఈ క్లౌడ్ కిచెన్ కాన్సెప్ట్ సహకరించనుందన్నారు. 'ఇప్పటివరకు ఫ్యాషన్‌పైన దృష్టి సారించాం. ఇక నుంచి ఆహార వ్యాపారంపై ఫోకస్ పెంచుతున్నాం. దీర్ఘకాలంలో ఈ విభాగం ద్వారా 50–60 శాతం అమ్మకాలను అంచనావేస్తున్నాం' అని వెల్లడించారు.

20 నుంచి అమెజాన్ మళ్లీ 'గ్రేట్ ఇండియన్ సేల్'



న్యూఢిల్లీ: ఈ–కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి 'గ్రేట్ ఇండియన్ సేల్'ను ప్రకటించింది. జనవరి 20–23 వరకు ఈ సేల్ ఉంటుందని వెల్లడించింది. స్మార్ట్‌ఫోన్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, కిచెన్, ఉపకరణాలు, రోజువారీ అత్యవసరాలకు సంబంధించిన అనేక పాపులర్ బ్రాండ్లపై భారీ డిస్కౌంట్లు ఉండనున్నట్లు తెలిపింది. ఆఫర్ కాలంలో అత్యంత వేగమైన డెలివరీలు, రిటర్న్ పాలసీలు ఉంటాయని ప్రకటించింది.

సైకిల్ పరిశ్రమ ప్రోత్సాహానికి కేంద్రం ప్రత్యేక కమిటీ...



న్యూఢిల్లీ: సైకిల్ తయారీ పరిశ్రమను ప్రోత్సహించడం, ఈ పరిశ్రమ ఎగుమతులు పెరిగేలా చూడటం కోసం ఒక ప్రత్యేక కౌన్సిల్‌ను ఏర్పాటు చేసినట్లు వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి సురేష్ ప్రభు వెల్లడించారు. ఇక బాటసారుల కోసం రోడ్లకు ఇరువైపులా ప్రత్యేక కాలినడక మార్గాలను ఏర్పాటు చేసిన మాదిరిగా.. సైకిల్‌పై ప్రయాణించే వారికి కూడా ఇదే విధంగా మార్గాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. నగరాల్లో ఈ నిర్మాణం జరగడం వల్ల అటు ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు జరుగుతుందని ఇక్కడ ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.

ఈ ఏడాది సాయం 4.5 బిలియన్ డాలర్లు

- దీన్లో 3.5 బిలియన్ డాలర్లు ప్రభుత్వానికి
- మరో బిలియన్ డాలర్లు ప్రయివేటు రంగానికి... భారత్‌పై ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రకటన
- రైతు రుణ మాఫీ సరైన పరిష్కారం కాదని అభిప్రాయం



న్యూఢిల్లీ: భారత్‌కు ఇచ్చే నిధుల సాయాన్ని 2019లో 4.5 బిలియన్ డాలర్ల(రూ.31,500 కోట్లు)కు పెంచనున్నట్టు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) ప్రకటించింది. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇది 7.6 శాతానికి పెరుగుతుందని అంచనా వేసింది. పెట్టుబడుల వృద్ధికి తోడు, జీఎస్టీ స్థిరపడటంతో ఆదాయాలు పెరుగుతాయన్న అంచనాల మేరకు ఈ గణాంకాలను ప్రకటించింది. ''భారత్‌కు 2019లో నిధుల సాయాన్ని 4.5 బిలియన్ డాలర్లకు పెంచనున్నాం. ఇందులో 3.5 బిలియన్ డాలర్లు భారత ప్రభుత్వానికి, మరో బిలియన్ డాలర్లు ప్రైవేటు రంగానికి ఇవ్వనున్నాం'' అని ఏడీబీ ఇండియా డైరెక్టర్ కెనిచి యోకోయమ శుక్రవారం ఢిల్లీలో మీడియాకు తెలిపారు. 2018లో భారత్‌కు 3.03 బిలియన్ డాలర్ల సార్వభౌమ రుణాలు ఇచ్చేందుకు కట్టుబడినట్టు చెప్పారు. ఓ ఏడాదిలో ఇదే గరిష్టమన్నారు. దీనికి అదనంగా ప్రైవేటు రంగానికి 557 మిలియన్ డాలర్ల రుణాలిచ్చినట్టు తెలిపారు. ప్రాజెక్టుల సంసిద్ధతపై నిధుల సాయం ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.

వృద్ధి పుంజుకుంటుంది...

కేంద్ర ప్రభుత్వ గణాంకాల విభాగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.2 శాతం జీడీపీ వృద్ధి రేటు నమోదవుతుందని అంచనా వేయగా, ఏడీబీ అంచనాలు 7.3 శాతంగా ఉన్నాయి. 2019–20లో వృద్ధి పుంజుకుంటుందని ఏడీబీ సీనియర్ ఎకనమిక్స్ అధికారి అభిజిత్‌సేన్ గుప్తా పేర్కొన్నారు. జీఎస్టీ అమలు, డీమోనిటైజేషన్ కారణంగా ఏర్పడిన సమస్యలు తొలగిపోయాయని, చమురు ధరల తగ్గుదల గృహ వినియోగాన్ని పెంచుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ద్రవ్యపరిమితులు, వాణిజ్య యుద్ధ ఆందోళనలు వృద్ధికి సవాళ్లుగా పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కరెంటు ఖాతా లోటు 2.5 శాతంగా ఉంటుందని ఏడీబీ అంచనా వేసింది.

ఆర్థిక సూత్రాలకు విరుద్ధం

వ్యవసాయ రుణాల మాఫీ అనేది ఆర్థిక సూత్రాలకు వ్యతిరేకమని, సాగు రంగంలో సంక్షోభానికి ఇది తగిన పరిష్కారం కాదని కెనిచి యోకోయమ అభిప్రాయపడ్డారు. లబ్ధిదారులకు నేరుగా నిధులను బదిలీ చేయడం వల్ల దుర్వినియోగం తగ్గుతుందన్నారు. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో రూ.1.47 లక్షల కోట్ల మేర వ్యవసాయ రుణాల బకాయిలు ఉండగా, వీటిని మాఫీ చేస్తున్నట్టు ఇటీవలే ప్రకటనలు వెలువడిన విషయం తెలిసిందే. కేంద్రం సార్వత్రిక కనీస ఆదాయ పథకాన్ని ఎంత సమర్థవంతంగా, ఏ రూపంలో అమలు చేయగలదన్న దానిపై అధ్యయనం చేయాల్సి ఉంటుందని యోకోయమ అన్నారు. ద్రవ్యలోటును ప్రభుత్వం చేరుకునే విషయంలో తమకు ఎటువంటి సందేహం లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతానికి కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యం విధించుకుంది.

14 నుంచి బంగారం బాండ్ల విక్రయం

గ్రాము బంగారం ధర రూ.3,214

ముంబై: సార్వభౌమ బంగారం బాండ్ల మలి విడత విక్రయం ఈ నెల 14న ప్రారంభం కానుంది. 18వ తేదీ వరకు కొనసాగుతుంది. ఓ గ్రాము బంగారం ధర రూ.3,214గా ఆర్‌బీఐ ఖరారు చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, డిజిటల్ రూపంలో చెల్లించే వారికి గ్రాము బంగారంపై రూ.50ను తగ్గింపు ఇవ్వనున్నట్టు తెలిపింది. దీంతో గ్రాము బంగారాన్ని రూ.3,614కే ఇవ్వనుంది. బ్యాంకులు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్, ఎంపిక చేసిన పోస్టాఫీసులు, ఎన్ఎస్ఈ, బీఎస్ఈ ద్వారా వీటిని కొనుగోలు చేయవచ్చు. ఒక వ్యక్తి ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా 500 గ్రాముల వరకు కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఉం ది. కనీస పెట్టుబడి ఒక గ్రాము. సార్వ భౌమ బంగారం బాండ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మొదటిసారిగా 2015 నవంబర్‌లో ప్రారంభించింది.



లోకల్ బ్రాండ్లకు.. 'పిక్ ఎన్ హుక్'

- వేగంగా ఉత్పత్తుల డెలివరీ
- స్థానిక బ్రాండ్లకే ఎక్కువ ప్రాధాన్యం
- కంపెనీ సీఈవో మోనిష్ పత్తిపాటి





హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అన్ని వస్తువులనూ విక్రయించే ఈ–కామర్స్ కంపెనీగా ఆరంభమైన హైదరాబాద్ కంపెనీ 'పిక్ ఎన్ హుక్'... ఇపుడు మిగతా చోట్ల దొరకని విభిన్న ఉత్పత్తుల విక్రయంపై దృష్టిపెట్టింది. తెలంగాణ చేనేత.. నిర్మల్ బొమ్మలు.. గద్వాల, ధర్మవరం, వెంకటగిరి చీరలు, కొండపల్లి బొమ్మల వంటి ప్రత్యేక వస్తువులను దేశవ్యాప్తంగా విక్రయించే ప్రయత్నాలు చేస్తోంది. మార్చి నుంచి ఈ వస్తువులన్నీ అందుబాటులోకి తెస్తున్న సందర్భంగా 'పిక్ ఎన్ హుక్' ఫౌండర్ సీఈఓ మోనిష్ పత్తిపాటి 'సాక్షి' స్టార్టప్ డైరీతో తన అనుభవాల్ని పంచుకున్నారు. అవి ఆయన మాటల్లోనే...

''స్థానికంగా ఉండి, సొంతంగా వ్యాపారం చేయాలన్నదే నా కల. అందుకు తగ్గట్టే నోయిడాలోని అమిటీ యూనివర్సిటీలో బీబీఏ పూర్తి చేశాక 2016లో 'పిక్ ఎన్ హుక్'ను ఆరంభించాం. రూ.కోటి పెట్టుబడితో మా నాన్నగారు ప్రసాద్ పత్తిపాటి సాయంతో ఆరంభించాం. ఆయనే చైర్మన్‌గా వెన్నంటి నడిపిస్తున్నారు. అనతికాలంలోనే లక్ష మందికిపైగా కస్టమర్లు వచ్చారు. 1,000కి పైగా వెండర్లు తమ ఉత్పత్తుల్ని మా ప్లాట్‌ఫామ్‌పై విక్రయిస్తున్నారు. మంచి ధర.. వేగంగా డెలివరీ అనే రెండంశాలే మా ప్రత్యేకత.

ఈ ఏడాది మార్చి నుంచి కొత్త రూపుతో రంగంలోకి దిగుతున్నాం. యాప్‌తో పాటు వెబ్‌సైట్‌కు కూడా మరిన్ని ఫీచర్లు జోడిస్తాం. ఉత్పత్తుల శ్రేణి పెంచుతున్నాం. ఫ్రాడ్ డెలివరీని నిలువరించి క్వాలిటీ చెక్ వ్యవస్థను పటిష్టం చేశాం. తద్వారా ఫిర్యాదులు అర శాతం లోపే ఉంటున్నాయి. ప్రొడక్టుల ధరను సెల్లర్లే నిర్ణయిస్తారు. ఇక నిధుల విషయానికి వస్తే ప్రస్తుతానికి సొంత వనరులే ఖర్చు చేస్తున్నాం. నిధుల సమీకరణ గురించి మార్చి చివరికల్లా ఒక స్పష్టత వస్తుంది. పోటీ ఎంతున్నా ఈ రంగంలో నిలదొక్కుకుంటామన్న ధీమా ఉంది. అందులో భాగంగానే తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక ఉత్పత్తుల్ని మా ప్లాట్‌ఫామ్‌పైకి తెస్తున్నాం. లోకల్ బ్రాండ్స్‌ను దేశ, విదేశాల్లో ప్రాచుర్యంలోకి తీసుకు రావాలన్న కృతనిశ్చయంతో ఉన్నాం'' అని మోనిష్ వివరించారు.

అద్భుతమైన స్టార్టప్‌ల గురించి అందరికీ తెలియజేయాలనుకుంటే startups@sakshi.com కు మెయిల్ చేయండి...

బిగ్ సీలో సంక్రాంతి ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ సీ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. శామ్‌సంగ్ గెలాక్సీ జే6, జే6 ప్లస్, ఏ7 మొబైల్స్‌పై అన్ని బ్యాంక్‌ల కార్డ్‌ల ద్వారా 10 శాతం క్యాష్ బ్యాక్, అన్ని వివో మోడల్స్‌పై సర్‌ప్రైజ్ గిఫ్ట్‌లను అందిస్తోంది. దీంతో పాటు ఒప్పో ఎఫ్9 ప్రొ కొంటే రైస్ కుక్కర్ ఉచితం, రూ.1,590 కార్బ న్‌కే3 బూమ్ మ్యాక్స్ సెల్‌ఫోన్‌పై రూ.2,500 విలువ గల ఫ్యాన్ ఉచితంగా అందుకోవచ్చని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఈ ఏడాది రూ.2,000 కోట్ల వ్యాపారం: లివ్‌ఫాస్ట్


గుర్‌ప్రీత్ సింగ్ భాటియా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పవర్ బ్యాకప్ సొల్యూషన్స్ కంపెనీ లివ్‌ఫాస్ట్ ఈ ఏడాది రూ.2,000 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా చేసుకుంది. 2018లో రూ.949 కోట్ల వ్యాపారం నమోదు చేసినట్టు కంపెనీ సీఈవో గుర్‌ప్రీత్ సింగ్ భాటియా శుక్రవారమిక్కడ మీడియాకు తెలిపారు. దేశవ్యాప్తంగా మార్చికల్లా 25,000 ఔట్‌లెట్ల ద్వారా ఉత్పత్తులను విక్రయించనున్నట్టు చెప్పారు. 'కొత్తగా ప్రవేశపెట్టిన మోడళ్లు 25 శాతం వేగంగా చార్జింగ్ అవడమేగాక 25 శాతం అదనపు బ్యాటరీ బ్యాకప్ ఇస్తాయి. 18 రకాల మోడళ్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. మోడల్‌నుబట్టి 15 నుంచి 60 నెలల దాకా వారంటీ ఉంది' అని వివరించారు.

ఎంఅండ్‌ఎంతో షెల్ లూబ్రికెంట్స్ జట్టు

హైదరాబాద్: మహీంద్రా అండ్ మహీంద్రాతో షెల్ లూబ్రికెంట్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. లూబ్రికెంట్ ఉత్పత్తులైన ఇంజన్ ఆయిల్స్, ట్రాన్స్‌మిషన్, యాక్సిల్ ఆయిల్స్, మాక్సిమైల్ బ్రాండ్ బ్రాండ్ ఉత్పాదనలను ఇరు సంస్థలు కలసి మార్కెటింగ్ చేయనున్నాయి. ఎంఅండ్‌ఎం డీలర్లు, మహీంద్రా స్పేర్స్‌ను విక్రయించే దుకాణాల ద్వారా పంపిణీ చేయనున్నారు.

తక్కువ పన్ను రేట్లతో నల్లధనం నిర్మూలన

హెచ్‌డీఎఫ్‌సీ వైస్ చైర్మన్ కేకి మిస్త్రీ



ముంబై: దేశంలో ప్రస్తుతం ఉన్న అధిక పన్ను రేట్లు దిగి రావాల్సిన అవసరం ఉందని... ఇది నల్లధనం ఉత్పత్తిని తగ్గించడంతోపాటు, ఆదాయాన్ని పెంచుతుందని హెచ్‌డీఎఫ్‌సీ వైస్ చైర్మన్ కేకి మిస్త్రీ అభిప్రాయపడ్డారు. అయితే, ఇప్పట్లో పన్ను రేట్లను తగ్గిస్తారని తాను ఆశించడం లేదని, సాధారణ ఎన్నికల ముందు తదుపరి బడ్జెట్ ఓట్ ఆన్ అకౌంట్ ఉండొచ్చన్నారు. ''ప్రజల నుంచి మరిన్ని ప్రయోజనాలు కావాలని, పన్నులు తగ్గించాలన్న డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది. అదే సమయంలో ప్రభుత్వం ద్రవ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటుంది. నా వ్యక్తిగత అభిప్రాయం అయితే పన్ను రేట్లను నిజంగా తగ్గించాల్సి ఉంది. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న కొద్ది మొత్తంలో నల్లధన ప్రవాహం అనేది అధిక పన్నుల వల్లే'' అని కేకి మిస్త్రీ చెప్పారు. తక్కువ పన్ను రేట్లు ఉంటే, అధిక పన్నులు వసూలు అవుతాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే, ద్రవ్య పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని సమతూకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు.

టీసీఎస్ దెబ్బ

- మార్జిన్ల పరంగా టీసీఎస్ నిరాశ
- ఇతర కంపెనీల ఫలితాలపై ఆందోళన
- ఎగిసిన చమురు ధరలు
- తగ్గిన రూపాయి
- వరుసగా రెండో రోజూ నష్టాలు
- 97 పాయింట్లు పతనమై 36,010కు సెన్సెక్స్
- 27 పాయింట్లు తగ్గి 10,795కు నిఫ్టీ

టీసీఎస్ ఫలితాలు అంచనాలకు అనుగుణంగా లేకపోవడంతో ఇతర కంపెనీల క్యూ3 ఫలితాలపై ఆందోళనతో స్టాక్ మార్కెట్లో శుక్రవారం లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ముడి చమురు ధరలు 1 శాతం మేర పెరగడంతో డాలర్‌తో రూపాయి మారకం విలువ పతనం కావడం, అంతర్జాతీయ సంకేతాలు మిశ్రమం ఉండటం ప్రతికూల ప్రభావం చూపించాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 36,000 పాయింట్ల పైన ముగియగా, నిఫ్టీ 10,800 పాయింట్ల దిగువకు పడిపోంది. వరుసగా రెండో రోజూ స్టాక్ సూచీలు నష్టపోయాయి. సెన్సెక్స్ 97 పాయింట్లు పతనమై 36,010 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 27 పాయింట్లు తగ్గి 10,795 పాయింట్ల వద్ద ముగిశాయి. ఎఫ్‌ఎమ్‌సీజీ మినహా మిగిలిన అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి. ఇక వారం పరంగా చూస్తే, స్టాక్ సూచీలు లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 315 పాయింట్లు, నిఫ్టీ 68 పాయింట్లు చొప్పున పెరిగాయి.

సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. ఆరంభ కొనుగోళ్ల జోరుతో 108 పాయింట్లు లాభపడింది. అయితే ఆ లాభాలు కొనసాగలేదు. మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు వెల్లువెత్తాయి. మధ్యాహ్నం తర్వాత 266 పాయింట్ల వరకూ నష్టపోయింది. చివరి గంటలో కొనుగోళ్ల తోడ్పాటుతో నష్టాలు తగ్గాయి. మొత్తం మీద రోజంతా సెన్సెక్స్ 374 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆసియా మార్కెట్లు లాభాల్లో, యూరప్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి.



- గురువారం మార్కెట్ ముగిసిన తర్వాత టీసీఎస్ క్యూ3 ఫలితాలు వెలువడ్డాయి. నికర లాభం పెరిగినా, మార్జిన్లు అంచనాల కంటే తక్కువగా ఉండటం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. టీసీఎస్ షేర్ 2.45 శాతం తగ్గి రూ.1,842 వద్ద ముగిసింది. సెన్సెక్స్ మొత్తం 97 పాయింట్ల నష్టంతో టీసీఎస్ వాటాయే 48 పాయింట్ల మేర ఉంది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	3,179
ఎన్‌ఎస్‌ఈ	24,619
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	5,03,549
ఎఫ్‌ఐఐ	- 687
డీఐఐ	123

- అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ సీఎల్‌ఎస్‌ఏ ఐటీసీ షేర్ బై రేటింగ్‌ను ఇచ్చింది. టార్గెట్ ధరను రూ.390 నుంచి రూ.400కు పెంచింది. దీంతో ఐటీసీ షేర్ 2 శాతం లాభంతో రూ. వద్ద ముగిసింది.
- ఎవరెడీ ఇండస్ట్రీస్ ఇండియాలో ప్రమోటర్ బీఎమ్ ఖైతాన్ తన వాటాను అమ్మేయనున్నారన్న వార్తల కారణంగా ఆ షేర్ 13 శాతం పెరిగి రూ. 205 కు చేరింది.
- జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) గత నెల అంతర్జాతీయ అమ్మకాలు 6 శాతం తగ్గడంతో ఐదు రోజుల టాటా మోటార్స్ పరుగుకు బ్రేక్ పడింది. ఈ షేర్ 3 శాతం వరకూ నష్టపోయి రూ.180 వద్ద ముగిసింది.
- దాదాపు వందకు పైగా షేర్లు తాజా ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. టాటా స్టీల్, అపోలో ట్యూబ్స్, దేనా బ్యాంక్, నీల్‌కమల్ తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. మరోవైపు ఆర్తి ఇండస్ట్రీస్, ముత్తూట్ ఫైనాన్స్, పీవీఆర్, టొరెంట్ ఫార్మా వంటి 40కు పైగా షేర్లు తాజా ఏడాది గరిష్ట స్థాయిలను తాకాయి.

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)


Symbol	LTP	(%)Change
ITC	294.7	1.76
UPL	781.6	1.1
WIPRO	329.25	1.07
IOC	131.05	0.89
HINDALCO	205.6	0.78
ONGC	144.3	0.73
ASIANPAINT	1,406.00	0.69
INFY	684.35	0.68
VEDL	196.7	0.64
HDFC	1,990.25	0.51

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	1,511.85	-3.45
TATAMOTORS	179.8	-3.2
INFRATEL	276.6	-2.96
TCS	1,843.45	-2.39
YESBANK	183.4	-1.87
GAIL	337.7	-1.8
LT	1,370.00	-1.62
TATASTEEL	473.3	-1.48
SBIN	301.65	-1.28
ADANIPORTS	375.6	-1.22

61 శాతం పెరిగిన కర్ణాటక బ్యాంక్ లాభం

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని కర్ణాటక బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.140 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.87 కోట్ల నికర లాభం వచ్చిందని, 61 శాతం వృద్ధి సాధించామని కర్ణాటక బ్యాంక్ తెలిపింది. నిర్వహణ, ఇతర ఆదాయాలు బాగా పెరగడంతో ఈ స్థాయిలో నికర లాభం పెరిగిందని తెలియజేసింది. నికర వడ్డీ ఆదాయం రూ.451 కోట్ల నుంచి 8 శాతం వృద్ధితో రూ.488 కోట్లకు పెరిగిందని పేర్కొంది. ఇతర ఆదాయం 55 శాతం ఎగసి రూ.301 కోట్లకు, నిర్వహణ లాభం 24 శాతం ఎగసి రూ.400 కోట్లకు పెరిగాయని వివరించింది.



పెరిగిన కేటాయింపులు..

రుణ నాణ్యత నిలకడగా ఉన్నా, కేటాయింపులు మాత్రం పెరిగాయి. గత క్యూ3లో 3.96 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ3లో 4.45 శాతానికి పెరిగాయని కర్ణాటక బ్యాంక్ పేర్కొంది. నికర మొండి బకాయిలు 2.85 శాతం నుంచి 3 శాతానికి చేరాయని వివరించింది. కేటాయింపులు 6 శాతం పెరిగి రూ.209 కోట్లకు చేరగా, ప్రొవిజన్ కవరేజ్ రేషియో 57.5 శాతం నుంచి 57.2 శాతానికి తగ్గింది. ఆర్థిక ఫలితాలు బాగా ఉండటంతో బీఎస్‌ఈలో కర్నాటక బ్యాంక్ షేర్ 0.6 శాతం లాభపడి రూ.116 వద్ద ముగిసింది.

ఎన్‌ఎస్‌ఈ చైర్మన్ అశోక్ చావ్లా రాజీనామా

న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్‌ఎస్‌ఈ) చైర్మన్ అశోక్ చావ్లా శుక్రవారం రాజీనామా చేశారు. ఇటీవల చోటు చేసుకున్న కొన్ని న్యాయపరమైన పరిణామాల కారణంగా చావ్లా రాజీనామా చేశారని పేర్కొంది. ఎయిర్‌సెల్–మాక్సిస్ కేసులో అశోక్ చావ్లా, మరో నలుగురు కేంద్ర ప్రభుత్వ అధికారులపై చార్జీషీటు దాఖలు చేయడానికి ప్రభుత్వం నుంచి ఆమోదం పొందామని సీబీఐ న్యాయవాదుల బృందం ఢిల్లీలోని స్పెషల్ కోర్ట్‌కు విన్నవించింది. ఈ నేపథ్యంలో చావ్లా రాజీనామా చేశారు.

బులియన్ రూ.లలో

ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	32,700	▼ 50
బంగారం (22 క్యారెట్లు)	30,310	▼ 20
వెండి (కిలో)	40,300	▼ 100
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	32,980	▼ 80
బంగారం (22 క్యారెట్లు)	30,680	▼ 70
వెండి (కిలో)	40,500	0
విజయవాడ		
బంగారం(24 క్యారెట్లు)	33,980	0
బంగారం (22 క్యారెట్లు)	30,500	0
వెండి (కిలో)	40,500	0
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	33,210	▼ 50
బంగారం (22 క్యారెట్లు)	30,720	▼ 40
వెండి (కిలో)	40,400	▼ 100

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	గురువారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	51.73	$52.59
బ్రెంట్	60.64	$61.68

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 12-01-2019

విజయవాడ	453-00
నమక్కల్	445-00

పారిశ్రామిక వృద్ధి అర శాతమే..!

న్యూఢిల్లీ: పారిశ్రామిక రంగం నవంబర్‌లో పేలవ పనితీరును ప్రదర్శించింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) ఈ నెలల్లో కేవలం 0.5 శాతంగా (2017 ఇదే నెలతో పోల్చి) నమోదయ్యింది. సూచీలోని తయారీ, వినియోగ రంగాల్లో అసలు వృద్ధి నమోదుకాకపోగా, క్షీణ రేటు నమోదయ్యింది. భారీ యంత్ర పరికరాల డిమాండ్‌ను సూచించే క్యాపిటల్ గూడ్స్‌లో కూడా ఇదే ధోరణి నెలకొంది. కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) శుక్రవారం విడుదల చేసిన నవంబర్ పారిశ్రామిక ఉత్పత్తి లెక్కల్లో

నవంబర్‌లో తీవ్ర నిరాశాకర ఫలితం

ముఖ్యమైన అంశాలు...

- మొత్తం సూచీలో 77.63 శాతం వాటా కలిగిన తయారీ రంగంలో నవంబర్‌లో వృద్ధిలేకపోగా –0.4 శాతం క్షీణత నమోదుచేసుకుంది. 2017 ఇదే నెలలో ఈ రేటు 10.4 శాతం. ఈ విభాగంలోని మొత్తం 23 పారిశ్రామిక గ్రూపుల్లో 10తప్ప మిగిలినవి ప్రతికూల వృద్ధిరేటును నమోదుచేసుకున్నాయి.



- డిమాండ్‌కు ప్రతిబింబమైన క్యాపిటల్ గూడ్స్ విభాగంలో కూడా వృద్ధిలేకపోగా –3.4 శాతం క్షీణత నమోదయ్యింది. 2017 ఇదే నెలలో ఈ రంగం వృద్ధి రేటు 3.7 శాతం.
- కన్జూమర్ డ్యూరబుల్స్ రంగంలో కూడా 3.1 శాతం వృద్ధి రేటు 0.9 శాతం క్షీణతలోకి జారింది.
- కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్ విషయంలో కూడా 23.7 శాతం భారీ వృద్ధిరేటు 0.6 శాతం క్షీణతలోకి పడిపోవడం గమనార్హం.
- మైనింగ్ రంగం వృద్ధి రేటు 1.4% నుంచి 2.7 శాతానికి పెరిగింది.
- విద్యుత్ రంగంలో ఉత్పత్తి 3.9 శాతం నుంచి 5.1 శాతానికి ఎగసింది.
- 2017 నవంబర్‌లో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటు 8.5 శాతం.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.



Cell Point
సంబరాల
సంక్రాంతి
'సెల్' సేల్
CELEBRATING 90+ STORES IN AP
Connecting People
NEW ARRIVELS
NEW OFFERS
Buy
1GB 8GB
Get FREE
@ ₹3,990
Buy
NOKIA 1 DS
Get FREE
NOKIA 105 SS
Worth ₹1,199
@ ₹4,990
Buy
LAVA Z60s
Get FREE
@ ₹4,999
Buy
2GB 16GB
Get FREE
@ ₹6,499
Xiaomi
NEVER BEFORE PRICE
Redmi 6 Pro ₹11,499 ₹10,299
Note 5 Pro ₹15,999 ₹13,499
Mi A2 ₹17,499 ₹14,499
Redmi 6 ₹8,999 ₹8299
vivo
V11 | V11 Pro
In-Display Fingerprint Scanning
సంక్రాంతి శుభాకాంక్షలు
This Sarada Sankarnthi Buy Vivo Smartphome and Get Chance to Win Gold & Exciting Gifts.
oppo
A7, F9 Pro
0% DOWN PAYMENT
0% FINANCE
CASH BACKS UPTO 10%
ON ALL LEADING BANKS
SAMSUNG
సంక్రాంతి సంబరాలు
Galaxy A7 ₹23990 ₹18990
Galaxy J6 ₹11499 ₹10490
Galaxy J6+ ₹14490 ₹12990
Galaxy J4+ ₹9990 ₹8490
Galaxy A9 ₹36990 ₹33990
NOKIA
Triple Joy Offer
0 Down payment
0 Interest
0 Processing fee
Buy
oppo
Worth ₹4,500
Get FREE
Buy
LG K9
2GB, 16GB
Get FREE
+
Different Panels
Dinner Set
@ ₹6,999
Buy
SAMSUNG J7 Duos
Get FREE
Worth ₹2,799
Bluetooth Sound Punch
ASSURED GIFT
Jio
కేవలం
₹501*
*conditions apply
Cell Point
EMI FACILITY WITH
BAJAJ FINSERV
HDFC BANK We understand your world
HDB
Pine Labs
CAPITAL FIRST
Paytm
HOME CREDIT
విజయవాడ 0866 6629888, 6672888, 6642888 • మసీద్ స్ట్రీట్, ఏలూరు రోడ్ • విజయ టాకీస్ ఎదురుగా, ఏలూరు రోడ్ • M&M షోరూం ఎదురుగా, ఎమ్.జి రోడ్డు • కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఎదురుగా, పటమట • పి.టి. కాలనీ ఎదురుగా, బందరు రోడ్
గుడివాడ 08674242066 • ఆంధ్రాబ్యాంక్ ఎదురుగా
హనుమాన్ జంక్షన్ 08656-242635 • పోలీస్ అవుట్ పోస్ట్ ప్రక్కన, విజయవాడ రోడ్డు
LACKS OF HAPPY CUSTOMERS
మా బ్రాంచీలు : • విశాఖపట్నం • శ్రీకాకుళం • పార్వతీపురం • బొబ్బిలి • రాజాం • విజయనగరం • కాకినాడ • రాజమండ్రి • అమలాపురం • తుని • తణుకు • తాడేపల్లిగూడెం • జంగారెడ్డిగూడెం • భీమవరం • ఏలూరు • విజయవాడ • గుంటూరు • గుడివాడ • హనుమాన్‌జంక్షన్ • ఒంగోలు • నెల్లూరు • తిరుపతి

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ శనివారం
12-1-2019

అసందర్భం

బాయిష్ టాక్

ఇండియాలో 'మీటూ'ను రాజేసిన తనుశ్రీ దత్తా గురువారం యు.ఎస్. వెళ్లిపోయారు. 'నా జీవితంలో ఇంతలా ఎప్పుడూ సఫర్ అవ్వలేదు' అన్నారు వెళ్లేముందు. హాలీవుడ్ దిగ్గజం వైన్‌స్టీన్‌పై తొలిసారి ఫిర్యాదు చేసి, 'మీటూ' ఉద్యమం ఆవిర్భావానికి కారణం అయిన నటి ఆష్లీ జూడ్ కేసును కోర్టు తోసిపుచ్చింది. పోరాటంలో వీళ్లిద్దరూ ఓడిపోయి ఉండొచ్చు. కానీ, స్త్రీల పట్ల మగవాళ్ల ప్రవర్తనను సమాజం ఇప్పుడు నిశితంగా గమనిస్తూ, నియంత్రిస్తోందంటే అది 'మీటూ' బాధితుల ఘనతే.

● మాధవ్ శింగరాజు

సిడ్నీలో నేడు మొదలవుతున్న మూడు వన్డేల ఆస్ట్రేలియా సిరీస్‌లోని తొలి వన్డే భారతీయ జట్టులో ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా, టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ లోకేశ్ రాహుల్ ఆడడం లేదు. గాయాల కారణంగా బోర్డు వారిని ఈ వన్డేకు దూరంగా ఉంచింది. అయితే అవి పాండ్యా, రాహుల్ చేసుకున్న గాయాలు కాదు. చేసిన గాయాలు. 'కాఫీ విత్ కరణ్ షో'లో ఇరవై ఐదేళ్ల పాండ్యా, ఇరవై ఆరేళ్ల రాహుల్ ఒళ్లు తెలియకుండా మాట్లాడి స్త్రీల మనోభావాలను గాయపరిచారు. ఇలాంటి వాళ్లు రేపు 'హనీట్రాప్'లో (తేనె మాటల వల) పడి, బుకీలకు బుక్కైపోరనేముంది అని బీసీసీఐ కోశాధికారి అనిరుధ్ చౌదరి అనుమానిస్తున్నారు. చిన్న శిక్ష వేస్తే సెట్ రైట్ అవుతారని బోర్డు కూడా భావించినట్లుంది.

క్రికెటర్‌ల మాట, చూపు, నవ్వు, నడక.. పదీ పన్నెండేళ్ల వయసుకే మగపిల్లలకు సెక్సువల్లీ ట్రాన్స్‌మిటెడ్ డిసీజ్‌లా అంటుకునే దేశం మనది. వాళ్లేం చేస్తే వీళ్లది చేస్తారు. వాళ్లేం చేశామని చెప్పుకుంటే వీళ్లది చెయ్యడానికి ట్రై చేస్తారు. కరణ్ చాట్ షోలో పాండ్యా అన్నాడు.. తను గడిపిన అమ్మాయిలెవరూ తనకు గుర్తుండరని, వాళ్ల పేర్లు కూడా తను అడగనని! షోలో రాహుల్ కొంచెం నయంగా ఉన్నాడు. ''మీ ఇద్దరూ ఒకే అమ్మాయిని ఇష్టపడితే?'' అని కరణ్ అడిగిన ప్రశ్నకు ''అది ఆ అమ్మాయి ఇష్టం'' అని రాహుల్ నవ్వుతూ అన్నాడు. పాండ్యా మళ్లీ షర్ట్ బటన్‌లు విప్పుకున్నాడు. 'బలమున్న వాడిదే అబల' అన్నాడు. ఈ చెత్త 'బాయిష్ టాక్' వీళ్లను ప్రస్తుతానికయితే ఒక వన్‌డేకి చెత్తబుట్టలో పడేసింది. పాండ్యాకు ట్విట్టర్‌లో ముప్పై లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. రాహుల్‌కి ఇరవై లక్షల మంది. ఈ ఫాలోవర్స్‌లో టీన్ బాయ్స్ ఉంటారు కదా.. ఇక వాళ్లకు మొదలౌతుంది.. క్రికెట్‌లో రన్‌లు కొట్టడం, వికెట్స్ పడగొట్టడం పెద్ద గొప్పేం కాదని.

పాండ్యా, రాహుల్‌ల ఈడువాడే డ్రేక్. అయితే ఇప్పుడు కాదు. పదేళ్ల క్రితం. కెనడా పాప్ సింగర్. 'కీకీ.. డు యు లైవ్ మీ' అనే మాట 'ఇన్ మై ఫీలింగ్' అనే అతడి పాటలోనిదే. ఆ మాటను తీసుకుని యు.ఎస్. కమెడియన్ షోకర్ కీకీ ఛాలెంజ్ మొదలుపెట్టాడు. ఆ చాలెంజ్‌కీ, డ్రేక్‌కీ సంబంధం లేదు కానీ, డ్రేక్ ఇప్పుడు ఊహించని ఛాలెంజ్‌ను ఎదుర్కోవలసి వస్తోంది. 2010లో యు.ఎస్.లోని డెన్వర్ (కొలరెడో స్టేట్)లో ఆగ్డెన్ థియేటర్ స్టేజీ మీద షో ఇస్తూ, ఆడియెన్స్‌లోంచి పైకి రప్పించుకున్న ఓ పదిహేడేళ్ల బాలికతో అతడు ప్రవర్తించిన తీరును ఇప్పుడు సోషల్ మీడియా అసహ్యించుకుంటోంది. కొలరెడో చట్టం ప్రకారం పదిహేడేళ్లు నిండని బాలికపై చెయ్యి వెయ్యడం నేరం. స్టేజీ మీద డ్రేక్ ఆ అమ్మాయిని వెనుక నుంచి ఆలింగనం చేసుకుంటూ ఆమె బ్రెస్ట్ మీదకు రెండు చేతులూ పోనిచ్చాడు. తర్వాత ఆమె చేతిని ముద్దు పెట్టుకున్నాడు. భుజాల్ని ముద్దు పెట్టుకున్నాడు. నుదుటిని ముద్దు పెట్టుకున్నాడు. చివరికి ఆమె పెదవులపై ముద్దు పెట్టుకున్నాడు. గువ్వలా ముడుచుకుని నిలబడింది ఆ బాలిక అతడివన్నీ చేస్తున్నప్పుడు. మధ్యలో.. 'నీ వయసెంత?' అని ఆ అమ్మాయిని అడిగాడు. 'పదిహేడు' అని చెప్పింది. 'కానీ భలేగున్నావే! థిక్‌గా' అన్నాడు! ఒళ్లు తెలియలేదు డ్రేక్‌కి. ఆ క్లిప్‌ను ఇప్పుడెవరో తవ్వి తీశారు. డ్రేక్ దీనిపై ఏమీ మాట్లాడ్డం లేదు.

బ్రిటిష్ చెఫ్ గోర్డన్ రామ్సే (52)ను కూడా నాలుగు రోజులుగా సోషల్ మీడియా ఫ్రై చేస్తోంది. అతడిదీ 'షో' ఎఫెక్టే. పదేళ్ల నాటి 'టునైట్' టీవీ షోలో తనతో పాటు గెస్ట్‌గా కూర్చున్న ముప్పై ఆరేళ్ల (అప్పటికి) హాలీవుడ్ నటి సోఫియా వెర్గారాను అతడు పదేపదే చవకబారు జోకులతో కామెంట్ చేస్తున్న వీడియో క్లిప్‌ను ఇప్పుడెవరో మళ్లీ నెట్ ఉపరితలానికి తేల్చారు. షోను జే లెనో హోస్ట్ చేస్తున్నారు. సోఫియా ఏం మాట్లాడినా, చెఫ్ గోర్డన్ కల్పించుకుంటున్నాడు. తను నటించిన ఏదో సన్నివేశం గురించి చెబుతూ, 'నా జీవితంలో నేనెప్పుడూ అంతలా అరవలేదు' అని సోఫియా అనగానే, 'బెడ్ మీద తప్ప' అని గోర్డన్ ఆమె మాటకు కంక్లూజన్ ఇచ్చాడు! ఇంకా నానా చెత్తా మాట్లాడాడు. సోఫియా కోపాన్ని అతి కష్టం మీద ఆపుకున్నారు. 'ఇదీ నా ఇంటర్వ్యూ' అని ఆ తర్వాత తలకొట్టుకున్నారు. ఇప్పుడీ ఇద్దరు కుర్రాళ్లు.. పాండ్యా, రాహుల్!


క్రికెటర్‌లు హార్దిక్ పాండ్యా, లోకేశ్ రాహుల్

మీటూ మొదలయ్యాక, కలుగుల్లో దాక్కుని ఉన్న 'బాయిష్ టాక్'ను కూడా తోక పట్టుకుని బయటికి లాగి పడేస్తున్న సోషల్ మీడియా.. డర్టీ బాయ్స్‌ని ఏ మాత్రం సహించే మూడ్‌లో లేదు. బుద్ధిగా ఉండడం ఒక్కటే మగవాళ్లు ఇక చేయవలసిన పని... మగబుద్ధిగా కాదు. ●

వెబ్ ఫ్లిక్స్



ఆమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమ్ అవుతున్న 'బ్యాంగ్ బాజా బారాత్' వెబ్ సిరీస్ పోస్టర్

పప్పన్నం వెడ్స్ కోడికూర

పాత చింతకాయ విషయం ఒకటి అనుకుందాం. పెళ్లిళ్లు రెండు కుటుంబాల మధ్య జరుగుతాయి. కానీ ఈ కథ అక్కడ ఆగదు. అసలు మొదలవడమే ఇంకో రకంగా మొదలౌతుంది. మోడర్న్ బట్టలు వేసుకుంటే లుక్కు మారొచ్చు. కానీ అవుట్‌లుక్ మారదుగా! అంటే.. కనబడటానికి మోడర్న్‌గా ఉన్నా.. కొత్తదనాన్ని ఆహ్వానించే పరిపక్వతా ఉండాలి. ఇది మనందరికీ పనికొచ్చే కథే. నిజానికి మన పిల్లలకంటే మనమే చాలా మోడర్న్ అని చెప్పే కథ.

''స్టార్ హోటల్‌లో షెఫ్‌ని. కాంటినెంటల్ ఫుడ్ వండుతా. ఇంటికెళ్లి పప్పు అన్నం తిని తృప్తి పడ్తా. చిన్న టౌన్‌లో పెరిగిన వాడిని షాహనా..! ప్రొగ్రెసివ్‌గా ఉండాలని ఆశ. కాని సంప్రదాయాన్నే రెస్పెక్ట్ చేస్తున్నా. సారీ షాహనా!'' పవన్ మల్హోత్రా అపరాధ భావం.

''తప్పు నాదే పవన్. నువ్వన్నట్టుగా పెళ్లికి కొన్నాళ్లు ఆగాల్సిందేమో. నేనే తొందరపడ్డా. నాకు మూడేళ్లున్నప్పుడు మా నాన్న మమ్మల్ని వదిలేశాడు. అప్పటి నుంచీ అమ్మే అన్నీ. ఆమెకు నేనే సర్వస్వం. బిజినెస్ టూర్స్ వెళ్తున్నాను అని అబద్ధాలు చెప్పీ చెప్పీ అదే అబద్ధంతో నాన్న పట్టుబట్టాడు. నాన్నను చూసే చస్తే అబద్ధాలు చెప్పకూడదని డిసైడ్ చేసుకున్నా. ఎన్ని ప్రాబ్లమ్స్ వచ్చినా నిజమే చెప్తూ వచ్చా. నిజం నీకు నచ్చలేదు. ఎనీవే.. ఇట్స్ ఓవర్'' అంటూ పవన్ వైపు తిరిగింది షాహనా.

''నిజంగా ఇట్స్ ఓవరా..?'' బేలగా అడిగాడు

మౌనంగా ఆమె.

అదే సమయానికి హోటల్ స్వీట్‌లో..

''వాళ్లనుకున్నట్టుగా కోర్ట్ మ్యారేజ్ చేసుకుంటే ఈ గొడవ ఉండేదే కాదుకదా! హ్యాపీగా ఈపాటికి హనీమూన్‌కి కూడా బయలుదేరేవారు. ఈ సిట్యుయేషన్‌కి మీరే కారణం'' అన్న, కాబోయే వదిన పెళ్లి పీటల మీద నుంచి చెప్పకుండా ఎటో వెళ్లిపోయారనే బాధ, పెద్దవాళ్ల మీద కోపంతో పెళ్లికొడుకు చెల్లి బర్ఖా.

''నువ్వూరుకోమ్మా.. పదిమంది ముందు నా కూతురు పరువు తీసిందని అని నేను ఫీలవుతుంటే'' అసహనంగా రంజిత్ అరోరా.. పెళ్లికూతురు తండ్రి.

''అబ్బో.. అక్కడికి మీరేదో ప్రెసిడెంట్.. ప్రైమ్ మినిస్టర్ అయినట్టు.. పరువట పరువు''బర్ఖా వెటకారాలాడుతుంటే సహించలేకపోయింది ఆమె తల్లి రోలీ శర్మ. ''ఏయ్.. చిన్నాపెద్దా లేకుండా ఏం మాటలవి'' అంటూ కూతురిని బెదిరించే ప్రయత్నం చేసింది.

''అసలు దీనికంతటికీ కారణం నువ్వే'' అంటూ భార్య సుష్మిత ఘోష్ మీద విరుచుకు పడ్డాడు రంజిత్ అరోరా. ''ఫ్రీడమ్ అంటూ అద్దూఅదుపు, ఓ పద్ధతి, పాడూ లేకుండా పిల్లను పెంచావ్'' కంటిన్యూ అయ్యాడు.

''సారీ వదిన గారు.. '' అంటూ అపాలజీ చెప్పబోయింది సుష్మిత. ''మీరు ఊరుకోండి వదినగారు.. '' అని ఆమెను ఆపి రంజిత్ అరోరాను చూస్తూ ''అసలు తప్పు మీది. కూతురి వయసున్న అమ్మాయిలను మగవాళ్లు పెళ్లి చేసుకోవచ్చు. విడాకులు తీసుకున్నాక ఆడవాళ్లు ఇంకో బంధంలోకి వెళితే పిల్లల బాధ్యత మరిచిపోయినట్టు. ఏం న్యాయం ఇది?'' వేలెత్తుతుంది రోలీ.

వీళ్ల ఈ వాదోపవాదాల్లో ఉంటుండగానే నెమ్మదిగా స్వీట్‌లోకి అడుగుపెట్టారు పవన్, షాహనా!

వాళ్లను చూడగానే పిన్ డ్రాప్ సైలెంట్ అయిపోతారు అక్కడున్న వాళ్లంతా. వెంటనే సుష్మితా లేచి కూతురిని తీసుకొని తమ స్వీట్‌లోకి వెళ్లిపోతుంది. పవన్ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి సోఫా మీద వాలిపోయాడు. అతని తండ్రి మురళీ ప్రసాద్ శర్మ వచ్చి కొడుకు ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చున్నాడు. తండ్రి రాకతో అలర్ట్ అయ్యి సరిగ్గా కూర్చున్నాడు పవన్.

''కాలేజ్‌లో ఉన్నప్పుడు నేనూ ఓ అమ్మాయిని ప్రేమించా. వాళ్లు బాగా ఉన్నవాళ్లు. ఆమె మేనమామ ఎమ్మెల్యే. ఒకరోజు రాత్రి విపరీతంగా వర్షం పడ్తోంది. ఆ అమ్మాయి మా హాస్టల్ దగ్గరకు వచ్చి లెటర్ పంపించింది. బయటకు రమ్మని. వచ్చా. వెళ్లిపోయి పెళ్లి చేసుకుందాం అంది. భయపడి నేను వెళ్లలేదు. చిన్నప్పుడు అందరికీ గాంధీ హీరో ఉంటాడు. తర్వాత తండ్రి హీరోగా మారుతాడు. మనకు పిల్లలు పుట్టివాళ్లు ఎదిగాక పిల్లలకు హీరోలుగా కనిపిస్తుంటారు. నేనెప్పుడూ అనుకునే వాడిని నా కొడుక్కి నేనెందుకు హీరో కాలేకపోయాను? బహుశా కట్టుబాట్లను కాదనలేని పిరికితనం వల్లేమో అని అనుకునే వాడిని. అనుకున్నవన్నీ సాధిస్తున్న నీ తెగువ, ధైర్యానికి ముచ్చటపడ్డాను. నాకు నువ్వు హీరోగా కనపడ్డం మొదలెట్టావ్. కాని ఈరోజు నువ్వు చేసిన పని హీరోయిజం కాదురా! షాహనా మంచి అమ్మాయి. ఆ పిల్ల పెంపకం అలాంటిది. నువ్వు ఆ అమ్మాయిని ఇష్టపడ్తున్నావంటే ఆ అమ్మాయి బలహీనతలనూ అంతే ఇష్టంగా రిసీవ్ చేసుకోవాలి. ఆమె అలవాట్లనూ అంతే ఇదిగా గౌరవించాలి. నా మాట విను.. షాహనాను పెళ్లి చేసుకో. ఆ అమ్మాయే నీకు సరిజోడు'' చివరి మాట.. కొడుకు తల నిమురుతూ చెప్పాడు మురళీ ప్రసాద్.

''నాన్నా..'' అన్నాడు పవన్. అవునన్నట్టుగా కళ్లతోనే జవాబిచ్చాడు తండ్రి.

సరిగ్గా ఇదే సమయానికి షాహనా వాళ్ల హోటల్ స్వీట్‌లో..

''సారంగ్‌ని ఇప్పటికీ ప్రేమిస్తున్నావా?'' కూతురిని అడిగింది సుష్మిత.

సమాధానం చెప్పలేదు షాహనా.

''నాకంటూ అయిన వాళ్లు ఎవరూ లేరు. దాంతో కుటుంబం, ఆ రిలేషన్స్, ఈ వ్యవహారాలు అన్నీ పెద్దగా పట్టలేదు నాకు. నిన్నూ నా లోకంలోనే ఉంచా. సంప్రదాయం అంతా తప్పు కాదు. దేనికైనా మన విజ్ఞతను అప్లయ్ చేయాలి. ప్రాక్టికల్‌గా ఆలోచించాలి. పవన్ చాలా మంచివాడు. వాళ్ల ఫ్యామిలీ కూడా. అంత సంప్రదాయ బద్ధమైన ఫ్యామిలీ కూడా మన విషయాలన్నీ తెలిసీ పెళ్లికి ఒప్పుకుంది. పవన్‌తో ఓ మంచి కుటుంబం దొరుకుతోంది నీకు.

మన దగ్గర పెళ్లి ఇద్దరు వ్యక్తులకు కాక రెండు కుటుంబాల మధ్య ఎలా ఉంటుందో.. ఆ రెండు కుటుంబాలు ఇద్దరు వ్యక్తులకు ఎంత అండగా ఉంటాయో.. సామరస్యాన్ని ఎలా పెంపొందిస్తాయో చూపించే సిరీస్. అయితే పెళ్లికి కావల్సింది అట్టహాసం కాదు అండర్‌స్టాండింగ్ అని, ఇద్దరు వ్యక్తులకైనా రెండు కుటుంబాలకైనా అని చెప్తుంది బ్యాంగ్ బాజా బారాత్.

నిజం చెప్పనా షాహనా.. ఈ విషయంలో నువ్వంటే జెలస్ ఫీలవుతున్నాను తెలుసా'' అంది సుష్మిత కూతురి భుజమ్మీద చేయివేస్తూ!

''అయినా... ఎందుకో ఈ పెళ్లి వద్దనిపిస్తోంది అమ్మా.. '' షాహనా.

ఈలోపే పవన్ వచ్చాడు ఆ స్వీట్‌లోకి. ''షాహనా.. ఐ లవ్ యూ.. విల్ యూ మ్యారీ మీ.. ప్లీజ్'' అంటూ అభ్యర్థించాడు పవన్. అచేతనంగా ఉంది షాహనా. తల్లి వంక చూసింది. ఒప్పుకో అన్నట్టుగా కళ్లల్లో భావం. పవన్‌ను చూసింది.. ''విల్ యూ'' అడిగాడు మళ్లీ. సరే అంది. ముద్దు పెట్టుకుని థ్యాంక్స్ చెప్పి వెళ్లిపోయాడు. అమ్మ కూతురిని వాటేసుకుంది. కూతురు గట్టిగా అమ్మను పొదివి పట్టుకుంది.

తర్వాత గంటకు ఆ ఇద్దరికీ అదే హోటల్‌లో ఇంతకు ముందు వేసిన వేదిక మీదే పెళ్లి అయింది. రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో సంతకాల పెళ్లి.

అంతకుముందు ఈ ఇద్దరి పెళ్లే ఎందుకు ఆగిపోయింది?

ఇప్పటికే అర్థమై ఉంటుంది షాహనా, పవన్‌ల నేపథ్యమే కాదు పెంపకాలు కూడా పూర్తిగా విరుద్ధమని. నాన్‌వెజ్ అనే మాటను కూడా నోట పలకని శుద్ధ శాకాహార కుటుంబం పవన్ వాళ్లది. నాన్‌వెజ్ లేకపోతే ముద్ద దిగని ఫ్యామిలీ షాహనా వాళ్లది. మెట్రో సిటీలో పుట్టిపెరుగుతుంది షాహనా. ఓ మోస్తరు టౌన్ పవన్‌ది. షెఫ్‌గా మెట్రో సిటీకి వచ్చాక.. ఆ ఆధునికత, హంగులకు ముచ్చటపడ్తాడు. పెళ్లికి ముందే సెక్స్‌ను ప్రొగ్రెసివ్ అనుకుంటాడు. అలాంటి పార్టనరే దొరికినందుకు సంతోషపడ్తాడు. షాహనా విషయానికి వస్తే.. సంప్రదాయాలు, సంస్కృతి వ్యక్తి స్వేచ్ఛకు అడ్డంపడే ఆటంకాలు. కంపార్టబులిటీ లేకపోతే విడిపోవడం చాలా కామన్ థింగ్ ఆమెకు. ఈ ఇద్దరూ ఆర్భాటాలు లేని రిజిస్టర్ మ్యారేజ్ చేసుకోవాలనుకుంటారు. కాని పవన్ తల్లిదండ్రులు ఒప్పుకోరు. ''నీకు నచ్చిన పిల్లను మేము ఓకే అన్నప్పుడు మాకు నచ్చినట్టే పెళ్లి'' అని షరతు పెట్టి మరీ స్టార్ హోటల్లో పెళ్లికి ఏర్పాట్లు చేస్తారు. ఆ పెళ్లి ఏర్పాట్లప్పుడే షాహనా కుటుంబం గురించి పూర్తిగా తెలుస్తుంది పవన్ కుటుంబానికి. అదంతా వాళ్లకు కాస్త మింగుడు పడని వ్యవహారంగానే ఉన్నా కొడుకు కోసం కాంప్రమైజ్ అవుతుంటారు. పవన్‌కు షాహనాకు సంబంధించి కొత్త విషయం తెలుస్తుంది. ఆమెకు అంతకు ముందే ఓ బాయ్‌ఫ్రెండ్ ఉన్నట్టు. అతను పెళ్లికి రావడం ద్వారా. బ్రేకప్ అయిందని సమాధాన పడ్తాడు. కాని అతను పెళ్లిలో ఉండొద్దనే షరతు పెడ్తాడు. అక్కడే ఇద్దరికీ మాటామాటా పెరిగి.. నమ్మకం, నమ్మకపోవడం దాకా సాగి పెళ్లి పీటల మీదనుంచి వెళ్లిపోతారు. ఆవేశం, కోపం, పంతం, పట్టుదల అంతా తగ్గాక అలా మళ్లీ కలుస్తారు.

ఇది బ్యాంగ్ బాజా బారాత్ కథ. ఆమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమ్ అవుతోంది. పవన్‌గా అలీ ఫజల్, షాహనాగా అంగిరా ధార్, మురళీ ప్రసాద్‌గా గజ్‌రాజ్ రావు, రంజిత్ అరోరాగా రజిత్ కపూర్, సుష్మితాగా షెర్నాజ్ పటేల్, రోలీగా అయేషా రజా నటించి మెప్పించారు.

– సరస్వతి రమ

ఊరికి పరంపర

సంస్కృతి


డాక్టర్ శ్రీనాగి, శశికళ

చెట్టు ఎంత ఎదిగినా వేళ్లను వదిలిపెట్టదు. తాను ఎదుగుతున్న కొద్దీ వేళ్లను కూడా అంతగా విస్తరించుకుంటుంది. మహావృక్షంగా మారిన తర్వాత ఊడలను దించుకుంటుంది. మరి.. మనుషులం? మన మూలాలను పుటుక్కున తెంచేసుకుంటున్నాం. 'ఎంత ఎత్తుకి ఎదిగినా పాదాలు ఉండాల్సింది నేల మీదనే' అనే చిన్న సూత్రాన్ని మర్చిపోతున్నాం. ''అది గుర్తు చేయడానికే 'పరంపర' కల్చరల్ ఆర్గనైజేషన్‌ను స్థాపించాం.. అంటున్నారు డాక్టర్ శ్రీనాగి, శశికళ. దేవాలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

''తమిళనాడు, కర్ణాటక వాళ్లు సంస్కృతికి దూరం కారు. ఎంత పెద్ద చదువులు చదివినా, ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నా సరే.. ఏడాదిలో ఒకసారి వారి సొంత ప్రదేశాలకు చేరిపోతారు. అందరూ కలిసి సంగీతం, నాట్యాలతో వాళ్ల సంప్రదాయ రీతులను ప్రదర్శించుకుంటారు. ఇక్కడ ప్రదర్శకులు వేరు, ప్రేక్షకులు వేరు కాదు. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక కళలో ప్రవేశం ఉంటుంది. చిన్నదో పెద్దదో ఏదో ఒక బాధ్యత తీసుకుంటారు. ఒకరు ప్రదర్శిస్తుంటే మిగిలిన వాళ్లు ప్రేక్షకులైపోతారు. సాంస్కృతిక వేడుకలు పూర్తయిన తర్వాత తిరిగి తమ తమ ఉద్యోగాలకు వెళ్లిపోతారు. ఐదేళ్ల కిందట ఒక స్నేహితురాలి ఆహ్వానంతో బెంగళూరుకెళ్లినప్పుడు వాళ్ల సంప్రదాయం, సంస్కృతిని పరిరక్షించుకుంటున్న తీరు తెలిసింది. తెలుగువాళ్లకు అలవాటు చేద్దామనిపించింది'' అన్నారు డాక్టర్ శ్రీనాగి.





కార్యక్రమాల 'పరంపర':

జనవరి 11 : కనకదుర్గ ఆలయం, విజయవాడ (ముగిశాయి)

జనవరి 13 : భావ నారాయణ ఆలయం, బాపట్ల; **జనవరి 16 :** వేయి స్తంభాల గుడి, వరంగల్

జనవరి 19 : శ్రీ రామచంద్రస్వామి ఆలయం , అమ్మపల్లె, శంషాబాద్, హైదరాబాద్

జనవరి 27 : వేణుగోపాల స్వామి ఆలయం, అక్కన్నమాదన్న ఆలయం, భువనగిరి

ఫిబ్రవరి 2 : వీరభద్రస్వామి ఆలయం, అప్పా సర్వీస్ రోడ్, నార్సింగి, హైదరాబాద్

ఫిబ్రవరి 22 : అపురూప వెంకటేశ్వర స్వామి ఆలయం, మామిడిపల్లి, నిజామాబాద్

మార్చి 4 : ధర్మపురి క్షేత్రం, మియాపూర్, హైదరాబాద్

మనకూ వేదికలు.. వేడుకలు

''మనదైన శాస్త్రీయ సంగీత కచేరీలు, సంప్రదాయ నాట్యరీతులు ఉన్నాయి. వాటిని ప్రదర్శించడానికి హైదరాబాద్‌లో రవీంద్రభారతి, శిల్పకళావేదిక వంటి వేదికలూ ఉన్నాయి. ప్రతి పట్టణంలోనూ ఇలాంటి వేదికలూ ఉండనే ఉన్నాయి. అయితే కళాభిరుచి ఉన్న వాళ్లను మాత్రమే ఆకర్షిస్తాయవి. సంస్కృతి గురించి ఏమీ తెలియని వారికి కూడా మన సంస్కృతి మూలాల దగ్గరకు తీసుకురావాలంటే మాకు కనిపించిన మార్గం ఒక్కటే. ఆ కార్యక్రమాలను వారి ముంగిటకు తీసుకెళ్లడమే. అందుకే నాలుగేళ్ల నుంచి కళాసాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను తీసుకున్నాం'' అని పరంపర కల్చరల్ ఆర్గనైజేషన్ గురించి చెప్పారు శశికళ.

డాక్టర్ శ్రీనాగి, శశికళ ఇద్దరూ తమవంతు బాధ్యతగా సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. 'రోష్ని' స్వచ్ఛంద సంస్థ స్థాపనలోనూ కీలకంగా వ్యవహరించారు శశికళ. రోష్ని సంస్థ ఆత్మహత్యకు పాల్పడే వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇస్తుంది. జీవితం మీద ఆసక్తి కోల్పోకుండా చేస్తుంది. జీవితంలో కష్టాలుంటాయి, కానీ అవి జీవితానికి డెడ్‌ఎండ్‌లు కాదు, టర్నింగ్‌లు మాత్రమేననే మంచి మాటలతో నిరాశానిస్పృహలను తొలగించి జీవితేచ్ఛ కలిగిస్తుంటుంది రోష్ని సంస్థ. వీరిద్దరి స్నేహం ఇప్పుడు సాంస్కృతిక కార్యక్రమాల పరిరక్షణ బాధ్యతను తలకెత్తుకుంది. 'పరంపర... నర్చరింగ్ కల్చర్' అనే ట్యాగ్‌లైన్‌లోనే తామేం చెప్పదలుచుకున్నామో ఉందంటారు శ్రీనాగి, శశికళ.



గుడిలోనే ఎందుకు?

సాంస్కృతిక కార్యక్రమాలను గుడి ఆవరణలో నిర్వహించడం వెనుక బలమైన కారణాన్ని చెబుతున్నారీ మహిళలు. ''ప్రతి ఊళ్లోనూ ఆలయం ఉంటుంది. గుడి ధార్మిక ప్రదేశమే. అయితే మతపరమైన పరిధితో గిరిగీసుకునే ప్రదేశం కాదు. ఆ గ్రామస్తులందరికీ సమావేశ వేదిక. ఊరికి, ఊళ్లో వాళ్లకు సంబంధించిన ఏ అంశాన్నయినా గుడి ఆవరణలోనే చర్చించుకునేవాళ్లు. ఆ సంస్కృతిని గుర్తు చేయడానికే గుడి ఆవరణను ఎంచుకున్నాం. ఎక్కడెక్కడ ప్రాచీన ఆలయాలున్నాయో శోధించాం. శంషాబాద్ దగ్గర అమ్మపల్లె రామచంద్రస్వామి ఆలయం ఏడు వందల ఏళ్ల నాటిది. మనం గుజరాత్‌కెళ్లి చూసొచ్చే స్టెప్‌వెల్ కూడా ఉంది ఆలయం సమీపాన. చాలామందికి అక్కడ అంత గొప్ప ప్రాచీన ఆలయం ఉందనే సంగతి కూడా తెలియదు. నాలుగేళ్లు మేము ఆ ఆలయంలో కూడా ఒక వేడుకను నిర్వహించడంతో ఇప్పుడు అక్కడికి భక్తులు ముఖ్యంగా పర్యాటకుల సంఖ్య బాగా పెరిగింది. భువనగిరిలోని అక్కన్న మాదన్నల ఆలయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యం ఈతరం చాలా మందికి తెలియడమే లేదు. మా గుడి సంబరాల నిర్వహణకు ప్రాచీన, చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాలనే ఎన్నుకుంటున్నాం. కళాకారుల ఎంపికలో మేము ఇప్పటికే పేరు గడించిన వారి కోసం ప్రయత్నించడం లేదు. టాలెంట్ ఉండి పెద్దగా గుర్తింపునకు నోచుకోని వారి కోసం గాలించినంత పని చేస్తున్నాం.

ఇదంతా స్వచ్ఛందంగా చేస్తున్న పని. ప్రదర్శనకు టికెట్ ఉండదు. వీలయినంత ఎక్కువ మందికి మన మూలాలను తెలియచేయడమే మా ఉద్దేశం. ఎవరైనా స్థానికంగా మాకు సహకరిస్తే వారి సహాయం తీసుకుంటున్నాం. మై హోమ్, బీవీఆర్, ఏఎమ్ఆర్ వంటి సంస్థలు కొంత వరకు ఆర్థిక తోడ్పాటునిస్తున్నాయి. గద్వాల్ కోటలో 'పాతాళభైరవి', 'మాయాబజార్' నృత్యనాటకాలను ప్రదర్శించాం. మహబూబాబాద్‌లో 'నర్తనశాల' ప్రదర్శించాం. ఆ ప్రదర్శన గురించి తెలిసిన వరంగల్ ఎమ్మెల్యే తర్వాతి ప్రదర్శన భద్రకాళి ఆలయంలో పెట్టమని అడిగారు. అలా ఎక్కడికక్కడ స్థానికంగా ఎవరైనా ముందుకు వచ్చి సహకరిస్తే మాకు కొంత బరువు తగ్గుతుంది. అలా లేనిచోట పూర్తి బాధ్యత మాదే. ఈ వేడుకలు ఈ రోజు (జనవరి 11న) మొదలయ్యాయి. ఏటా జనవరి నుంచి మార్చి వరకు సాగే ఈ కార్యక్రమాల్లో మాతో కలిసి పనిచేయడానికి ఆసక్తి ఉన్న వాళ్లందరికీ ఇదే మా ఆహ్వానం'' అన్నారు డాక్టర్ శ్రీనాగి, శశికళ.

– ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



పల్లవి: సంక్రాంతి వచ్చిందే తుమ్మెద
సరదాలు తెచ్చిందే తుమ్మెద
కొత్త ధాన్యాలతో కోడి పందేలతో
ఊరే ఉప్పొంగుతుంటే
ఇంటింటా... ఆ... పేరంటం
ఊరంతా... ఆ... ఉల్లాసం
కొత్త అల్లుళ్లతో కొంటె మరదళ్లతో
పొంగే హేమంత సిరులు

చరణం-1
మంచీ మర్యాదనీ పాప పుణ్యాలనీ
నమ్మే మన పల్లెటూళ్లు
న్యాయం మా శ్వాసనీ ధర్మం మా బాటనీ
చెబుతాయి స్వాగతాలు
బీద గొప్పొళ్లనే మాటలేదు
నీతి నిజాయితీ మాసిపోదు
మచ్చలేని మనసు మాది
మంచి పెంచు మమత మాది
ప్రతి ఇల్లో బొమ్మరిల్లు... ॥సంక్రాంతి॥

చరణం-2
పాలే పంచామృతం మనసే బృందావనం
తడిసేనే ఒళ్లు జల్లు
మాటే మకరందమూ చూపే సిరి గంధమూ
చిరునవ్వే స్వాతి జల్లు
జంట తాళాలతో మేజువాణి
జోడు మద్దెళ్లనీ మోగుపోనీ
చెంతకొస్తే పండగాయే చెప్పలేని బంధమాయే
వయసే అల్లాడిపోయే... ॥సంక్రాంతి॥

చిత్రం : సోగ్గాడి పెళ్లాం (1996)
రచన : భువనచంద్ర ; సంగీతం : కోటి
గానం : ఎస్.పి.బాలు, చిత్ర

కాసుకో సుడోకు

2	4	9						
						6		
5	6	7		8	9	3		2
		2	8		5			6
7	5	3	1		6	8	2	4
8			2		7	9		
9		4	5	1		7	6	8
		5						
						2	5	3

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

3	7	9	6	5	4	2	1	8
8	4	6	3	1	2	7	9	5
1	2	5	7	9	8	4	3	6
7	6	1	4	2	9	8	5	3
4	8	2	5	6	3	9	7	1
9	5	3	1	8	7	6	2	4
5	1	4	9	7	6	3	8	2
2	3	7	8	4	5	1	6	9
6	9	8	2	3	1	5	4	7

గంపెడు పండుగ





2019లో తొలి పండగ ఇది. తొలి సంక్రాంతి. గంపెడు ఆశలు, గంపెడు ఆకాంక్షలు, గంపెడు సంతోషాలు, గంపెడు సంబరాలు తీసుకొచ్చే పండగ. గంపెడు మంది బంధువులు వస్తారు. గంపెడు మంది అయినవాళ్లు తోడవుతారు. గంపెడు కబుర్లు సాగుతాయి. గంపెడు నవ్వులు వెల్లివిరుస్తాయి. సంతోషం ఎక్కువైతే ఆకలి కూడా కరకరలాడుతుంది. ఏం చేయాలి? గంపెడు వంటకాలు వండాలి. తలా ఒక చేయి వేసి వంటగదిలో సందడి రేపాలి. ఆ తర్వాత ఏముంది? తిన్నంత... తబ్బిబ్బయ్యేంత.

మామిడికాయ బొబ్బట్లు

కావలసినవి: పచ్చి మామిడికాయలు – 2 ; బొంబాయి రవ్వ – ఒక కప్పు; పంచదార – ఒక కప్పు+ పావు కప్పు; మైదా పిండి – ఒక కప్పు; ఉప్పు – చిటికెడు; నూనె – అర కప్పు; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; ఏలకుల పొడి – అర టీ స్పూను.

తయారీ: ● మామిడికాయలను శుభ్రంగా కడిగి తొక్క తీసి, సన్నగా తురుముకుని పక్కన ఉంచాలి ● స్టౌ మీద బాణలి ఉంచి, వేడి క్కిన తరవాత బొంబాయి రవ్వ వేసి దోరగా వేయించి తీసి పక్కన ఉంచాలి ● మందంగా ఉన్న పాత్రను స్టౌ మీద ఉంచి వేడ య్యాక, ఒక టేబుల్ స్పూను నెయ్యి వేసి కరిగించాలి ● పచ్చి మామిడికాయ తురుము వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించాలి ● ఐదు నిమిషాల తరవాత రెండు కప్పుల నీళ్లు, పంచదార జత చేసి, పంచదార కరిగేవరకు కలుపుతుం డాలి ● పంచదార పూర్తిగా కరిగాక, వేయించిన బొంబాయి రవ్వ కొద్దికొద్దిగా జత చేస్తూ ఆపకుండా కలుపుతుండాలి ● నెయ్యి జత చేసి బాగా కలియబెట్టి ఉడికించాలి ● ఏలకుల పొడి జత చేసి కలిపి దింపి చల్లారిన తరవాత ఉండలు చేసి పక్కన ఉంచాలి ● ఒక పాత్రలో మైదా పిండి, కొద్దిగా నెయ్యి, చిటికెడు ఉప్పు వేసి కలపాలి ● తగినన్ని నీళ్లు జత చేస్తూ, చపాతీ పిండిలా కలుపుకోవాలి ● నూనె బాగా జత చేసి కలిపి, తడి వస్త్రంలో గంటసేపు పక్కన ఉంచాలి ● పిండిని చిన్నచిన్న ఉండలుగా తీసుకుని, చేతితో చిన్న పూరీలా ఒత్తి, ఒక ఉండను ఉంచి, అంచులు మూసేయాలి ● అరటి ఆకు మీద కాని, ప్లాస్టిక్ పేపర్ మీద కాని కొద్దిగా నెయ్యి పూసి ఈ ఉండను దాని మీద ఉంచి చేతితో మృదు వుగా బొబ్బట్లు మాదిరిగా ఒత్తాలి ● స్టౌ మీద పెనం ఉంచి వేడయ్యాక కొద్దిగా నూనె లేదా నెయ్యి వేసి తయారుచేసి ఉంచుకున్న బొబ్బట్లును వేసి రెండువైపులా నెయ్యి వేసి దోరగా కాల్చి తీసి వేడివేడిగా అందించాలి.



రవ్వ గారెలు

కావలసినవి: బొంబాయి రవ్వ – ఒక కప్పు; ఉల్లి తరుగు – అర కప్పు; అల్లం తురుము – ఒక టీ స్పూను; తరిగిన పచ్చి మిర్చి – 2; జీలకర్ర – అర టీ స్పూను; మిరియాలు – 12 (పొడి చేయాలి); కొత్తిమీర తరుగు – ఒక టీ స్పూను; కరివేపాకు – ఒక టేబుల్ స్పూను (సన్నగా తరగాలి); పుల్లటి పెరుగు – అర కప్పు; బేకింగ్ సోడా – పావు టీ స్పూను; ఉప్పు – తగినంత; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ: ● ఒక పాత్రలో బొంబాయి రవ్వ, ఉల్లి తరుగు, అల్లం తురుము, పచ్చి మిర్చి తరుగు, తరిగిన కొత్తిమీర, తరిగిన కరివే పాకు వేసి కలపాలి ● జీలకర్ర, మిరియాల పొడి జత చేసి మరోమారు కలపాలి ● పుల్లటి పెరుగు, ఉప్పు, బేకింగ్ సోడా జత చేసి గారెల పిండిలా కలుపుకోవాలి ● మూత పెట్టి అర గంట సేపు నాననివ్వాలి ● పిండి ఎండినట్లుగా అనిపిస్తే మరి కాస్త పెరుగు కాని నీళ్లు కాని జత చేసి మరో పావు గంట సేపు ఉంచే యాలి ● స్టౌ మీద బాణ లిలో నూనె కాచాలి ● తయారుచేసి ఉంచు కున్న పిండిని నిమ్మ కాయ పరిమాణం లో చేతిలోకి తీసుకుని, నూనె పూసిన అరటి ఆకు మీద కాని, ప్లాస్టిక్ కవర్ మీద కాని గారె ఆకారంలో మృదువుగా ఒత్తి, కాగిన నూనెలో వేయాలి ● రెండు వైపులా దోరగా వేగిన తరవాత కిచెన్ పేపర్ టవల్ మీదకు తీసుకుని ఇష్టమైన చట్నీతో అందించాలి.



మద్దూర్ వడ

కావలసినవి: బియ్యప్పిండి – అర కప్పు; మైదా పిండి – పావు కప్పు; బొంబాయి రవ్వ – పావు కప్పు; ఉల్లి తరుగు – పావు కప్పు; తరిగిన పచ్చి మిర్చి – 2; కరివేపాకు – 6 రెమ్మలు (సన్నగా తరగాలి); కొత్తిమీర – 4 టీ స్పూన్లు (సన్నగా తరగాలి); ధనియాల పొడి – 3 టేబుల్ స్పూన్లు; ఉప్పు – తగినంత; ఇంగువ – చిటికెడు; గోరు వెచ్చని నూనె – ఒక టేబుల్ స్పూను; నీళ్లు – తగినన్ని; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా

తయారీ: ● ఒక పాత్రలో బియ్యప్పిండి, బొంబాయి రవ్వ, మైదా పిండి వేసి కలపాలి ● ఉల్లి తరుగు, పచ్చి మిర్చి తరుగు, కరివేపాకు తరుగు, కొత్తిమీర తరుగు, ధనియాల పొడి వేసి మరో మారు కలపాలి ● ఉప్పు, ఇంగువ జత చేయాలి ● గోరు వెచ్చని నూనె జత చేసి మరోమారు కలియబెట్టి, తగినన్ని నీళ్లు పోసి గారెల పిండి మాదిరిగా కలుపుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాచాలి ● పిండిని కొద్దికొద్దిగా చేతిలోకి తీసుకుని వడల మాదిరిగా ఒత్తి నూనెలో వేయాలి ● రెండువైపులా దోరగా వేగిన తరవాత కిచెన్ పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి.



చెరకు రసం పొంగలి

కావలసినవి: పెసర పప్పు – పావు కప్పు; బియ్యం – అర కప్పు; నెయ్యి – పావు కప్పు; ఏలకుల పొడి – పావు టీ స్పూను; పచ్చకర్పూరం – కొద్దిగా; జీడిపప్పులు – ఒక టేబుల్ స్పూను; కిస్మిస్ – ఒక టేబుల్ స్పూను; చెరకు రసం – 3 కప్పులు

తయారీ: ● బాణలిలో కొద్దిగా నెయ్యి వేసి కరిగాక పెసర పప్పు వేసి రంగు మారేవరకు వేయించి తీసేయాలి ● బియ్యాన్ని శుభ్రంగా కడిగి, నీళ్లు ఒంపేయాలి ● కుకర్‌లో పెసర పప్పు, బియ్యం వేసి కలపాలి ● చెరకు రసం జత చేసి బాగా కలియబెట్టి, స్టౌ మీద ఉంచి, నాలుగు విజిల్స్ వచ్చాక దింపేయాలి ● మూత తీశాక గరిటెతో మెత్తగా మెదపాలి ● స్టౌ మీద బాణలిలో మూడు టేబుల్ స్పూన్ల నెయ్యి వేసి కరిగాక జీడి పప్పులు వేసి గోధుమరంగు లోకి వచ్చేవరకు వేయించాక, కిస్మిస్ జత చేసి మరో మారు కలిపి దింపేయాలి ● సిద్ధంగా ఉన్న చక్కెరపొంగలిలో వేసి కలపాలి ● ఏలకుల పొడి, పచ్చ కర్పూరం జత చేసి మరోమారు కలిపి, నైవేద్యం పెట్టి, వేడి వేడిగా అందించాలి.



కొబ్బరి బూరెలు

కావలసినవి: మైదా పిండి – పావు కప్పు; బియ్యప్పిండి – పావు కప్పు; ఏలకుల పొడి – అర టీ స్పూను; కొబ్బరి తురుము – 3 కప్పులు; బెల్లం పొడి – ఒక కప్పు; నువ్వుల నూనె/నెయ్యి – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ● ఒక పాత్రలో మైదా పిండి, బియ్యప్పిండి వేసి బాగా కలపాలి ● తగినన్ని నీళ్లు జత చేస్తూ దోసెల పిండిలా కలుపుకోవాలి (ఎక్కువ పల్చగా ఉన్నా, ఎక్కువ గట్టిగా ఉన్నా బూరెలు సరిగా రావు) ● స్టౌ మీద బాణలిలో నువ్వుల నూనె/నెయ్యి వేసి కరిగాక కొబ్బరి తురుము వేసి పచ్చి వాసన పోయే వరకు వేయించాలి ● బెల్లం పొడి, ఏలకుల పొడి జత చేసి రెండూ కలిపి, కొద్దిగా గట్టి పడేవరకు ఉడికించాలి ● చల్లారాక ఉండలు చేసి పక్కన ఉంచుకోవాలి (మరీ పల్చగాను, మరీ గట్టిగాను కాకుండా చూసుకోవాలి) ● స్టౌ మీద బాణలిలో నెయ్యి/నువ్వుల నూనె వేసి కాచాలి ● తయారుచేసి ఉంచుకున్న కొబ్బరి ఉండలను, మైదా పిండి మిశ్రమంలో ముంచి తీసి కాగిన నెయ్యి/నూనెలో వేసి దోరగా వేయించి కిచెన్ పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి ● తినే ముందర బూరె మధ్యలో చిన్న రంధ్రం చేసి అందులో వేడి వేడి నెయ్యి వేసి అందిస్తే రుచిగా ఉంటాయి.



సేకరణ: వైజయంతి పురాణపండ

రాశి ఫలాలు (సౌరమానం)



జన్మనక్షత్రం తెలియదా? నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా? మీ పుట్టిన తేదీని బట్టి ఈ వారం (జనవరి 12 నుంచి 18 వరకు) మీ రాశి ఫలితాలు

డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

మేషం (మార్చి 21 - ఏప్రిల్ 19)

ఎప్పుడో చదువుకున్న కథే అయినా ఎప్పుడూ గుర్తుంచుకోవాల్సిన కథ. పక్షులన్నీ గుడ్లు పెట్టి ఓ ముసలి గద్దని కాపలాగా ఉండవలసిందిగా కోరి దానికి ఆహారంగా ఆ పక్షులు తెచ్చుకున్న తిండిలో కొంత ఆ గద్దకి ఇస్తుండేవి. పక్షులు ఆహారానికి వెళ్లిన వేళని గమనించి ఓ పిల్లి ఈ గద్దతో అతి వినయంగా మాట్లాడి పరిచయం పెంచుకుని మెల్లగా ఆ గుడ్లని తినేసిందనేది కథ. మీరు కూడా సంస్థకో వృత్తికో వ్యాపారానికో వెళ్లిన వేళ గమనించి మీ ఇంట్లో ఉన్న వృద్ధులతో మంచి పరిచయం పెంచుకుని ధనం లేదా వస్తువులు లేదా ఇంట్లో వయసు పిల్లలతో ప్రేమ వ్యవహారాలకి ప్రయత్నించవచ్చు. ఎంతో భద్రంగా ఉండండి.

ఒక పెట్టె నిండుగా బట్టలున్నవేళ ఇంకా వస్త్రాలని పైన పెడుతూ బలంగా నొక్కుతుంటే పెట్టెలో కిందనున్న వాటిలో ఏవైనా పగిలిపోయేవీ చిట్లి కారిపోయేవీ ఏమైనా ఉంటే మొత్తం అన్నీ పాడైపోతాయి కదా! అలాగే మీ పై అధికారులకి ఒత్తిడి పెరగ్గానే అది మీ మీద ఒత్తిడిగా కాగానే మీరు మీ కింది వారిమీద ఒత్తిడిని పెంచక తప్పదు కదా! ఈ దశలో కింది ఉద్యోగులతో తోటివారితో వాద వివాదాలూ తీవ్ర కోప సంఘటనలూ రావచ్చు. జాగ్రత్త అవసరం!

ఎందుకో అర్థం కాదుగానీ సొమ్ము అలా మంచి నీళ్లలా ఖర్చయ్యే అవకాశం కనిపిస్తోంది. ఏ పనికి ఆ పనే అతి ముఖ్యం అనిపిస్తుంది. కొద్ది జాగ్రత్తతో ఉండక తప్పదు. మీ మంచితనం కారణంగా మిత్రులు మీకు మంచి సహాయాన్ని అవసరమైన సందర్భాల్లో చేసి మీ మానసిక ఆందోళన తగ్గిస్తారు.

అతి మంచితనంతోగాని మొగమాటం కారణంగా గాని వాగ్దానాలని చేయకండి. హామీలని గుప్పించకండి.

లౌకిక పరిహారం: వాద వివాదాలకి దూరంగా ఉండండి. వాగ్దానాలు వద్దు.
అలౌకిక పరిహారం: శ్రీ విష్ణు సహస్రనామ పఠనం మంచిది.

మిథునం (మే 21 - జూన్ 20)

వైకుంఠపాళి అనే ఒక ఆట ఉంది. దానికే 'పరమపద సోపానం' అని కూడా పేరు. దానిలో ఉండే నిచ్చెన ద్వారా దాదాపు 5,6 మెట్లని ఒకే ఒక్కసారి ఎగరగలిగామనుకుంటాం గాని పొరపాటున ఆ నిచ్చెన పక్కనే ఉన్న పాము నోట్లో గాని పడ్డామా? మళ్లీ బయల్దేరిన చోటికే పడిపోవచ్చు కూడా. అలాగే మీరూ మీ ఉద్యోగస్థితీ బాగా ఎదిగిపోతూ ఉంటుంది. ఆనందంగా అనిపిస్తూ ఉంటుంది కూడా. అయితే స్థిరీకరణ(పర్మనెంట్) చేయని కారణంగా భయంగా ఉంటూంటుంది కూడా. భయమైతే ఉండచ్చేమోగాని వ్యతిరేక ఫలితాలుండవనే ఉండవు. ఒక దీర్ఘకాలిక సమస్యని గురించిన పరిష్కార మార్గాల కోసం కొందరు ముఖ్యుల్ని సంప్రదిస్తారు. అందరూ తలా ఒక మార్గాన్ని చెప్పే కారణంగా ఏం చేయాలో పాలు పోని పరిస్థితి కనిపిస్తుంది. సంతానానికి సంబంధించిన సమస్యే గనుక అయినట్లయితే దానికి పరిష్కారమనేది ప్రస్తుతానికి లభించకపోవచ్చు. నిరుత్సాహపడకండి.

ప్రస్తుతం జరుగుతున్న దశ ప్రకారం తేలికగా కావలసిన పని కూడా కొంత శ్రమ మీదనే సాధింపబడుతుంది. అయితే మీరు పడే శ్రమ మీకు ఉద్యోగంలో కొత్త అనుభవాన్ని కలిగిస్తూ ఆనందకరంగానూ, ప్రజయోజనాత్మకంగానూ ఉన్నట్లే అనిపిస్తుంది. అది నిజం కూడా. ఎంత బరువుని మనం మోయగలమో అంతే బరువుని తలకెత్తుకున్నా భుజం మీద వేసుకున్నా పెద్ద శ్రమ అనిపించదు. అదేమరి శక్తికి మించిన భారాన్ని మీద వేసుకుంటే మధ్యలోనే ఆగిపోవాలనిపిస్తుంది. ఇది శరీరాన్ని గురించి చెప్పే మాట కాదు. మీరు ఆలోచన విషయంలో మీ బుర్రకి మించిన ఆలోచనలని చేస్తున్న కారణంగా తొందరగా మానసికంగా అలసిపోతారు. మనసు అలసిపోతే దానిమీద ఆధారపడిన శరీరం కూడా అలసిపోతుంది. దాంతో విలువైన సమయం వ్యర్థమౌతుంది. ఎ క్కువ ఆలోచికండి. ఎలా జరిగితే అలా అని మాత్రమే అనుకోండి.

లౌకిక పరిహారం: నష్టాలేమీ లేవు. మానసికంగా ఎక్కువ ఆలోచించకండి.
అలౌకిక పరిహారం: ఆంజనేయ ద్వాదశ నామ పఠనం ఉత్తమం.

సింహం (జూలై 23 - ఆగస్ట్ 22)

మంచి గంధపు చెట్టు మంచి వాసనలనీయాలంటూ మరేదో పరిమళ ద్రవాన్ని దాని మీద కొట్టక్కర్లేదు. అలాగే మీరు గాని సరైన తీరులో అంటే అత్యాశ, దురాశల ప్రభావం లేకుండా ధర్మబద్ధంగా గాని వ్యాపారాన్ని చేయదలిస్తే మరెవరి సూచనలో సలహాలో మీకక్కరలేదు. ప్రారంభంలో మంచితనంతో వ్యాపారం ప్రారంభించి, మధ్యలో వ్యాపారాన్ని పట్టించుకోకుండా ఉండడంతో నష్టపోతున్నామని తెలిసి, ఆ నష్టాన్ని పూడ్చుకోవడం కోసం చివరనున్న అందరిమీదా ఆ నష్టభారాన్ని వేసే కారణంగానే అపకీర్తి పాలయ్యారు. పాలవుతున్నారు కూడా. ఒకే తీరు వేగంతో వెళ్తూంటే మీకు ఏ తీరు నష్టమూ ఉండదు. కీర్తినీ కోల్పోరు. ఇంకేముంది గాని, ఒడ్డుకి వచ్చేస్తారు. అనుభవం బాగానే వచ్చింది కాబట్టి ఇబ్బందులు తొలగిపోయినట్లే! శుభమస్తు.

వ్యాపారంలో నష్టం వచ్చినా మరో సంవత్సరంలో పూడ్చుకోవచ్చు గాని కుటుంబంలో కలహం ప్రారంభమైతే, వ్యాపారంలో లాగా వస్తువుల నష్టం కాదు. వ్యక్తుల మనశ్శాంతికి నష్టం కాబట్టి ఆ కలహం తీవ్రమౌతుంది – మనఃస్పర్ధలొస్తాయి. ఈ కుటుంబ వాతావరణాన్ని గురించి మరింతగా శ్రద్ధతో ఉండండి. చెప్పుకోకూడని మాట ఏమంటే అత్త, భార్య, తండ్రి, కొడుకు... అనే నిష్పత్తిలో వైరాలు వచ్చే అవకాశముంది. నిప్పు అంటుకోవడానికి ముందే ఆర్పేసినట్లయితే దగ్ధమైన వస్తువుల విలువ ఎంతో లెక్కించుకోనవసరం రాదు గదా! పూర్వ పరిచయాలని ఎప్పుడూ కొనసాగించుకునే చక్కని అలవాటున్న మీకు పరిచయాల వల్ల నష్టం కష్టం ఉండే వీలే లేదు. అయితే అప్పుడప్పుడు మీ సొంత పనులకి ఈ పరిచితుల పనులు అడ్డుపడుతూ మానసికాందోళన కలుగుతూ ఉంటుంది. ఆ మేరకి ఆర్థికంగా కలిసి వస్తూనూ ఉంటుంది. మొత్తమ్మీద దిగుల్లేదు.

లౌకిక పరిహారం: అత్యాశ, దురాశలు వద్దు. కుటుంబంలో కలహాలకి తావివ్వకండి.
అలౌకిక పరిహారం: గణపతి ఆరాధనం అవసరం.

వృషభం (ఏప్రిల్ 20 - మే 20)

సమాంతరంగా గీయబడిన జంట గీతల మధ్య ఎచ్చు తగ్గులు లేకుండా అక్షరాలని రాస్తే చూడ్డానికి ఎంత ముచ్చటగా ఉంటుందో అలా మీరు కూడా చక్కటి ప్రణాళికని వేసుకుని కచ్చితంగా అదే ప్రణాళిక ప్రకారం వెళ్తూ ఆనందాన్ని సొంతం చేసుకుంటారు. ఈ కారణంగా పనులన్నీ సకాలంలోనూ సక్రమంగానూ పూర్తయిపోతూ ఉత్సాహంగా ఉండగలుగుతారు. మీకు శత్రువులైన వారి ప్రణాళిక మీకు వెంట వెంటనే తెలుస్తుండే కారణంగా, ఎక్కడా శత్రుద్వేషానికి లొంగకుండా విజయాన్ని సాధించేస్తారు. విజయాన్ని సాధించేశాం కదా! అనే ఆనందంతో ఉండడంతో పాటు మీ మీద మిమ్మల్ని గెలవాలనేంత వ్యతిరేకత ఇంకా ఉండనే ఉందనే జాగరూకతతో ఉండడం తప్పనిసరి. విదేశీ ప్రయాణం మీకు తప్పనిసరి కావచ్చు. అయితే వెళ్లే అవకాశమున్నా కూడా మీకు కొన్ని పనుల కారణంగా వాయిదా పడవచ్చు. నిరుత్సాహ పడకండి. రుణాన్ని తీసుకోవలసిన అవసరం రాదు సరికదా లోగడ చేసిన రుణాలన్నీ కూడా పూర్తిగా తీరిపోతాయి. కొత్త సంవత్సరం నుంచి. మీరు తీసుకునే క్రమశిక్షణతో కూడిన జాగ్రత్త కారణంగా ఆర్థికంగా బలంగా ఉంటారు. దగ్గర బంధువులో లేదా ఆప్తులో మిమ్మల్ని ప్రార్థించే కారణంగా ఒక విద్యార్థిని దత్తత తీసుకుని చదివించే అవకాశముంది. కేవలం సహాయాన్ని చేసెయ్యడమే కాకుండా మీరిస్తున్న సొమ్ము సద్వినియోగపడుతున్నదీ లేనివీ పరిశీలించుకోవడం మంచిది. లేని పక్షంలో అది దుర్వినియోగపడే అవకాశం స్పష్టంగా ఉంది. మిత్రులో బంధువులో దానధర్మాలని చేస్తుంటే ఎవరేమనుకుంటారోననుకుంటూ మీరు కూడా తొందరపాటుతనంతో అలాగే కొంత మొగమాటం ఒత్తిడీ కారణంతోనూ దానధర్మాల వైపు మొగ్గు చూపే అవకాశముంది. ఆధ్యాత్మికత ప్రశాంతతకి కారణమయ్యే మాట నిజమే గాని, శ్రుతిమించిన పక్షంలో అందరితోనూ శత్రుత్వం ఏర్పడి మనసు అశాంతం కావచ్చు.

లౌకిక పరిహారం: ఒత్తిడికి లొంగకండి. మొహమాట పడకండి.
అలౌకిక పరిహారం: గణపతి అష్టోత్తర నామాలని రోజూ పఠిస్తూ ఉండండి.

కర్కాటకం (జూన్ 21 - జూలై 22)

మీరు పాటించే క్రమశిక్షణ, ఎంత దూరంలో ఎవరిని ఎంత దూరంలో ఉంచాలో, ఎంత మాట్లాడాలో ఎలా మాట్లాడి ఎదుటివారికి నొప్పి తెలియకుండా మత్తుని ఎక్కించాలో ఆ తెలిసిన వారైన కారణంగా మీ పనులన్నీ సుశీఘ్రంగా అయిపోతుండే కాలం వచ్చేసింది.

మీ నిజాయితీ కారణంగా మీ ద్వారా తీర్థయాత్రలకీ పుణ్యక్షేత్రాలకీ వెళ్లే ఉద్దేశ్యంతో ముఖ్యులైనవారు మిమ్మల్ని ఎంచుకుంటారు ప్రధానవ్యక్తిగా. వాళ్లకి దర్శనాలని చేయిస్తూ ఉంటే ఆ పుణ్యంలో పరోక్ష భాగస్వామ్యం మీకు లభిస్తుందిగా! తప్పక అంగీకరించి మీ సమయం అనుమతించినంతలో ఆ పనుల్ని చేయండి. భూమి కాని గృహం కాని పొలం గాని విశేషించి వాహనాన్ని గాని కొనుక్కునే అవకాశముంది. ప్రస్తుతం జరుగుతున్న అదృష్టయోగం కారణంగా అధికారులు మిమ్మల్ని బాగా ప్రశంసిస్తారు– వాళ్లకి తగినంత విరామం లేనికారణంగా వాళ్లు చేయాల్సిన గురుతర బాధ్యతలని కూడా మీ మీద పెట్టి, మీ చేతనే నిర్వహింపజేస్తారు. ఏదో మీరు తప్పు చేస్తే ఈ బాధ్యతలో తప్పు చేశాడని నిరూపిస్తూ మిమ్మల్ని తక్కువ చేయడానికో శిక్షించడానికో కానే కాదు. కేవలం మీ ఉన్నతత్వం కోసమే మరో కష్టమైన పనిని మీకు నేర్పించుదామనే ఆలోచనతోనే. ప్రభుత్వరంగ సంస్థలకి ఏ తీరుగా మీరు ముందుగా పెట్టుబటి పెట్టి పనుల్ని చేశారో వాటికి సంబంధించి మీకు రావలసిన సొమ్ము మొత్తం శ్రమ లేకుండా చేతికొచ్చే అవకాశముంది. స్థిరమైన ఆస్తుల్ని పట్టించుకోవలసిన అవసరం ఉంది. వాటిని అలా విడిచేయడం సరైన పనే కాదు. ఎవరైనా కొనుగోలుకంటూ వస్తే అమ్మాలనే ఆలోచనకి రావడం ఏమాత్రమూ సరికాదు. మీరు తీసుకున్న ఏమైనా భూములుంటే వాటికి చుట్టూ గోడలని నాలుగువైపులా నిర్మించుకుని తగిన తీరుగా సరిహద్దుల్ని పటిష్టం చేసుకోవడం ఎంతైనా అవసరం.

మీ అశ్రద్ధా పట్టించుకోనితనంతో ఓ గొప్ప అవకాశం జారిపోవచ్చు. శ్రద్ధపట్టి తోవలోకి తెచ్చుకోండి.

లౌకిక పరిహారం: ఆస్తుల్ని పట్టించుకోండి. శ్రమని చేసి వాటిని తోవకి తెచ్చుకోండి.
అలౌకిక పరిహారం: ఆదిత్య హృదయ స్తోత్రం తప్పనిసరి.

కన్య (ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)

'రెంటికీ చెడ్డ రేవడి' అనే ఓ సామెత ఉంది తెలుగులో. ఒక రజకుడు నది ఒడ్డున బట్టల్ని ఉతుకుతూ ఆరేస్తున్నాడు. పెద్ద గాలి వచ్చింది ముందుగా. ఆరిపోయిన బట్టల్ని తడిసిపోకుండా జాగ్రత్త చేసుకుందామని అటు పరిగెత్తాడు. ఇటు ఉతుకుతున్న బట్టలు ఆ గాలికి నదిలో పడి కొట్టుకుపోతుంటే ఇటు పరిగెత్తాడు. రెండు తీరుల బట్టల్నీ నష్టపోయాడని దానర్థం. సరిగ్గా మీరు కూడా పైన అనుకున్న సామెతకి ఉదాహరణ కాకుండా చూసుకోండి. మీరంటే గిట్టని కొందరు మిమ్మల్ని మరో చోటికి బదిలీ చేయించే ప్రయత్నంలో ఉండచ్చు. దానివల్ల వాళ్లకి కలిగే ఆనందం ఒకటే – మీరు ఇబ్బందికి గురికావడమే. వాళ్లు ఇలా రెండు పనుల్ని చేయలేరు – మీరు చేస్తున్న ఈ తీరు వారికి అసూయ కారణంగా నచ్చకపోవడమే. అందుకే భర్తృహరి అనే మహాకవి అన్నాడు – నిష్కారణంగా ఇతరుల్ని బాధపెట్టేవాళ్లని ఏమనాలో ఏమని పిలవాలో తెలియడంలేదని. ప్రయాణాల్లోనూ అలాగే శుభకార్యాల సందర్భంలోనూ అతిముఖ్యమైన వస్తువులు, ధనము, వస్త్రాలు, పత్రాలు ఉన్న సంచీ పెట్టె వంటివాటి విషయంలో సరైన వ్యక్తికి బాధ్యతనప్పగించడం అవసరం.

ఆర్థికంగా పెద్ద మార్పుండకపోవచ్చుగాని వ్యాపారం మొగమాటం కోసం రొక్కానికి కాకుండా చేస్తారు. కొద్ది జాగ్రత్త మాత్రం తప్పనిసరి. బాగా ఆలోచించే ఏ పనినైనా చేయడమనేది మీ లక్షణం. అదీ గాక దైవానుకూల్యం ఉన్న కారణంగా ప్రారంభించిన ప్రతి పనీ నిర్విఘ్నంగా పూర్తవుతుందనేది యదార్థం. వ్యవసాయదారులైతే పొలాలకి కొంత మరమ్మతు చేయించాల్సిన అవసరం, గోతిని పూడ్పించాల్సిన అవసరం, కుంట తవ్వించాల్సిన పరిస్థితి రావచ్చు. చేయిస్తారు. ఈ కారణాల వల్ల ఆర్థిక మాంద్యం తాత్కాలికంగా ఉంటుంది.

లౌకిక పరిహారం: వస్తు, వాహన, ద్రవ్యాల విషయంలో బాధ్యత పాటించండి.
అలౌకిక పరిహారం: సత్యనారాయణస్వామి వ్రతాన్ని వీలైనప్పుడు చేయించుకోండి.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ ॥ శనివారం
12-1-2019



పోలి పూర్ణం బూరెలు

కావలసినవి: మైదా పిండి – పావు కప్పు; బియ్యప్పిండి – పావు కప్పు; పెసర పప్పు – ఒక కప్పు; పంచదార – ఒకటిన్నర కప్పులు; కొబ్బరి తురుము – అర కప్పు; ఏలకుల పొడి – కొద్దిగా; నువ్వుల నూనె/నెయ్యి – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ● ఒక పాత్రలో మైదా పిండి, బియ్యప్పిండి వేసి బాగా కలపాలి ● తగినన్ని నీళ్లు జత చేస్తూ దోసెల పిండిలా కలుపుకోవాలి (ఎక్కువ పలచబడినా, ఎక్కువ గట్టిగా ఉన్నా బూరెలు సరిగా రావు) ● పెసర పప్పును రెండు గంటల పాటు నానబెట్టి, మిక్సీలో వేసి పలుకులుగా ఉండేలా మిక్సీ పట్టాలి ● ఈ పిండిని ఇడ్లీ రేకులలో ఇడ్లీలా వేసి కుకర్‌లో ఉంచి, విజిల్ పెట్టకుండా ఆవిరి మీద ఉడికించి దింపేయాలి ● చల్లారాక పిండిని చేతితో పొడిపొడిలా అయ్యేలా మెదపాలి ● పంచదార, కొబ్బరి తురుము, ఏలకుల పొడి జత చేసి కలిపాక, చిన్న చిన్న ఉండలుగా చేసి పక్కన ఉంచాలి ● స్టౌమీద బాణలిలో నెయ్యి/నూనె కాగాక తయారుచేసి ఉంచుకున్న ఉండలను మైదా పిండి మిశ్రమంలో ముంచి బూరెల మాదిరిగా వేసి బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించి తీసేయాలి ● వేడి వేడి బూరె మధ్యలో చిన్న రంధ్రం చేసి అందులో వేడి వేడి నెయ్యి వేసి అందిస్తే రుచిగా ఉంటాయి.



సూరన్ వడలు

కావలసినవి: కంద – పావు కేజీ; నిమ్మ రసం – అర టీ స్పూను; అల్లం తురుము – ఒక టీ స్పూను; తరిగిన పచ్చి మిర్చి – 1; కరివేపాకు తరుగు – ఒక టీ స్పూను; బియ్యప్పిండి – 3 టేబుల్ స్పూన్లు + ఒక టేబుల్ స్పూను; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా; ఉప్పు – తగినంత.

పొడి కోసం... మిరియాలు – అర టీ స్పూను; జీలకర్ర – అర టీ స్పూను; సోంపు – అర టీ స్పూను; మెంతులు – 4 గింజలు; లవంగాలు – 2.

తయారీ: ● కందను శుభ్రంగా కడిగి, తొక్క తీసి చిన్న చిన్న ముక్కలుగా తరగాలి ● తగినన్ని నీళ్లు జత చేసి కుకర్‌లో ఉంచి ఉడికించి దింపేయాలి ● విజిల్స్ వచ్చాక నీళ్లు వేరు చేసి, ముక్కలను చల్లారబెట్టాలి ● మిక్సీ జార్‌లో మిరియాలు, జీలకర్ర, సోంపు, మెంతులు, లవంగాలు వేసి రవ్వలాగ వచ్చేలా పొడి చేయాలి ● ఒక పాత్రలో కంద ముక్కలు, మిరియాల పొడి మిశ్రమం, కొద్దిగా బియ్యప్పిండి, నిమ్మ రసం, అల్లం తురుము, తరిగిన పచ్చిమిర్చి, కరివేపాకు, ఉప్పు వేసి గారెల పిండిలా కలుపుకోవాలి ● స్టౌ మీద పాన్ ఉంచి వేడయ్యాక కొద్దిగా నూనె వేసి కాచాలి ● సిద్ధంగా ఉన్న కంద మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేతిలోకి తీసుకుని, వడల మాదిరిగా చేతితో మృదువుగా ఒత్తి, నూనెలో వేయాలి ● రెండువైపులా దోరగా వేగిన తరవాత, కిచెన్ పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి.

పాశుర ప్రభాతం 28వ రోజు



నీట ముంచినా, పాల ముంచినా నీదే భారమని నమ్మి భగవంతుడనే గొప్ప అండను ఆసరాగా చేసుకుని జీవితాన్ని గడిపే అమాయకత్వం, అఖండ నమ్మకం భక్తి.

**“కరవైగళ్ పిన్‌శెన్రు కానమ్ శేర్న్దుణ్బోమ్
అరివొన్రు మిల్లాదవాయ్‌క్కులత్తు, ఉన్దన్నై
ప్పిరవి పెరున్దనై, పుణ్ణియమ్ యాముడైయోమ్,
కురైవొన్రు మిల్లాద గోవిన్దా! ఉన్దన్నోడు
ఉరవేల్ నమక్కిఙ్గొళిక్క వొళియాదు,
అరియాద పిళ్ళైగళోమ్, అన్బినాల్ ఉన్దన్నై
చ్చిరుపే రళైత్తనవుమ్ శీరియరుళాదే
ఇరైవా నీతారాయ్ పరై యేలో రెమ్బావాయ్”**

భావం: గోకులమే జాతిగా మారి అభిమానించే మాధవుడూ యాదవుడేనని సంబరపడుతూ బతికే అమాయకప్రాణులం మేము. పశువులను మేపుతూ కాలం గడిపే మేము శుచీశుభ్ర మెరుగక పోయినా స్వచ్ఛమైన మా మనస్సుల్లో పూర్ణరూపుడిగా, నీ చరణాలే శరణంగా ఆరాధిస్తున్నాం. గోవిందా! ఏ జన్మ పుణ్యఫలమో నీతో మాకున్న సంబంధం అజరామరం. లోకజ్ఞానం లేని వారము. ప్రేమతో నిన్ను అనేక విధాలుగా పిలుచుకున్నాము. అందుకు నీవు కోపం తెచ్చుకోక మా అభీష్టాలను నెరవేర్చి, మా అర్చనను స్వీకరించి, మా వ్రతంలో నిజరూపమై మమ్మనుగ్రహించమంటూ గోదాబృందం వేడుకుంటుంది.



ఖర్జూరం-పల్లీ/బాదం బొబ్బట్లు

కావలసినవి: గోధుమ పిండి – ఒక కప్పు; మైదా పిండి – ఒక కప్పు; ఖర్జూరాల ముద్ద – ఒక కప్పు; వేయించిన పల్లీలు/బాదం పప్పులు – ఒక కప్పు; నువ్వుల నూనె/నెయ్యి – తగినంత; ఉప్పు – కొద్దిగా

తయారీ: ● ఒక పాత్రలో మైదా పిండి, గోధుమ పిండి, ఉప్పు వేసి బాగా కలపాలి ● తగినన్ని నీళ్లు జత చేసి చపాతీ పిండిలా కలుపుకోవాలి ● నూనె జత చేసి బాగా మెత్తగా కలిపి, పైన తడి వస్త్రం ఉంచి, గంట సేపు పక్కన ఉంచాలి ● మిక్సీలో పల్లీలు/బాదం వేసి మెత్తగా పొడి చేయాలి ● ఖర్జూరాల ముద్ద జత చేసి మరోమారు మెత్తగా చేయాలి ● ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలోకి తీసుకోవాలి ● గోధుమపిండి మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి ● అరటి ఆకు మీద కాని, నూనె పూసిన ప్లాస్టిక్ పేపర్ మీద కాని ఈ ఉండను ఉంచి చిన్న సైజు పూరీలా ఒత్తాలి ● ఖర్జూరం మిశ్రమం కొద్దిగా ఉంచి, అంచులు మూసేయాలి ● ప్లాస్టిక్ కవర్ మీద బొబ్బట్టు మాదిరిగా పల్చగా ఒత్తాలి ● స్టౌ మీద పెనం వేడయ్యాక, ఈ బొబ్బట్టును వేసి రెండువైపులా నెయ్యి వేస్తూ దోరగా వేయించి ఒక ప్లేటులోకి తీసుకోవాలి ● ఇలా అన్నీ తయారుచేసుకోవాలి ● తినే ముందు బొబ్బట్లు మీద కొద్దిగా నెయ్యి వేసి వేడివేడిగా అందిస్తే రుచిగా ఉంటుంది.



కొబ్బరి బొబ్బట్లు

కావలసినవి: మైదా పిండి – ఒక కప్పు; గోధుమ పిండి – ఒక కప్పు; నువ్వుల నూనె/నెయ్యి – పావు కప్పు; ఉప్పు – చిటికెడు; పచ్చి కొబ్బరి తురుము – 2 కప్పులు; బెల్లం పొడి – 2 కప్పులు; ఏలకుల పొడి – అర కప్పు.

తయారీ: ● ఒక పాత్రలో మైదా పిండి, గోధుమ పిండి, నూనె, ఉప్పు వేసి కలపాలి ● కొద్దికొద్దిగా నీళ్లు జత చేస్తూ చపాతీ పిండిలా కలిపి, పైన తడి వస్త్రం మూతలా వేసి గంట సేపు నానబెట్టాలి ● మందపాటి పాత్రలో నెయ్యి వేసి కరిగించాలి ● పచ్చికొబ్బరి తురుము వేసి పచ్చి వాసన పోయేవరకు వేయించాలి ● బెల్లం పొడి జత చేసి ఆపకుండా కలుపుతుండాలి ● ఏలకుల పొడి జత చేసి మరోమారు కలియబెట్టాలి ● మిశ్రమం దగ్గర పడగానే దింపేసి, చల్లారాక చిన్న చిన్న ఉండలు చేసి పక్కన ఉంచాలి ● మైదా పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి, ఒక్కో ఉండను చిన్న పూరీలా ఒత్తాలి ● కొబ్బరి ఉండను మధ్యలో ఉంచి, నాలుగువైపులా మూసేయాలి ● నూనె పూసిన అరటి ఆకు మీద కాని, ప్లాస్టిక్ కవర్ మీద కాని ఉంచి, చేతితో పల్చగా ఒత్తాలి ● స్టౌ మీద పెనం వేడయ్యాక తయారుచేసి ఉంచుకున్న బొబ్బట్టును పెనం మీద వేసి, రెండు వైపులా నెయ్యి వేసి కాల్చాలి ● బొబ్బట్లను ప్లేట్‌లో ఉంచి, కరిగించిన నెయ్యి వేసి వేడివేడిగా అందించాలి.

నాటుకోడి పులుసు

కావలసినవి: నాటుకోడి ముక్కలు – 200 గ్రాములు; గసగసాలు – 150 గ్రాములు; ఎండుకొబ్బరి పొడి – 100 గ్రాములు; నూనె – 4 టేబుల్ స్పూన్లు; అల్లం + వెల్లుల్లి పేస్ట్ – 2 టీ స్పూన్లు ; చింతపండు గుజ్జు – 2 టేబుల్ స్పూన్లు; ఉల్లిపాయలు – 2 (సన్నగా తరగాలి); టొమాటో – 1 (సన్నగా తరగాలి); జీలకర్ర – టీ స్పూన్; పచ్చి మిర్చి – 3; పసుపు – పావు టీ స్పూను; మిరప కారం – టీ స్పూన్; ఉప్పు – తగినంత; గరం మసాలా – అర టీ స్పూన్; ధనియాల పొడి – అర టీ స్పూన్; కొత్తిమీర – టేబుల్ స్పూన్.

తయారీ: ● గసగసాలు వేయించి ఎండుకొబ్బరి పొడి కలిపి ముద్ద చేసి ఉంచాలి ● నాటుకోడి ముక్కలలో అల్లం వెల్లుల్లి పేస్ట్, పసుపు, కారం, ధనియాల పొడి వేసి కలిపి అర గంట పక్కనుంచాలి ● స్టౌ మీద బాణలిలో నూనె వేసి జీలకర్ర, ఉల్లి తరుగు వేసి, వేయించాక, టొమాటో తరుగు నిలువుగా తరిగిన పచ్చి మిర్చి వేసి కలపాలి ● అల్లం వెల్లుల్లి ముద్ద మిశ్రమంలో ఉంచిన నాటుకోడి ముక్కలను జత చేసి బాగా కలియబెట్టాలి ● కొద్దిగా ఉడికిన తరవాత కారం, ఉప్పు, గసగసాల మిశ్రమం, చింతపండు గుజ్జు వేసి కలపాలి ● ముక్క ఉడికాక మంట తగ్గించి గరం మసాలా, ధనియాల పొడి, కొత్తిమీర వేసి, మూడు నిమిషాలు ఉంచి దించాలి.






నువ్వుల బూరెలు

కావలసినవి: – మైదా పిండి – పావు కప్పు; బియ్యప్పిండి – పావు కప్పు; ఏలకుల పొడి – అర టీ స్పూను; వేయించిన నువ్వులు – ఒక కప్పు; బెల్లం పొడి – ఒక కప్పు; పాలు – కొద్దిగా; నువ్వుల నూనె/నెయ్యి – డీప్ ఫ్రైకి సరిపడా.


తయారీ: ● ఒక పాత్రలో మైదా పిండి, బియ్యప్పిండి వేసి బాగా కలపాలి ● తగినన్ని నీళ్లు జత చేస్తూ దోసెల పిండిలా కలుపుకోవాలి (ఎక్కువ పలచబడినా, ఎక్కువ గట్టిగా ఉన్నా బూరెలు సరిగా రావు) ● మిక్సీలో నువ్వులు, బెల్లం పొడి, ఏలకుల పొడి వేసి అన్నీ కలిసే వరకు మిక్సీ పట్టాలి ● కొద్దిగా పాలు జత చేస్తూ, ఉండలు చేసి పక్కన ఉంచుకోవాలి (మరీ పల్చగాను, మరీ గట్టిగాను కాకుండా చూసుకోవాలి) ● స్టౌ మీద బాణలిలో నెయ్యి/నువ్వుల నూనె వేసి కాచాలి ● తయారుచేసి ఉంచుకున్న నువ్వుల ఉండలను మైదా పిండి మిశ్రమంలో ముంచి, కాగిన నెయ్యి/నూనెలో వేసి దోరగా వేయించి కిచెన్ పేపర్ టవల్ మీదకు తీసుకోవాలి ● బూరె మధ్యలో చిన్న రంధ్రం చేసి అందులో వేడి వేడి నెయ్యి వేసి అందిస్తే రుచిగా ఉంటాయి.

ముగ్గు-ముచ్చట





చలమల్ల సంజన, లింగోజిగూడెం, యాదాద్రి
25 చుక్కలు, 5 వరుసలు, 5 వచ్చేవరకు





చంద్రకళ ఆలూరు, జాంబాగ్, హైదరాబాద్
15 చుక్కలు, 1 వచ్చే వరకు, సరిచుక్క

ముగ్గులకు ఆహ్వానం ముగ్గులు పంపవలసిన చిరునామా ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com

తుల
(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)

పట్టుదలతో ఉన్నవాళ్లకి తమ పట్టు నెగ్గిందా? లేదా? అనేదే ప్రధానమనిపిస్తుంది తప్ప, ఇలా నెగ్గడం వల్ల వ్యవహారం ఇంకా జటిలం (పీటముడి) అవుతోందా? అనే ఆలోచనే రాదు. కళ్లు మూసుకోవలసిందని చెప్పి, మనచేత కళ్లని మూయించి ఎవరైనా మనని తీసుకెళ్తుంటే ఎలా ఉంటుందో అలా, మిమ్మల్ని పూరితగా కననీకుండా విననీకుండా ఆలోచించుకోనీకుండా అకస్మాత్తుగా పరిస్థితిని తలకిందులుచేస్తూ మీ తల్లిదండ్రులు గాని, ఆప్తులు గాని, మిత్రులు గాని లేదా ఈ అందరూ గాని చేస్తూ మీ చక్కని సంసార జీవితాన్ని ముఖ్యంగా దాంపత్య ఐకమత్యాన్ని దెబ్బతీయచ్చు. సలహా, సూచన... ఇచ్చేవాళ్లు కాదుగా దాని ప్రకారం నడిచి శుభ, అశుభ ఫలితాలని అనుభవించేది! అందుకని ముందుకి ముందే అర్థం చేసుకుని మీకు మీరుగా నిర్ణయించుకుని తోవ మారడం ఎంతైనా మంచిది!

ఇంతకీ విషయమేమంటే మిమ్మల్ని విజయం వరిస్తుంది. సంబరపడిపోతారు. విడాకులు మంజూరు కావడం, కలసి మెలసి ఉమ్మడిగా ఉన్న సంసారం వేర్వేరు పడడం, పొలం గట్టుల్ని తెంపుకోవడం, మాటా మాటా వచ్చి పరస్పరం పలకరింపులు లేకుండా చేసుకోవడం... వంటివి శుభాలా? అశుభాలా? గమనించుకోండి. ఈ రోజు విజయం కాదు. రేపటి రోజున కూడా విజయమేనా? అర్థం చేసుకోగలగాలి! శారీరకంగా జీర్ణక్రియ దెబ్బతినే అవకాశముంది. ఉద్యోగ రీత్యా తీవ్ర శ్రమ ఉండే కారణంగా శారీరక మానసిక సంబంధంగా బాగా అలసిపోయే అవకాశముంది. పైఅధికారులతో విశేషించి ప్రభుత్వంతో విరోధించే సూచనలున్నాయి. దానికోసం బాధ్యత తీసుకున్న వ్యక్తి మొదట్లో బాగా పట్టించుకున్నా ప్రస్తుతం ఆయన వ్యవహార శైలి మారే తీరులో, లేదా మారినట్లుగా అనిపించవచ్చు.

లౌకిక పరిహారం: పరిష్కారం మీకు తెలుసు. ఏకాంతంగా ఆలోచించి ఒడ్డున పడండి.
అలౌకిక పరిహారం: దుర్గా స్తోత్ర పఠనం మంచిది.

వృశ్చికం
(అక్టోబర్ 23 - నవంబర్ 21)

ఈ రోజు ఏ శాకపాకాలు చేసుకుందామనేది అత్యల్ప నిర్ణయం. ఫలాని ఊరికి ఏ వాహనం మీద లేదా ఏ మార్గాన వెళ్దామనుకునేది అల్ప నిర్ణయం. ఎవరితో పనిని సాధించడానికి ఏ తీరున మాట్లాడి తీరాలి అనేది ముఖ్య నిర్ణయం. ఏ పొలాన్ని అమ్మాలి? అందరూ వ్యతిరేకిస్తున్నా ఏ వ్యక్తిని పెళ్లాడాలి? లేదా పెళ్లి చేసుకుని ఎలా విడిపోవాలి? వంటివి సాహసోపేత నిర్ణయం జాబితాలోకొస్తాయి. అలాంటి సాహసోపేత నిర్ణయం దాదాపుగా ఈ వారంలో తీసుకోవలసి రావచ్చు. తొందరపడకండి.

మీకొచ్చే ఆదాయాన్ని దాచుకునేచోట మరొకర్ని కూడా దానికి సంబంధించిన వ్యక్తిగా నియమిస్తారు. అది ప్రస్తుత దశలో అనుకూలమే. గృహ, వాహన, భూ లాభాలున్నాయి. కాలమంతా వ్యథ లేకుండానే నడుస్తుంది. గాని, ఓ ముఖ్యమైన అపరిష్కృత సమస్య – దాంపత్య బంధానికి చెందిన సమస్య మాత్రం – అలా ఇబ్బంది కలిగిస్తూనే ఉంటుంది.

దైవానుగ్రహం పుష్కలంగా ఉన్న కారణంగా మానసికంగా భయపడాల్సిన అవసరం ఏమాత్రమూ లేదని గ్రహించండి. శారీరకమైన, మానసికమైన ఒత్తిడుల కారణంగా ఉద్యోగాన్ని మీరు గాని విడిచినట్లయితే, వృత్తిని గాని మార్చుకోదలచినట్లయితే, చేస్తున్న వ్యాపారం నుండి బయటికి వచ్చేదలచినా ఉత్తరాయణం వరకూ (జనవరి 15) ఆగడమే మంచిది – అనుకూల ఫలితాలే ఉంటాయి కూడా.

న్యాయస్థానాల నుండి తీర్పు రాకుండా వాయిదానే పడుతుంది. భయం లేకుండానూ వ్యవహార రీత్యా కూడా ప్రతి వాయిదాకీ వెడుతూ ఉండడమనేది మీకు లౌకికంగా, మానసికంగా ధైర్యాన్నిచ్చేదీ, మీ నిజాయితీని తెలిపేదీ అవుతుంటే, కాలం అదృష్టయోగం ప్రకారం శుభకాలం అంటే ఉత్తరాయణం వరకూ ఆగడం పరమ అనుకూలం.

లౌకిక పరిహారం: కొత్త పనులు ప్రారంభానికి ఉత్తరాయణం (జనవరి 15) వరకూ ఆగండి.
అలౌకిక పరిహారం: శని శ్లోకాన్ని ప్రతిరోజూ 361 మార్లు పారాయణాన్ని చేస్తూనే ఉండండి.

ధనుస్సు
(నవంబర్ 22 - డిసెంబర్ 21)

ఇంట్లో శుభకార్యం జరగడం మంచిదే. అయితే ఏ కులాంతర వివాహమోగాని తప్పని సరిగా జరగవలసి వస్తుంటే, దానికి కుటుంబ సభ్యుల పరిపూర్ణ ఆమోదమూ ఉండకపోవచ్చు కాబట్టి అగతిక గతే (తప్పనిసరి పరిస్థితుల్లో ఒప్పుకున్న పనే). అలాగే ఏదో అకస్మాత్తుగా ద్రవ్యం కావలసి వచ్చినప్పుడు ద్రవ్యాన్ని తెచ్చుకోవడమనేది సరైన పనే గాని, పొలాన్నో, ఇంటినో అమ్మడం లేదా తాకట్టు పెట్టుకోవలసి రావడమనేది అగతిక గతే. ఇలాంటివి వచ్చే అవకాశముంది కాబట్టి కుటుంబ వ్యవహారాల పట్ల జాగరూకతతో ఉండడం మరింత తప్పనిసరి.

అతి ముఖ్య కుటుంబ కార్యం అత్యంత ముఖ్య ఉద్యోగ విషయం... ఇలా వ్యక్తిని తీవ్రంగా మథనపడవేసే తీరులో సమస్య వచ్చే అవకాశముంది.

అయితే దైవానుకూల్యం కారణంగా ఒడ్డున పడుతూ ఉంటారు. ఇంట్లోకి అకస్మాత్తుగా కోతిగాని తలుపు తీసి ఉన్న చోటునుండి లోపలికి చొరబడితే అది బయటికి ఏ హానీ చేయకుండానూ, ఏ వస్తువునీ పట్టుకు పోకుండానూ వెళితే ఎంత ఆనందం? అదే మీ ప్రస్తుత పరిస్థితి. దైవమే శరణ్యం! వ్యతిరేకత అనేది లేకపోవడ మనేది కూడా ఆనంద కరమే కదా! ఆందోళన ఉన్నా ఆనందకరమైన ముగింపు ఉంటే అదెంత వినోదాత్మక సంఘటనం మరి!

ఎంత వద్దని మీరు నిరోధిస్తున్నా, అనిష్టతని చూపెడుతున్నా కూడా ఉద్యోగంలో పై స్థానం లేదా తాత్కాలికంగా పదవీ ఉన్నతి లేదా మరొక పెద్ద బాధ్యతని తగిలిస్తారు. దాంతో మరింతగా కుటుంబ పరిస్థితి అస్తవ్యస్తం కావచ్చు. దానిక్కారణం ఆ పదవీ నిర్వహణ మరోచోట ఉండి చేయాల్సినది కావడమే. దైవమే శరణు.

లౌకిక పరిహారం: ఆందోళన, ప్రశాంతత అనే ఉయ్యాలలో ఎలా ఊగాల్సి వస్తే అందుకు సిద్ధమై ఉండండి.
అలౌకిక పరిహారం: మీకిష్టమైన దైవాన్ని ధ్యానం చేయండి.

మకరం
(డిసెంబర్ 22 - జనవరి 19)

కుజుడూ గురువూ శుక్రుడూ అనుకూలురుగా ఉన్నా రవి మాత్రం మిశ్రమ ఫలితాన్నిచ్చేవాడౌతున్న కారణంగా ఒత్తిడి రావలసిన పరిస్థితి ఉన్నా అలా పెనుగాలికి నల్లని దట్టమైన మేఘం ఒక్కసారిగా దూరానికి పారిపోయిన విధంగా ఇబ్బంది తొలిగిపోతూ ఉంటుంది. మీకు మానసిక ప్రశాంతతనిస్తూనే ఉంటుంది. మీలో ఉన్న గొప్ప గుణం – నాన్చుడు లేకపోవడం, మంచో చెడో ఏదో ఒక నిర్ణయానికంటూ వచ్చేసి విషయాన్ని తెగ్గొట్టేసి మనశ్శాంతిని తెచ్చుకోవడం. లోకంలో ఎక్కువమందికి లేని విధానమిదే. ఆస్తిని అమ్మి రుణాలని పూర్తిగా తొలగించేసుకోవడాన్ని చేసేసి ప్రశాంతతని అనుభవిస్తూ ఉండి ఉంటారు. ఇక్కడే ఈ విషయంలోనే కాదు – కూతురూ అల్లుడూ, కొడుకూ కోడలూ సంసార విషయంలో కూడ పొరపొచ్చాలొస్తే కూడ వెంటనే నిర్ణయాన్ని నిర్భయంగా చెప్పేసే గట్టి గుండెతనం మీకు ఉండడం నిజంగా ప్రశంసనీయం. నిప్పుకి నీరూ, నదికి ఒడ్డు, వాయువుకి అడ్డంగా చెట్ల వరుసా ఎలా అడ్డు అయిన విషయంలో అలాగే మీ నిర్ణయాన్ని అమలుకా(నీయ)కుండా మీకూ కుటుంబసభ్యుల అడ్డు ఉంటూ ఉంటుంది. అయినా వాళ్లని ఒప్పించగలగడంలో మీకున్న వాక్‌శైలి అమోఘం– కార్యసాధకం కూడ. ‘ఈ సంవత్సరం పంటలు పండడానికి తగినంత వర్షాన్ని ఇస్తా’నంటూ ఇంద్రుడు ప్రతి సంవత్సర ప్రారంభంలోనూ వర్షవిధానాన్ని గురించి దేవతాసభలో ఉగాదినాడు ఎలా తన ప్రణాళికని వివరిస్తాడో అలా ఇటు ఆదాయమనేది అటు ఖర్చులకి సరిపడేంతగా ఉంటుందని మీకు మీరుగా లోలోపల అనుకోండి. అనవసరవ్యయాలు – అంటే అవి కొనని పక్షంలో ఇంటి నడక ఆగిపోదనుకునే ఖర్చులైన వస్త్రాలు ఆభరణాలు వంటివాటికోసం చేయబోయే ఖర్చుల్ని అదుపుచేసుకుని తీరాలి. ముందునాటికి పెద్ద వ్యయం – శుభకార్యం సందర్భంగా ఎదురుచూస్తోంది కాబట్టి జాగ్రతగా ఉండండి ఖర్చువిషయంలో.

లౌకిక పరిహారం: అంచనావేసుకుని ఖర్చు చేసుకోవలసిందే.
అలౌకిక పరిహారం: జగదంబకి సంబంధించిన స్తోత్రాలని చదువుకుంటూ ఉండండి.

కుంభం
(జనవరి 20 - ఫిబ్రవరి 18)

అన్ని గ్రహాల అనుకూలతా (ఒక్క రాహుకేతువుల తప్ప) ఉన్న కారణంగా మీకు ప్రతి విషయంలోనూ స్థిరమైన ఆలోచనలే వస్తాయి. ఆ అన్ని ఆలోచనలూ విజయాన్నే ప్రసాదిస్తాయి. ఆనందం ఐశ్వర్యం సర్వత్ర అనుకూలతా ఇంటా బయట కూడ మనశ్శాంతీ ఉండే కారణంగా మీ బుద్ధి దానధర్మాలమీదికి మళ్లుతుంది. అలాటి ఆలోచన కలగడానిక్కారణం మీకున్న స్థితిమంతుల విధానం మాత్రమే కాకుండా మీ తల్లిదండ్రుల సంస్కారఫలితం కూడ. అర్హులూ మీరిచ్చిన దానాన్ని వారికి వారు మాత్రమే నిరంతరం వినియోగించుకునేవారైన పక్షంలో దానం సత్ఫలితాన్నిస్తుందని గ్రహించి అలాటివారికే దానమియ్యండి. సంతానమంతా కోరే కారణంగా విదేశాలకి వెళ్లే అవకాశముంది. సంతానం విదేశాల్లో స్థిరపడే ఉద్దేశ్యంతో ఇళ్లూ అలాగే వ్యాపార సంస్థలూ కొందామనిగాని అనుకుంటూంటే వ్యతిరేకించనూ వద్దు. ప్రోత్సహించి కొనిపించనూ వద్దు. తటస్థంగానే ఉండండి. దైవనిర్ణయానికీ కాలం నిశ్చయించే తీరుకీ విడిచెయ్యండి. మీరనుకున్న సమయానికి శుభకార్యం జరగడానికి ఓ చిన్న అభ్యంతరం వచ్చి వాయిదా పడే సూచన లభిస్తే ఆందోళన పడకండి. అనుకోని ఖర్చులు వచ్చినప్పటికీ కంగారుపడకండి. అంతా సవ్యంగానే జరుగుతుంది. అలాగే కొన్ని ప్రయాణాలు సత్ఫలితాలనియ్యని పక్షంలో నిరుత్సాహపడకండి. బంధుమిత్రులతో ఎంత అవసరమో అంతే మాట్లాడడం మంచిది తప్ప, పరిచయాతిశయంతో ఎక్కువెక్కువ మాటలూ వేళాకోళాలూ ప్రస్తుత గ్రహస్థితిలో అంత మంచిది కాదు. కుటుంబ రహస్యాన్ని దాచి ఉంచడంలో మీకు మీరే సాటి అనేది నిజం. అయితే శారీరకమైన వ్యాధికి సంబంధించిన సూచనగాని ఉంటే ముఖ్యంగా నేత్ర – శరీర మాంస సంబంధమైనవి. వెంటనే బహిరంగ పరచాల్సిందే!

లౌకిక పరిహారం: దానం సద్వినియోగమౌతుందని అన్పించినప్పుడే అలాటివారికే ఇయ్యండి.
అలౌకిక పరిహారం: శ్రీ లలితా సహస్రనామస్తోత్ర పారాయణం మంచిది.

మీనం
(ఫిబ్రవరి 19 - మార్చి 20)

వ్యసనమనేది ఒక్కసారిగా బలంగా అయిపోదు. మెలమెల్లగా పెరుగుతూ పెరుగుతూ పోయి ఇక సరిచేయలేనంత స్థాయికి ఎదిగిపోతుంది. ఇలా చెప్పడం ఎందుకంటే మీ దంపతిలో మనస్పర్ధలనేవి ఒక్కసారిగా ముదిరిపోవు. చిన్న చిన్నగా కలహం ప్రారంభమై పరిస్థితి మరోలా కావచ్చు. కాబట్టి ఒకరికి మరొకరు తగ్గి ఉంటూ శ్రుతి మించకుండా చూసుకోండి. దంపతుల మధ్య కలహం వల్ల నష్టపోయేది మీకంటె మీ సంతానమని గ్రహించుకోండి. తల్లి తండ్రి ప్రేమలేని కారణంగానే సూర్యునికి పుత్రుడైనప్పటికీ కర్ణుడు దుష్టచతుష్టంలో ఒకడుగా అయ్యాడు. జాగ్రత! ఓ మార్గంలో ప్రయాణిస్తూ ఉంటే ఎగుడు దిగుడులూ గోతులు గొప్పులూ ఉన్నట్టే మీ వ్యాపారం వృత్తి అనే వాటిల్లో కూడ ఎగుడు దిగుడులు తప్పవు. అంతమాత్రాన నిరుత్సాహపడడం సరికాదు. సంతానం ఆరోగ్యంలో కొద్దిగా తేడా కన్పించవచ్చు. సరైన వేళలో భోజనం సరైన పోషకాహారం గాని పెట్టడం జరిగితే వైద్యశాలకి వెళ్లాల్సిన అవసరం రాదు. కొద్దిగా తీరుబడి చేసుకుని ఆరోగ్యాన్ని సరిచేయండి. సంతానం గాని యౌవనవయసులో ఉంటే ముఖ్యంగా వాళ్ల ప్రవర్తనా, స్నేహాలూ, చేస్తున్న ఖర్చులూ.. వంటి వాని గురించి అవగాహనతప్పనిసరి అని గ్రహించండి. చదువు మీద శ్రద్ధ తగ్గుతోందనిపిస్తే అనవసర పరిచయాలు పెరిగాయని గ్రహించి వెంటనే తగిన తీరులో స్పందించండి. పిల్లల విషయంలో ఏ ఒక్కరూ గారాబాన్ని చేసినా, భయం లేకుండా ఉండే తీరుని నేర్పినా మీ ఇద్దరూ నష్టపోవడానికి సిద్ధమైనట్టే. అప్పాచెల్లెళ్ల మధ్య, అన్నా తమ్ముళ్ల మధ్యా మాటా మాటా వచ్చే అవకాశముంది. కాబట్టి, ఎంత అవసరమో అంతే మాట్లాడడం, అంతేకాక వెంటనే మీకు మీరుగా తక్కువ మాట్లాడుతూ ఉండడం శ్రేయస్కరం.

లౌకిక పరిహారం: ఆరోగ్యం పట్ల అవగాహనతో ఉంటే వైద్యశాల అవసరం రాకపోవచ్చు.
అలౌకిక పరిహారం: ఆంజనేయ స్తోత్రాన్ని రోజుకి ముమ్మారు పఠించడం మంచిది.

సాక్షి ఫ్యామిలీ సినిమా
విజయవాడ ॥ శనివారం
12-1-2019

నేను పెద్ద హీరోని అనుకోను

- వెంకటేశ్



● 'దిల్' రాజు, వెంకటేశ్, వరుణ్‌తేజ్, మెహరీన్ రాజేంద్రప్రసాద్, తమన్నా, అనిల్ రావిపూడి, శిరీష్

''సాధారణంగా పండగలకు వచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌ను ప్రేక్షకులు ఆదరిస్తారు. ఈ సంక్రాంతికి 'ఎఫ్ 2' సినిమా రావడం చాలా ఆనందంగా ఉంది. నేను, వరుణ్ సంక్రాంతి అల్లుళ్లుగా వస్తున్నాం'' అని వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్, వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్లుగా 'దిల్' రాజు నిర్మించిన చిత్రం 'ఎఫ్ 2'. 'ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' అన్నది ఉపశీర్షిక. ఈ సినిమా ఈ రోజు విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో వెంకటేశ్ మాట్లాడుతూ– ''నేను పెద్ద హీరోని అని ఎప్పుడూ అనుకోను. కథ, దర్శకుడు అనిల్‌ని నమ్మి ఈ సినిమా చేశా. 'దిల్' రాజుగారితో మంచి అనుబంధం ఉంది'' అన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''కలియుగ పాండవులు' చిత్రంతో వెంకటేశ్‌గారి అభిమానిని అయ్యా. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' తర్వాత ఆయనతో రెండోసారి పనిచేసే అవకాశం దక్కింది. పూర్తి స్క్రిప్ట్ లేకుండా సినిమా తీయడానికి నేను ఒప్పుకోను. అలాంటి నన్ను కేవలం సన్నివేశాలు చెప్పి ఒప్పించే స్తాడు అనిల్'' అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ– ''ఫస్ట్ టైమ్ ఓ మాస్ క్యారెక్టర్ చేశాను. అది కూడా కామెడీ క్యారెక్టర్. 'ఎఫ్ 2'తో అనిల్‌లాంటి మంచి ఫ్రెండ్ దొరికినందుకు ఆనందంగా ఉంది. 'దిల్' రాజు, శిరీష్, లక్ష్మణ్‌గారితో 'ఫిదా' తర్వాత మరోసారి పనిచేయడం హ్యాపీ. మా పెద నాన్నగారి (చిరంజీవి) కాన్‌టెంపరరీ హీరో వెంకటేశ్‌గారితో సినిమా చేయాలంటే ఎక్కడో చిన్న భయం ఉండేది. కానీ ఆయన మాతో ఫ్రెండ్‌లా, మెంటర్‌లా ఉన్నారు. నెక్ట్స్ టైమ్ ఆయనతో స్టోరీ కూడా అడగకుండానే సినిమా చేయడానికి రెడీ'' అన్నారు. ''ఎఫ్ 2' సినిమా ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తుతుంది. టైమింగ్ ఉన్న గొప్ప నటులు ఈ సినిమాలో పనిచేశారు'' అన్నారు అనిల్ రావిపూడి. నటులు రాజేంద్ర ప్రసాద్, కథానాయికలు తమన్నా, మెహరీన్, నిర్మాత శిరీష్ తదితరులు పాల్గొన్నారు.



● తాప్సీ

ఐయామ్ లక్కీ

కెరీర్ తొలి దశలో క్యాస్టింగ్ కౌచ్ ఇబ్బందులు ఎదుర్కొన్నామంటూ చాలామంది నటీమణులు తమ అనుభవాలను షేర్ చేసుకున్నారు. తాజాగా ఓ ఈవెంట్‌లో 'క్యాస్టింగ్ కౌచ్' గురించి మాట్లాడారు తాప్సీ. ''నా తొలి తెలుగు, హిందీ, తమిళం చిత్రాలు సక్సెస్ సాధించాయి. దాంతో ఆఫర్స్ కోసం ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం రాలేదు. క్యాస్టింగ్ కౌచ్ లాంటి అనుభవాలు నేను ఎదుర్కోలేదు. ఆ విధంగా నేను చాలా అదృష్టవంతురాలిని. కానీ, కొన్ని భయంకరమైన కథనాలు విన్నాను. నాకెలాంటి చెడు అనుభవాలు ఎదురు కాలేదని అలాంటివి జరగవనుకోవడం పొరపాటు. స్త్రీ, పురుష సమానత్వం లేకపోవడం, పవర్‌ని దుర్వినియోగం చేయడం వల్లే ఇలాంటి సమస్యలు తలెత్తుతాయి. కానీ, క్యాస్టింగ్ గురించి బయటకు వచ్చి అందరూ మాట్లాడటం మొదలుపెట్టాక మార్పు తెలుస్తోంది. ఇవాళ సినిమా సెట్స్‌లో పురుషుల ప్రవర్తన చాలా మారింది. జాగ్రత్తగా ఉంటున్నారు. మేం పబ్లిక్ పర్సనాల్టీ కాబట్టి, సినిమా ఇండస్ట్రీ మీద అందరికీ ఆసక్తి ఉంటుంది కాబట్టి మా గురించి రాస్తారు. అయితే ఇలాంటి సంఘటనలు సినిమా ఇండస్ట్రీలోనే జరుగుతాయనుకోకూడదు. ప్రతి చోటా జరుగుతుంటాయి'' అని పేర్కొన్నారు తాప్సీ.

118... ఓ సస్పెన్స్

కల్యాణ్ రామ్ హీరోగా కేవీ గుహన్ దర్శకత్వంలో రూపొందించిన సస్పెన్స్ థ్రిల్లర్ '118'. నివేథా థామస్, షాలినీ పాండే కథానాయికలు. మహేశ్ కోనేరు నిర్మించిన ఈ సినిమాను మార్చి 1న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మహేశ్ కోనేరు మాట్లాడుతూ – ''కల్యాణ్‌రామ్ ఇప్పటి వరకూ చేయని జానర్ ఇది. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ తరహా సస్పెన్స్ ఉంటుంది. యాక్షన్ పార్ట్ సినిమాకు హైలైట్. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్, టీజర్స్‌కు మంచి స్పందన లభిస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, మాటలు : 'మిర్చి' కిరణ్. కథ, కెమెరా, స్క్రీన్‌ప్లే : కె.వి గుహన్.



● కల్యాణ్ రామ్



● సయేషా

పెళ్లికి బాజా మోగిందా?

'అఖిల్' సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యారు సయేషా. తెలుగులో జోరుగా సినిమాలు ఒప్పుకోకపోయినా తమిళంలో మాత్రం వరుస ఆఫర్స్‌తో దూసుకెళ్తున్నారు. వరుసగా యంగ్ హీరోలతో జతకడుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారారు. ఈ మధ్య మరో వార్త ద్వారా హాట్ టాపిక్‌గా మారారు సయేషా. తమిళ హీరో ఆర్యను పెళ్లి చేసుకోనున్నారన్నదే ఆ టాపిక్. రీసెంట్‌గా 'గజినీకాంత్' అనే సినిమాలో ఈ ఇద్దరూ కలిసి స్టెప్పులేశారు. ఆ షూటింగ్‌లో ఏర్పడిన అనుబంధమే ఈ ఇద్దరూ కలిసి ఏడడుగులు నడవాలనే నిర్ణయానికి కారణం అయిందని టాక్. ప్రస్తుతం సూర్య హీరోగా చేస్తున్న 'కాప్పాన్' సినిమాలోనూ ఆర్య, సయేషా నటిస్తున్నారు. అయితే జోడీగా కాదు. ఈ సినిమా షూటింగ్ బ్రేక్స్‌లో చెన్నైలో ఏ మాల్‌లో చూసినా వీళ్లిద్దరే కనబడటంతో 'సమ్‌థింగ్' ఉంది అనే వార్త బలం అందుకుంది. ఇరు కుటుంబ సభ్యులు కూడా తమ అంగీకారాలను తెలిపినట్టు కోలీవుడ్ టాక్. మరి పెళ్లికి బాజా మోగిందా? అంటే వేచి చూద్దాం.



● రాయ్‌లక్ష్మి

ఆఫీసర్ ఝూన్సీ

ఆరేళ్ల తర్వాత కన్నడంలో రాయ్‌లక్ష్మీ నటిస్తున్న సినిమా 'ఝూన్సీ'. 2013లో వచ్చిన 'అట్టహాస' రాయ్‌లక్ష్మీ తొలి కన్నడ చిత్రం. 'ఝూన్సీ' చిత్రానికి పీఈఎస్ గురుప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు రాయ్‌లక్ష్మీ. సినిమాలో ఆమె లుక్‌ను విడుదల చేశారు. ఈ లుక్‌లో కాగడా పట్టుకుని కోపంగా రాయ్‌లక్ష్మీ చాలా పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు కదూ. ఈ చిత్రంలో ఆమె కొన్ని రియల్ స్టంట్స్ కూడా చేశారు. ''కన్నడంలో నా తర్వాతి చిత్రం 'ఝూన్సీ' లుక్‌ను విడుదల చేసినందుకు ఆనందంగా ఉంది. ఈ చిత్రం త్వరలో విడుదలవుతుంది'' అన్నారు రాయ్‌లక్ష్మీ.



● అక్షయ్ ఖన్నా

మంచి చాన్స్ మిస్

మంచి సినిమాలో భాగమయ్యే అవకాశం చేజారినప్పుడు ఏ యాక్టర్ అయినా ఫీల్ అవుతారు. ఇప్పుడు అదే చేస్తున్నారు బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా. రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వంలో వచ్చిన సంజయ్‌దత్ బయోపిక్ 'సంజు' గతేడాది బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇందులో సంజయ్ పాత్రలో రణ్‌బీర్‌సింగ్, సంజయ్ తండ్రి సునీల్ దత్ పాత్రలో పరేష్ రావల్ నటించారు. కానీ సునీల్ దత్ పాత్రలో నటించే అవకాశం తొలుత అక్షయ్ ఖన్నాకు వచ్చింది. ''సంజు సినిమాలో సునీల్ దత్ పాత్రకోసం లుక్ టెస్ట్ చేశారు. ఆ పాత్రకు నేను మిస్ ఫిట్ అని హిరానీ ఫీల్ అయ్యారు. ఇలా మంచి సినిమాలో భాగమయ్యే అవకాశం నాకు దక్కలేదు'' అని పేర్కొన్నారు అక్షయ్ ఖన్నా.

అటు డ్యాన్స్... ఇటు ఫైట్

డ్యాన్స్ మూమెంట్స్‌ను బాగా ప్రాక్టీస్ చేసిన తర్వాత డైరెక్టర్ యాక్షన్ అనగానే ఫైట్ స్టార్ట్ చేస్తున్నారు బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్. ఏంటి? ఆమె కన్‌ఫ్యూజ్ అయ్యారా? అని ఆలోచించకండి. ఎందుకంటే శ్రద్ధా ఫుల్ క్లారిటీతోనే అలా చేస్తున్నారు. ఇంతకీ విషయం ఏంటంటే... ప్రస్తుతం 'సాహో' మూవీ యాక్షన్ సీన్స్‌లో పాల్గొంటున్నారామె. ఈ సినిమా షాట్ గ్యాప్‌లో డ్యాన్స్ ప్రాక్టీస్ చేసేది రీసెంట్‌గా సైన్ చేసిన 'ఏబీసీడీ 3' చిత్రం కోసమే. రెమో డిసౌజా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వరుణ్‌ధావన్ కథానాయకుడు. నోరా ఫతేహి కీలక పాత్ర చేస్తారు. ఈ సినిమాలో కత్రినా కైఫ్‌ను కథానాయికగా తీసుకున్నారు. కానీ, సల్మాన్‌తో కత్రినా చేస్తున్న 'భారత్' సినిమా డేట్స్ 'ఏబీసీడీ 3'తో క్లాష్ అవడం.. కత్రినా తప్పుకోవడంతో శ్రద్ధా లైన్లోకి వచ్చారు. ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లడానికి ఎక్కువ టైమ్ లేకపోవడంతో 'సాహో' సెట్‌లోనే డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నారట శ్రద్ధా కపూర్. శ్రద్ధా మాత్రమే కాదు.. వరుణ్ ధావన్ కూడా డ్యాన్స్ రిహార్సల్స్ చేస్తున్నారు. అయితే ఆయన ముంబైలో.. శ్రద్ధా మాత్రం ఏ షూటింగ్‌లో ఉంటే అక్కడే. 'సాహో, ఏబీసీడీ 3' సినిమాలే కాకుండా 'ఛిఛోరే, సైనా' చిత్రాలతో బిజీగా ఉన్నారామె. ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'సాహో' చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.



● శ్రద్ధాకపూర్

యుద్ధం చేయాలి



● హరీష్, తనిష్క్

హరీష్ వినయ్, తనిష్క్ తివారి జంటగా నటించిన చిత్రం 'బైలంపుడి'. 'ఇక్కడ యుద్ధం చేయాలి... గెలవడానికి కాదు.. బతకడానికి'' అనేది ఉప శీర్షిక. ఈ చిత్రం ద్వారా అనిల్ పిజి రాజ్ దర్శకునిగా పరిచయం అవుతున్నారు. పారిశ్రామిక వేత్త బ్రహ్మానందరెడ్డి నిర్మించారు. ఈ చిత్రంలోని 'పిల్లల దేవుడు...' అనే సాంగ్‌ని బాలీవుడ్ హీరోయిన్ మైరా అమిథ విడుదల చేశారు. బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ– ''పారిశ్రామికవేత్తగా ఉన్న నేను సినిమా మీద ఆసక్తితో తొలిసారి 'బైలంపుడి' చిత్రాన్ని నిర్మించా. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. అందరూ కొత్త వారైనా చక్కగా నటించారు. త్వరలోనే సినిమా విడుదల చేస్తాం'' అన్నారు. ''కెమెరామేన్‌గా చాలా చిత్రాలకు వర్క్ చేశాను. దర్శకుడిగా ఇది తొలి సినిమా. 'బైలంపుడి' అనే గ్రామంలో జరిగే లవ్ అండ్ పొలిటికల్ చిత్రమిది'' అన్నారు అనిల్ పిజి రాజ్.